ఈనాడు

విజయవాడ 16-12-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 126
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

నేడే పోలీసు కొలువుల వేడుక

కానిస్టేబుళ్లుగా ఎంపికైన 5,757 మందికి నియామక పత్రాల అందజేత

సీఎం చేతుల మీదుగా పంపిణీ

కుటుంబ సభ్యులతో హాజరుకానున్న అభ్యర్థులు 2లో

మిరప 'ధర'హాసం

డబ్బి బ్యాడిగ రకం క్వింటాలు రూ.71 వేలు 13లో

పది రోజుల్లోనే హామీ నెరవేర్చిన పవన్‌కల్యాణ్

చిలకలూరిపేటలోని పాఠశాలకు సొంత నిధులతో 25 కంప్యూటర్లు, పుస్తకాలు, ఫర్నిచర్ అందజేత 2లో

ఉగ్రవాదులు తండ్రీ కుమారులే..

ఆస్ట్రేలియా బోండీ బీచ్ దాడిలో పాల్గొన్నది వారే 10లో

వైద్య కళాశాలల పూర్తి యాజమాన్యం

ప్రభుత్వానిదే



- అవి ప్రభుత్వ ఆస్తులు.. నిర్వహణ మాత్రమే ప్రైవేటు వ్యక్తులకు
- మెరుగైన విద్యకు 'పీపీపీ'నే ఉత్తమమని పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పష్టం చేసింది
- అందుకే ఈ విధానంలో ముందుకు వెళుతున్నాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

ఈనాడు – అమరావతి

కొత్తగా నిర్మించే ప్రభుత్వ వైద్య కళాశాలల మీద యాజమాన్యం, పెత్తనం పూర్తిగా ప్రభుత్వానికే ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అవి ప్రభుత్వ ఆస్తులని..నిర్వహించేది మాత్రమే ప్రైవేటు వ్యక్తులని తేల్చిచెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన విద్య, సేవలు కావాలంటే ఆసుపత్రులు, కళాశాలల నిర్మాణానికి పీపీపీ విధానమే ఉత్తమమని పార్లమెంటరీ స్థాయీ సంఘమే చెప్పిందని గుర్తుచేశారు. ఈ విధానంతో అత్యుత్తమ రహదారులు, విమానాశ్రయాలు వచ్చాయని పేర్కొన్నారు. పీపీపీ విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాన్ని కావాలనే కొందరు రాజకీయం చేస్తున్నారని, 'ప్రైవేటు' అంటూ ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలోని తుమ్మలపల్లివారి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 'సంపద సృష్టించడానికి ఏకైక విధానం పీపీపీనే. ఉదాహరణకు రహదారుల్ని ఈ విధానంలో నిర్మిస్తాం. 10-20 ఏళ్లు ప్రైవేటు వాళ్లు వాటిని నిర్వహించి..మళ్లీ ప్రభుత్వానికి అప్పగిస్తారు. అవి ప్రభుత్వ ఆస్తులు...నిర్వహించేది ప్రైవేటు వ్యక్తులు. అందుకే పీపీపీ విధానంలో ముందుకు వెళుతున్నాం' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

మూడు రాజధానులు మహాకుట్ర

'వైకాపా ప్రభుత్వం తెచ్చిన మూడు రాజధానులు.. మహాకుట్ర. అసలు రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశారు. ప్రపంచం ముందు మనల్ని అపహాస్యం చేశారు. రాజధాని పేరు ఎవరైనా అడిగితే చెప్పలేని పరిస్థితి తెచ్చారు' అని చంద్రబాబు మండిపడ్డారు. ఇప్పుడు గర్వంగా 'మా రాజధాని అమరావతి' అని చెప్పగలుగుతున్నామన్నారు. 'ఎంతో మంది మేధావులు రాష్ట్రానికి వన్నె తెచ్చారు. మన దురదృష్టం.. శాశ్వత చిరునామా లేకుండా అటూఇటూ తిరిగాం. మద్రాసులో కొన్ని రోజులు, తర్వాత కర్నూలులో, హైదరాబాద్‌లో (మిగతా 3లో)

మీ గుర్తింపే.. మరో పది మంచి పనులు చేయడానికి స్ఫూర్తి

ప్రజలు పాజిటివ్‌గా ఆలోచించి.. మేం చేసిన పనులను గుర్తించి, పది మందికి చెబితే... అది మాకు పెద్ద టానిక్. మరో పది మంచి పనులు చేయడానికి స్ఫూర్తి. చేసిన పని మరచిపోతే మాకు నీరసం వస్తుంది. రాజకీయ నాయకుడు మంచి పాలసీలు తెస్తే.. అభినందించాలి. తప్పుడు పాలసీలు తెస్తే ఖండించాలి. రాష్ట్రాభివృద్ధి నా ఒక్కడి ఘనతే కాదు... ఎన్డీయే, ప్రధాని మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లది కూడా.

అమరావతిలో.. స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైజ్

58 అడుగుల ఎత్తుతో పొట్టి శ్రీరాములు విగ్రహం

ఆయన జీవితం, త్యాగం భావితరాలకు గుర్తుండేలా కార్యాచరణ

సీఎం చంద్రబాబు వెల్లడి • ఆత్మార్పణ దినం సందర్భంగా నివాళి

'ఆర్యవైశ్యులు'గా కుల ధ్రువీకరణ పత్రాల జారీకి హామీ 2లో

ఉపాధి హామీ పథకం కొత్తపేరు..

వీబీ - జీ రామ్ జీ



మహాత్మాగాంధీ పేరిట ఉన్న పాత చట్టం రద్దు

కొత్తగా 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్'

ప్రభుత్వ ప్రతిపాదన.. మండిపడ్డ ప్రతిపక్షాలు

ఉన్నత విద్యాసంస్థల నియంత్రణకు ఒకే సంస్థ

లోక్‌సభ ముందుకు మరో బిల్లు

దిల్లీ: 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం' (ఎంజీ నరేగా)ను రద్దుచేస్తూ దాని స్థానంలో ఒకకొత్త చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రామ్ జీ) బిల్లు-2025' పేరుతో దీనిని లోక్‌సభా వ్యవహారాల అనుబంధ జాబితాలో సోమవారం పొందుపరిచారు. మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాన్ని బలోపేతం చేయడానికే కొత్తదానిని ప్రతిపాదించినట్లు మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ బిల్లు ఉద్దేశాల్లో తెలిపారు. ఎంజీ నరేగా- 2005ను ప్రతిపాదిత కొత్త చట్టం రద్దుచేయడంతోపాటు 2047 నాటికి వికసిత భారతాన్ని ఆవిష్కరించాలనే దార్శనిక ఉద్దేశానికి అనుగుణంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ ప్రతిపాదనను ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఎంజీ నరేగా నుంచి జాతిపిత బాపూజీ (మిగతా 3లో)

స్టార్స్ ప్రాజెక్టు కింద ₹4,400 కోట్లు ఇవ్వండి



లోకేశ్‌తో ఆత్మీయంగా మాట్లాడుతున్న ధర్మేంద్ర ప్రధాన్. చిత్రంలో రామ్మోహన్‌నాయుడు, శ్రీకృష్ణదేవరాయలు

రాష్ట్రంలో నైపుణ్య గణనకు సహకరించండి

- విశాఖ స్కిల్ సెంటర్‌తో దేశవ్యాప్తంగా ప్రయోజనం
- కేంద్ర మంత్రులకు మంత్రి లోకేశ్ వినతులు
- ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్, జయంత్ చౌధరిలతో భేటీ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థలో వసతుల మెరుగుదల, బోధనా పద్ధతుల్లో ఆధునికీకరణ, యువతకు నైపుణ్య శిక్షణకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని మంత్రి నారా లోకేశ్ పలువురు కేంద్ర మంత్రులను కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కొత్తగా పలు డిమాండ్లను, ప్రతిపాదనలను వారి ముందుంచారు. సోమవారం దిల్లీకొచ్చిన లోకేశ్.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముగ్గురు కేంద్ర మంత్రులు (మిగతా 3లో)

రఘురామను ఎందుకు కొట్టారు?

ఎవరు కొట్టమన్నారు?

- కస్టడీలోకి ముసుగు ధరించి వచ్చిందెవరు? వారిని పంపిందెవరు?
- పీవీ సునీల్‌కుమార్‌పై విచారణాధికారి ప్రశ్నల వర్షం
- అన్నింటికీ ముక్తసరి సమాధానాలే!



విచారణ అనంతరం బయటకు వస్తున్న సునీల్‌కుమార్

ఈనాడు– అమరావతి; న్యూస్‌టుడే– గుంటూరు నేరవార్తలు: 'రఘురామకృష్ణరాజును కస్టడీలో ఏం ఆశించి కొట్టారు, కొట్టేందుకు వచ్చిన వ్యక్తులెవరు? ఈ వ్యవహారంలో మీ పాత్ర ఏమిటి' అంటూ సీఐడీ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను దర్యాప్తు అధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ ప్రశ్నించారు. సుమారు 5 గంటల పాటు సాగిన విచారణలో అనేక ప్రశ్నలు సంధించినా సునీల్ ముక్తసరి సమాధానాలే చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి నరసాపురం ఎంపీ (ప్రస్తుత శాసనసభ ఉపసభాపతి) రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో హింసించిన కేసులో నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. సోమవారం ఉదయం ఆయన విచారణ నిమిత్తం గుంటూరులోని సీసీఎస్‌కు వచ్చారు. విచారణాధికారి దామోదర్ ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట (మిగతా 3లో)

రాష్ట్రంలో ఆరు జోన్లు, రెండు మల్టీ జోన్లు

26 జిల్లాల ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్ 1975 ప్రకారం ఉన్న జోనల్ నిబంధనలను కేంద్రం సవరించింది. ప్రత్యక్ష నియామకాల్లో స్థానికత కేడర్, జోనల్, మల్టీ జోనల్‌లపై స్పష్టతనిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. 26 జిల్లాల ప్రకారం ఆరు జోన్లుగా ప్రకటించింది. వాటిని రెండు మల్టీ జోన్లుగా విభజించింది. ఏడేళ్లు ఒకేచోట చదివిన ప్రాంతాన్ని స్థానికంగా పరిగణనలోకి తీసుకోనున్నట్లు పేర్కొంది.

మల్టీ జోన్–1

జోన్–1: శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి

జోన్–2: అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

జోన్–3: పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా

మల్టీ జోన్–2

జోన్–4: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం

జోన్–5: తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప

జోన్–6: నంద్యాల, అనంతపురం, కర్నూలు, శ్రీ సత్యసాయి



సూట్‌కేస్‌లో ఆరోగ్య రహస్యాలు

ఇంటి వద్దే పరీక్ష క్షణాల్లో రిపోర్టు 3లో

గంటల కొద్దీ సమయం ఆదా

18న మార్చి నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్ల విడుదల 2లో

ఇదీ సంగతి!



ఆరోగ్యం.. గజగజ!



జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

ఉష్ణోగ్రతలు తగ్గి.. వెన్నులో వణుకు పుట్టించే చలితో పిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. చిన్నారులకు ముక్కులో నుంచి రక్తం కారడం, చంటి పిల్లల్లో న్యుమోనియా, పెద్దల్లో ఆస్తమా పెరుగుతున్నాయి. గుండె సంబంధిత రుగ్మతలున్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చలి పంజా నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- చలి తీవ్రత పెరగడంతో అనేక లక్షణాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.
- ఈ కాలంలో చిన్నారుల్లో తీవ్రమైన జ్వరాలు కనిపిస్తుంటాయి. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా సోకుతుంటాయి. ముఖ్యంగా న్యుమోనియా సోకకుండా జాగ్రత్తపడాలి.
- అనేక రకాల ఎలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలూ పిల్లలపై దాడి చేస్తుంటాయి.
- నెలలోపు వయసున్న పసిపిల్లల్లో 'హైపోథర్మియా' వచ్చే అవకాశం ఉంది. అంటే శరీర ఉష్ణోగ్రత (మిగతా 3లో)

అమరావతిలో.. స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైజ్

• ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు, అమరావతి: 'అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు. ఆయన తెలుగు ప్రజల ఆస్తి, సెంటిమెంట్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగు జాతి గుర్తింపునకు పోరాడి ప్రాణాలర్పించిన ఏకైక నాయకుడని కొనియాడారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భావితరాలు గుర్తుపెట్టుకునేలా తాను, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. '58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసినందుకు గుర్తుగా రాజధాని అమరావతిలో 58 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నాం. దీనికి 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైజ్'గా పేరు పెడతాం. 6.8 ఎకరాల్లో మెమోరియల్ పార్కు తీర్చిదిద్దుతాం. దీనికి పొట్టి శ్రీరాములు స్మృతివనంగా నామకరణం చేశాం' అని సీఎం వివరించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన 'శ్రీపొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం' కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలతో కూడిన ఫొటో గ్యాలరీని సందర్శించారు. అమరజీవి కుటుంబ సభ్యులు గునుపూడి హనుమంతరావు, సత్యనారాయణరావు, నరసింహారావు, సుబ్రహ్మణ్యం, కుందా ప్రతిభలను సత్కరించి, జ్ఞాపికలు అందించారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు.


అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదికపై కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, బొండా ఉమా, మంత్రులు సవిత, కందుల దుర్గేష్, పొట్టిశ్రీరాములు కుటుంబ సభ్యులు గునుపూడి హనుమంతరావు, కుందా ప్రతిభ, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, ఐఏఎస్ అధికారులు అజయ్‌జైన్, సురేష్‌కుమార్

పొట్టి శ్రీరాములును గౌరవించింది తెదేపానే

'పొట్టి శ్రీరాములుకు తొలుత గుర్తింపునిచ్చిన పార్టీ తెదేపా. మన నాయకుడు ఎన్టీఆర్ 1985లో తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టారు. ఆయన పుట్టిన నెల్లూరు జిల్లాకు శ్రీపొట్టి శ్రీరాములు పేరును నామినేట్ చేస్తూ 2003 మార్చి 10న కేంద్రానికి పంపా. 2008లో దాన్ని కేంద్రం నోటిపై చేసింది' అని సీఎం గుర్తుచేశారు. 'నెల్లూరు జిల్లాలో శ్రీరాములు పుట్టిన ఇంటిని మెమోరియల్‌గా మార్చి, అక్కడ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తాం. ఆయన ప్రారంభించిన ఆసుపత్రిని అభివృద్ధి చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలందేలా చూస్తాం. ఆయన ప్రాణాలు విడిచిన చెన్నైలోని భవనాన్ని 'త్యాగ భవనం'గా గుర్తించి, పరిరక్షిస్తామ'ని చెప్పారు.

ఆర్యవైశ్యులు ఆంత్రప్రెన్యూర్లుగా ఎదగాలి

'ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవీ ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా ప్రకటించాం. అమ్మవారు జన్మించిన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామాన్ని వాసవీ పెనుగొండగా మార్చాం. అక్కడ బ్రహ్మాండమైన దేవాలయాన్ని కట్టించి, పర్యాటక కేంద్రంగా, దివ్యక్షేత్రంగా మారుస్తాం. త్వరలో గుప్తా, శెట్టి, వైశ్య, కోమటి తదితరులకు వేర్వేరుగా కాకుండా ఆర్యవైశ్యులుగానే కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామ'ని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యులు వితరణశీలురని ప్రశంసించారు. ఆంత్రప్రెన్యూర్లుగా ఎదగాలని, మహిళలు ప్రభుత్వ, కార్పొరేషన్ రుణాలు అందిపుచ్చుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఈ ఏడాది మార్చి 16 నుంచి వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. సమావేశంలో మంత్రి సవిత, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేశ్ మాట్లాడారు. భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జీఏడీ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సీఎం చంద్రబాబు. గునుపూడి హనుమంతరావు, డూండి రాకేష్


పెనుగొండ మండలానికి వాసవీ పెనుగొండగా పేరు మార్చినందుకు థాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

భాషా ప్రయుక్త రాష్ట్రాలకు కారకుడు

– కందుల దుర్గేష్, భాషా సాంస్కృతిక శాఖ మంత్రి

దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడానికి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణే నాంది. అంతకుముందు ఆయన స్వాతంత్ర్యం కోసమూ పోరాడారు. భావితరాల్లో ఆయన స్ఫూర్తిని రగిలించేందుకే కూటమి ప్రభుత్వం అమరావతిలో విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తోంది. రాజకీయాలు సేవానిరతితో ఉండాలనేందుకు ఆయన నిలువెత్తు నిదర్శనం.

18న మార్చి నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్ల విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: భక్తుల సౌకర్యార్థం 2026 మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) టికెట్లను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఎలక్ట్రానిక్ లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

- 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా, సాలకట్ల తెప్పోత్సవాలు, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.
- 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.
- ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన లేదు

బిజినెస్ టుడే కార్యక్రమంలో నారా బ్రాహ్మణి



ఈనాడు, అమరావతి: రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన తనకు లేదని మంత్రి నారా లోకేశ్ సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ ఈడీ నారా బ్రాహ్మణి చెప్పారు. హెరిటేజ్ ఫుడ్స్ తనకు తొలి ప్రాధాన్యమని, ఆ సంస్థ ద్వారా గొప్ప ప్రభావం చూపించే అవకాశం తనకు లభించిందని ఆమె పేర్కొన్నారు. బిజినెస్ టుడే సంస్థ ఈ నెల 12న ముంబయిలో నిర్వహించిన ఎంపీడబ్ల్యూ 2025 (అత్యంత ప్రభావవంతమైన మహిళలు) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చంద్రబాబు మిమ్మల్ని రాజకీయాల్లోకి రావాలని కోరితే ఏమంటారని ఈ సందర్భంగా నిర్వాహకులు అడిగిన ప్రశ్నకు.. కచ్చితంగా అది తనకు ఆసక్తికరమైన రంగం కాదని ఆమె సమాధానమిచ్చారు. పాడిరంగంలోని లక్షల మంది మహిళా రైతులు, కోట్ల మంది వినియోగదారులపై ప్రభావం చూపగలిగే అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలని అన్నారు. వ్యక్తిగతంగా తనకు ఆరోగ్యం, పోషణ రంగాలపై ఎంతో ఆసక్తి ఉందని.. చిన్నప్పటి నుంచి ఈ రంగాలు అంటే ఇష్టమని బ్రాహ్మణి వివరించారు.

19, 20 తేదీల్లో.. పీఎస్సీ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సు

హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఈనాడు, హైదరాబాద్: దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సు ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సదస్సును రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. తొలిరోజు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ముగింపు కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరు కానున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల పీఎస్సీల ఛైర్‌పర్సన్లు హాజరై వివిధ అంశాలపై చర్చించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలపై చర్చించి రాష్ట్రాల పీఎస్సీల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వాటిని అధిగమించాల్సిన ప్రణాళికను ఈ సదస్సు రూపొందించనుంది.

ఆధ్యాత్మికతతోనే విశ్వ చైతన్యం

- హైదరాబాద్ కన్హా శాంతివనం అద్భుతం
- ప్రశాంతతతో పాటు పర్యావరణ విలువలు అపారం: చంద్రబాబు
- శాంతివనంలో ఐదు గంటలు గడిపిన ఏపీ సీఎం
- బాబుతో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం చేయించిన దాజీ

ఈనాడు, హైదరాబాద్– న్యూస్‌టుడే, నందిగామ: ఆధ్యాత్మికత ద్వారానే విశ్వ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం హైదరాబాద్ శివారులోని కన్హా శాంతివనాన్ని ఆయన సందర్శించారు. వనం నిర్వాహకులు, శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షులు దాజీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ...'' కన్హా శాంతివనంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే వాతావరణం ఉంది. విద్యారంగంలో కొత్త ప్రమాణాలు పాటిస్తూ... హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయి. రేపటి తరం నాయకులను తయారు చేసేలా స్కూల్ నడుపుతున్నారు. ఈ వనం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక్కడ ప్రశాంతతతో పాటు పర్యావరణ విలువలు కూడా అపారం. పర్యావరణ సుస్థిరత, ఆరోగ్యం, విద్య, యువత, మహిళా సాధికారత, ఆధ్యాత్మికత...ఇలా ఆంధ్రప్రదేశ్‌లో చూడాలనుకుంటున్న ప్రతిదీ ఇక్కడ ఉంది'' అని ఆయన అన్నారు. దాజీని అభినందించారు. అంతకుముందు దాజీ ..చంద్రబాబుకు సాదర స్వాగతం పలికి జ్ఞాపిక అందించారు. చంద్రబాబు కూడా దాజీని సత్కరించారు.

ఆశ్రమం కలియ తిరుగుతూ..: ఆశ్రమం అంతా కలియ తిరుగుతూ చంద్రబాబు దాదాపు ఐదుగంటల పాటు ఇక్కడ గడిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రంతో పాటు వెల్‌నెస్ సెంటర్, యోగా సౌకర్యాలు, హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్, హార్ట్‌ఫుల్‌నెస్ గోపీచంద్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమీ, వృక్ష పరిరక్షణ కేంద్రం, వర్షారణ్యం, బయోచార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను చంద్రబాబు సందర్శించారు. శాంతివనంలో జరుగుతున్న శాస్త్రీయ, వృక్షశాస్త్ర పరిశోధనల గురించి తెలుసుకున్నారు. జీవ వైవిధ్యం, పర్యావరణ కార్యక్రమాలను వీక్షించారు. రెయిన్ ఫారెస్ట్ రూపకల్పన, దానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని సీఎంకు దాజీ వివరించారు. ధ్యాన మందిరం వెలుపల ఉన్న వర్షపు నీటి సంరక్షణ ప్రాంతమైన బాబూజీ వనాన్ని పరిశీలించారు. తర్వాత ఆయన బ్యాడ్మింటన్ అకాడమీకి వెళ్లి అక్కడ విద్యార్థులతో కాసేపు గడిపారు. పర్యటన అనంతరం చంద్రబాబుతో దాజీ ధ్యానం చేయించారు. కన్హా శాంతివనంలో చేపట్టిన సుస్థిరత కార్యక్రమాలు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టేందుకున్న సాధ్యాసాధ్యాల గురించి ఇద్దరూ చర్చించుకున్నారు.


కన్హా శాంతివనంలో శాస్త్రీయ, వృక్షశాస్త్ర పరిశోధనల గురించి తెలుసుకుంటున్న ఏపీ సీఎం చంద్రబాబు. చిత్రంలో శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షులు దాజీ

యువ వైద్యురాలికి వరకట్న వేధింపులు

రూ.12.5 కోట్లు తేవాలన్న అత్తింటి వారు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పెళ్లైన ఏడాది నుంచే అదనపు కట్న వేధింపులు ఎదుర్కొంటున్న ఓ యువ వైద్యురాలు అత్తింటి ఆరళ్ల నుంచి కాపాడాలంటూ పోలీసులను ఆశ్రయించిన ఉదంతమిది. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన ఓ యువతి (30) గైనకాలజీలో ఎంఎస్ చేశారు. కార్డియాలజీలో పీజీ చదువుతున్న.. కర్ణాటకలోని రాయచూర్ జిల్లాకు చెందిన యువకుడితో 2024 నవంబరులో ఆమెకు పెళ్లి అయ్యింది. అప్పట్లో కట్నం కింద రూ.1.5 కోట్ల నగదు, 200 సవర్ల బంగారం, 10 కిలోల వెండి, రూ.30 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.50 లక్షల ఆడపడుచు లాంఛనాలు ఇచ్చారు. తాజాగా, ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.12.5 కోట్ల అదనపు కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్తమామలు, ఆడపడుచు ఆమెను వేధించారు. ఈ ఏడాది సెప్టెంబరులో ఆమె పుదుచ్చేరిలోని ఓ ఆసుపత్రిలో ఆడపిల్లకు జన్మనివ్వగా, చూసేందుకు వచ్చిన భర్త.. తన భార్య, పసికందును ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లిపోయాడు. విడాకులు ఇవ్వాలని బెదిరించాడు. చివరకు గొల్లపూడిలోని పుట్టింటికి చేరిన ఆ వైద్యురాలు.. భర్త, అత్తమామలు, ఆడపడుచు, ఇతర బంధువులపై ఆదివారం రాత్రి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేతన్నల బకాయిలు చెల్లించండి: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: ఆప్కో ద్వారా చేనేత సహకార సంఘాలకు 30 శాతం బకాయిల కింద రూ.3.90 కోట్లు, ఉద్యోగులకు రెండు నెలల బకాయి వేతనాల కింద రూ.1.70 కోట్లు విడుదల చేయాలని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అధికారులను ఆదేశించారు.

నేడే పోలీసు కొలువుల వేడుక

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రాలు అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఓ పండగలా నిర్వహిస్తోంది. ఇందు కోసం మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌లోని పరేడ్ మైదానంలో భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులు మరో ఇద్దర్ని ఆహ్వానించారు. మొత్తం 5,757 మంది అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు కలిపి 17,000 మందికి పైగా హాజరు కానున్నారు. ఏ జిల్లాకు చెందిన అభ్యర్థులను ఆ జిల్లా నుంచి పోలీసుశాఖే ప్రత్యేక బస్సుల్లో అమరావతికి తీసుకొస్తోంది. సభా ప్రాంగణంలోనూ జిల్లాల వారీగా అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి అనిత, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరుకానున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం మొదలవుతుంది. బహిరంగ సభ వేదికనూ వినూత్నంగా సిద్ధం చేశారు. ప్రధాన వేదికకు ఇరువైపులా రెండు భారీ తెరలు ఏర్పాటు చేశారు. ప్రధాన వేదిక మొదలుకుని సభా ప్రాంగణంలోని కొంత భాగం వరకూ మధ్యలోనూ, రెండువైపులా కలిపి మొత్తం పొడవాటి ర్యాంపులు ఏర్పాటు చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, మాధవ్, అనిత అందరూ వాటి పైకి వచ్చి అభివాదం చేస్తారు. తర్వాత అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. టాపర్లుగా నిలిచిన అభ్యర్థులు, వారి నేపథ్యం, పోలీసు నియామక ప్రక్రియపై ఏవీలు ప్రదర్శించనున్నారు. అనంతరం అభ్యర్థులందరికీ ట్రైనీ కానిస్టేబుళ్లుగా నియామక పత్రాలు అందజేయనున్నారు.


కానిస్టేబుల్ నియామక పత్రాలు అందజేసేందుకు మంగళగిరి బెటాలియన్‌లోని పరేడ్ మైదానంలో సిద్ధమైన వేదిక

22 నుంచి శిక్షణ ప్రారంభం..: నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ముగిసిన అనంతరం.. అభ్యర్థులందరినీ తిరిగి పోలీసు శాఖే ప్రత్యేక బస్సుల్లో వారి స్వస్థలాలకు తీసుకెళ్లనుంది. వీరందరికీ ఈ నెల 22 నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. అభ్యర్థులు వారికి కేటాయించిన పీటీసీ, డీటీసీ, బీటీసీల్లో ఈ నెల 21వ తేదీలోగా రిపోర్టు చేయాలి. మొత్తం 9 నెలల పాటు కఠోర శిక్షణ ఇవ్వనున్నారు. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ఈ సారి శిక్షణ మాడ్యూళ్లు, సబ్జెక్టుల్లోనూ పోలీసు శాఖ అనేక మార్పులు తీసుకొచ్చింది. ఈ సారి ఉద్యోగాలకు ఎంపికైన వారిలో ఎక్కువ మంది బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ వంటి సాంకేతిక కోర్సులు చేసిన వారే ఉన్నారు. వారిలోని నైపుణ్యాలకు మెరుగుపెట్టేలా ఈ శిక్షణ ఉండనుంది.

తొక్కి పెట్టిన వైకాపా ప్రభుత్వం... ఉద్యోగాలిచ్చిన కూటమి సర్కారు

కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం 2022 నవంబరులో నాటి వైకాపా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించి ఆ తర్వాత ఎంపిక ప్రక్రియను అర్ధంతరంగా నిలిపేసింది. అభ్యర్థులు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. కనీస సమాచారం ఇవ్వకుండా, వారి గోడు వినిపించుకోకుండా తొక్కిపెట్టేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయపరమైన చిక్కులన్నింటినీ పరిష్కరించింది. ఆ వెంటనే దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షలు, అందులో ఎంపికైన వారికి తుది రాత పరీక్ష నిర్వహించింది. మొత్తం ప్రక్రియను ఏడాది వ్యవధిలో పూర్తి చేసి ఆగస్టు నెలలో ఫలితాలు విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులందరికీ ఇప్పుడు నియామక పత్రాలిచ్చి శిక్షణ ప్రారంభించనుంది. 9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని అభ్యర్థులంతా ఉద్యోగాల్లో చేరనున్నారు. మొత్తం 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ కాగా, 6,014 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. యాంటిసిడెంట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వారిలో 5,757 మంది 'ఫిట్ ఫర్ ట్రైనింగ్ (శిక్షణకు అర్హత)' సర్టిఫికేట్ పొందారు. వీరందరికీ ఇప్పుడు ట్రైనీ కానిస్టేబుళ్లుగా నియామక పత్రాలు ఇవ్వనున్నారు. నియామక పత్రాలు అందుకోనున్న అభ్యర్థుల్లో 3,343 మంది సివిల్ కానిస్టేబుళ్లుగా, 2,414 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారిలో 993 మంది మహిళలు ఉన్నారు.

- ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 183 మంది ఆదివాసీలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

పది రోజుల్లోనే హామీ నెరవేర్చిన పవన్‌కల్యాణ్

చిలకలూరిపేటలోని పాఠశాలకు సొంత నిధులతో 25 కంప్యూటర్లు, పుస్తకాలు, ఫర్నిచర్ అందజేత

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని శ్రీ శారదా జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన హామీని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పది రోజుల లోపే నెరవేర్చారు. ఈనెల 5న పాఠశాలలో జరిగిన మెగా టీచర్స్ - పేరెంట్స్ సమావేశంలో విద్యార్థులు కంప్యూటర్ ల్యాబ్ కోసం విజ్ఞప్తిచేశారు. దీంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన సొంత నిధులతో 25 కంప్యూటర్లు, గ్రంథాలయానికి 523 పుస్తకాలు, ర్యాక్‌లు, ఇతర అవసరమైన ఫర్నిచర్ అందించారు. వీటితో పాటు కంప్యూటర్ ల్యాబ్ సుందరీకరణకు మొత్తంగా రూ.25 లక్షలు వినియోగించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ కృతిక శుక్లా కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయాన్ని ప్రారంభించారు. మాట ఇచ్చిన పది రోజుల్లోనే సొంత నిధులతో హామీని నెరవేర్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సేవలను కొనియాడారు. విద్యార్థులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అందజేసిన కంప్యూటర్లు, ఫర్నిచర్ • పాఠశాల గ్రంథాలయానికి అందించిన పుస్తకాలు, ర్యాక్, ఫర్నిచర్

గ్రహం అనుగ్రహం

16-12-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం

ద్వాదశి: రా.12-01 తదుపరి త్రయోదశి; స్వాతి: మ.3-11 తదుపరి విశాఖ
వర్జ్యం: రా.9-22 నుంచి 11-08 వరకు; అమృత ఘడియలు: ఉ.7-18 వరకు
దుర్ముహూర్తం: ఉ.8-37 నుంచి 9-21 వరకు తిరిగి రా.10-36 నుంచి 11-28 వరకు; రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.26; సూర్యాస్తమయం: సా.5.24; ధనుర్మాస ఆరంభం మ. 1–23

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	27.0
అనంతపురం	16.5	30.0
కర్నూలు	16.8	31.2
శ్రీకాకుళం	17.0	29.0
రాజమహేంద్రవరం	17.0	33.5
విశాఖపట్నం	17.6	28.0
కడప	18.0	28.0
విజయవాడ	18.5	29.8
నరసాపురం	19.0	31.0
గుంటూరు	20.0	30.0
ఒంగోలు	20.9	30.5
నెల్లూరు	21.0	29.4
తాడేపల్లిగూడెం	25.0	29.0

నా పదోన్నతి.. పార్టీ ఆశీర్వాదం

- భాజపా మాత్రమే క్షేత్రస్థాయి కార్యకర్తలను ఎదగనిస్తుంది
- కమలదళం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా వ్యాఖ్యలు
- నడ్డా, అమిత్ షా తదితరుల సమక్షంలో నూతన బాధ్యతల స్వీకరణ



నితిన్ నబీన్ సిన్హాను అభినందిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జేపీ నడ్డా

పట్నా, దిల్లీ: క్షేత్రస్థాయి కార్యకర్తలను ఉన్నత స్థానాలకు ఎదగనిచ్చే ఏకైక రాజకీయ పక్షం భాజపాయేనని ఆ పార్టీ నూతన జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా పేర్కొన్నారు. తనకు లభించిన తాజా పదోన్నతిని పార్టీ ఆశీర్వాదంగా అభివర్ణించారు. భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆదివారం నియమితులైన ఆయన.. దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు- పట్నాలోని తన నివాసంలో నబీన్ విలేకర్లతో మాట్లాడారు. తనను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించినందుకు భాజపా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. "భాజపా యువకులను ప్రోత్సహించే పార్టీ మాత్రమే కాదు. పెద్ద లక్ష్యాలను సాధించే దిశగా వారికి మార్గనిర్దేశం కూడా చేస్తుంది. క్షేత్రస్థాయి కార్యకర్తలను ఎదగనిచ్చే ఏకైక పార్టీ ఇదే" అని వ్యాఖ్యానించారు. పార్టీ బలోపేతానికి ఓపికగా పనిచేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. తన తండ్రి దివంగత నబీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా ఆశయాలకు అనుగుణంగా తాను పనిచేస్తానన్నారు. "నా తండ్రి పార్టీనే తల్లిగా భావించారు. అన్నింటికంటే అగ్ర ప్రాధాన్యం దేశానికే ఇచ్చారు. అందుకే- పార్టీ కార్యకర్తలతో కలిసి పని కొనసాగించేందుకు భాజపా ఈ అవకాశం ద్వారా నన్ను ఆశీర్వదించిందని అనుకుంటున్నా" అని పేర్కొన్నారు.

వాళ్లు ఎన్నికలప్పుడే.. మేం నిరంతరం

ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో ప్రతి గ్రామానికి, ప్రతి పట్టణానికి అభివృద్ధి ఫలాలు చేరుతున్నాయని నబీన్ అన్నారు. పేదల పార్టీగా కూడా భాజపా ప్రస్తుతం గుర్తింపు దక్కించుకుందన్నారు. బెంగాల్, అస్సాం, ఉత్తర్ ప్రదేశ్.. ఇలా ఏ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా భాజపా కార్యకర్తలు సిద్ధంగా ఉంటారని చెప్పారు. తమ పార్టీ గొప్పదనమే అదని వ్యాఖ్యానించారు. ఇతర పార్టీల వాళ్లు ఎన్నికలప్పుడే పనిచేస్తారని, భాజపా కార్యకర్తలు మాత్రం నిరంతరం పనిచేస్తూనే ఉంటారని అన్నారు. దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో పార్టీ జాతీయాధ్యక్షుడు జె.పి. నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్ తదితర నేతల సమక్షంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నబీన్ బాధ్యతలు చేపట్టారు. ఆయనతో నడ్డా, షా, ప్రధాన్ ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. ■ పట్నా నుంచి దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న నబీన్‌కు దిల్లీ సీఎం రేఖా గుప్తా, పలువురు భాజపా నేతలు స్వాగతం పలికారు. ■ ప్రజాసేవ, జాతి నిర్మాణ ప్రయాణంలో కమలదళాన్ని నబీన్ ప్రధాని మోదీ మార్గనిర్దేశంలో సమర్థంగా నడిపిస్తారని నడ్డా, షా 'ఎక్స్' వేదికగా విశ్వాసం వ్యక్తం చేశారు. ■ నూతన బాధ్యతల స్వీకరణ అనంతరం నబీన్ భాజపా అగ్ర నేత మురళీ మనోహర్ జోషి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఉపాధి హామీ పథకం కొత్తపేరు.. వీబీ-జీ రామ్ జీ

(మొదటి పేజీ తరువాయి)

పేరును తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రతి గ్రామీణ కుటుంబం నుంచి శారీరక శ్రమ చేసేందుకు సిద్ధంగా ఉన్న వయోజనులకు ఏటా 125 రోజుల పాటు ఉపాధిని కొత్త పథకం కల్పించనుందని ప్రభుత్వం పేర్కొంటోంది. నరేగాలో ఏటా 100 రోజుల ఉపాధి హామీనిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత పథకం కింద అందిస్తున్న రోజువారీ కూలీ మొత్తాన్ని పెంచడంతోపాటు ఉపాధి అందించే పనిదినాల సంఖ్యను కూడా పెంచాలని తామే సిఫార్సు చేశామని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పార్లమెంటరీ స్థాయీసంఘం ఛైర్మన్, కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలాకా చెప్పారు.

తొలినుంచీ ఇదే మోదీ ఆకాంక్ష: ప్రియాంక

"ఇది గుంతలు తవ్వే పథకమని భాజపా అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఆ పథకాన్ని రద్దు చేయాలన్నదే మొదటి నుంచీ ఆయన ఆకాంక్ష. ఒక పథకం పేరును మార్చిన ప్రతిసారీ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అనేక మార్పులు చేయాల్సి ఉంటుంది. దీనికి పెద్ద మొత్తంలో ప్రజాధనం అవసరమవుతుంది. అలాంటప్పుడు పథకం పేరు మార్చడం వల్ల కలిగే ప్రయోజనమేమిటి?" అని పార్లమెంటు భవన సముదాయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. "దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అతి పెద్ద నాయకుడు మహాత్మాగాంధీ. ఆయన పేరును ఎందుకు తొలగించాలని అనుకుంటున్నారో చెప్పండి" అని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు.

రాష్ట్రాలదే బాధ్యత

బిల్లులోని వివరాల ప్రకారం.. పేరు మార్చడంతోపాటు ఉపాధి హామీ పథకం అమలులో గుణాత్మకమైన మార్పులను కేంద్రం తీసుకురానుంది. కేంద్రం పర్యవేక్షణకే పరిమితం కానుంది. నిర్వహణ, జవాబుదారీతనం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత కానుంది. రైతులకు కూలీల లభ్యత పెరిగి కూలీ రేట్లు నియంత్రణలో ఉండేందుకు వీలుగా వ్యవసాయ సీజన్లో 60 రోజులపాటు ఉపాధి హామీ పనులను నిలిపివేయాలని ప్రతిపాదించారు. ఉపాధి కల్పించడంతోపాటు నాలుగు ప్రాధాన్య రంగాల్లో దీర్ఘకాలం మన్నే మౌలికవసతుల కల్పనకు కొత్త చట్టం వీలు కల్పిస్తుంది. ప్రతిపనినీ వ్యూహాత్మక దృష్టితో చేపడతారు. జలభద్రత, మౌలికవసతుల కల్పన, జీవనోపాధి సృష్టి, వాతావరణ మార్పులను తట్టుకొని నిలిచే నిర్మాణ పనులపై దృష్టి సారించి వాటిద్వారా గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడే ఆస్తులను కల్పిస్తారు. కూలీల డిజిటల్ హాజరు, డిజిటల్ చెల్లింపులతోపాటు డేటా ఆధారిత ప్రణాళికలకు ప్రాధాన్యమిస్తారు.

మరిన్ని పాతచట్టాలకు చెల్లుచీటీ

భారతీయ ట్రామ్ మార్గాల చట్టం-1886 సహా వినియోగంలో లేని, అనవసరమైన 71 చట్టాలను రద్దు చేసే బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. వీటిలో ఆరు ప్రధాన చట్టాలు కాగా మిగిలిన 65 అనుబంధ చట్టాలు. ఇప్పటివరకు 1,562 పాత చట్టాలను సర్కారు రద్దుచేసింది.

మూడు కొత్త బిల్లులు

వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లు, రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్లు-2025 అనే మూడు కొత్త బిల్లుల్ని కేంద్రం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఇందులో "శాంతి" బిల్లు పౌర అణుశక్తి రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి వీలు కల్పిస్తుంది. వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు ఉన్నత విద్యారంగంలో మార్పులకు ఉద్దేశించినది. ఉన్నత విద్యాసంస్థల నియంత్రణకు వేర్వేరు సంస్థల బదులు 13 మంది సభ్యులతో ఒకే సంస్థను నెలకొల్పాలని దీనిలో ప్రతిపాదించారు. బిల్లుల ముసాయిదాలను చివరి నిమిషంలో అందించారని, అధ్యయనం చేయడానికి తగిన సమయం ఇవ్వలేదని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. ముఖ్యమైన బిల్లులకు హిందీలో పేర్లు పెడుతుండటంపై మరికొందరు సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఈ పేర్లు నోరు తిరగడం లేదని ఆర్‌ఎస్‌పీ (ఏ) నేత ప్రేమచంద్రన్ అన్నారు.

వైద్య కళాశాలల పూర్తి యాజమాన్యం ప్రభుత్వానిదే

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాం. మళ్లీ ఇప్పుడు అమరావతిని భావితరాల కోసం ప్రపంచం మెచ్చే నగరంగా నిర్మిస్తున్నాం. అమరావతే కాదు..విశాఖ, తిరుపతి నగరాలనూ అలాగే తయారు చేస్తాం. అధికార వికేంద్రీకరణ కాదు..అభివృద్ధి వికేంద్రీకరణ చేసి..తెలుగు జాతిని అభివృద్ధి చేస్తాం. విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర, తిరుపతి కేంద్రంగా రాయలసీమను అభివృద్ధి చేస్తాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. 18 నెలల్లో రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఇటీవల ఆర్బీఐ నివేదిక దేశంలోనే ఎక్కువగా పండ్లు పండించే, చేపలు ఉత్పత్తి చేసే నం.1 రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లు మారాయి. దానికి తగ్గట్టు ముందుకు వెళుతున్నాం. వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. గతంలో హైదరాబాద్‌ను నాలెడ్జ్ ఎకానమీకి చిరునామా చేశాం. ఇప్పుడు మన రాష్ట్రంలో దాన్ని మరో స్థాయికి తీసుకెళుతున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

ఐపీఎస్ అధికారి సంజయ్‌కు షరతులతో బెయిల్

ఈనాడు, అమరావతి: అగ్నిమాపక, సీఐడీ డీజీగా పనిచేసిన కాలంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో అరెస్టయిన ఐపీఎస్ అధికారి సంజయ్‌కు విజయవాడలోని ఏసీబీ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పిటిషన్‌పై గత వారం వాదనలు పూర్తవగా షరతులతో కూడిన బెయిల్ ఇస్తూ న్యాయాధికారి భాస్కరరావు సోమవారం తీర్పు వెలువరించారు. రూ.50 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులు సమర్పించాలని, మూడు రోజుల్లో పాస్‌పోర్ట్ అప్పగించాలని, ప్రతి శుక్రవారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని కోర్టు షరతులు విధించింది. నిధుల దుర్వినియోగం కేసులో ఆగస్టు 26న ఏసీబీ కోర్టులో సంజయ్ లొంగిపోయారు. కోర్టు రిమాండ్ విధించడంతో అప్పటి నుంచి విజయవాడ కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ కేసులో సహనిందితుడైన కొండలరావు (ఏ4)కు కూడా కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

స్టార్స్ ప్రాజెక్టు కింద ₹4,400 కోట్లు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్, జయంత్ చౌధరీలతో సమావేశమయ్యారు. ఆయన వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర ఎంపీలు ఉన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ కేంద్ర మంత్రులకు బాలల రాజ్యాంగ పుస్తక ప్రతిని బహూకరించారు.

నవోదయ స్కూళ్లు, స్మార్ట్ కిచెన్లకు అనుమతులివ్వండి

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు డిమాండ్లను లోకేశ్ వివరించారు. 'సమగ్ర శిక్షా సంస్కరణల్లో భాగంగా చేపట్టిన స్టార్స్ (స్ట్రెంథెనింగ్ టీచింగ్-లెర్నింగ్ అండ్ రిజల్ట్స్ ఫర్ స్టేట్స్) ప్రాజెక్టు కింద రాష్ట్రానికి రూ.4,400 కోట్ల ఆర్థిక సాయం అందించండి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం కోరిన రూ.1,270 కోట్ల అదనపు నిధులకు ఆమోదం తెలపండి. పీఎం పోషణ్ కింద రాష్ట్రంలో 155 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు అనుమతివ్వండి. 11 జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరు చేయండి. రాష్ట్రానికి ఇటీవల కేటాయించిన 12 కేంద్రీయ విద్యాలయాలను త్వరగా సాకారమయ్యేలా చర్యలు తీసుకోండి' అని విన్నవించారు. గుంటూరు జిల్లా చినకాకానిలో అభివృద్ధి చేసిన మోడల్ ఆటిజం స్పోర్ట్స్ సెంటర్ ప్రారంభోత్సవానికి రావాలని ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వినూత్న కార్యక్రమాలను లోకేశ్ వివరించారు. 'ప్రాథమిక పాఠశాలల పిల్లలు అకడమిక్ అంశాలతో పాటు లెక్కల్లో రాణించేలా ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాన్ని ప్రారంభించాం. పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు క్లికర్ బేస్డ్ ఇంటరాక్టివ్ క్లాస్‌రూమ్ రెస్పాన్స్ సిస్టం ప్రవేశపెట్టాం. బాల్యంలోనే రాజ్యాంగ విలువలు తెలుసుకునేలా ఇటీవల ఆంధ్రప్రదేశ్ స్కూల్ లెజిస్లేచర్ పేరుతో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాం. పుస్తక రూపంలో బాలల రాజ్యాంగాన్ని ముద్రించి అందించాం. దేశంలో ఎక్కడాలేని విధంగా కడపలో కేంద్రీకృత స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజన వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నాం. నాణ్యత, పారదర్శకతను పెంచాం' అని వివరించారు.



రాష్ట్రంలోని పాఠశాలల్లో తీసుకొస్తున్న సంస్కరణలపై వీడియోను ఆసక్తిగా తిలకిస్తున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్. చిత్రంలో నారా లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు, అధికారులు

విశాఖలో స్థాపిస్తే.. దేశవ్యాప్తంగా వ్యాప్తి

విశాఖలో జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థను నెలకొల్పాలని రాష్ట్ర మంత్రి లోకేశ్ కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌధరిని కోరారు. ఇందుకోసం విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడలో ఐదెకరాల స్థలం రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఖరారు చేసిందని తెలిపారు. 'ఈ శిక్షణ సంస్థ ద్వారా అధ్యాపక నైపుణ్యాల మెరుగుదల, పరిశ్రమలకు అనుసంధానమైన నైపుణ్యం, గ్రీన్ స్కిల్స్, డిజిటల్ రంగాల్లో శిక్షణ ఇవ్వొచ్చు. విశాఖకు స్కిల్ సెంటర్ వస్తే అది ప్రాంతీయ కేంద్రంగానూ సేవలందిస్తుంది. జాతీయ నైపుణ్య వ్యవస్థను బలోపేతం చేస్తుంద'ని లోకేశ్ ప్రతిపాదించారు.



కేంద్రమంత్రి జయంత్‌చౌధరితో భేటీ అయిన మంత్రి లోకేశ్

టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సహకరించండి

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే నైపుణ్య గణనకు కేంద్రం నుంచి సహాయం అందించాలని లోకేశ్ కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, రైల్వే శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. నైపుణ్య గణన కోసం ఏపీ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నైపుణ్యం పోర్టల్ గురించి ఆయనకు వివరించారు. నైపుణ్య గణనపై మంగళగిరిలో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్టులో ఎదురైన సమస్యలను అధిగమించడానికి ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానం తెచ్చినట్లు చెప్పారు. 'యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ తరఫున సహకారం అందించండి. ఈ హబ్‌లో ఏవీజీసీ-ఎక్స్‌ఆర్, వేవెక్స్ ఫ్రేమ్‌వర్క్ కింద ఎక్స్‌ఆర్ యానిమేషన్, ఏఆర్, వీఆర్, ఇమ్మెర్సివ్ టెక్నాలజీస్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు నిధులు సమకూర్చండి. ఇండియా ఏఐ మిషన్ కింద ఏపీలో ఏఐ విస్తృతిని వేగవంతం చేయడానికి మద్దతివ్వండ'ని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.



కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బాలల రాజ్యాంగం పుస్తకాన్ని అందిస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, హరీష్ మాథుర్, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, తెన్నేటి కృష్ణప్రసాద్, బస్తిపాటి నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ

తలలేని మొండెంలా కొత్త ఉపాధి హామీ బిల్లు

- 40% ఖర్చు రాష్ట్రాలు భరించాలనడం సరికాదు
- వ్యవసాయ కార్మిక సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకట్

ఈనాడు, దిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రస్తుతం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో తీసుకొచ్చిన 'వీబీ-జీ ఆర్‌ఎం జీ బిల్లు తలలేని మొండెంలా ఉందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మండిపడింది. ఇప్పటివరకు ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో? దాని స్థానంలో కొత్త బిల్లును ఏ ఉద్దేశంతో తెస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం దిల్లీలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "కొత్త బిల్లు ద్వారా ఉపాధి కూలీల పనిదినాలను 125 రోజులకు పెంచుతున్నట్లు చెబుతున్నా.. సంవత్సరంలో 60 రోజుల పనులపై నిషేధం విధిస్తున్నారు. మరోవైపు ఈ పథకానికి అయ్యే ఖర్చులో 90% కేంద్రం భరిస్తే 10% రాష్ట్రాలు భరిస్తూ వచ్చేవి. ఇప్పుడు 40% భారాన్ని రాష్ట్రాలు భరించాలని చెప్పడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తేసే కుట్రపన్నుతున్నట్లు కనిపిస్తోంది. ఆర్థిక సమస్యల కారణంగా రాష్ట్రాలు 40% వాటా సమకూర్చకపోతే కేంద్రం తన వాటా కింద 60% డబ్బులు ఇవ్వదు. దానివల్ల రాష్ట్రాల్లో పథకం అమలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. కొత్త బిల్లు ద్వారా మహాత్మాగాంధీ కలలను మోదీ ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేసింది. పేదల నుంచి వ్యతిరేకత రాకముందే పాత చట్టాన్ని పునరుద్ధరించి, కొత్త బిల్లును ఉపసంహరించుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

సూట్‌కేస్‌లో ఆరోగ్య రహస్యాలు!



ఇన్‌స్టా ఐ క్లినిక్ సూట్‌కేస్ కిట్



కిట్‌తో కళ్లను పరీక్షిస్తున్న సిబ్బంది

ఏజెన్సీ ప్రాంతాల్లోని వారు, ఇంటి నుంచి బయటకు వెళ్లలేని వృద్ధులకు రక్త, ఇతర ఆరోగ్య పరీక్షలు చేయించాలంటే ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. వాటి ఫలితాల కోసం ఎదురు చూడటమూ తప్పదు. అన్నింటికీ కలిపి గంటల సమయం వృథా అవుతుంది. ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా సూట్‌కేస్ కిట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో ఒకటైన ఇన్‌స్టా ఐ క్లినిక్ కిట్‌లోని పరికరాలతో శుక్లాలు, నీటికాసులు, ఐరిస్‌లో సమస్యలు, మధుమేహుల్లో వచ్చే రెటినోపతీ వంటి సమస్యలను గుర్తించవచ్చు. ఈ కిట్‌ను రెమిడో కంపెనీ రూపొందించింది. మరో సంస్థ తయారుచేసిన మొబిల్యాబ్ కిట్ ద్వారా 25 రకాల రక్తపరీక్షలు చేయొచ్చు. ఇది ఒకేసారి ఆరు నమూనాలను విశ్లేషిస్తుంది. ఏఐ ఆధారంగా పనిచేసే ఈ కిట్లు నిమిషాల్లోనే రిపోర్టులు ఇచ్చేస్తాయి. దాంతోపాటు రోగి పేరుతో క్లౌడ్‌లో మెడికల్ రికార్డ్ నంబరు (ఎంఆర్‌డీ) నమోదవుతుంది. వైద్యుడి దగ్గరికి వెళ్లి ఆ నంబరు చెబితే చాలు వారికి పూర్తి రిపోర్టు కనిపిస్తుంది. వీటిని ఒకసారి ఛార్జ్ చేస్తే బ్యాటరీ సాయంతో 7 నుంచి 10 గంటలు పనిచేస్తాయి. 'ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగం' పేరుతో సోమవారం విజయవాడలో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల సదస్సులో వీటిని ప్రదర్శించారు.



మొబిల్యాబ్ కిట్

– ఈనాడు, అమరావతి

జీవితాన్ని మలుపుతిప్పే ఐదు అలవాట్లు



✦ చిరుతిండ్ల జోలికిపోకుండా ఉండగలగటం ✦ కాఫీని వదిలిపెట్టడం ✦ ప్రకృతితో ఎక్కువ సమయం గడపడం ✦ రోజూ శ్వాసవ్యాయామాలు, ధ్యానం చేయడం ✦ కళ్లకు మాస్క్ ధరించి, చెవుల్లో ధ్వని నిరోధకాలు పెట్టుకుని నిద్రపోవడం ఈ అలవాట్లు జీవితంలో శక్తి స్థాయిలను పెంచడంతో పాటు స్పష్టతను, ప్రశాంతతను తీసుకొస్తాయి. – స్కాట్ విల్సన్, ఇన్‌ఫ్లుయెన్సర్

రఘురామను ఎందుకు కొట్టారు? ఎవరు కొట్టమన్నారు?

(మొదటి పేజీ తరువాయి)

వరకు, గంటసేపు భోజన విరామం తర్వాత సాయంత్రం 4 గంటల వరకు మరోమారు విచారించారు. ఇద్దరు వీఆర్వోల సమక్షంలో ఈ ప్రక్రియ పూర్తయింది. మొత్తం వీడియో చిత్రీకరించారు.

పొడి పొడి సమాధానాలతో దాటవేత

'సీఐడీ కస్టడీలోకి తీసుకున్న రఘురామకృష్ణరాజును చిత్రహింసలు ఎందుకు పెట్టాల్సి వచ్చింది, అలా చేయమని మీకు అప్పటి ప్రభుత్వ పెద్దలు ఏమైనా ఆదేశాలు జారీ చేశారా, ముసుగు ధరించి వచ్చి ఆయన్ను కొట్టిందెవరు, గుండెలపై కూర్చొని ఊపిరాడకుండా చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారా, కొట్టడానికి మనుషుల్ని ఎవరు పంపించారు, మీకు ఈ కేసుకు సంబంధమేంటి, మీకు వ్యక్తిగతంగా రఘురామకృష్ణరాజును ఎటాక్ చేయాల్సిన అవసరం ఏముంది, కొట్టిన తరవాత మీరేం చేశారు, ఒకవేళ మీకు తెలియకుండా కిందివాళ్లు చేశారని భావిస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ప్రాథమిక విచారణ చేసిన సునీల్‌నాయక్‌ను గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి ఎందుకు పంపించారు, అతని ఆధ్వర్యంలో కొట్టించడానికే పంపించారా, అంతర్గత విచారణలు ఏమైనా చేశారా, కొట్టిన దానిపై మీరు ఏమైనా నివేదిక ఇచ్చారా, ఇస్తే అదెక్కడుంది' అంటూ సునీల్‌కుమార్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు.



సీసీఎస్ వద్ద విచారణ అధికారి ఎస్పీ దామోదర్

రికార్డుల్లో సమాధానాలుంటాయి!

ఈ ప్రశ్నల్లో కొన్నింటికి మాత్రమే సునీల్‌కుమార్ సమాధానమిచ్చినట్లు తెలిసింది. కొన్ని ప్రశ్నలకు తనకు తెలియదన్నారు. మరికొన్నింటికి మౌనంగా ఉన్నారు. కొన్ని ప్రశ్నలకు రికార్డుల్లో సమాధానాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. విచారణ మొత్తంగా తనకేం తెలియదన్నట్లు ప్రవర్తించారని తెలిసింది. విచారణకు సునీల్ సహకరించలేదని మళ్లీ పిలిచేందుకు నోటీసులు ఇవ్వనున్నారు. విచారణ నేపథ్యంలో పశ్చిమ డీఎస్పీ అరవింద్, ఏఎస్పీ రమణమూర్తి, సీసీఎస్ డీఎస్పీ మధుసూదనరావు బందోబస్తు పర్యవేక్షించారు.

రిలయన్స్‌కు రూ.601.87 కోట్ల ప్రోత్సాహకాలు

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రూ.1,622 కోట్లతో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న బెవరేజస్ ప్రాజెక్టుకు టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ నిబంధనల మేరకు ప్రోత్సాహకాల కింద రూ.601.87 కోట్లు (స్థిర మూలధన పెట్టుబడిపై 10 శాతం) చెల్లించేందుకు అనుమతించింది. ఈ మొత్తాన్ని ఐదేళ్లలో చెల్లించాలని నిర్ణయించింది.

ఆరోగ్యం.. గజగజ!

(మొదటి పేజీ తరువాయి)

తగ్గిపోయి వారి శరీరం చల్లబడుతుంది. ఇది చాలా ప్రమాదకరం. కాబట్టి పసిపిల్లల్ని వెచ్చగా ఉంచాలి.

● పొడి వాతావరణం వల్ల ముక్కు ఎండిపోయి లోపల నుంచి రక్తస్రావం జరుగుతుంది. జలుబు తీవ్రంగా ఉండడం వల్ల ఎక్కువసార్లు ముక్కు చీదినా, లోపల తరచూ వేలు పెట్టినా రక్తం వచ్చే ప్రమాదం ఉంది.

ఆహారం, వ్యాయామం...

ఈ సీజన్‌లో వ్యాధుల బారిన పడకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

■ అనారోగ్యకరమైన చిరుతిళ్లు (జంక్‌ఫుడ్) జోలికి వెళ్లకుండా వేడి ఆహారాన్ని, ముఖ్యంగా ఆకుకూరలను భోజనంలో భాగం చేసుకోవాలి. ■ నూనెలు ఎక్కువగా ఉండే వేపుళ్లు, పిండి వంటలను కట్టడిచేయాలి. వేడి వేడి సూప్‌లను ఆహారంలో భాగం చేసుకోవాలి. ■ చలికాలం దాహంలేదని పిల్లలు మంచి నీళ్లు ఎక్కువగా తాగరు. దీనివల్ల చర్మం, పెదవులు పొడిబారి రక్తస్రావం జరుగుతుంది. కాబట్టి దాహంగా అనిపించకున్నా నీళ్లు తాగుతూ ఉండాలి. ■ రోజుకు కనీసం రెండు, మూడుసార్లు చర్మానికి మాయిశ్చరైజర్లు రాసి పొడిబారకుండా చూసుకోవాలి. ■ చలి ఎక్కువగా ఉంటే వ్యాయామం ఇంటి లోపల చేయొచ్చు. కాస్త ఎండవచ్చాక నడక, ఇతర శారీరక శ్రమ కలిగించే ఎక్సర్‌సైజ్‌లు తప్పనిసరి.

■ ఉన్ని దుస్తులతో చలి తగలకుండా వెచ్చగా ఉండడం అందరికీ శ్రేయస్కరం.

హృద్రోగులు అప్రమత్తంగా ఉండాలి

■ శీతల వాతావరణం గుండె సమస్యలున్న వారికి ప్రమాదకరం. రక్తనాళాలు సంకోచించడం వల్ల అధిక రక్తపోటుకు దారితీస్తుంది. తద్వారా గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. ■ చల్లని వాతావరణంవల్ల రక్తం చిక్కబడి క్లాట్స్ ఏర్పడే ప్రమాదమూ ఉంది. శ్వాసకోస సంబంధిత సమస్యల వల్ల గుండెకు సరఫరా అయ్యే ప్రాణవాయువు శాతం తగ్గడంతో దాని పనితనం దెబ్బతింటుంది. ■ చలిగా ఉందని చాలా మంది శారీరక శ్రమ లేదా వ్యాయామం తగ్గిస్తారు. దీనివల్ల గుండె సమస్యలు అధికమయ్యే ప్రమాదం ఉంది. ■ ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలున్న వారు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. ఉదయం కాస్త ఎండ వచ్చాక వ్యాయామం కొనసాగించాలి. జన సమూహంలోకి వెళ్లినపుడు మాస్కులు ధరించాలి. ■ కొవ్వు పదార్థాలను తినకూడదు. ఎక్కువ చక్కెరలు కలిగిన ఆహారాన్ని నిషేధించాలి. ఏదైనా ఇబ్బంది కలిగితే వైద్యులను వెంటనే సంప్రదించాలి.

– డాక్టర్ అజయ్, గుండె వైద్యుడు, కిమ్స్ ఆసుపత్రి, హైదరాబాద్

– ఈనాడు, హైదరాబాద్

వసతిగృహాలున్న చోటే వార్డెన్ల నివాసం

ఈనాడు, అమరావతి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో అధికారుల పర్యవేక్షణపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వసతిగృహ అధికారులు, ప్రిన్సిపళ్లు.. వసతిగృహాలు, గురుకులాల్లో సిబ్బందికి క్వార్టర్లు ఉంటే అక్కడే ఉండాలని స్పష్టం చేసింది. అవి నివాసయోగ్యం కాకపోతే అదే గ్రామం/ పట్టణంలోనే నివసించాలని ఆదేశించింది.


ఈనాడు

నిర్జీవమవుతున్న నదీమతల్లులు!

తాగు, సాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు విద్యుదుత్పత్తి వంటి వాటికీ అక్కరకొచ్చే నదీనదాలు మానవాళికి ప్రాణసమానాలు. వాటిని కాపాడుకోవడంలో పొడచూపుతున్న అలక్ష్యం భారతావని భవిష్యత్తును గాఢాంధకారంలోకి నెడుతోంది. పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీళ్లు, సగంకాలిన మృతదేహాలు, పశుకళేబరాలు, పొలాల్లోని క్రిమిసంహారకాలన్నీ వచ్చి కలుస్తుండటంతో నదులు కళతప్పుతున్నాయి. తాగేందుకు కాదుకదా, కనీసం స్నానానికీ పనికిరానంతగా అవి విషతుల్యమవుతున్నాయి. ఆయా నదీజలాలతో పండించిన పంటల్లోకి భారలోహాలు చేరి క్యాన్సర్ వంటి భయంకర రోగాలకు కారణమవుతున్నాయి. తాజాగా కృష్ణానదిలో రసాయనాల ఉద్ధృతి మూలంగా సూర్యాపేట జిల్లాలో 108 గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగింది. అంతకు మునుపు పల్నాడు జిల్లా తంగెడ వంతెన దగ్గర వ్యర్థాలు తెట్టెలుకట్టడంతో తమకు కలుషిత కృష్ణాజలాలు వస్తున్నాయని సమీప గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇలా ఎక్కడికక్కడ నదుల్లో రసాయనాలు పారుతుండటం ప్రజారోగ్యానికీ, జాతి సౌభాగ్యానికీ తీవ్ర హాని చేస్తోంది!

దేశీయంగా కాలుష్య రక్కసి కోరల్లో చిక్కిన నదీ ప్రవాహ ప్రాంతాలు 2022లో 311 ఉంటే, 2025లో 296కు తగ్గాయని సీపీసీబీ గొప్పగా చెబుతోంది. కానీ, 2009తో పోలిస్తే అవి ఏకంగా రెండింతలు పెరిగాయి. పైగా అప్పట్లో 121 నదులే కాలుష్యం బారినపడితే- ఆపై పద్నాలుగేళ్లలో అలాంటి వాటి సంఖ్య అంతకు రెండు రెట్లకు పైబడింది. సరైన శుద్ధి ఏర్పాట్లు లేకపోవడంతో నగరాలతోపాటు పట్టణాల్లోనూ మురుగులో ముప్పావు శాతం నేరుగా నదులు, సమీప జలవనరుల్లోకే చేరిపోతోంది. చుట్టుపక్కల పరిశ్రమలైతే హానికారక వ్యర్థాలను యమ దర్జాగా నదుల్లోకే వదిలేస్తున్నాయి. దానివల్లే కృష్ణాజలాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని గత పరిశోధనల్లో తేలింది. బాసర నుంచి రాజమహేంద్రి దాకా తెలుగు రాష్ట్రాల్లో ప్రవహించినంతమేరా గోదావరి అలాగే కునారిల్లుతోంది. కర్నూలు నగరంలో నిత్యం ఎగదన్నే మురుగులో 80శాతం నేరుగా తుంగభద్రలో కలుస్తోంది. పెన్నా, మంజీర, శబరి, మానేరు, మూసీ, కుందు వంటివీ డంపింగ్ యార్డులుగా మారిపోయి వాటి అసలు రూపాలను కోల్పోతుండటమే తీవ్రంగా కలవరపరుస్తోంది!

కెనడా, డెన్మార్క్, స్వీడన్ తదితర దేశాలు జలవనరులను కంటికి రెప్పలా కాచుకుంటూ తమ ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందిస్తున్నాయి. అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్న ఇండియాలో కలుషిత జలాలు ఏటా రెండు లక్షల మందిని బలిగొంటున్నాయి. వాతావరణ మార్పులతో ఇప్పటికే చాలా చోట్ల నదులు కుంచించుకుపోతున్నాయి. వ్యర్థాల గుమ్మరింతతో అవి మరింతగా నాశనమవుతున్నాయి. దేశానికి జీవనాడి వంటి గంగను తేటపరిచేందుకు 'నమామి గంగే' కింద వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కానీ, ఆశించిన ఫలితాలు నేటికీ లభించనేలేదు. కీలకమైన నీటికాల్వలూ మురుగు పరవళ్లతో, పశువులూ వాహనాలను వాటిలోనే కడిగేవారి బాధ్యతారాహిత్యంతో భ్రష్టుపడుతున్నాయి. ముప్పై గ్రామాలకు ఆధారమైన గుంటూరు ఛానల్ వెంబడి ఇలాంటి విస్మయకర దృశ్యాలే కనిపిస్తాయి. పెద్దాపురం పరిసరాల్లోని ప్యాక్టరీల వ్యర్థాలను ఏలేరు కాలువలోకి వదిచ్చేగా వదులుతుండటంతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. రాబోయే రోజుల్లో జలభూతం స్వచ్ఛమైన నీటికి అంగలార్చకూడదంటే జలవనరులను కలుషితం చేసేవారిని ఉపేక్షించకూడదు. ఇష్టారాజ్యంగా వ్యవహరించే కర్మాగారాలపై పీసీబీలు కొరడా ఝుళిపించాలి. నదులు చెరువుల ప్రాధాన్యంపై ప్రజావగాహన పెంచి, వాటి పునరుద్ధరణకు ప్రభుత్వాలు ఉద్యమస్ఫూర్తితో పరిశ్రమించాలి!



మన అంతర్గత శక్తినే రకరకాల పేర్లతో పిలుస్తాం. విధి అని, దైవమనీ, శివుడనీ, ఈశ్వరుడనీ... అన్నీ దాని పేర్లే. ఆ శక్తితో మనిషి చేసే ప్రయత్నానికే 'పౌరుషం' అని పేరు.

– సత్యవ్రత శాస్త్రి, సంస్కృత పండితులు, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత

మార్గశీర్షం

మనిషి ఉన్న... ఆతడి కర్తలు దేవదేవుడి సన్నిధానం చేరడానికి భగవంతుడు సూచనలు పాటిస్తూ ఆయననే స్మరిస్తూ పవిత్రంగా బతికే పరాత్పరుడి చెంత చేరితే అదే మోక్షం. ధనుర్మాసంలో విష్ణుపూజ చేస్తే భగవంతుడు త్వరగా కరుణిస్తాడని పద్మపురాణం చెబుతోంది. మాసాలలో ధనుర్మాసాన్ని నేనే అన్నాడు శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో. సాత్విక ఆరాధనలకు ధనుర్మాసం ప్రధానమైనది. గోదాదేవి కథ ఈ మాసానికి సంబంధించినదే.

సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించిన సమయం ధనుస్సంక్రమణం. దీన్నే పండుగ నెలపట్టడం... అంటారు. ధనుర్మాసం నెల రోజులూ పండుగ హడావుడిని గుర్తుచేస్తూ ఇళ్లముందు అందమైన ముగ్గులను తీర్చిదిద్దుతారు. ఈ నెలలో శ్రీవ్రతం చేస్తే పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. గోదాదేవి భగవంతుణ్ని భర్తగా పొందేందుకు చేసిన ఈ వ్రతం భక్తిపూర్వక ఆరాధనకు పరాకాష్ఠ. ఆధ్యాత్మిక సాధనలకు, భగవత్సేవకు ధనుర్మాసం అనువైన సమయం. గోదాదేవి (ఆండాళ్) విష్ణుచిత్తుడికి పూలతోటలో దొరికిన కుమార్తె. ఏకైక మహిళా ఆళ్వార్. విష్ణుచిత్తుడు విష్ణుచిత్తుణ్ని పెరియాళ్వార్ అని కూడా పిలుస్తారు.



రోజూ శ్రీరంగనాథుడికి సకల కైంకర్యాలు చేస్తూ భక్తి పారవశ్యంలో ఉండేవాడు. గోదాదేవి పెంపుడు తండ్రిని అనుసరిస్తూ శ్రీకృష్ణ లీలలు వింటూ భక్తురాలిగా మారింది.

శ్రీవ్రతం అంటే తిరుప్పావై చదువుతూ శ్రీకృష్ణ పరమాత్మ సేవకు సిద్ధం కావడం. తిరుప్పావై భక్తి గీతమాలిక. ధనుర్మాస వ్రతం శరణాగతికి ప్రతీక. ఈ మాసంలో శ్రీఆండాళ్ తన అంతరంగంలో తాదాత్మ్యం చెందుతూ పాశురాలను రచించి భగవద్గమనం కోసం పరితపించింది. మృగశిర నక్షత్రంతో కూడిన పౌర్ణమి ఈ నెలలోనే వస్తుంది కనుక ధనుర్మాసాన్ని మార్గశీర్షమని అంటారు.

అంతర్యామి

పూర్వం ద్వాపర యుగంలో పెళ్లి కాని యువతులు శ్రీకృష్ణుడే తమ భర్తగా రావాలని కోరుతూ కాత్యాయని వ్రతం చేశారు. అదే కోరికతో ఆండాళ్ తాను నివసించే శ్రీవిల్లిపుత్తూరులోని వటపత్రశాయిని కృష్ణుడిగా తలచి, ఆ దైవంపై అద్భుతమైన ఆధ్యాత్మిక గీతాలను రచించింది. ఈ గీతాలనే తిరుప్పావై అంటారు. 'తిరు' అంటే మంగళకరం. 'పావై' అంటే వ్రతం అని అర్థం. విష్ణువును కీర్తిస్తూ, గోదాదేవి మూలద్రావిడంలో గానం చేసిన ముప్పై పాశురాల గీతమాలిక తిరుప్పావై. ఒక్కో పాశురం ఒక్కొక్క రోజు గానం చేసి బెల్లంతో చేసిన పొంగలి పరమాత్మకు నైవేద్యం పెట్టడం సంప్రదాయం. ఈ పాశురాలు మధుర భక్తిని ప్రతిబింబిస్తాయి. ఈ వ్రతాన్ని వైష్ణవులు మార్గళి వ్రతమనీ, మార్గళి అనీ, ధనుర్వ్రతమనీ అంటారు. తెలుగులోనూ ఈ పాశురాలకు చాలా అనువాదాలు వచ్చాయి. అనువాదం చేసిన వారిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి, లక్ష్మణ యతీంద్రులు మొదలైన గొప్ప కవులు, తత్వవేత్తలు ఉన్నారు. ఇది ఎప్పుడూ సాహిత్యపరంగానూ, సాహితీ విలువల దృష్ట్యా సైతం తిరుప్పావై గొప్ప రచన. దైవ సాక్షాత్కారానికి చక్కని వేదమక్క.

– అప్పరుసు రమాకాంతరావు

ప్రగతి భారతానికి సొంత వ్యూహం

ఈ ఏడాది ప్రపంచంలోనే అత్యధిక వృద్ధిరేటు సాధించిన ఇండియా- పారిశ్రామికంగా మరింత పురోగమించేందుకు ఇటీవల 'లేబర్ కోడ్'లను అమలులోకి తెచ్చింది. కానీ, ఆర్థికాభివృద్ధికి కీలకమైన యువ జనాధిక్యతను ఉత్పాదకశక్తిగా మార్చుకునేందుకు చేయకలేకపోతోంది. దాంతో యువతలో నిరుద్యోగిత పెరుగుతోంది. దాన్ని నివారించాలంటే భారత్ కేవలం వస్తుసేవల వినియోగంపైనే ఆధారపడకూడదు. సొంతంగా టెక్నాలజీని అభివృద్ధి చేసుకుని, ఎగుమతులనూ పెంచుకుంటేనే ఉపాధి అవకాశాలు విరివిగా అందివస్తాయి.

కొన్నేళ్లుగా దేశంలోని బడా కంపెనీలు పెట్టుబడులు పెట్టేగల సామర్థ్యముండి కూడా ఆ పని చేయడంలేదు. పైగా ప్రభుత్వం భారీగా సబ్సిడీలు ఇస్తేనే కొత్త పరిశ్రమలు స్థాపిస్తామనీ, ఉన్నవాటిని విస్తరిస్తామనీ అంటున్నాయి. లేదంటే విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెడితే వాటికి ఇక్కడ ఏజెంట్లుగా పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. మరికొన్ని కంపెనీలు అరువు తెచ్చుకున్న పాత సాంకేతికత లతో లైసెన్సుల మీద ఉత్పత్తి సాగిస్తున్నాయి. విదేశాల్లో విజయవంతమైన వ్యాపార నమూనాలను ఇక్కడ అనుకరిస్తున్నాయి. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి సృజనాత్మక సాంకేతికతలు రాజ్యమేలుతున్న ప్రపంచంలో అరువు పరిజ్ఞానాలతో పనికిరావని అవి గ్రహించడం లేదు. ఇలాంటి అరువు నమూనాల దీర్ఘకాలిక ప్రగతికి ఏమాత్రం పనికిరావు.



ప్రభుత్వ ప్రోత్సాహక పథకం కింద ఇలాంటి కంపెనీల్లో అప్రెంటిస్లుగా చేరినవారు సైతం వీటివల్ల తమకు భవిష్యత్తు ఉండదని గ్రహించి గడువుకన్నా ముందే వైదొలగుతున్నారు.

పరిశోధన-అభివృద్ధికి నసేమిరా...

మన కంపెనీలు పెట్టుబడి వ్యయాన్ని పెంచి సృజనాత్మకతకు పదును పెట్టాలి. కొత్త సాంకేతికతలను సృష్టించి, వాటిపై మేధా హక్కులను సాధించడంతో పాటు అత్యాధునిక ఉత్పత్తులూ సేవలతో ముందుకుసాగాలి. అప్పుడే భారతదేశ దీర్ఘకాలిక ప్రగతికీ, ఉజ్జ్వల భవిష్యత్తుకూ భరోసా లభిస్తుంది. కానీ, ఈ వాస్తవాన్ని మన కార్పొరేట్లు గ్రహించకపోవడం విచారకరం. జాతీయ గణాంక సంస్థ నిర్వహించిన సర్వేలో 40.6శాతం కంపెనీలే 2024-25లో కీలక ఉత్పాదక ఆస్తుల సృష్టికి పెట్టుబడులు పెంచుతామని చెప్పాయి. 2025-26వచ్చేసరికి ఈ పెట్టుబడి వ్యయాన్ని తగ్గిస్తామని చెప్పడం ఆయా పరిస్థితికి నిదర్శనం. అయితే, పారిశ్రామిక రంగంలోని కొన్ని కంపెనీలు అలా చెప్పకపోవడం కాయింకాస్త ఆశాకిరణం. సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో 28.4శాతం ఉన్న వ్యాపారాన్ని మెరుగుపరచుకోవడానికీ, ఆదనపు విలువను జోడించడానికీ పెట్టుబడులు పెడతామన్నాయి. పరిశోధన-అభివృద్ధి ద్వారా మేధా హక్కులు సాధించడానికి ముప్పు చేస్తామన్న కంపెనీలు కేవలం 5.8శాతమే! ఇక 43శాతం కంపెనీలైతే కొత్త పెట్టుబడులు పెట్టే ఉద్దేశమే లేదనేశాయి. ఇలాంటప్పుడు భారతదేశ జీడీపీలో పరిశోధన-అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) వాటా కేవలం 0.6శాతంగానే ఉండటం ఆశ్చర్యమేమీ కాదు! గడచిన మూడు దశాబ్దాల నుంచి ఇదే కథ. 1994-95లో మన జీడీపీలో 19శాతంగా ఉన్న పారిశ్రామిక రంగం వాటా నేడు 12శాతానికి పడిపోయింది.

ప్రైవేటు కంపెనీల లాభాలు పెరగడమంటే కార్మికుల ఉత్పాదకశక్తి పెరగడం మీద ఆధారపడి ఉంటుంది. ఉత్పాదకత పెరగడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి- ఆధునిక యంత్రాలూ సాంకేతికతలనూ సమకూర్చుకుని, వాటికి అనుగుణంగా కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరచి... తక్కువ వ్యయంతో ఎక్కువ ఉత్పత్తిని సాధించడం. కార్మికులతో ఎక్కువ పనిగంటలు పనిచేయించుకోవడం ద్వారా అధిక ఉత్పత్తిని సాధించడం రెండోది. కొత్త సాంకేతికతల ద్వారా కార్మికుల ఉత్పాదకతను, తద్వారా లాభాలనూ పెంచుకోవచ్చు. అయితే, ఇందుకోసం ఆర్‌అండ్‌డీపై కష్టపడి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ పని చేయడానికి చాలా భారతీయ కంపెనీలు ససేమిరా ఇష్టపడటం లేదు సరికదా, కార్మికుల నుంచి ఎక్కువగా పిండుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నాయి. అందుకే కార్మికుల పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచాలని పట్టుబట్టాయి. వీటిలో తక్కువస్థాయి సాఫ్ట్‌వేర్ ఎగుమతులు చేసే కంపెనీలే ఎక్కువ. దురదృష్టవశాత్తూ వీటి ఒత్తిడి ఫలించింది. ఇది కార్మికుల సంక్షేమానికి చేటు చేస్తోంది.

సాధారణంగా కార్మికులకు ప్రతిరోజూ నగరాలు, పట్టణాలకు దూరంగా ఉండే తమ కంపెనీలకు వెళ్లిరావడానికి 2-4 గంటల సమయం పడుతుంది. ఈ లెక్కన రోజుకు 12 గంటల పని అంటే, రోజులో 14-16 గంటలు ఉద్యోగానికే సరిపోతాయి. ఇక వారికి విరామం ఎక్కడ మేధోశ్రమమైనా సరే, ఇలా ఏకబిగిన చేయడమూ సాధ్యం కాదు. మితిమీరిన పని ఆరోగ్యానికి హానికరం కూడా. నిజానికి చాలా పరిశ్రమల్లో ఇప్పటికే ఎనిమిది గంటలకు మించి పనిచేయిస్తున్న కార్మికశాఖ పట్టించుకోవడం లేదు. కోవిడ్ వచ్చినప్పటి నుంచి సాఫ్ట్‌వేర్ వంటి రంగాల్లో ఉద్యోగుల ఆఫీసుతోపాటు ఇంటి నుంచీ పనిచేయాల్సి వస్తోంది. ఎక్కువ పనిగంటలు డిమాండ్ చేస్తున్న కంపెనీల్లో అత్యధిక జీతం ఆదునిక సేవలు అందించేవి కాదు. తక్కువ కార్మిక వ్యయంతో నెట్టుకొస్తున్న ఇలాంటి సంస్థలకు రేపు ఏఐ, రోబోటిక్స్ గట్టి కాలం చెల్లనుంది. అందుకే దీనం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాల్సిన తప్పనిసరి అవసరం ఉంది. ఎక్కువ పనిగంటల కోసం డిమాండ్ చేస్తున్నాయి.

సరైన పరిష్కారమేది?

ఏఐ, రోబోటిక్స్ యుగంలో టెక్నాలజీ ఎప్పటికప్పుడు మారిపోతుంది. లాభార్జన కష్టమవుతుంది. కాబట్టి, ప్రభుత్వం నుంచి చవగ్గా భూములు, సబ్సిడీలు పొందుతూ పాతతరం పరిశ్రమలను నడిపించడం ఇక ఎన్నాళ్లో కుదరదు. నవీన సాంకేతికతలు, కొత్త ఉత్పత్తి పద్ధతులతోనే వ్యాపారాలు, పరిశ్రమలు ముందుకుసాగుతాయి. 2008 ఆర్థిక సంక్షోభం తరవాత చైనా ప్రభుత్వ మద్దతుతో ఆధునిక ఉత్పత్తి ప్రక్రియలపైనా దృష్టి కేంద్రీకరించాయి. ఇప్పుడవి ప్రపంచంలోనే మేటి కంపెనీలుగా ఎదిగాయి. భారతావని సైతం అదే బాటపట్టాలి. నిర్దిష్ట నవీన రంగాల్లో పెట్టుబడులు పెట్టేవారికి మాత్రమే ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ(ఎంఎస్ఎంఈ)లకు అండదండలివ్వాలి. దేశ పారిశ్రామిక రంగంలో 80శాతం ఇలాంటివే కాబట్టి, వాటి ద్వారా పెద్దయెత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఎంఎస్ఎంఈలు ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడానికీ ప్రభుత్వరంగం చేయూతనివ్వాలి.



డాక్టర్ ఎస్.అనంత్
ఆర్థిక సామాజిక విశ్లేషకులు



కోపం ఒకరి మీద...

అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టు... అనే సామెతలో దుత్త అంటే చిన్న కుండ. అత్తమీద కోపమొచ్చిన ఓ కోడలు అవిశ్వే ఏమీ అనలేక, పెరుగు కుండ నేలకేసి కొట్టిందట. అదైతే ఎదురు తిరిగి ఏమీ అనదు కదా!

నేను 1979లో కృష్ణాజిల్లా కలెక్టరుగా ఉన్నప్పుడు నేదురుమల్లి జనార్దనరెడ్డి రెవెన్యూ మంత్రిగా ఉండేవారు. ముఖ్యమంత్రి చెన్నారెడ్డికి కుడి భుజంగా ఉంటూ హుషారుగా పనిచేసేవారు, మాతో చేయించేవారు. 1989లో కాంగ్రెసు గెలవడంతో చెన్నారెడ్డి మళ్లీ సీఎం అయ్యారు. గవర్నర్ కుముద్‌బెన్ జోషి తన ఆఫీసులో సెక్రటరీగా నన్ను నియమించాలని పట్టుబట్టారు. గతంలోనే ఒకప్పుడు చేసి ఉండటంవల్ల సీఎంని కలిసి ఆ పోస్టింగ్ నాకొద్దని చెప్పాను. తాను చూసుకుంటానని చెప్పి ఎనర్జీ ఎన్విరాన్మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీలో సెక్రెటరీగా వేద్దామనుకున్నారు. అది ముఖ్యమైన శాఖ అయినా నాకా రంగంలో ఆసక్తి లేదు. వెళ్లి సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.ఆర్.రామమూర్తిని కలిసి వీలుంటే వ్యవసాయ శాఖలో వేయమని అడిగితే ఆయన నా కోరిక మన్నించారు.

వ్యవసాయ శాఖ మంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి కావడంతో మా మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. అది సీఎంకి ఆపోహ కలిగించింది. అప్పటికే ఆయనకూ నేదురుమల్లికీ పొరపొచ్చాలు ఉండేవి. ఒక రోజు అసెంబ్లీలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే పి.జనార్దనరెడ్డి డెయిరీ ఫెడరేషన్ గురించి ముఖ్యమంత్రిపై ఏవో ఆరోపణలు చేశారు. ఆయన అధికార పార్టీ సభ్యుడైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడారు. డెయిరీ ఫెడరేషన్ నాకిందికే వస్తుంది. జవాబిచ్చేందుకు ముఖ్యమంత్రికి సహాయ పడటానికి సిద్ధంగా ఉన్నాను. సీఎం నా వైపు తిరిగి 'ఏమయ్యా... నువ్వు సరిగ్గా అర్థమయ్యేట్టు చెప్పలేదా' అన్నారు.

పి.జనార్దనరెడ్డి నేదురుమల్లి దగ్గరివారని ప్రతీతి. అందువల్ల నేనూ ఆయనతో కుమ్మక్కయ్యానని అనుకుంటున్నారేమో అనిపించి, జవాబు చెప్పలేకపోతుండగా చెన్నారెడ్డి లేచి వెళ్లిపోయారు. నేను ఆయన వెనకే గబగబా గదిలోకి వెళ్లాను. 'మీ మనసులో ఏదో ఉన్నట్టుంది. ఏంటో సరిగ్గా చెప్పండి' అన్నాను. 'ఇక్కడేం జరుగుతోందో నాకు తెలుసు. సమాచారం ప్రభుత్వం నడుస్తోందా' అన్నారాయన కోపంగా. నాకు మొదట్లో ఏమీ అర్థం కాలేదు. ఆ తరవాత పుంజుకుని చెప్పాను 'సర్, మీకేదో దురభిప్రాయం కలిగినట్టుంది. నేను ఏదైనా తప్పు చేస్తున్నానని కాని, చేయాల్సిన విధంగా పనులు చెయ్యడం లేదని కానీ అనిపిస్తే చెప్పండి, వెంటనే సెలవుపెట్టి వెళ్లిపోతాను' అన్నాను. అది ఆయన ఆవేశాన్ని మరింత పెంచింది. 'నువ్వు బెదిరిస్తున్నావా? నేను నీకంటే గొప్ప గొప్పవాళ్లను చూశాను' అన్నారు నిష్ఠూరంగా. 'మీకు నామీద నమ్మకముంటే మంచిది. లేకపోతే మాత్రం నేనిక్కడ పనిచెయ్యలేను' అని చెప్పేసి చీఫ్ సెక్రెటరీ వి.పి.రామారావు దగ్గరికి వెళ్లాను. ఆయనకు నా లీవ్‌లెటర్ ఇచ్చాను. 'కాలుకాలు తెలియదు కానీ ఇవాళ ముఖ్యమంత్రి వైఖరి చూస్తే ఆయనకు నామీద విశ్వాసం ఉన్నట్టు లేదు. ఈ పరిస్థితుల్లో నేనిక్కడ కొనసాగడం బాగుండదు' అని అందులో రాశాను.

చిత్రంగా ఆ తరవాత రెండు మూడు రోజుల్లోనే ముఖ్యమంత్రి మారిపోయారు. నేదురుమల్లి కొత్త సీఎం అయ్యారు!

– డాక్టర్ మోహన్ కందా
ఉమ్మడి ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

సర్కారీ బడులపై చిన్నచూపెందుకు?



స్వావలంబన కోసం

సిటిస్కాన్లు మొదలు ఎంఆర్ఐ స్కానర్లు, పేస్‌మేకర్లు, వెంటిలేటర్ల దాకా అన్నింటినీ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుండటం వల్ల వైద్య వ్యయాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పీఎల్ఐ పథకం కింద వైద్య పరికరాల తయారీకి కేంద్రం ఊతమిస్తోంది. దాంతో ప్రస్తుతం 1,500 కోట్ల డాలర్లుగా ఉన్న దేశీయ వైద్య పరికరాల పరిశ్రమ 2030 నాటికి అంతకు మూడున్నర రెట్లకు పైగా వృద్ధి చెందుతుంది అంటున్నారు. గత అయిదేళ్లలో ఆయా రాష్ట్రాలు, యూటీల్లో వైద్య పరికరాల తయారీకి కేంద్రం ఎన్ని లైసెన్సులు మంజూరు చేసిందంటే...

గుజరాత్	738	తెలంగాణ	194
మహారాష్ట్ర	721	కేరళ	187
తమిళనాడు	346	రాజస్థాన్	118
ఉత్తర్‌ప్రదేశ్	346	పంజాబ్	78
హరియాణా	302	ఆంధ్రప్రదేశ్	58
దిల్లీ	291	బిహార్	39
కర్ణాటక	262	ఒడిశా	38

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని సర్కారీ బడుల్లో విద్యార్థుల ప్రవేశాలు నానాటికీ తగ్గిపోతుంటే, ప్రైవేటు స్కూళ్లలో పెరుగుతున్నాయి. 2024-25 విద్యాసంవత్సర గణాంకాల ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లో దాదాపు సగానికిపైగా ప్రభుత్వ పాఠశాలలు ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఇస్తున్నా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలవైపే ఎందుకు మొగ్గుతున్నట్లు?

ఆంధ్రప్రదేశ్‌లో 20కన్నా తక్కువమంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 15 వేలు. తెలంగాణలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా చేరని సర్కారీ బడులు 1,980. నిరుడు వాటి సంఖ్య 1,745 మాత్రమే. గడచిన మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 700కన్నా తక్కువ మంది విద్యార్థులున్న ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 9,600. ఇప్పుడు 40శాతం పాఠశాలలు వందకన్నా తక్కువమందితో నెట్టుకొస్తున్నాయి. 2016-25 మధ్యకాలంలో ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు 8.6శాతం తగ్గిపోగా, ప్రైవేటు పాఠశాలల్లో 35శాతం పెరిగాయి. నిజానికి ప్రాథమిక పాఠశాల దశలోనే చాలామంది పిల్లలు సర్కారీ బడులకు దూరమవుతున్నారు. ఇక పదోతరగతి విద్యార్థుల్లో మూడోవంతుల మంది ప్రైవేటు స్కూళ్లకే వెళ్తున్నారు. పేదలు భారం అధికమైనా ఇప్పుడు పిల్లలను చాలామంది ప్రైవేటు వైపే మొగ్గుచూపుతుండటం గమనార్హం.

తల్లిదండ్రులు ఏమనుకుంటున్నారు?

ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చాలామంది బోధనపై దృష్టి పెట్టడం లేదని, అక్కడ చదివే విద్యార్థులకు మంచి మార్కులు రావనే అభిప్రాయం చాలామంది తల్లిదండ్రుల్లో ఉంది. అది తప్పని ఎన్నోసార్లు తేలినా ఆ అపోహ వీడటం లేదు. ప్రైవేటు స్కూళ్లు మాత్రం తాము ఉత్తమమైన, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని భారీ ప్రచారం చేసుకోవడంలో విజయం సాధించాయి. గణిత, భౌతిక, రసాయనశాస్త్ర పాఠాలను ప్రైవేటు బడుల్లోనే బాగా చెబుతారనీ... అందువల్ల తమ పిల్లలు పోటీ పరీక్షల్లో నెగ్గుకొస్తారనీ ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తారనే నమ్మకం తల్లిదండ్రుల్లో పెరిగింది. సర్కారీ బడుల్లో అన్ని సబ్జెక్టుల్లోనూ సమగ్ర బోధన లభిస్తుందనే వాస్తవాన్ని వారు పట్టించుకోవడం లేదు. ప్రైవేటు బడులు తెలుగు, హిందీ వంటి భాషలకూ, సామాజిక శాస్త్రాలకూ, వ్యాయామానికీ ప్రాధాన్యమివ్వకుండా సైన్స్ సబ్జెక్టుల మీదే పూర్తిగా దృష్టి పెడుతున్నాయి. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడని దాన్ని చాలామంది తల్లిదండ్రులు కూడా సమ్మతిస్తుండటం విస్మయం కలిగించేదే. ఐఐటీ తరహా ప్రవేశ పరీక్షల్లో తమ పిల్లలు నెగ్గాలంటే 'ప్రైవేటు' బోధనే తప్పనిసరని అని వారు విశ్వసిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంపై మోజు, బస్సుల్లో పిల్లలను తీసుకెళ్లడం, కోచింగ్‌కు ప్రాధాన్యం వంటివీ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి.



తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పిస్తుంటే, ప్రభుత్వ పాఠశాలలు తరగతి గదులు కుంచించుకుపోతున్నాయి. విద్యార్థుల నమోదు ఒక స్థాయికన్నా తక్కువగా పడిపోతే ప్రభుత్వ బడులను మిగతా పాఠశాలల్లో విలీనం చేస్తున్నారు. లేదంటే వేరే బోటికి తరలిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే సంస్కరణలు తీసుకొచ్చి, తగిన విధాన నిర్ణయాలతో ప్రోత్సాహం అందించకపోతే- వేలాది సర్కారీ బడులు మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకు పంపిస్తున్న తల్లిదండ్రులు... అక్కడ చదివిన వారికి ప్రభుత్వ ఇంజినీరింగ్, వైద్య కళాశాలలతో పాటు ఐటీ ఐలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో కొన్ని సీట్లు రిజర్వు చేయాలి. జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో చదివినవారికి కొన్ని సీట్లు కేటాయించే పద్ధతి ప్రస్తుతం బాసర, నూజివీడు, ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్ ఐటీల్లో ఉంది. దాన్ని ఇంకా విస్తరించాలి. ఐఐటీ, ఎన్ఐటీ వంటి విద్యాసంస్థలకు నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ప్రధాన సబ్జెక్టులతో పాటు భాషలు, సామాజిక శాస్త్రాలకూ ప్రభుత్వం అధిక మార్కులు వేయాలి.

ఉపాధ్యాయులపై గురుతర బాధ్యత

తల్లిదండ్రుల నమ్మకాన్ని చూరగొనడంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులదే కీలక పాత్ర. వారు తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశమవుతూ విద్యార్థుల పురోగతి గురించి చర్చించాలి. లోటుపాట్లను సరిదిద్దడం, సరైన ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహాన్ని శ్రద్ధను పెంపొందించాలి. ఉపాధ్యాయులకూ నైపుణ్య శిక్షణ చాలా అవసరం. గ్రామీణ పాఠశాలల నిర్వహణ కమిటీల్లో ఉన్నత చదువులు చదివిన పూర్వవిద్యార్థులను కూడా నియమించాలి. ముఖ్యంగా విద్యారంగంలో పనిచేస్తున్న వారినీ, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నతాధికారులుగా పనిచేస్తున్నవారినీ నియమిస్తే మరీ మంచిది. ఇలాంటివారు స్థానిక సమాజానికి పాఠశాలకూ మధ్య అనుసంధానకర్తలుగా నిలుస్తారు. జవాబుదారీ వహించడంలో తోడ్పడగలుగుతారు. గ్రామీణ పాఠశాలలకు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు కూడా మార్గదర్శకత్వం వహించాలి. కళాశాలల అధ్యాపకులు పాఠశాల ఉపాధ్యాయులకు వర్క్‌షాప్‌లు నిర్వహించవచ్చు. కాలేజీ విద్యార్థులు సైతం బడుల్లో ట్యూటర్లుగా వ్యవహరించగలుగుతారు. ఇటువంటి చర్యల ద్వారా పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగుపడతాయి. ప్రభుత్వాలు కూడా చిత్తశుద్ధితో తగిన విధాన నిర్ణయాలు తీసుకుని సర్కారీ బడుల్లో బోధనా ప్రమాణాలు, వసతులను మెరుగుపరచాలి. లేదంటే గ్రామీణ బాలబాలికలకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షలానే మిగిలిపోతుంది.



నాగళ్ల శివప్రసాద్
విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ-మద్రాసు

హాయ్ బుజ్జీ

సముద్రంలో రంగుల ప్రపంచం..!

నేస్తాలు..! సముద్రం అడుగున రంగురంగులుగా ఉండే వీటిని చూసి ఏ పూల మొక్కలో అనుకునేరు. ఇవి పగడపు దిబ్బలు. భలే అందంగా ఉన్నాయి కదూ! ఒకసారి వాటిని చూసేద్దాం. కోసం దగ్గర నుంచి చూస్తే బాగుందు అనిపిస్తోంది కదా! ఇంతకీ అవి ఎలా ఏర్పడతాయి, దేనికి ఉపయోగపడతాయో తెలుసుకుందామా!

భూమి మీద ఉన్నట్లే సముద్రం లోపల కూడా కొన్ని జీవులు ఉంటాయి. పెద్ద జీవుల నుంచి వాటిని అవి రక్షించుకోవడానికి సముద్రం అడుగుభాగాన కాల్షియం కార్బొనేట్‌తో గట్టి అస్థిపంజరం లాంటి నిర్మాణాలను ఏర్పాటు చేసుకుంటాయి. వాటి సమూహాలనే పగడపు దిబ్బలు(కోరల్ రీఫ్) అని పిలుస్తాం. వీటిలో ఒక ప్రత్యేకమైన ఆల్గే ఉంటుంది. ఇదే పగడపు దిబ్బలకు ఆహారాన్ని, రంగును అందిస్తుంది. వీటిని 'రెయిన్ ఫారెస్ట్స్ ఆఫ్ ది సీ' అని కూడా పిలుస్తారు. ఇవి సముద్రం మొత్తంలో ఒక శాతం విస్తీర్ణంలోనే ఉంటాయి. కానీ దాదాపు 25శాతం సముద్ర జీవులకు ఆహారాన్ని అందిస్తాయి. అలాగే



కొన్ని జీవులకు నివాసంగా కూడా పని చేస్తాయి. నదులు, చెరువులు కూడా నీళ్లతోనే ఉంటాయి కదా! మరి వాటిలో ఎందుకు ఈ దిబ్బలు కనిపించవు? అనే సందేహం ఇప్పటికే మీకు వచ్చింది కదా! అవి ఉప్పు నీళ్లలో మాత్రమే ఉంటాయి. అందుకే మనకు ఇతర నీటి వనరుల్లో కనిపించవు. వీటిని ఉపయోగించి కొన్నిరకాల ఔషధాలను కూడా తయారుచేస్తారు. ఇంకా తుపానుల నుంచి తీరప్రాంతాలను రక్షిస్తాయి. అలాగే చెట్లలా కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుంటాయి. ఇన్ని ఉపయోగాలున్న పగడపు దిబ్బలు సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదలలు, నీటి కాలుష్యం వల్ల చనిపోతున్నాయి. వాటికి ఎలాంటి హాని కలగకుండా చూడాలంటే మనం చేయాల్సింది.. సముద్రాల దగ్గర ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పారవేయకుండా ఉండాలి. పర్యావరణాన్ని కాపాడుకోవాలి.

– పి.పవిత్ర

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి రాయండి చూద్దాం.

బుట్ట	గంట	పాగ	పాము
కీలు	తోట	రోజు	రామ
పచ్చి	మట్టి	గుర్రం	చెత్త
ఎర్ర	పుట్టిన	నవమి	అరటి
మంచు	గడ్డి	గుడి	నాగు

సోగ్గాడు @50

కేరాఫ్ కోలవెన్ను



కోలవెన్ను మండపాల కూడలిలో 'సోగ్గాడే.. లేచాడే' పాట చిత్రీకరణ

విజయం సాధించిన సోగ్గాడు చిత్రం పేరు చెప్పగానే కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను గుర్తుకొస్తుంది. ఈ చిత్రంలోని కీలకమైన సన్నివేశాలతో పాటు విజయవంతమైన రెండు పాటలను ఇక్కడే నెల రోజుల పాటు చిత్రీకరించారు. దర్శకుడు కె. బాపయ్య స్వస్థలం కావడంతో గ్రామస్థుల సహకారం లభించింది. 'సోగ్గాడే..లేచాడే..లేచిలేచి నీ దుమ్ము దులుపుతాడే' పాటలో కథానాయకుడు శోభన్‌బాబు, కథనాయికలు జయచిత్ర, జయసుధతో పాటు మంజుభార్గవి, రాజబాబు, నగేష్(నాగేష్) నటించారు. అల్లు రామలింగయ్య, కైకాల సత్యనారాయణ, గిరిబాబు, అంజలి, శాంతకుమారి, రమాప్రభ తదితర తారాగణంతో సినీ పండగ సందడి చూడటానికి అప్పట్లో జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలిరావడాన్ని గ్రామస్థులు మననం చేసుకుంటున్నారు.

గ్రామ నడిబొడ్డున ఉన్న మండపాల కూడలిలోనే చిత్రీకరణ అధికంగా జరిగింది. స్థానికుల సహకారంతో ఇక్కడే వరసిద్ధి వినాయకుడి విగ్రహాన్ని నిర్మాత డి.రామానాయుడు ప్రతిష్ఠించారు. ఇప్పటికీ సురేష్ ప్రొడక్షన్ ద్వారా విడుదలయ్యే ప్రతి సినిమాలో బ్యానర్ పాటలో ఈ విగ్రహమే కనిపిస్తుంది. 1975లో విడుదలైన సోగ్గాడు చిత్రంతో శోభన్‌బాబు హీరోగా తన స్థానాన్ని మరింత పదిలపరచుకున్నారని చెబుతుంటారు. ఈ నెల 19న 'అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి' ఆధ్వర్యంలో స్వర్ణోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు ప్రకటించిన విషయం విదితమే. ఆ రోజు మరోసారి సోగ్గాడు చిత్రం విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

- న్యూస్‌టుడే, కంకిపాడు

అడిగినంత ఇచ్చుకో.. నచ్చినట్లు తోలుకో...

లైసెన్స్‌కు రూ.5 వేల వరకు వసూలు

ఈనాడు - అమరావతి

మీకు వాహనం నడపడం వచ్చా.. రాదా అనేది అనవసరం. రవాణా నిబంధనలపై ప్రాథమిక అవగాహన ఉన్నా లేకున్నా పట్టించుకోరు. అడిగినంత కమీషన్ ఇస్తే చాలు.. అడ్డగోలుగా లైసెన్స్‌లు ఇప్పించేస్తారు. ఇదీ ఆర్టీవో కార్యాలయాలపై ఏజెంట్ల గుత్తాధిపత్యం.. వారు ఇంత చేస్తున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోరా అంటే.. వారికీ ఇందులో వాటాలుంటాయి కదండీ అని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

కమీషన్ల కక్కుర్తి...

● విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేటలో ఆర్టీవో కార్యాలయాలు ఉన్నాయి. నున్నలో ఏటీఎస్ కేంద్రం ఉంది. వీటిల్లో కమీషన్ల గుట్టు ఎందెందు వెతికినా అన్నట్లు ఉంది. ప్రతి కార్యాలయానికి కూతవేటు దూరంలోనే కమీషన్ల కోసం స్థావరాలు పెట్టి మరీ దళారులు కాసుకూర్చున్నారు. ● ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించేది గోరంత.. దళారులు దోచేది కొండంత. ● బండి లైసెన్స్‌కు రూ.5 వేలు, బండి, కారు కలిపితే రూ.8 వేలుగా నిర్ధారించారు. ● కార్యాలయాల్లో రాత పరీక్షను సిబ్బందే రాసేస్తున్నారు. ● డ్రైవింగ్ టెస్ట్‌కొస్తే చాలు.. బండి నడపడం వచ్చినా రాకున్నా పట్టించుకోరు. ● దళారులు వసూలు చేసిన సొమ్మును కార్యాలయ సిబ్బందితో కలిసి వాటాలు వేసుకుంటున్నారు. ● ఒక్క రోజులో మూడు ఆర్టీవో కార్యాలయాల్లో దాదాపు 200 ఎల్.ఎల్.ఆర్.లను మంజూరు చేస్తారు. ఈమేరకు ఒకరోజుకు.. రూ.10 లక్షల చొప్పున నెలకు రూ.3 కోట్లు చేతులు మారుతున్నాయి. డీటీసీ మోహన్ వివరణ కోరగా.. అడ్డగోలు వసూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిలువు దోపిడీ చేస్తున్నారు...

సింగ్‌నగర్‌వాసి రాఘవ సోమవారం డ్రైవింగ్ లైసెన్స్ కోసం విజయవాడ ఆర్టీవో కార్యాలయానికి వెళ్లారు. సిబ్బందిని దరఖాస్తు అడిగితే.. ఈట్‌స్ట్రీట్‌లోని ఓ ఏజెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి అక్కడికి వెళ్లమన్నారు. అక్కడికెళ్లాక... 'లైసెన్స్‌కు రూ. 8,500 ఇవ్వండి.. మీరేం చేయక్కర్లేదు.. అన్నీ మేమే చూసుకుంటాం.. రాత, డ్రైవింగ్ పరీక్షలకు హాజరైతే చాలన్నారు.' చివరకు రూ.8 వేలకు బేరం తెగ్గొట్టారు.

నందిగామ ఆర్టీవో కార్యాలయం సమీపంలో పాతబస్టాండ్, రైతుపేటలో మధ్యవర్తులు స్థావరాలు పెట్టారు. వీరి ద్వారా వెళితేనే లైసెన్స్ వస్తుంది. నేరుగా దరఖాస్తు చేస్తే కాళ్లరిగేలా తిప్పిస్తారు. లైసెన్స్ దరఖాస్తుకు రూ.500-750 లోపే ఖర్చవుతుంటే.. వీరు మాత్రం రూ.7 వేలుపైగా బాదేస్తున్నారు. జగ్గయ్యపేటలోనూ ఇంతే.

పుస్తక పండగొచ్చేస్తోంది..!



ఈనాడు, అమరావతి: 'విజయవాడలో ఏటా సంక్రాంతికి ముందే.. పుస్తకాల పండగొచ్చేస్తుంది. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి భారీగా పుస్తక ప్రియులు తరలి వచ్చి.. రూ.లక్షల విలువైన పుస్తకాలను కొంటారు. పుస్తక మహోత్సవం కోసమే ప్రత్యేకంగా విద్యాసంస్థలు, గ్రంథాలయాలు నిధులు సిద్ధం చేసుకుంటాయి. దేశంలో ప్రముఖ ప్రచురణ సంస్థలన్నీ తరలివచ్చి స్టాళ్లను పెట్టడంతో.. అతి చిన్న పుస్తకం నుంచి.. భారీ గ్రంథాల వరకు దొరుకుతాయి. ప్రతి స్టాల్‌లోనూ.. అన్ని పుస్తకాలపై 10 శాతం రాయితీ ఇస్తారు. 35 ఏళ్లుగా విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం (వీబీఎఫ్) ఆధ్వర్యంలో దిగ్విజయంగా ప్రదర్శన జరుగుతోంది.'

ప్రముఖులను గుర్తుచేసుకునేలా..: పుస్తక మహోత్సవ ప్రాంగణం, వేదికలకు సాహితీ ప్రముఖులు, రచయితలు, ప్రచురణకర్తల పేర్లను పెడుతుంటారు. ★ ఈసారి ప్రాంగణానికి.. వడ్లమూడి విమలాదేవి, ప్రధాన సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, ప్రతిభా వేదికకు ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్ పేర్లు పెట్టారు. ★ జనవరి 02న సాయంత్రం ప్రదర్శన ప్రారంభిస్తారు. ★ ఈ ఏడాది ప్రధాన వేదికపై మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సభ నిర్వహించనున్నారు.

300 స్టాళ్లు..: జనవరి 02 నుంచి 11 వరకు ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనుంది. నిత్యం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 వరకు స్టాళ్లు తెరిచి ఉంటాయి. నిరుడు 200 స్టాళ్లు పెట్టగా.. ఈసారి 300 స్టాళ్లు ఏర్పాటవనున్నాయి.

వైవిధ్య నెలవు: దేశంలో పాత పుస్తకాలు కన్పించని ఏకైక పుస్తక ప్రదర్శన.. ఇదే. ప్రముఖ ప్రచురణ సంస్థలు వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేస్తాయి. ఏ స్టాల్‌లోనూ ఒకే రకమైన పుస్తకాలు లేకుండా నిర్వాహకులు శ్రద్ధ చూపుతారు.

ఘనంగా 36వ ప్రదర్శన

- టి.మనోహర్‌నాయుడు, అధ్యక్షుడు

ఈసారి మరింత ఘనంగా పుస్తక మహోత్సవం నిర్వహిస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభోత్సవానికి రానున్నారు. ప్రధాన వేదికపై.. అన్ని ప్రాంతాల సాహిత్యాలపై సదస్సులు నిర్వహిస్తాం. అనువాద, దృశ్య మాలిక, బాల సాహిత్యం.. అంశాలపై సదస్సులుంటాయి.

వేడుక ముగిసే.. భక్తులు మురిసే!



పూర్ణాహుతితో దీక్షల విరమణ

ఈనాడు - అమరావతి

ఇంద్రకీలాద్రిపై భవానీదీక్ష విరమణ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈనెల 11 నుంచి ఆరంభమై.. సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయడంతో సత్ఫలితాలు ఇచ్చాయని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. భవిష్యత్తులో మెరుగైన సేవలు అందించేలా.. భక్తుల సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. ప్రత్యేక ఏర్పాట్లు మంగళవారమూ కొనసాగుతాయని ఈవో శీనానాయక్ తెలిపారు.

● **5.27 లక్షల మంది భక్తులు..:** ఐదు రోజుల్లో 5,27,568 మంది భక్తులు తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు. చివరి రోజు భారీగా భవానీ భక్తులు పోటెత్తారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులను కంపార్ట్‌మెంట్లలో ఉంచి క్యూలైన్లలోకి వదిలారు.

● **21.25 లక్షల లడ్డూల విక్రయం..:** వేడుకల్లో 21.25 లక్షల లడ్డూలు విక్రయించారు. ముందస్తుగానే మూడు కేంద్రాల్లో తయారుచేస్తూ.. భక్తులు అడిగినన్ని అందించారు.

● **2.13 లక్షల మందికి అన్నదానం:** రికార్డుస్థాయిలో అన్నప్రసాదాన్ని భక్తులకు పెట్టారు. ఐదు రోజుల్లో 2,13,645 మంది భవానీ భక్తులు, వారి కుటుంబీకులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

● **తలనీలాల సమర్పణ:** 59,435 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా.. వెయ్యి మంది క్షురకులు విధుల్లో పాల్గొన్నారు.

● **4 వేల మంది పోలీసులు:** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి నాలుగు వేల మంది సిబ్బందిని విధులకు తీసుకొచ్చారు. 1000 మంది దేవాదాయ, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది హాజరయ్యారు.

● **2,500 మంది స్వచ్ఛసైనికులు:** దుర్గగుడి పరిసరాలు, ఘాట్లు సహా అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు 2,500 మంది కార్మికులను వినియోగించారు. ఎప్పటికప్పుడు తాత్కాలిక మరుగుదొడ్లు, ఘాట్లను శుభ్రం చేసేందుకు శ్రమించారు.

● **15 లక్షల వాటర్ బాటిళ్లు..:** భక్తులకు 15 లక్షల వాటర్ బాటిళ్లను, ఎనిమిది లక్షల నీటి ప్యాకెట్లను అందించారు. 25 వేల మజ్జిగ, 25 వేల బిస్కెట్ ప్యాకెట్లను పంచారు.

● **80 మెట్రిక్ టన్నుల భవానీ దుస్తులు..:** ఘాట్లలో భవానీ భక్తులు విడిచిపెట్టిన దుస్తులను ఎప్పటికప్పుడు కన్వేయర్ బెల్ట్ ద్వారా నేరుగా వాహనాల్లోకి ఎక్కిస్తూ.. తరలించారు. ఇలా 380 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, 80 మెట్రిక్ టన్నుల దుస్తులు తొలగించామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

చల్లని అనుభూతి.. రామలక్ష్మణ ఖ్యాతి!



ఈడుపుగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మర్రి వృక్షాలు

కంకిపాడు మండలం ఈడుపుగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించే కొత్త వారి దృష్టి ఆ ప్రాంగణంలోని రెండు భారీ మర్రి వృక్షాలపై తప్పక పడుతుంది. వీటి చుట్టూ నిర్మించిన అరుగుపై కూర్చొని సేదదీరిన వారిలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్రస్థాయి అధికారులు అనేక మంది ఉన్నారు. దాదాపు అర ఎకరం స్థలంలో విస్తరించిన వీటిని కవలలుగా భావించి రామలక్షణులు అని పిలుస్తుంటారు. 1932లో హైస్కూల్‌కు జిల్లా బోర్డు అనుమతి ఇవ్వడంతో జాతీయ రహదారి పక్కన విశాలమైన భూమిని దాతలు విరాళంగా ఇచ్చారు. చదును చేసేటపుడు అప్పటికే ఐదారేళ్ల వయసున్న మర్రి చెట్లను కూలీలు తొలగించలేకపోయారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధుల సూచనలతో వాటిని అలాగే ఉంచారు. 1936లో తరగతి గదులు ప్రారంభించారు. ఆ తర్వాత వృక్షాల చుట్టూ రాతి అరుగులు నిర్మించారు. వాటి కింద కూర్చొంటే సహజ ఏసీలో ఉన్నట్టుంది అంటూ.. పాఠశాల పరిశీలనకు ఎండలో వచ్చిన విద్యాశాఖ కమిషనర్ స్థాయి అధికారులు అన్న మాటలను ఉపాధ్యాయులు గుర్తుకు తెస్తుంటారు. వేసవిలో ఈ వృక్షాల నీడనే తరగతులు నిర్వహించాలని విద్యార్థులు కోరుతుంటారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశాల ఏర్పాటుకూ ప్రాధాన్యం ఇస్తుంటారు.

- న్యూస్‌టుడే, ఈడుపుగల్లు (కంకిపాడు)



ఆటోలు ప్రారంభించిన కలెక్టర్ లక్ష్మీశ. పక్కన డీపీవో లావణ్య, డీఆర్వో లక్ష్మీనరసింహం

స్వచ్ఛతకు సాంకేతిక తోడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాకు ఏడు చెత్త సేకరణ బ్యాటరీ ఆటోలు సమకూరాయి. వాటిల్లో ప్లాస్టిక్ డబ్బాలను ఉంచి, పొడి, తడి చెత్తను సేకరిస్తారు. సదరు ఆటోలను నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం ప్రారంభించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో పి.లావణ్య కుమారి, డీఎల్పీవో జి.ఎల్.ఎన్.వి. రాఘవన్ తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం, మైలవరం మండలం కీర్తిరాయునిగూడెం, ఎ.కొండూరు మండలం మాధవరం, రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ, రెడ్డిగూడెం పంచాయతీలకు వీటిని కేటాయించారు.

నింగీ.. నేలా.. మురిసాయి



ఎన్టీఆర్ జిల్లా మైలవరం గుర్రాజుపాలెం అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన 120 అడుగుల సాయిబాబా విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. బాబా జీవిత చరిత్ర పుస్తకంలోని 3, 8, 13, 18 అధ్యాయాలను పారాయణం చేసి, సాయి నామాలు కార్డుపై రాసి భవనం లోపల ఉండే పెద్ద హుండీలో వేస్తారు. ఏడాదికి ఒక రోజు ఏప్రిల్‌లో ఆ హుండీ తెరుస్తారు. ఇప్పటి వరకు 90 కోట్ల నామాలున్నాయని, శిర్డీ సాయిబాబా సేవాశ్రమం వ్యవస్థాపకుడు అమ్ముల సాంబశివరావు దీన్ని నిర్మించారని ఇక్కడి సిబ్బంది తెలిపారు. 2012లో నిర్మాణం ప్రారంభించి 2024 జనవరిలో పూర్తిచేశారు. ఎటువంటి విపత్తులనైనా తట్టుకునేలా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయంలోకి భక్తులు ఉచితంగా వెళ్లొచ్చు. అన్నప్రసాదాలు అందజేస్తున్నారు. **- ఈనాడు, అమరావతి**

మేం ఆడితే.. విజయమే మురవదా!

క్రీడాంశాల్లో యువతుల రాణింపు

ప్రపంచ మహిళా వరల్డ్ కప్‌లో భారత్ క్రికెట్ జట్టు విజయకేతనం ఎగురవేయడంతో దేశం యావత్తు యువత క్రీడలపై మరింత ఆసక్తి చూపుతోంది. పలువురు క్రీడాకారిణులు తాము ఎంచుకున్న విభాగాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో మెరవాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నారు.

ఒలింపిక్స్‌లో ఆడతా..



ప్రియ వైష్ణవి

కానూరుకు చెందిన బానావత్ సాయి శ్రీనివాస నాయక్, వరలక్ష్మి దంపతులు ప్రభుత్వ ఉద్యోగులు. వీరి కుమార్తె ప్రియ వైష్ణవి బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఒలింపిక్స్‌లో ప్రాతినిత్యం వహించే దిశగా సాధన చేస్తోంది. చిన్నతనం నుంచే క్రీడలంటే ఆసక్తి. ఇంటర్‌లో ఓల్గా ఆర్చరీ అకాడమీలో చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ పర్యవేక్షణలో ఆర్చరీలో మెలకువలు నేర్చుకుంది. 2023లో కడపలో రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించింది. అయోధ్యలో జాతీయ సీనియర్ ఆర్చరీ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2024లో యూఎస్ లాస్ వెగాస్‌లో వెగా షూట్ ఓపెన్ ఆర్చరీ టోర్నీలో తలపడింది. పశ్చిమ బెంగాల్‌లో జాతీయ ఆర్చరీ జూనియర్ ర్యాంకింగ్ టోర్నీలో తలపడి నాలుగో స్థానంలో నిలిచింది. రాయపూర్‌లో జాతీయ సబ్ జూనియర్ విభాగంలో ఆడి.. జట్టు కాంస్య పతకం సొంతం చేసుకోవడంలో తనవంతు పాత్ర పోషించింది. అక్టోబరులో పంజాబ్‌లో ఆలిండియా అంతర్ వర్సిటీ ఆర్చరీ పోటీల్లో మిక్స్‌డ్ ఈవెంట్‌లో తలపడి 22వ ర్యాంకులో నిలిచింది. ఒలింపిక్స్ లక్ష్యంగా రోజూ ఆరు గంటల పాటు సాధన చేస్తోంది.

భారత జట్టులో స్థానమే లక్ష్యం



ఎస్తేర్‌రాణి

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం చిన్న అగ్రహారం గ్రామస్థులు అల్లి పెద్దిరాజు, లక్ష్మి దంపతుల కుమార్తె ఎస్తేర్‌రాణి విజయవాడలో బీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. చిన్నతనం నుంచి క్రికెట్ ఆడేది. స్కూల్ పీఈటీ కొండలరావు సూచనలతో పదో తరగతి పూర్తయిన తర్వాత శిక్షణ కోసం విజయవాడకు వచ్చింది. 2022లో ఐజీఎంసీ స్టేడియంలో సాధన ప్రారంభించింది. ఏడాది తర్వాత తాడేపల్లిలోని స్టార్స్ క్రికెట్ అకాడమీలో కోచ్ ప్రదీప్ వద్ద ఉచిత శిక్షణకు ప్రవేశం లభించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 క్రికెట్ టోర్నీలో జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకోవడానికి కృషి చేసింది. 2023లో కేడీసీఏ అండర్-19 జట్టులో స్థానం సాధించింది. ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకోవడంతో పాటు సెంట్రల్ జోన్ జట్టులో స్థానం సాధించింది. ఇంటర్ జోనల్ పోటీల్లోనూ తలపడింది. అండర్-19, 23 జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. సెంట్రల్ జోన్, ఏసీఏ జట్లలో స్థానం కోసం కృషి చేస్తోంది. భవిష్యత్తులో భారత జట్టులో చోటు దక్కించుకుంటానని ఆమె చెబుతోంది. ఆఫ్ స్పిన్ బౌలింగ్‌తో పాటు ఆల్ రౌండర్‌గా రాణిస్తోంది.

– న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

వేదాద్రి-కంచల ఎత్తిపోతలకు ఊపిరి

రూ.15 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం

నందిగామ, పెనుగంచిప్రోలు (న్యూస్‌టుడే)



కృష్ణా నదిపై ఎత్తిపోతల పథకం

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 17 వేల ఎకరాలకు సాగునీరందించే వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకానికి కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించింది. గత వైకాపా సర్కార్ ఐదేళ్ల పాలనలో మోటార్ల మరమ్మతులు, నిర్వహణకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం వల్ల పథకం మూతపడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు.. దీని మరమ్మతులు, పునరుద్ధరణకు రూ.15 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి హామీ నెరవేర్చారు.

కృష్ణా నదిపై వేదాద్రి వద్ద కంచల ఎత్తిపోతల పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. అనంతరం ఫేస్-2 పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఏర్పాటు చేశారు. ఎన్ఎస్పీ జోన్-2 చివరి ఆయకట్టులో ఉన్న నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వేదాద్రి ఎత్తిపోతల అందుబాటులోకి రావడంతో 36 గ్రామాల పరిధిలోని భూములకు సాగునీరందింది. అనంతరం మోటార్లు మరమ్మతులకు గురికావడం వల్ల సాగునీరందక కర్షకులు ఇబ్బందిపడ్డారు. గత తెదేపా ప్రభుత్వంలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు రూ.ఐదు కోట్లు మంజూరు చేయడంతో నాడు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు.

వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యం

గత వైకాపా ప్రభుత్వంలో మోటార్ల మరమ్మతులకు నిధులివ్వలేదు. షట్టర్లకు తాళాలు వేశారు. బకాయిలు వల్ల విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎలాగైనా సాగునీరందించాలనే లక్ష్యంతో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రయత్నాలు చేశారు. దీనిలో భాగంగా ఒక మోటారుకు మరమ్మతులు చేసి సాగునీరందించేందుకు డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మరమ్మతుల చేశారు. దీనికి ఎంపీ తన నిధుల నుంచి రూ. ఐదు లక్షలు కేటాయించారు.

అయినోళ్లతో కమ్మేసి.. అయినకాడికి కాజేసి!

"ఎల్‌బీఎఫ్" సంస్థ లోగుట్టు ఇదేనండి..

ఈనాడు - అమరావతి



ఎల్‌బీఎఫ్ కార్యాలయం

లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ (ఎల్‌బీఎఫ్) కుంభకోణంలో నిర్వాహకులు దుర్గాప్రసాద్, శివాని దంపతులు సొంత మనుషులతోనే సంస్థను పెట్టేసి వ్యవహారం నడిపించారు. కీలక బాధ్యతలను వీరే నిర్వహించారు. శివాని తండ్రి గోవిందరావు, దుర్గాప్రసాద్ సోదరుడు సీతారామాంజనేయులు కీలక పాత్ర పోషించారు. డిపాజిట్ల సేకరణ నుంచి ముఖ్యాంశాల వరకు వీరే దగ్గరుండి చూశారు. ప్రాంతీయ హెడ్లు, జిల్లా బ్రాంచి మేనేజర్లుగా సొంత వారినే నియమించినట్లు తెలిసింది. ప్రధాన నిందితురాలు శివాని కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. విస్సన్నపేట ఠాణాలో నమోదైన కేసులో ఏ1గా శివానీని, మరికొందరి పేర్లు చేర్చారు. ఆమె దొరికితే.. దర్యాప్తులో మిగిలిన వారి పాత్ర ఆధారంగా పేర్లను చేర్చనున్నారు.

అనుమానాస్పద రిజిస్ట్రేషన్లపై దృష్టి... ఈ ఏడాది మార్చిలో నిర్వాహకులు ఎల్‌బీఎఫ్ పేరుతో ట్రస్టు పెట్టి.. రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందులో దుర్గాప్రసాద్, శివాని, సభ్యులుగా నగేష్, వీరాస్వామి, సీతారామాంజనేయులును చేర్చారు. ఈ ట్రస్టు వ్యవహారంపై కూపీ లాగుతున్నారు. శివాని తన పేరిట ఆస్తులను ఎవరికి రిజిస్టర్ చేయించిందీ తేలాల్సి ఉంది. ఓ స్థలాన్ని తన అక్క కుమారుడు వంగల శివకిషోర్‌కు విక్రయించినట్లు వెలుగు చూసింది. ఇలా ఇంకెన్ని ఆస్తులను కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట బదలాయించారో తేలాలి. కుటుంబీకుల పేరిట భారీగా బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ఇన్ని ఖాతాలు ఎందుకు తెరిచారనే అనుమానాలు వస్తున్నాయి.

మోహన్‌రెడ్డి ఎవరు?... ఐదు నెలల కిందట సొమ్ము చెల్లించమని డిపాజిటర్లు నిర్వాహకుల వద్దకు వెళ్తే.. కంపెనీ నష్టాల్లో ఉందని, చాలా ఆస్తులు తనఖాలో ఉన్నాయన్నారు. మోహన్‌రెడ్డి వద్ద తనఖా పెట్టామని దుర్గాప్రసాద్, శివాని వెల్లడించారు. దస్తావేజులనూ చూపించినట్లు తెలిసింది. కానీ బాధితులు ఆ ఆస్తుల ఈసీ కాపీలు తీయగా.. నిర్వాహకుల పేరునే ఉన్నట్లు తేలిందని సమాచారం. మోహన్‌రెడ్డి ఎవరు? అతని పేరున తనఖా ఎందుకు పెట్టారో తేలాలి.

నలుగురు కానిస్టేబుళ్ల పేర్లు... శివాని డైరీలో నలుగురు కానిస్టేబుళ్ల పేర్లు ఉన్నట్లు సమాచారం. వీరు రెడ్డిగూడెం లేదా విస్సన్నపేట స్టేషన్‌లో పనిచేసే వారా అనేది తేలలేదు. నిందితురాలు అజ్ఞాతంలోకి వెళ్లక ముందు కానిస్టేబుళ్లు ఆమెను కలిశారు. తన భర్త.. టర్మ్ పాలసీ డబ్బులు రావాలనీ.. అవి వస్తే.. సెటిల్ చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మచిలీపట్నం నుంచి దుర్గాప్రసాద్ బంధువులు రెడ్డిగూడెం స్టేషన్‌కు వచ్చి శివాని కనిపించడం లేదని కేసు నమోదు చేయమని కోరారు. దీనిపై పోలీసులు శివానీ తండ్రి గోవిందరావును పిలిచి మాట్లాడారు. తన కుమార్తెను, పిల్లలను విస్సన్నపేట బస్సు ఎక్కించాననీ, అంతకు మించి తనకు తెలీదని బుకాయించాడు. మిస్సింగ్ కేసు కోసం ఫిర్యాదు ఇవ్వకుండా వెళ్లినట్లు తెలిసింది.

ఇంధన పొదుపుతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు

గిరిపురం (సీతారాంపురం), న్యూస్‌టుడే : సమష్టి భాగస్వామ్యంతో ఇంధన పొదుపుతో స్వర్ణాంధ్ర జీ 2047 దిశగా అడుగులు వేద్దామని ఏపీ జెన్‌కో ఎండీ ఎస్. నాగలక్ష్మి, కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఐజీఎంసీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. స్టేడియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నాగలక్ష్మి మాట్లాడారు. వ్యక్తులు, పారిశ్రామిక సంస్థలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు.. తదితరాలు ఇంధన పొదుపు దిశగా పయనించాలని కోరారు. భవన నిర్మాణాల్లో హరిత ప్రమాణాలను పాటించాలని కోరారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ [illegible] నికర శూన్య ఉద్గారాల (నెట్ జీరో ఎమిషన్స్)తో స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక లక్ష్యమని, దీని సాధనకు కృషి చేయాల్సిన అవసరముందన్నారు.

కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. ఇంధనాన్ని పొదుపు చేస్తే డబ్బును పొదుపు చేసినట్లేనని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి.. పొదుపు పాటించాలని కోరారు. విద్యుత్తును ఆదా చేసే గృహోపకరణాలను వాడాలని సూచించారు. వీటి ద్వారా 20-30 శాతం ఆదా చేయవచ్చన్నారు. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ.. ఇంధన పొదుపు ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని చెప్పారు. సౌర, పవన, తదితర పునరుత్పాదక ఇంధన వనరుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యకర పర్యావరణాన్ని భావితరాలకు బహుమతిగా అందిద్దామన్నారు. ఎంత అవసరమో అంతే విద్యుత్తును ఉపయోగించుకోవాలని సూచించారు. ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్తు లేనిదే అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి ఉన్నదన్నారు. నాణ్యమైన విద్యుత్తును సరసమైన ధరలకు అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ కమలాకర్‌బాబు మాట్లాడుతూ.. విద్యుత్తు పరిరక్షణలో ఏపీ నెం.1గా ఉంటోందని, మిషన్ మోడ్‌లో విద్యుత్తు పొదుపు కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. కళాజాత ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. విద్యార్థులు, పలు శాఖల అధికారులు, పవర్ యుటిలిటీ ద్వైర్ల ప్రతినిధులతో కలిసి జాతీయ ఇంధన పొదుపు పోస్టర్లను ఆవిష్కరించారు. 'అత్యంత విలువైన విద్యుత్తు ఏ రూపంలోనూ వృథా కాకుండా ఎల్లప్పుడూ జాగ్రత్తగా వ్యవహరిస్తాను.. పొదుపు సందేశం అందరికీ చేరేలా పాటుపడతాను' అందరితో ప్రతిజ్ఞ చేయించారు.



అవగాహన ప్రదర్శనలో నాగలక్ష్మి, లక్ష్మీశ, సూర్యసాయి ప్రవీణ్‌చంద్, పుల్లారెడ్డి, కమలాకర్‌బాబు, ప్రకాశ్‌రావుతో యువతులు

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్క రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

ప్రణాళికతో భవానీ దీక్షలు విజయవంతం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : పక్కా ప్రణాళికతో భవానీ దీక్షల విరమణ వంతం అయ్యాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణను పురస్కరించుకొని క్షేత్ర స్థాయి పరిస్థితులను ఆయన సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఐదు రోజుల పాటు లక్షలాది భవానీ దీక్షాధారులు గిరిప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించి ఇరుముడి సమర్పించి దీక్ష విరమణ చేశారన్నారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, దేవస్థానం, దేవాదాయ శాఖల సమన్వయంతో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు పోటీ పడ్డాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించారన్నారు. కోసం ఆహర్నిశలు కృషి చేసిన దేవస్థానం సిబ్బందితో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు అందించిన సహకారాన్ని ప్రశంసించారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది మొదలు ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరూ ఐదురోజుల పాటు సామూహిక కార్యాచరణతో విజయవంతం అయ్యిందన్నారు. అర్జీవో కాపురి చైతన్య, ఏసీపీ దుర్గారావు, ఈతలు కోటేశ్వరరావు, రామారావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కన ఈవో శీనానాయక్, పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ, తరలి వస్తున్న భవానీలు

తిరుపతమ్మ అమ్మవారి మండల దీక్షలు ప్రారంభం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దీక్షా మాలధారణలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పూజారులు, అర్చకులు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు 800 మంది భక్తులు దీక్షలు తీసుకున్నారు. ఈ నెల 21 వరకు మండల దీక్షలు జరుగుతాయి. అర్ధమండల దీక్షలు జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్నాయి. అదే విధంగా 11 రోజుల దీక్షలు జనవరి 16 నుంచి 20వ తేదీ వరకు స్వీకరించవచ్చని ఆలయ పూజారులు తెలిపారు. తొలిరోజు దీక్షాధారులకు ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన కత్తకూట వెంకట్రావు విరాళంతో ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ప్రధాన అర్చకుడు మర్రెబోయిన గోపి, ఆలయ ధర్మకర్తలు, ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు డి.వి.ఎన్.రాజు, లక్ష్మణ్, నాగేశ్వరరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శశికపూర్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయంలో పూజలు చేస్తున్న పూజారులు, పక్కన ఛైర్మన్ శ్రీనివాసరావు

బ్యాటు.. బంతి.. బైక్‌లు

- ఈ నెల 20న టోర్నీ ప్రారంభం
- ఈఎస్ఎల్ కప్ ఆవిష్కరణ నేడు

ఈనాడు క్రికెట్‌కు రంగం సిద్ధం

EENADU SPORTS LEAGUE 2025

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల ఆటగాళ్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ టోర్నీ రానే వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కళాశాల జట్లు బరిలో దిగే ఈఎస్ఎల్ క్రికెట్ కప్ 15వ సీజన్‌కు ఈ నెల 20న తెరలేవనుంది. బీసీసీఐ సీనియర్ సెలెక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ మంగళవారం హైదరాబాదులో ఈఎస్ఎల్ కప్‌ను ఆవిష్కరించనున్నారు. టోర్నీలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కళాశాల జట్లు పెద్ద సంఖ్యలో ఆసక్తి కనబరిచాయి. సోమవారం దరఖాస్తులకు తుది గడువు కాగా.. సుమారు 1000 జట్లు ఎంట్రీలు నమోదు చేసుకున్నాయి. మొదట తెలుగు రాష్ట్రాల్లో జిల్లా స్థాయిలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అనంతరం ప్రాంతీయ స్థాయి టోర్నీ జరుగుతుంది. ప్రాంతీయ విజేతలు అంతర్ రాష్ట్ర స్థాయి లీగ్‌లో తలపడతాయి. సీనియర్, జూనియర్ విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు గ్రాండ్ ఫైనల్లో పోటీపడతాయి. విజేతలు, రన్నరప్‌లకు ట్రోఫీలు.. ప్రతిభావంతులకు బైక్‌లతో పాటు ఆకర్షణీయమైన బహుమతులు లభించనున్నాయి.

బ్యాటు, బంతితో అసాధారణ ప్రతిభ కనబరిచే క్రికెటర్లకు బైక్‌లు బహుమతులుగా దక్కనున్నాయి. సీనియర్, జూనియర్ విభాగాల్లో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'లుగా నిలిచే ఆటగాళ్లకు వీటి బైక్ లభించనుంది. ఈఎస్ఎల్ సీజన్-15ను ప్రకటించగానే అద్భుత స్పందన లభించింది. తెలుగు రాష్ట్రాల కళాశాల జట్లు పెద్ద సంఖ్యలో ఈనాడు క్రికెట్ టోర్నీలో పాల్గొననున్నాయి. గత నెల 14న

వినియోగదారులకు అందుబాటులో సేవలు

గొల్లపూడి, న్యూస్‌టుడే : టాటా మోటార్స్ ఆథరైజ్డ్ డీలర్ జాస్పర్ ఇండస్ట్రీస్ నూతన కార్ల షోరూం, సర్వీస్ సెంటర్ గొల్లపూడిలో సోమవారం ప్రారంభమైంది. రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ఏ.మోహన్ జ్యోతి వెలిగించి షోరూంను ఆరంభించారు. ఈ మేరకు టాటా మోటార్స్ సేల్స్ రీజనల్ మేనేజర్ జి.గోపీకృష్ణ మాట్లాడుతూ గొల్లపూడి పరిసర ప్రాంతాల్లోని వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా నూతన టాటా కార్ షోరూంను జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రారంభించినట్లు తెలిపారు. జాస్పర్ ఎండీ బాడిగ సుమంత్ మాట్లాడుతూ ప్రారంభోత్సవ సందర్భంగా కార్లపై ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పీవీ.సత్యనారాయణ, టాటా మోటార్స్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వినియోగదారులు, ఫైనాన్షియర్లు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న రవాణా శాఖ జాయింట్ కమిషనర్ మోహన్

నూతన కానిస్టేబుళ్లకు దిశానిర్దేశం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కొత్తగా ఎంపికైన కానిస్టేబుళ్లలో ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించిన వారికి పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు దిశానిర్దేశం చేశారు. వీరికి ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నియామక పత్రాలు ఇస్తారు. ఈ నెల 22 నుంచి శిక్షణ మొదలు పెడతారు. ఈ సందర్భంగా జిల్లాకు కేటాయించిన 172 మంది పురుష కానిస్టేబుళ్లు, 70 మంది మహిళా కానిస్టేబుళ్లతో సీపీ సమావేశమయ్యారు. శిక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పనులపై సూచనలు చేశారు. పోలీస్ ఉద్యోగం బాధ్యతతో కూడుకున్నదని.. ఇక నుంచి ఎక్కడకు వెళ్లినా చాలా హుందాగా వ్యవహరించాలని సూచించారు. నేడు అన్ని రంగాల్లో ప్రధానంగా పోలీస్‌శాఖలో సాంకేతిక వినియోగం పెరుగుతోందని.. శారీరక దృఢత్వంలో పాటు సాంకేతికతపై పట్టు సాధించాలని కోరారు. సైబర్ నేరాలపై పట్టు సాధించాలని సూచించారు. శిక్షణలో సాధించిన మార్కుల ఆధారంగానే పదోన్నతులు ఉంటాయని చెప్పారు. మీ వ్యవహారశైలి ఆధారంగా పోలీస్‌శాఖకు మంచి పేరు వస్తుందన్నారు. అన్నింటిలోనూ ముందుండి ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం అభ్యర్థులకు టీ షర్ట్, లోయర్ కిట్ అందించారు.



జాగ్రత్తలు వివరిస్తున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

యూఎస్ కాన్సులేట్ జనరల్‌తో భేటీ


ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ సోమవారం విజయవాడకు విచ్చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ రెహానా బేగం మర్యాదపూర్వకంగా లారాను కలిశారు. పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు. ప్రముఖులను కలిసిన అనంతరం లారా.. విశాఖ వెళ్లనున్నారు.



లారా విలియమ్స్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రెహానా బేగం

నేటి నుంచి విజయకీలాద్రిపై ధనుర్మాస ఉత్సవాలు

తాడేపల్లి: సీతానగరం కొండపై విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చిన జీయర్‌స్వామి సోమవారం తెలిపారు. అదే విధంగా వచ్చే నెలలో జరిగే క్షేత్రం తొమ్మిదో వార్షికోత్సవ ఆహ్వాన ప్రతులను స్వామీజీ ఆవిష్కరించారు. నిత్యం గోదా అష్టోత్తర శతనామార్చన, పాశురాల పఠనం, తీర్థ ప్రసాద గోష్ఠి, సారె సమర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. వచ్చే నెల 14వ తేదీ గోదారంగనాథుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 6 నుంచి 8 వరకు క్షేత్రంలో 27 అడుగుల హనుమాన్ ఏకశిలా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠామహోత్సవాలు ఉంటాయన్నారు.



ఆహ్వాన ప్రతులు ఆవిష్కరిస్తున్న చిన జీయర్‌స్వామి

దళితుల సమస్యలపై బలమైన పోరాటాలు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : సామాజికంగా, ఆర్థికంగా దళిత వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై బలమైన పోరాటాలు అవసరం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సబ్ కమిటీ సమావేశాన్ని సోమవారం విజయవాడలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పందలాది సంవత్సరాలుగా సామాజిక అణచివేతకు, వివక్షతకు గురవుతున్న దళితవర్గాల ప్రజలు స్వాతంత్ర్యం అనంతరం తమ జీవితాలు మారతాయని ఎదురు చూశారని.. కానీ వారి ఆశ నిరాశే అయిందన్నారు. ఎన్నో పథకాలు రూపకల్పన చేశామని, సబ్ ప్లాన్ అమలు చేయడం ద్వారా వారి నివాసిత ప్రాంతాల రూపురేఖలు మారుస్తామన్న పాలకుల వాగ్దానాలు శూన్యం అని రుజువయ్యిందన్నారు. పెద్ద ఎత్తున పరిశ్రమలను ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వేషన్లు దెబ్బతింటున్నాయని.. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి చదువుకున్న యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లేక నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. దళిత హక్కుల పోరాట సమితిని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. స్వాతంత్ర్య ఫలాలను సమాజంలో అందరికీ సమానంగా అందేలా.. చైతన్యవంతమైన ఉద్యమాన్ని నిర్మించాలని ఉద్బోధించారు. సమితి రాష్ట్ర ఇన్‌ఛార్జి సి.హెచ్.కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరయ్య. వేదికపై కోటేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు

తల్లీ పిల్లలను రక్షించిన ట్రాఫిక్ పోలీసులు

కృష్ణలంక, భవానీపురం, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మవారధి నుంచి పిల్లలతో కృష్ణా నదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన తల్లి, ఇద్దరు పిల్లలను ట్రాఫిక్ పోలీసులు రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురానికి చెందిన ప్రమీల ఆర్థిక ఇబ్బందులు కారణంగా పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడదామన్న నిర్ణయానికి వచ్చింది. సోమవారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో పిల్లలిద్దరితో గుంటూరు నుంచి విజయవాడ వైపునకు వచ్చే వారధి 32వ పిల్లర్ వద్దకు చేరుకుంది. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రమేష్‌కు అనుమానం వచ్చి ఆమె వద్దకు వెళ్లి విషయాన్ని తెలుసుకుని వారించాడు. వారి చిరునామా తదితర వివరాలు తెలుసుకుని 5వ ట్రాఫిక్ సీఐ బాలమురళీకృష్ణ వద్దకు వారిని తీసుకెళ్లాడు. విషయాన్ని తెలుసుకున్న సీఐ ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి భవానీపురం పోలీసులకు అప్పగించారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం



ప్రత్యేక అలంకరణలో శివలింగం

శివాలయాల్లో విశేష పూజలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు: తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని శివాలయాల్లో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శివలింగాలకు పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

21న హిందూ సమ్మేళనం

గంపలగూడెం: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 21న హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. సమ్మేళనంలో పలువురు పీఠాధిపతులు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టాలి



డైరీ, క్యాలెండర్లను న్యాయవాదులకు అందజేస్తున్న న్యాయమూర్తి శైలజ

మైలవరం, న్యూస్‌టుడే: న్యాయవ్యవస్థకు ఉన్నతమైన గౌరవం ఉందని, దానిని నిలబెట్టాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని స్థానిక కోర్టు న్యాయమూర్తి ఎం.శైలజ సూచించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను న్యాయస్థానంలో సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయస్థానాల గొప్పతనం, బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి బుద్ధారపు వెంకట్రావు, సభ్యులు వీటీ కిశోర్, ఒర్సు శ్రీనివాసరావు, ప్రభుత్వ న్యాయవాది ఏడీ ప్రసాద్, మాజీ ఏజీపీ ఎం.ఆంజనేయులు, బార్ నాయకులు ఆర్.రమేష్, రవికుమార్, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కాలువలపై మూతల ఏర్పాటు



పినపాకలో కాలువలపై మూతలు ఏర్పాటు చేయకపోవడంతో వృద్ధులు అవస్థలు పడుతున్నారని 'సమస్య తీవ్రం.. స్పందించని వైనం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, కార్యదర్శి నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ సహాయక ఇంజినీర్ నవీన్‌కుమార్‌లు యుద్ధ ప్రతిపాదికన కాలువలపై మూతల ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, జి కొండూరు

స్పందనకు వందనం

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

జి.కొండూరు: జి.కొండూరులోని పంచాయతీ కార్మికులకు మాజీ ఏఎంసీ ఛైర్మన్ పులిపాక థామస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో థామస్ కుమారుడు ప్రకాష్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు సోమవారం పంపిణీ చేశారు. ప్రకాష్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల కష్టాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని. పర్యావరణాన్ని కాపాడటంలో వారు అందించే సేవలు మరువలేనివన్నారు. సర్పంచి మండల అరుణ, గ్రామానికి చెందిన తెలుగు పండితుడు డాక్టర్ పెదగమళ్ల నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ అధ్యయనం.. బహుళ ప్రయోజనం

27 రోజులపాటు మరోసారి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియ

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే

సంక్షేమ పథకాలు అర్హులకు చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఇంటింటి సర్వే ప్రారంభించింది. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే-2025(యూఎఫ్ఎస్) పేరుతో సోమవారం ప్రారంభించిన సర్వే వచ్చే ఏడాది జనవరి 12 వరకు కొనసాగనుంది. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు గ్రామ, పట్టణాల్లో 27 రోజుల పాటు హౌసింగ్ మ్యాపింగ్ చేస్తూ ఏకీకృత కుటుంబ సర్వే చేస్తారు. కుటుంబాల సమగ్ర అధ్యయనాల సమాచారం మేరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు బహుళ ప్రయోజనం చేకూరుతుంది. ఏకీకృత కుటుంబ అధ్యయనంలో సేకరించాల్సిన సమాచారానికి సంబంధించిన ప్రశ్నల జాబితాలను సచివాలయాల ఉద్యోగులకు అందించారు.



గంపలగూడెంలో యూఎఫ్ఎస్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో సరస్వతి

పథకాల వర్తింపునకు ఉపయుక్తంగా..

డివిజన్‌లోని గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల్లో వార్డు, గ్రామ సచివాలయాల ఉద్యోగులకు ఎంపీడీవోలు సర్వేపై సోమవారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. మొత్తం 89 గ్రామ సచివాలయాల పరిధిలో 1,03,445 కుటుంబాల పూర్తి వివరాలు సేకరించనున్నారు. సదరు సిబ్బంది ప్రతి ఇంటికెళ్లి కుటుంబ సమాచారం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. సర్వే ద్వారా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సరికొత్తగా నమోదు చేస్తూ ఆ కుటుంబాల్లో చనిపోయిన, శాశ్వత మైగ్రేషన్ వ్యక్తుల పేర్లు తొలగిస్తారు. ఇది ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆటో డ్రైవర్ సేవలో.. తదితర పథకాలు వర్తింపునకు ఉపయుక్తంగా ఉంటుంది. ప్రత్యేక యాప్ ద్వారా చరవాణిలో ఈకేవైసీ ఆధారంగా వ్యక్తిగత, కుటుంబ సమాచారం సేకరిస్తారు. ఆధార్, చరవాణి నంబరు, విద్య, ఉపాధి, ఆదాయం, ఆస్తులు, గృహ వివరాలు, సామాజిక తదితర కుటుంబ సభ్యులు వివరాలు తీసుకుంటారు. తదుపరి ప్రభుత్వం కుటుంబ ప్రయోజన పత్రాలు అందజేస్తుంది. భవిష్యత్తు సంక్షేమ సేవలు కార్డుల ఆధారంగా అమలు చేస్తారు.

★ తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో సమగ్ర కుటుంబ సర్వేపై మండలాల వారీగా గ్రామ, వార్డు సచివాలయాలు, సర్వే చేయాల్సిన కుటుంబాల వివరాలు ఇలా..

మండలం	సచివాలయాలు	కుటుంబాలు
ఎ.కొండూరు	14	16,678
గంపలగూడెం	21	24,726
రెడ్డిగూడెం	12	16,114
విస్సన్నపేట	15	19,697
తిరువూరు పట్టణం	10	11,353
తిరువూరు గ్రామీణం	17	14,877

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వినతి



ఆర్డీవో మాధురికి వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌పీలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో పనిచేస్తున్న సీఆర్ఎంటీలు (సీఆర్పీలు) తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో మాధురికి సోమవారం వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖలో ఏళ్ల తరబడి తామంతా విధులు నిర్వహిస్తున్నామని.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సీఆర్పీలను విద్యాశాఖ ఉద్యోగులుగా పరిగణించి క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. నెలకు రూ.44,570 వేతనం ఇవ్వాలని, పీఆర్సీ కూడా వర్తింపజేయాలని, టీఏ డీఏ సదుపాయం కల్పించాలని కోరారు. సీఆర్ఎంటీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బీవీ రత్నం, నాయకులు అచ్చారావు, గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, సుమన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఉపాధ్యాయుల ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న లకిరెడ్డి హనిమిరెడ్డి

మైలవరం, న్యూస్‌టుడే: చేత బ్యాటు పట్టి ఫోర్లు కొట్టారు. బంతిని ఆపేందుకు పరిగెత్తి బొక్క బోర్లా పడ్డారు. చాలా కాలం తర్వాత ఆడుతూ నవ్వులు పూయించారు. మొత్తంగా.. నిత్యం చేత పుస్తకం, గదమాయించే స్వరంతో గంభీరంగా కనిపించే ఉపాధ్యాయులు ఆటల్లో మునిగి.. వారు చదువుకున్న రోజుల్లోకి వెళ్లిపోయారు. అలాంటి విభిన్న దృశ్యాలకు స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణం వేదిక కాగా.. వాటిని పండించిన వారు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు. లీప్ టోర్నమెంట్‌లో భాగంగా విజయవాడ డివిజన్ ఆటల పోటీలను సోమవారం స్టేడియం నిర్మాణ దాత హనిమిరెడ్డి, సర్పంచి మంజుభార్గవి తదితరులు ప్రారంభించారు. తొలి రోజు పురుషుల విభాగంలో క్రికెట్‌లో మూడు లీగ్ మ్యాచులు, స్త్రీల విభాగంలో త్రో బాల్ పోటీల్లో మూడు మ్యాచులను పూర్తి చేశారు. మంగళవారం లీగ్‌లతో పాటు, తుది పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈవోలు ఎల్.బాలు, రాజు తెలిపారు. టోర్నమెంట్‌లో డివిజన్ పరిధిలోని 8 మండలాల నుంచి ఒక్కో టీం చొప్పున పాల్గొంటున్నట్లు పీడీ రవికుమార్ తెలిపారు. దాత హనిమిరెడ్డి వితరణతో ఆటల్లో పాల్గొన్న వారికి భోజన ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం: వైష్ణవ ఆలయాల్లో మంగళవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాల పారాయణంతో పాటు వివిధ స్తోత్ర పారాయణాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వివిధ భక్త సమాజాలు ఆయా గ్రామాల్లో నగర సంకీర్తనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాయి. 16న ప్రారంభ పూజలు, 30న స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, జనవరి 11న కూడారై ఉత్సవం, 14న బోగి పండగ సందర్భంగా శ్రీరంగనాయక స్వామి సమేత గోదా అమ్మవారి కల్యాణోత్సవం.. అదే రోజున గ్రామ పుర వీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు సేవ నిర్వహించనున్నట్లు ఎన్టీటీపీఎస్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు సాయి స్వామి తెలిపారు.

ఉత్సాహంగా క్రీడలు

విస్సన్నపేట: రెండు రోజుల పాటు జరుగనున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల డివిజన్ స్థాయి ఆటల పోటీలు నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం సందడిగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు హాజరై పోటీలను ప్రారంభించారు. దాత గొట్టేటి సుబ్రహ్మణ్యం (బుడ్డయ్య), నియోజకవర్గ స్పోర్ట్స్ ఇంఛార్జి రమేష్, హెచ్ఎం శోభలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంధన పరిరక్షణ అందరి బాధ్యత



అవగాహన ప్రదర్శనలో ఎన్టీటీపీఎస్ ఇంజినీర్లు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇంధన పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ శివరామాంజనేయులు పేర్కొన్నారు. జాతీయ ఇంధన వారోత్సవాలను సోమవారం ఎన్టీటీపీఎస్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శక్తి వినియోగం తగ్గించడంతో వనరులను కాపాడుకోవచ్చని చెప్పారు. ఇంధన డిమాండ్, సరఫరాల మధ్య తీవ్ర అంతరం ఉన్న నేపథ్యంలో ఇంధన వినియోగం పొదుపుగా ఉండాలని పేర్కొన్నారు. డిసెంబరు 14 నుంచి 20 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. అందులో భాగంగా సంస్థ పరిసరాల్లో అవగాహన కొరకు 30 ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేవీ నాగేశ్వరరావు, సురేష్‌బాబు ఎగ్జిక్యూటివ్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం ప్రాధాన్యంపై అవగాహన

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణం బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ధరించడంపై పోలీసులు అవగాహన కల్పించారు. సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో 'నో హెల్మెట్ నో ఎంట్రీ' కార్యక్రమంలో భాగంగా శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరిస్తే కలిగే ప్రయోజనాలు, లేకుంటే ఎదురయ్యే నష్టం గురించి వివరించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

కార్మికులను కట్టు బానిసలుగా చేసేందుకే పనిగంటల పెంపు



కొండపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



మైలవరంలో..

కొండపల్లి, న్యూస్‌టుడే: పనిగంటల పెంపు కార్మికులను కట్టు బానిసలుగా చేయడమేనని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ అన్నారు. సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభల సందర్భంగా యూనియన్ దిమ్మెల వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కార్మిక పక్షాన సీఐటీయూ ఏళ్ల తరబడి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. లేబర్ కోడ్స్ రద్దుకు యూనియన్ పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తుందని చెప్పారు. వివిధ కార్మిక యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐటీయూ అఖిలభారత మహాసభల నిర్వహణ సందర్భంగా సోమవారం మైలవరంలోని పలు ప్రాంతాల్లో ఆ సంఘం జెండాలను కార్మికులతో కలిసి జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సుధాకర్ ఆవిష్కరించారు. మహాసభల్లో ఆయా అంశాలపై చర్చలు ఉంటాయని. విజయవంతం చేయాలని కోరారు. పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కుంగుతున్న రోడ్డు.. ఎన్నాళ్లీ పాట్లు



మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నరసాపురం- చాట్రాయి ఆర్ అండ్ బీ రహదారిపై గుంతలు పడి అధ్వానంగా మారింది. గత కొన్నాళ్లుగా మరమ్మతులకు నోచుకోక మోకాళ్ల లోతు గోతులు పడి రోడ్డు అంచులు సైతం కుంగిపోయాయి. ఈ నేపథ్యంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు, అన్నదాతలు, పలు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

నాణ్యత లోపం.. పనులు అస్తవ్యస్తం



కాచవరం పరిధిలోని జాతీయ రహదారి ఇరుపక్కల ఉన్న డ్రెయిన్లపై ఏర్పాటు చేసిన పలకలు విరిగిపోయాయి. వర్షాకాలం జాతీయ రహదారిపై కురిసిన వాన నీటితో పాటు పరిసర గృహాల నుంచి వచ్చే మురుగు పారుదల కోసం ఎన్‌హెచ్ సంస్థ వీటిని నిర్మించింది. గ్రామస్థుల నడకకు అనువుగా వాటిపై పలకలు ఏర్పాటు చేసింది. అయితే వీటిలో నాణ్యత లోపించడంతో డ్రెయిన్లు శుభ్రం చేసి తిరిగి వేసేటప్పుడు విరిగిపోయినట్లు పారిశుద్ధ్య సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం



నివాళులు అర్పిస్తున్న దేవినేని ఉమా



తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో..



కొండపల్లి మార్కెట్ సెంటర్‌లో..



తిరువూరు.. ఎమ్మెల్యే ఆఫీసులో..



విస్సన్నపేట తెదేపా మండల కార్యాలయంలో..

అమరజీవికి ఘన నివాళి

న్యూస్‌టుడే బృందం: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అమరుడైన పొట్టి శ్రీరాములు వర్ధంతిని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు సోమవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



మైలవరంలో...



గంపలగూడెంలో..

శిక్షణతో మెరుగైన బోధన



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అప్పారావు

మైలవరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ఆధునిక విధానాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన బోధనకు అవకాశం ఉంటుందని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు పేర్కొన్నారు. కళాశాలలో ఏఐసీటీఈ సహకారంతో అటల్ స్కీం కింద ఏరోస్పేస్ విభాగ అధ్యాపకులకు వారం రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ నిట్ మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వై.రవికుమార్ పలు అంశాలను వివరించారు. విభాగాధిపతి లోవరాజు, డీన్ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీపీవోను కుటుంబ సభ్యుల పేరుపై జారీచేయాలి



మాట్లాడుతున్న చాంద్‌బాషా

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి వ్యాగన్ వర్కుషాపునకు చెందిన విశ్రాంత ఉద్యోగుల మరణానంతరం వారి కుటుంబ సభ్యుల పేరుపై పీపీవోను జారీచేయాలని పెన్షనర్స్ వర్కుషాపు డివిజన్ శాఖ అధ్యక్షులు షేక్ చాంద్ బాషా కోరారు. పెన్షన్ అదాలత్ సందర్భంగా సోమవారం గుంటుపల్లి వ్యాగన్ వర్కుషాపు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో చిన్న చిన్న పొరపాట్లకు కూడా పెన్షనర్లకు పలు సమస్యలు వస్తాయన్నారు. 70 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఎప్పుడైనా రిఫరల్ ఆసుపత్రుల్లో నేరుగా అవుట్ పేషెంట్ వైద్యం చేయించుకోవడానికి రైల్వే బోర్డు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంజినీరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి వాటిని తక్షణమే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు వీరస్వామి, కోశాధికారి శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ విభజన కోరుతూ నిరసన దీక్ష



పాతరేపూడిలో నిరసన దీక్షలో గ్రామస్థులు

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎ.కొండూరు మండలం రేపూడి గ్రామ పంచాయతీ విభజన కోరుతూ పాతరేపూడి గ్రామస్థులు సోమవారం నిరసన దీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు రేపూడి, పాత రేపూడి ఒకే గ్రామ పంచాయతీలో ఉన్నాయి. జీవో నంబరు 97 మేరకు పాత రేపూడిలో జనాభా 2500, ఓటర్లు 1700 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో రేపూడి నుంచి పాతరేపూడిని విడగొట్టి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రకటించాలని నినాదాలు చేశారు. గ్రామ పంచాయతీ విభజన జరగకుండా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అడ్డుకుంటున్నారని నిరసన దీక్షలో పాల్గొన్న గ్రామస్థులు ఆగ్రహించారు. పాత రేపూడిలోని అన్ని సామాజిక వర్గీయులు ప్రత్యేక గ్రామ పంచాయతీని కోరుకుంటున్నట్లు తెలిపారు. పాత రేపూడిలోని పాఠశాల సమీపంలో ఎన్నెస్పీ డీసీ ఛైర్మన్ కఠారి కోటేశ్వరరావు, వార్డు సభ్యులు బి.కృష్ణకుమారి, ఎం.ప్రకాశం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఎం.ఏలియాబాబు, ఊర చెరువు ఉపాధ్యక్షుడు సీహెచ్.స్వామి తదితరుల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కనుమూరు, అనుముల్లంక(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరు, అనుముల్లంక గ్రామాల్లో విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా నిలిపేస్తామని డిస్కం ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా బసవయ్య

మైలవరం: ప్రముఖ ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా మైలవరానికి చెందిన మోదుగు బసవయ్య నియమితులయ్యారు. సోమవారం కడపలో నిర్వహించిన 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు ఆయన్ను నియమించారు.

పోటీ పరీక్షలపై అవగాహన

తిరువూరు, గంపలగూడెం: తిరువూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎ.కొండూరు ఎంఈవో కేశవరావు ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు అధికారిణి పద్మావతి తెలిపారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జనార్దన్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మానసిక స్పష్టత, భావోద్వేగ ప్రశాంతత, శారీరక విశ్రాంతి పొందేందుకు ధ్యానం ఉపకరిస్తుందని శాంతివన్ యోగ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లంకె జనార్దన్ వివరించారు. ద్వితీయ ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బుద్ధి కుశలత, కేంద్రీకృత శ్రద్ధ, ఏకాగ్రతతో కూడిన ఆలోచన వంటి పద్ధతులను మెరుగు పరచుకునేందుకు, ఒత్తిడిని తగ్గించడం, భావోద్వేగ సమతుల్యతను మెరుగుపరచడం, నిద్ర నాణ్యతను పెంచడంలో ధ్యానం సామర్థ్యాన్ని పరిశోధనలు నిరూపిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రధానోపాధ్యాయులు డేవిడ్ రాక్ ఫెల్లర్, పీడీ రషీద్, ఉపాధ్యాయులు ఉమాదేవి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

క్వారీ లీజుల్లో వడ్డెర్లకు భాగస్వామ్యం కల్పించాలి



తీర్మానాలను ఎండీకి అందిస్తున్న ఏపీ వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వరరావు

గొల్లపూడి, న్యూస్‌టుడే: క్వారీ లీజుల్లో 15 శాతం వడ్డెర్లకు కేటాయించాలని ఏపీ వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు అన్నారు. వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ల సమావేశం గొల్లపూడిలోని బీసీ భవన్‌లో సోమవారం నిర్వహించారు. మల్లె ఈశ్వరరావు మాట్లాడుతూ.. వడ్డెర కాలనీల్లో నివాసం ఉండే వారికి ఇళ్ల పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. 50 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పింఛన్లు ఇవ్వాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో పలు అంశాలను తీర్మానించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. బీసీ కార్పొరేషన్ ఎండీ జి.ఉమాదేవి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఈ నెల చివరి వరకు గడువు

కొండపల్లి: అదనపు విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణ రాయితీకి ఈ నెల చివరి వరకూ డిస్కం సమయం ఇచ్చిందని డీఈ గురుకిశోర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

మైలవరం: మండలంలోని వెల్వడం మీదుగా అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నారంటూ వెల్వడానికి చెందిన స్థానికులు రాత్రి సమయంలో మట్టి టిప్పర్లను ఆపి.. తమకు సమాచారం అందించినట్లు చెప్పారు. నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకుని విచారిస్తున్నామని.. తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్దులపర్వలోనూ లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ బాధితులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విస్సన్నపేట కేంద్రంగా లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సంస్థ చేసిన మోసం ఇటీవల సంచలనం రేపింది. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలోనూ కొందరు బాధితులు రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు తెలుస్తోంది. వీరంతా త్వరలోనే పోలీసులను ఆశ్రయించనున్నట్లు సమాచారం. ఈ దిశగా పోలీసులు కేసు దర్యాప్తు చేసే అవకాశం ఉంది. సంస్థ సీఈవో శివాని తల్లిదండ్రుల ఊరు (పుట్టిల్లు) మద్దులపర్వ. ఆమె తండ్రితో పాటు, వారి దగ్గరి బంధువు మరోకరు ఏజెంట్లుగా రూ.కోటి వరకు డిపాజిట్లు సేకరించినట్లు సమాచారం.

ఆకట్టుకున్న వేషధారణలు



వివిధ వేషధారణలో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు


మైలవరం, న్యూస్‌టుడే: సామాజిక సేవా దృక్పథంపై విద్యార్థుల్లో అవగాహన నిమిత్తం సోమవారం స్థానిక లీలావతి పాఠశాలలో నిర్వహించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. అందులో భాగంగా విద్యార్థులతో వైద్యులు, పోలీసులు, లాయర్లు, నర్సులు, రైతుల వేషధారణలు వేయించారు. వారితో పాటు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ రైతు వేషం వేశారు. వివిధ వృత్తుల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకే కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం

విస్సన్నపేట: నూజివీడు నుంచి చింతలపూడికి వస్తున్న నూజివీడు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు వెంకటాద్రిపురం వద్ద కమాన్ కట్టలు తెగి పక్కకు ఒరిగింది. దీంతో బస్సులోని ప్రయాణికులు భయంతో కేకలు పెట్టారు. డ్రైవర్ సమయ స్ఫూర్తితో చాకచక్యంగా రోడ్డు పక్కన నిలపడంతో ప్రమాదం తప్పింది.

వ్యాయామానికి తోడు... ఇలా తిని చూడు!

బాగా వర్కవుట్స్ చేస్తున్నారా..? మరి దానికి ముందు తీసుకోనే ఆహారం (ప్రీ వర్కవుట్ మీల్), తర్వాత తీసుకొనే ఆహారం (పోస్ట్ వర్కవుట్ మీల్)పై శ్రద్ధ పెడుతున్నారా? అలా చేయకుంటే సానుకూల ఫలితాలు అసంపూర్తిగా ఉంటాయని చెబుతున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. మీ లక్ష్యం కండలు పెంచడమైనా, కొవ్వులు కరిగించడమైనా, బరువు పెరగడమైనా, తగ్గడమైనా.. ప్రీ, పోస్ట్ వర్కవుట్ మీల్స్ చాలా కీలకమని చెబుతున్నారు. ఈ ఆహారాన్ని 'విండో ఆఫ్ గ్రోత్'గా పేర్కొంటున్నారు.



- ఈనాడు, అమరావతి

● కొందరు తొందరగా బరువు తగ్గాలని అసలు తినకుండా వ్యాయామం చేస్తారు. మరికొందరు అతిగా తినేస్తారు. ఈ రెండూ ప్రమాదమే.

● కసరత్తులు చేయడానికి శక్తినివ్వడమే కాదు. మీ కండర కణజాలం దెబ్బతినకుండా ముందు తీసుకునే ఆహారం కాపాడుతుంది.

● అది ఎక్కువ కార్బోహైడ్రేట్లు, మధ్యస్థాయిలో ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పదార్థాల సమాహారంగా ఉండాలి.

● కార్బోహైడ్రేట్లు కసరత్తులు చేస్తున్నంత సేపూ శక్తినిస్తాయి. ప్రొటీన్లలోని అమైనో ఆమ్లాలు కండరాలు దెబ్బతినకుండా కాపాడతాయి. శరీరం ప్రొటీన్ తీసుకోవడాన్ని నిదానంగా జరిగేలా కొవ్వులు చేస్తాయి.

ప్రీ వర్కవుట్ మీల్‌గా ఇవి మేలు...

● **శనగల చాట్:** నల్ల, తెల్ల శనగల్లో పిండిపదార్థాలు ఎక్కువగా, ప్రొటీన్ మీడియంగా, కొవ్వులు స్వల్పంగా ఉంటాయి.

● **ఓట్స్, నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు:** ఓట్స్ కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్. ఐయంలో ఫైబర్, విటమిన్-బి ఎక్కువగా ఉంటుంది. నీటిశాతం ఎక్కువగా ఉండే పళ్ల శరీరాన్ని డీ హైడ్రేట్ కాకుండా ఉంచుతాయి.

● **షేకులు, స్మూతీలు:** కఠిన వ్యాయామాలు చేసేవారు..పాలు, అరటిపండు, ఓట్స్, పీనట్ బటర్, బాదం, జీడిపప్పు ఇలా మనకు అందుబాటులో ఉన్న వాటితో షేకులు, స్మూతీలు చేసుకొని తాగొచ్చు.

● **ఆలూ చాట్:** బంగాళదుంపను ఉడకబెట్టి..అందులో కొంచెం పెరుగు, మిరియాల పొడి కలుపుకొని తినొచ్చు. బంగాళదుంపలో బయటి చిలగడదుంప తీసుకోవచ్చు.

● **అరటిపండు, పీనట్ బటర్ రోటీ:** అరటిపండులో పొటాషియం ఉంటుంది. రోటీ కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్. పీనట్ బటర్‌లో ప్రొటీన్ ఉంటుంది. పీనట్ బటర్ అంటే అలర్జీ ఉన్నవారు ఆల్మండ్ బటర్‌ను తీసుకోవచ్చు.



కసరత్తులు ప్రారంభించే 15 నిమిషాల ముందు కావాలనుకుంటే గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ తాగొచ్చు. సాయంత్రం కసరత్తులు చేస్తే బ్లాక్ కాఫీ వద్దు.



వర్కవుట్ తర్వాత?

● వ్యాయామం చేశాక మీ కండరాల కణజాలం దెబ్బతినొచ్చు. దాన్ని కాపాడటానికి, సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రొటీన్ చాలా అవసరం.

● దీంతోపాటు శక్తి కోసం కొద్ది మొత్తంలో కార్బోహైడ్రేట్లు, అలాగే చాలా తక్కువ మొత్తంలో కొవ్వులు తీసుకోవాలి. మీరు తీసుకునే పోస్ట్ వర్కవుట్ మీల్ పాస్ట్ రికవరీకి సహాయం పడేవిగా ఉండాలి.

● చాలామంది వే ప్రొటీన్ తీసుకుంటారు. దాన్ని నీళ్లలోనే తాగాలి. పాలతో తీసుకుంటే జీర్ణ ప్రక్రియ నిదానంగా సాగుతుంది.

● వే ప్రొటీన్‌కు బదులు పాలు, అరటి పండు, గ్రిల్డ్ చికెన్, బంగాళదుంప, మసాలా పన్నీర్ చన్నా, ఎగ్ వైట్స్, పళ్లు, ఖర్జూరాలు, పెసరట్టు, పన్నీర్, మిల్క్ దలియా, ఓట్స్ తీసుకోవచ్చు.

● ఉదయం వ్యాయామం చేసేవాళ్లు ప్రీ వర్క్ అవుట్ మీల్‌గా అల్పాహారం తీసుకోవచ్చు.



ఎంత సమయం ముందు?

● అది మెటబాలిజంపై ఆధారపడి ఉంటుంది. కసరత్తులు చేసే గంట, రెండు గంటల ముందు ప్రీ వర్కవుట్ మీల్ తీసుకోవాలి.

● తీసుకున్న ఆహారం వ్యాయామం చేసేటప్పుడు అసౌకర్యంగా అనిపించకూడదు.

● పోస్ట్ వర్కవుట్ మీల్ వ్యాయామానికి గంట తర్వాత తీసుకోవాలి.

● కఠినమైన వ్యాయామాలు చేసే వారు కండరాల పునరుద్ధరణకు గంట లోపు తీసుకుంటే మంచిది.

ఖాళీ కడుపుతో వ్యాయామం వద్దు...

చాలా మంది ఏమీ తినకుండా వ్యాయామం చేస్తారు. వ్యాయామం తర్వాత ఏమీ తినకుండా బ్లాక్ కాఫీ, గ్రీన్ టీతో సరిపెడతారు. ఇవి రెండూ మంచిది కాదు. దీని వల్ల ఆశించిన ఫలితాలు రావు. మనం ఏ చిన్న వ్యాయామం చేసినా శరీరం కార్టిసోల్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. కార్టిసోల్‌ను నియంత్రించాలంటే పోస్ట్ వర్కవుట్ మీల్ చాలా అవసరం. ఇన్సులిన్ బ్యాలెన్స్ అవ్వాలన్నా... గ్లైకోజెన్ స్టోరేజ్ ఫుల్‌ఫిల్ కావాలన్నా పోస్ట్ వర్కవుట్ మీల్ కీలకం.

- గోకుల్ యలగందుల, ఫిట్‌నెస్ కోచ్

ఎవరో వదిలేసిన ఈ శునకం.. నేడు రక్తదాత




ఒకసారి కాదు రెండుసార్లు కాదు పదులసార్లు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్న వారెందరో ఉన్నారు. ఈ శునకం కూడా అనేకసార్లు రక్తదానం చేసి తోటి కుక్కల ప్రాణాలు కాపాడింది. ఎవరో క్రితం అనారోగ్యంతో ఉన్న ఈ శునకాన్ని ఎవరో ఖమ్మం నగరంలోని జిల్లా పశువైద్యశాల పరిసరాల్లో వదిలేసి వెళ్లారు. గమనించిన సిబ్బంది దానికి వైద్య సేవలు అందించడంతో పూర్తిగా కోలుకుంది. తర్వాత అక్కడే ఉండిపోవడంతో ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందికి మచ్చికైంది. దీన్ని వారు ముద్దుగా 'పులి' అని పిలుస్తున్నారు. వారు పెట్టింది తింటూ అక్కడే ఉండే ఈ శునకం ఇప్పటివరకు ఏడుసార్లు రక్తదానం చేసినట్లు పశువైద్య సంచాలకులు డా. శ్రీనివాసరావు, డా. కిశోర్ తెలిపారు. గాయపడిన, అనారోగ్యానికి గురైన కుక్కలకు రక్తం ఎక్కించాల్సిన అత్యవసర పరిస్థితుల్లో దీని నుంచి రక్తం సేకరించినట్లు వెల్లడించారు.

–న్యూస్‌టుడే, ఖమ్మం అర్బన్

వీర్యమా.. విషమా!

అనగనగా ఓ వ్యక్తి... తన వీర్యాన్ని, ఇతోధికంగా దానిమిచ్చేశారు... ఆ దానం 200 కుటుంబాల్లో కల్లోలం రేపింది. ప్రపంచవ్యాప్తంగా స్పెర్మ్ బ్యాంకుల స్థితిగతులను ప్రశ్నార్థకం చేసింది. అసలేం జరిగిందంటే...



సహజసిద్ధంగా భర్త ద్వారా గర్భందాల్చలేనివారు, ఒంటరి మహిళలు దాతల వీర్యం ద్వారా మాతృత్వాన్ని పొందుతుంటారు. ఈ అవసరాన్ని తీర్చేందుకు స్పెర్మ్ బ్యాంకులు పుట్టుకొచ్చాయి. డెన్మార్క్‌లోని యూరోపియన్ స్పెర్మ్ బ్యాంక్‌కు ఓ వ్యక్తి తన వీర్యాన్ని దానమిచ్చారు. దీంతో 14 దేశాల్లో దాదాపు 200 మంది చిన్నారులు జన్మించారు. విషాదమేమిటంటే ఆ దాతలోని జన్యు ఉత్పరివర్తన వల్ల.. పుట్టిన చిన్నారుల క్యాన్సర్ బారినపడే ముప్పు ఉందని నిపుణులు తేల్చారు. ఇప్పటికే వారిలో కొందరు మృత్యువాతపడ్డారు. మిగతావారి మెడపై క్యాన్సర్ కత్తి వేలాడుతోంది. ఈ నేపథ్యంలో ఒక దాత వీర్యాన్ని అంత విరివిగా ఎందుకు ఉపయోగించారు? ప్రామాణిక పరీక్షల్లో ఆ ఉత్పరివర్తన ఎందుకు బయటపడలేదు... అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

స్క్రీనింగ్ కీలకం...కానీ!

● ఇటీవల అనేక క్లినిక్‌లు తమ జన్యు స్క్రీనింగ్‌ను విస్తృతం చేశాయి. ఈ పరీక్షల్లో చిన్నతనం లేదా పెద్దయ్యాక ఉత్పన్నమయ్యే రుగ్మతలతో ముడిపడ్డ వందల జన్యువులను పరిశీలిస్తున్నారు.

● అయితే ఈ పరీక్షలన్నింటితో వ్యాధికారక వేరియంట్లన్నింటినీ గుర్తించలేరు. అనేక జన్యు ఉత్పరివర్తనలను ఇటీవలే గుర్తించి ఉండటం లేదా దానితో వచ్చే సమస్యలపై ఆధారాలు చాలా స్వల్పంగానే ఉండడం వంటి కారణాల వల్ల కొన్ని అరుదైన ఉత్పరివర్తనలను సాధారణ స్క్రీనింగులు చేర్చడంలేదు. ● 200 మంది శిశువుల జననానికి కారణమైన డెన్మార్క్ దాత విషయంలోనూ అదే జరిగింది. పరీక్షల్లో ఎలాంటి అనుమానిత లక్షణాలూ వెలుగుచూడలేదు. అది చాలా అరుదైన ఉత్పరివర్తన కావడమే దీనికి కారణం. ● అందువల్ల విస్తృత స్క్రీనింగ్ కన్నా..

ఒక దాత వీర్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎంతమంది చిన్నారుల జననానికి వాడాలన్నదానిపై పరిమితి ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ● బ్రిటన్‌లో పది మంది మహిళలకు మించి ఒక దాత వీర్యాన్ని వాడకూడదు. అయితే ఈ పరిమితి ఆ దేశ పరిధి లోనే వర్తిస్తోంది. దాత వీర్యం సరిహద్దులు దాటిన సందర్భంలో ఇది వర్తించట్లేదు. ● దీన్ని కట్టడి చేసేందుకు సమగ్రమైన అంతర్జాతీయ చట్టాలు కూడా లేవు. బెల్జియంలో ఒక దాత వీర్యాన్ని అరుగురు మహిళలకే ఉపయోగిస్తారు. కానీ తాజా కేసులో 38 మంది చిన్నారుల జననానికి దీన్ని వాడినట్లు స్పష్టమవుతోంది. ● మరో ఉదంతంలో ఒక దాత వీర్యంతో పలు దేశాల్లో వెయ్యి మంది చిన్నారులు పుట్టినట్లు ఇటీవల వెల్లడైంది. ఆ దాతకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు.

ఎంపిక ఇలా...

● బహిరంగంలో దాతల వీర్యానికి కొరత వల్ల స్పెర్మ్ బ్యాంకులు డిమాండ్‌ను అందుకోవడానికి... తమ వద్ద అందుబాటులో ఉన్న దాతల నుంచే ఎక్కువగా సేకరిస్తున్నట్లు పరిశీలకులు చెబుతున్నారు.

● దాతల పొడవు, జుట్టు రంగు, క్రీడాకారుడా, బహుభాషలు మాట్లాడేవాడా అన్నదాని ఆధారంగా స్పెర్మ్ బ్యాంకులు దాతలను ఎంచుకుంటున్నాయి.

పనికొచ్చేది కొందరిదే..

● వీర్యదానానికి ముందుకొచ్చే ప్రతి 100 మందిలో ఐదుగురి కన్నా తక్కువ మందే అర్హులవుతారు.

● ఒక నమూనాలో నిర్దేశిత సంఖ్యలో వీర్యకణాలు ఉండి... వాటి సామర్థ్యం, కదలికలు, ఆకృతి బాగుండాలి. మహిళల ప్రత్యుత్పత్తి ఆవయవంలో ఈదగలిగే సామర్థ్యమూ కీలకం.

● వీర్యదాతల్లో హెచ్‌ఐవీ, గనేరియా వంటి వ్యాధులు ఉండకూడదు. సిస్టిక్ ఫైబ్రోసిస్, స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ, సికిల్ సెల్ ఎనీమియా వంటి జన్యు రుగ్మతలు కలిగించే ఉత్పరివర్తనాలుండే అనర్హులవుతారు.

● ఇలా వివిధ కారణాలతో వీర్య దానానికి అర్హులైన వారు కొద్దిమందే ఉంటారు. బ్రిటన్‌లో ఉపయోగిస్తున్న వీర్యంలో సగం విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నదే కావడం గమనార్హం.

కచ్చితత్వం కోసం...

● వీర్యదానానికి ముందుకొచ్చిన వారిని క్షుణ్నంగా పరిశీలిస్తారు. దాతల నుంచి సవివర ప్రశ్నావళిని సేకరిస్తారు. అందులో వారి ఆరోగ్య నేపథ్యం, కుటుంబ ఆరోగ్య చరిత్ర వంటివి ఉంటాయి.

● ఒకవేళ ఏదైనా అనువంశిక రుగ్మతల ముప్పు పొంచి ఉందనుకుంటే దాతలను మరిన్ని పరీక్షలకు పంపడం లేదా వీర్యదానాన్ని తిరస్కరించడం చేస్తారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం



మిత్రమా.. మాట్లాడవూ..!

కోడె లాగుతూ రోజంతా శ్రమించే ఓ ఎద్దు.. పూజలందుకొనే నంది ప్రతిమ పాన్ని చూసి స్నేహితుడేమో అని భ్రమపడింది. పలకరించడానికి ప్రయత్నిస్తూ ప్రతిమ తలపై తలపెట్టి ముద్దాడింది. అయినా బదులు రాకపోవడంతో నిరాశగా అలానే చూస్తూ ఉండిపోయింది. ఇంతలో యజమాని వచ్చి తీసుకెళ్లిపోవడంతో బాధగా వెనుదిరిగింది. ఈ చిత్రం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరులో కనిపించగా 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

- న్యూస్‌టుడే, పెద్దాపురం



బిగ్గరగా మాట్లాడటం సరికాదు

మీ మాటను అందరూ వినాలనే ఉద్దేశంతో బిగ్గరగా మాట్లాడటం సరికాదు. మీ మాటలు విలువైన సందేశం ఇస్తున్నట్లు ఉంటే మీరు చెప్పే విషయాన్ని అందరూ శ్రద్ధగా ఆలకిస్తారు. గట్టిగా మాట్లాడటం వల్ల కొద్ది సమయమే ఇతరుల దృష్టిని ఆకర్షించగలరు.

– ఆడం గ్రాంట్, సైకాలజిస్టు

జలవనరులశాఖలో వసూళ్ల దందా!

అనిశా వలలో ఇరిగేషన్ ప్రింటింగ్ టెక్నీషియన్

ఈనాడు - అమరావతి: పోలవరం కుడికాలువ డివిజన్-5 ఈఈ కార్యాలయ ప్రింటింగ్ టెక్నీషియన్ నగేశ్‌బాబు లంచం తీసుకుంటూ సోమవారం అనిశాకు చిక్కాడు. అనకారి నాగార్జున అనే క్లాస్-5 గుత్తేదారుడు గుర్తింపు ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ దస్త్రం కదలడానికి నగేశ్ రూ.15 వేలు డిమాండ్ చేశాడు. నగదు ఇవ్వడం ఇష్టంలేని నాగార్జున నగేశ్‌పై విజయవాడ అనిశాకు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో ఫిర్యాదుదారు నుంచి లంచం తీసుకుంటుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. ముద్దాయి నివాసం, కార్యాలయంలో సోదాలు చేసినా ఏమీ దొరకలేదు. ఈఈ చెబితేనే తాను గుత్తేదారుల నుంచి లంచాలు వసూలు చేశానని విచారణలో చెప్పినట్లు తేలడంతో.. దీనిపైనా లోతైన విచారణ చేపట్టనున్నారు.



నగదుతో పట్టుబడిన నగేశ్

తొలి నుంచీ ఆరోపణలే...

నగేశ్ తండ్రి ఉద్యోగంలో ఉండగా మరణించడంతో కారుణ్య నియామకంలో 1991లో సాగునీటి శాఖలో బ్లూప్రింట్ ఆపరేటర్‌గా విధులు మొదలుపెట్టాడు. ఇన్నేళ్లుగా విజయవాడ, నూజివీడుల్లో బాధ్యతలు నిర్వహించాడు. విజయవాడలో పని చేసినప్పటి నుంచి అతనిపై అవినీతి ఆరోపణలున్నాయి. గుత్తేదారులు.. దస్త్రాలు ముందుకు వెళ్లాలంటే నగేశ్‌ను ప్రసన్నం చేసుకోవాల్సిందే.

అంతా ఇష్టారాజ్యం....

● జల వనరుల శాఖలో అడుగడుగునా అక్రమాలే. ● బుడమేరు గండ్లు పూడ్చే పనుల్లో టెండర్లు పిలవకుండానే ఇష్టమొచ్చిన వారితో పనులు చేయించారు. రూ.43 కోట్ల పనుల్లో కడప గుత్తేదారు, స్థానికంగా మరో ఇద్దరికి దాదాపు 80 శాతం పనులు అప్పగించారు. అక్రమం బయటకు పొక్కకుండా పనులు చేశాక వారికే టెండర్లు వచ్చేలా కథ నడిపారు. ● ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన సిబ్బందిని బదిలీ చేయకుండా భారీ మొత్తం వసూలు చేశారు. ● గుత్తేదారులకు బిల్లులు మంజూరు కాకుండా కొందరు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. చిన్నచిన్న లోపాలను బూచిగా చూపి 2-5 శాతం కమీషన్ లాగేస్తున్నారు. ● గుడివాడ సబ్ డివిజన్‌లో ఓ అధికారి కూటమి సర్కారు వచ్చాక చేపట్టిన హై ప్రయారిటీ పనులకు బినామీ టెండర్లు వేయించి పనులు నామమాత్రంగా చేసి రూ.20 లక్షలు దండుకున్నారు. కొందరు అధికారులు ఇదే మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు. ● గుడివాడ సబ్‌డివిజన్‌లో కాలువ గట్లపై చెట్లను అడ్డగోలుగా కొట్టించి అమ్ముతున్నారు. అంతేనా.. కాలువ గట్ల ఆక్రమణదారులను భయపెట్టి నెలవారీ కమీషన్లు దండుకుంటున్నారు. ● కూటమి సర్కారు కొలువుదీరాక. . చేపట్టిన ఓఅండ్ఎం పనుల్లోనే కమీషన్ తీసుకున్నారు. కొన్ని పనులు చేయకున్నా బిల్లులు మంజూరు చేశారు.

---

8 గంటలు... 3 మరణాలు

బెంబేలెత్తిస్తున్న ఇన్నర్‌రింగ్‌రోడ్డు

మధురానగర్: రామవరప్పాడు రింగ్ నుంచి పాయకాపురం వైపు వెళ్లే ఇన్నర్‌రింగ్‌రోడ్డు వాహనచోదకులను వణికిస్తోంది. ఈ నెల 12న జరిగిన మూడు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలై ఆసుపత్రికి తీసుకువెళుతుండగా చనిపోయారు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో.. 8 గంటల వ్యవధిలోనే ఈ ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం.

లారీ ఢీ కొని పాదచారి..

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా నరసాపురం గ్రామానికి చెందిన రెడ్డి వెంకటరమణ (59) రామచంద్రాపురం ఆర్టీసీ డిపోలో పని చేస్తున్నారు. ఈ నెల 12న వ్యక్తిగత పనుల నిమిత్తం విజయవాడకు వచ్చారు. తిరిగి మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో రామవరప్పాడు రింగ్ యూ టర్న్ వద్ద రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొని...

యలమంచిలి పంచదార్ల గ్రామానికి చెందిన తేరపల్లి రాజు (36) విజయవాడ ఫ్లిప్‌కార్ట్‌లో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం రామవరప్పాడు రింగ్ వైపు నుంచి పాయకాపురం వైపు తన ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. ఈ క్రమంలో అదుపు తప్పి.. రోడ్డుకు ఎడమవైపు ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొట్టి కింద పడిపోయారు. అటుగా వెళుతున్న వారు ఆగి.. 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. ఆ వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



ద్విచక్రవాహనంపై నుంచి పడిపోయి..

నున్న 13వ వార్డుకు చెందిన సగ్గుర్తి శివసాయి చరణ్ (23) ఫ్లిప్‌కార్ట్‌లో పని చేస్తుంటారు. ఈ నెల 12న ఉదయం విధులకు వెళ్లారు. రాత్రి 11.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళుతూ.. ఇన్నర్‌రింగ్‌రోడ్డు మొదటి పై వంతెన వద్ద ద్విచక్రవాహనంపై నుంచి కింద పడిపోయాడు. వెంటనే ఇతనిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా.. మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

నిత్యం ప్రాణ సంకటమే

రామవరప్పాడు రింగ్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డులోకి వెళ్లే మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడి నుంచి పాయకాపురం వైపు వెళ్లే మార్గంలో రాకపోకలు సాగించాలంటే అందరికీ గుండెలు అదిరిపోతున్నాయి. ఇసుక రవాణా చేసే లారీలు మితిమీరిన వేగంతో వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు ఇటుగా వెళుతుంటాయి. ఫలితంగా ఈ మార్గం ప్రమాదాలకు కేంద్రంగా మారింది. వేగాన్ని నియంత్రించేలా బారికేడ్లు పెడితే కొంత కట్టడి చేయవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాతృభాషలో పట్టు సాధిస్తే ఆంగ్లం సులభం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: మాతృభాషలో పట్టు సాధిస్తేనే ఆంగ్లం లాంటి ఇతర భాషలపై కూడా పట్టు సాధించవచ్చని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో సమకాలీన ఆంగ్ల సాహిత్యం, భాషా సంస్కృతులపై రెండు రోజులు నిర్వహించే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల కన్వీనర్, సిద్ధార్థ అకాడమీ సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలిత ప్రసాద్ మాట్లాడుతూ యువత సాహిత్య అధ్యయనం చేస్తేనే జీవిత పరిశీలన మెరుగుపడుతుందని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేశ్, డీన్ ఆచార్య రాజేశ్ సి. జంపాల, ఆంగ్ల విభాగాధిపతి శ్రీలత తదితరులు పాల్గొన్నారు. పరిశోధన పత్రాలతో కూడిన ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ఉష, లలిత ప్రసాద్ తదితరులు

17న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల క్రాస్ కంట్రీ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తామని కృష్ణా జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి తెలిపారు. రామవరప్పాడు రింగ్‌లోని ఇన్నోటెల్ హోటల్ వెనుక ముస్తాబాద్ రోడ్డులో అండర్-16, 18, 20, సీనియర్ స్త్రీ, పురుషుల కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీలో ప్రతిభ కనబరచిన అథ్లెట్లను ఆయా జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24వ తేదీన కాకినాడ జిల్లా పెద్దాపురంలోని ఎంఆర్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల క్రాస్ కంట్రీ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఆయా జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తిగల అథ్లెట్లు వయసు ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, ఒరిజినల్ ఆధార్‌కార్డుతో 17వ తేదీ ఉదయం 6.30 గంటలకు హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 63028 22291, 86391 66424 నంబర్లపై సంప్రదించాలన్నారు.

సెమీస్‌లో నలంద, ఎస్వీడీ సిద్ధార్థ

కృష్ణా వర్సిటీ క్రికెట్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఆంధ్రా లయోలా కళాశాల మైదానంలో జరుగుతున్న కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో నలంద డిగ్రీ, ఎస్వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాలల జట్లు సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో నలంద డిగ్రీ కళాశాల జట్టు 251 పరుగుల ఆధిక్యంలో వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(మొవ్వ) జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(మొవ్వ) జట్టు ఫీల్డింగ్‌ను ఎంచుకోగా. . బ్యాటింగ్‌కు దిగిన నలంద డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత 18 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 308 పరుగులు చేసింది. జట్టులో నిమ్మల భానువరప్రసాద్(48 బంతులు, 101 పరుగులు), దాచేపల్లి అఖిల్(36 బంతులు, 100 పరుగులు)తో రాణించారు. బదులుగా 309 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్లు గోకుల్ శ్రీమణి వర్మ 11 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు కూల్చాడు. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో ఎస్వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాల జట్టు నాలుగు వికెట్ల తేడాతో డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(మైలవరం) జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత 18 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. ప్రత్యర్థి బౌలర్ హరికృష్ణ 28 పరుగులు ఇచ్చి అయిదు వికెట్లు కూల్చాడు. బదులుగా 103 లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఎస్వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాల జట్టు 17.4 ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నలంద డిగ్రీ కళాశాల, ఎస్వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాల జట్ల మధ్య మంగళవారం మధ్యాహ్నం సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు.



నిమ్మల భాను వరప్రసాద్(101)



హరికృష్ణ (28/5)

సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం తగదు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : సామాజిక మాధ్యమాల్లో దుర్గగుడిపై దుష్ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ హెచ్చరించారు. భవానీ దీక్షల విరమణ తొలి రోజున ఆలయ ఈవో, ఛైర్మన్ ఇరుముడి విప్పి అపవిత్రం చేశారని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడాన్ని గురుభవానీల సంఘం నాయకులతో కలిసి ఆయన సోమవారం ఖండించారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠ, భవానీల మనోభావాలను దెబ్బతీసేందుకు కొన్ని శక్తులు ఉద్దేశ పూర్వకంగా సోషల్ మీడియా వేదికగా పని చేస్తున్నాయని మండిపడ్డారు. దేవస్థానంలో దీక్షాధారులకు అడిగినంత లడ్డూ ప్రసాదాన్ని గతంలో ఎన్నడు పంపిణీ చేయని విధంగా అందించామన్నారు. దీన్ని కూడా 5 లక్షల లడ్డూ ప్రసాదం మిగిలిందని ప్రచారం చేయడం విచారకరమన్నారు. సంఘం అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ ఇరుముడిని గురుభవానీలు తీసిన తర్వాత లోపల ఏమి ఉన్నాయో వివరించేందుకు తాము ఈవో, ఛైర్మన్‌ను పిలిచామన్నారు. ఇరుముడి తీసిన తర్వాత ఎవరైన దాన్ని తాక వచ్చన్నారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ రాధాకృష్ణ, పక్కన సంఘం అధ్యక్షుడు గణేష్



నిర్వాహకులు, అతిథుల నుంచి పురస్కారం అందుకుంటున్న రాజీవ్

రాజీవ్‌కు జీవన సాఫల్య పురస్కారం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ముర్రా జాతి పశువుల అభివృద్ధి, అధిక పాల దిగుబడినిచ్చే గేదెల ఉత్పత్తికి వీలుగా కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లిలో ఏబీసీ సెమన్ బ్యాంకు నిర్వహిస్తున్న చిలకపాటి రాజీవ్‌కు జీవన సాఫల్య పురస్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఇండియన్ సొసైటీ ఫర్ బఫెలో డెవలప్‌మెంట్ (ఐఎస్‌బీడీ) దీనిని ప్రదానం చేసింది. ప్రవాస భారతీయుడైన రాజీవ్ పదేళ్ల కిందట స్వదేశానికి తిరిగివచ్చి ముర్రా జాతి పశు సంపదను పరిరక్షించాలనే తలంపుతో ఏటా 10 లక్షల డోసుల వీర్యం ఉత్పత్తి చేసేలా దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద సెమన్ బ్యాంకు నెలకొల్పారు. ప్రస్తుతం ఇక్కడ ఐవీఎఫ్ (కృత్రిమ గర్భధారణ) విధానాన్ని అమలు చేసేందుకు వీలుగా ఇటీవలే కార్యాచరణ చేపట్టారు. మరోపక్క పూర్తిగా ముర్రాజాతి గేదెలతో అధునాతన డెయిరీ ఫాం నిర్వహిస్తున్నారు. వీటిని స్వయంగా పరిశీలించిన ఐఎస్‌బీడీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ రాజీవ్‌ను జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఇజ్జత్‌నగర్‌లో ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 'మారుతున్న వాతావరణం పశువుల ఉత్పత్తి-ఆరోగ్యం' అనే అంశంపై సోమవారం ప్రారంభమైన జాతీయ సదస్సులో ఐఎస్‌బీడీ అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రజీత్‌సింగ్, సరితాయాదవ్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

బావ నచ్చాడు..!

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : వరుసకు బావ అయ్యే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. తల్లి దండ్రులు ఒప్పుకోలేదు. ఆమెను వన్‌స్టాప్ సెంటర్‌లో పెట్టారు. అయినాసరే.. బావతోనే వెళ్లిపోయింది. వివరాల్లోకి వెళితే.. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే ఒక యువతి (19) బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. మేనమామ కొడుకును ఏడాది నుంచి ప్రేమిస్తోంది. ఈ నెల 10న వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. యువతి తల్లిదండ్రులు దీనికి అంగీకరించలేదు. దీంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు యువతీ యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. యువతి.. తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు అంగీకరించకపోవడంతో.. తాత్కాలిక వసతి నిమిత్తం హనుమాన్‌పేటలోని వన్‌స్టాప్ సెంటరుకు తరలించారు. 13వ తేదీ రాత్రి 8.40 గంటల సమయంలో ఆమెను పెళ్లి చేసుకున్న యువకుడు అక్కడికి వచ్చాడు. దీంతో ఆమె.. విధుల్లో ఉన్న సిబ్బంది వై.వి.ఎన్.లక్ష్మి, పి.జ్యోతిలను తోసివేసి బయటకు పరుగెత్తింది. ద్విచక్రవాహనంతో సిద్ధంగా ఉన్న భర్తతో కలిసి పరారైంది. వారిని అడ్డుకునేందుకు సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రైల్వేస్టేషన్, బస్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఎక్కడా కనిపించలేదు. వన్‌స్టాప్ సెంటర్ ఇన్‌ఛార్జి దేవనబోయిన సౌజన్య ఆదివారం రాత్రి గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

కార్డియో కూడా కావాలి!



'వ్యాయామం తప్పక చేయాలి'... అని వైద్యులు సూచించడం ఆలస్యం... నడక మొదలుపెట్టేస్తాం. కానీ అదొక్కటే సరిపోదు అంటున్నారు వైద్యులు. కార్డియో వ్యాయామాలకీ చోటివ్వాలని చెబుతున్నారు. పేరు వినగానే 'ఇవి మగవాళ్లు చేసేవి, జిమ్‌లోనే చేయగలం' అనిపిస్తుంది. కానీ ఇంట్లోనూ, ఆరుబయట కూడా చేయొచ్చు. దగ్గర్లో పార్క్ ఉందా? అక్కడ ట్రాంపలీన్ ఉందేమో చూడండి. దాన్ని ప్రయత్నించొచ్చు. లేదంటే జంపింగ్ జాక్స్ చేయండి. నడక బోర్ కొడుతున్నప్పుడు పరుగు తీయండి. సరదాగా ఓ పాట పెట్టుకుని డ్యాన్స్ వేయండి. రింగ్, షటిల్, త్రోబాల్, తాడాట... పిల్లలతో కలిసి ఆడేయండి. మౌంటెయిన్ క్లైంబింగ్, సైకిల్ తొక్కడం, జాగింగ్... ఇవన్నీ కార్డియో వ్యాయామాల కిందకే వస్తాయి. కేవలం గుండె ఆరోగ్యానికే కాదు... బరువు అదుపులో ఉండటానికీ, ఎముక ఆరోగ్యానికీ ఇవి అవసరమే. ముఖ్యంగా మహిళల్లో హార్మోనుల్లో సమతుల్యతకు సాయపడతాయి. ఒత్తిడి తగ్గించి మానసిక ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తాయి. ఇమ్యూనిటీని పెంచడంతోపాటు సుఖనిద్రనీ అందిస్తాయి. ఒంట్లో సత్తువకి కారణమవుతాయి. ఇన్ని లాభాలు కాబట్టే, వైద్యులు వీటిని తప్పనిసరి చేసుకోమంటున్నారు. అందుకే, ప్రారంభంలో వీటికి రోజులో పది నిమిషాలు కేటాయించుకోండి. తరవాత 20 నిమిషాల వరకూ చేయొచ్చు. మొత్తంగా వారంలో 75-150 నిమిషాలు కేటాయించగలిగితే మేలు.

ఆ ఇల్లు.. పచ్చదనాల హరివిల్లు..





ఇంటిల్లిపాదికీ ఆరోగ్యం అందించాలన్నది ఆమె తాపత్రయం. మిద్దెపై మొక్కలు పెంచుతుంటే ఇంట్లోవాళ్లే 'మేడ పాడవుతుంది' వద్దన్నారు. కానీ ఆమె నిరాశపడలేదు. వాళ్లనే ఒప్పించారు. ఫలితం... ఇల్లంతా పచ్చదనం. మార్కెట్‌కి వెళ్లకుండానే ఆరోగ్యకరమైన ఆహారం ఆ ఇంటి సొంతం. ఆ విజయానందంతో మరికొందరినీ మిద్దె తోట దిశగా ప్రోత్సహిస్తున్నారు... ఆదిలక్ష్మి

ఆదిలక్ష్మిది విజయనగరంలోని దుప్పాడ. మొక్కలన్నా వాటి పెంపకమన్నా ప్రాణం. అంగన్వాడీలో కార్యకర్తగా చేసేటప్పుడూ పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందివ్వాలనుకునేవారు. అందుకని స్వయంగా అంగన్వాడీ కేంద్రంలో రకరకాల కూరగాయలు పెంచి, పిల్లలకు వండిపెట్టేవారు. ఆ ఆసక్తితోనే మిద్దె తోటకు శ్రీకారం చుట్టారు. కానీ ఇంట్లోవాళ్లే 'డాబా పాడు చేస్తున్నావ్, ఆపేయ'మన్నారు. మిద్దె తోటల పెంపకం చేస్తోన్న కొందరి వీడియోలు చూపించి, ఇంట్లోవాళ్లు ఒప్పుకొనేలా చేశారు. మేడ మీదున్న 180 గజాల్లోనే కాదు, ఇంటి చుట్టుపక్కల ఖాళీ స్థలంలోనూ 400లకు పైగా మొక్కల్ని పెంచుతున్నారు. వాటిలో కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలే కాదు... ఔషధ రకాలూ ఉన్నాయి.

బృందాన్ని ఏర్పాటు చేసి...

రోజుకి మూడు నుంచి నాలుగు గంటలు మొక్కల మధ్యే గడుపుతారు ఆదిలక్ష్మి. రసాయన ఎరువులను కొనరు, వినియోగించరు. ద్రవ జీవామృతం, ఇంట్లో వ్యర్థాలతో చేసిన ఎరువునే వాడుతుంటారు. తన తోటలోని కూరగాయల్నే ఇంటికి వాడతారు. మిగిలినవి చుట్టుపక్కల వాళ్లకీ, ఆశ్రమాలకీ, ప్రభుత్వ పాఠశాలలకీ ఉచితంగా పంచుతారు. అంతరించిపోతున్న తెల్ల, ఎర్ర గల్జేరు, పునర్నవ, చెంచలాకు వంటివాటితోపాటు ఆకుకూరల్లోనూ వివిధ రకాలు, అరుదైన పండ్లు, పూల మొక్కల్నీ పెంచుతున్నారీమె. తన కుటుంబానికే కాదు, అందరికీ ఆరోగ్యం అందాలి అనుకున్న ఆమె... మిగతావారినీ ప్రోత్సహించడం మొదలుపెట్టారు. 'హరిత విజయనగరం' పేరుతో బృందాన్ని ఏర్పాటుచేశారు. బృందసభ్యులకీ మొక్కల పెంపకంలో సాయపడుతుంటారు. వారితో ప్రతి రెండు నెలలకీ సమావేశమవుతుంటారు ఆదిలక్ష్మి. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయంపై ఉద్యానవన అధికారులనూ ఆహ్వానించి సలహాలు, సూచనలు ఇప్పిస్తుంటారు. మొక్కలు, విత్తనాలు కొనడం ఈ సభ్యులు ఎరుగరు. ఒకరికొకరు పంచుకునేలా ప్రోత్సహిస్తున్నారీమె. అగ్రికల్చర్ విద్యార్థినులకు మిద్దె తోటల పెంపకంపై అవగాహననీ కల్పిస్తుంటారు.

'మొక్కలు, విత్తనాలు పంచుకుంటే ఆర్థిక భారం తగ్గుతుంది. మిద్దె తోటలతో స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన ఆహారం దొరకడంతోపాటు... శరీరానికి వ్యాయామం. మనసూ ఉల్లాసంగా ఉంటుంది. సేంద్రియ పద్ధతిలో పెంచుకోవడమూ సులువే. ఆసక్తి ఉన్నవారికి ప్రభుత్వం రాయితీతో సోలార్ విద్యుత్ ప్లాంట్లనీ అందిస్తోంది. వాటిని వినియోగించుకోవచ్చు. నన్ను చూసి ఎంతోమంది మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఒక్కరూ ఇలా ప్రయత్నిస్తే ఆరోగ్యం, ఆహ్లాదం సొంతం చేసుకోవచ్చు' అంటారు ఆదిలక్ష్మి.

– పద్మ శ్రీనివాసరావు, విజయనగరం

భర్త హింసించి వదిలేశాడు... పోషించడా?

మా అక్క వయసు 55 ఏళ్లు. పెళ్లయ్యింది పిల్లలు లేరు. భర్త హింసించడంతో మానసికంగా దెబ్బతింది. కానీ, అదే కారణంగా చూపిస్తూ పదేళ్ల క్రితం ఆమెను బావ మా పుట్టింట్లో వదిలేశాడు. అప్పటి నుంచి తనూ వెళ్లడానికి ఇష్టపడలేదు. అతనో ప్రైవేటు సంస్థలో ఉన్నతస్థానంలో ఉన్నాడు. ఈ మధ్య మా అమ్మానాన్నలు చనిపోవడంతో తను ఒంటరి అయిపోయింది. నాకు వెన్ను సంబంధిత సమస్య ఉండటంతో తనని చూసుకోలేని పరిస్థితి. ఇప్పుడు ఆమె భర్తను బాధ్యత తీసుకోమంటే తీసుకుంటాడా? తను విడాకులు తీసుకోలేదు. ప్రస్తుతం వృద్ధాశ్రమంలో ఉంది. ఏదైనా సలహా ఇవ్వగలరు? – ఓ సోదరి

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి, న్యాయవాది

మీ అక్కను ఆమె భర్త తీసుకొచ్చి మీ ఇంట్లో వదిలినప్పుడు ఆవిడ పోషణ ఖర్చుని మీరు ఎందుకు అడగలేదు. విడాకుల కేసు వేసినా వేయకపోయినా భార్యను పోషించాల్సిన బాధ్యత భర్తదే. ముఖ్యంగా హిందూ దత్తత-పోషణ చట్టం-1956లోని సెక్షన్-18 ప్రకారం భార్య తనని తాను పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు భర్త దగ్గర నుంచి నెలసరి పోషణ ఖర్చు తీసుకోవచ్చు. అంటే తిండి, బట్ట, ఆరోగ్యం లాంటి ముఖ్యమైన అవసరాల కోసం తగినంత మొత్తాన్ని నెలకు గానీ, ఏకమొత్తంలో గానీ అడగవచ్చు. మీ అమ్మానాన్నలు ఉన్నప్పుడే అడిగి ఉండాల్సింది. ఇప్పుడైనా మించిపోయింది లేదు. వెంటనే ఫ్యామిలీ కోర్టులో మెయింటెనెన్స్ కేసు వేయండి. అతని జీతం, హోదాను బట్టి మీరు ఎంత అడగాలో నిర్ణయించుకోండి. మీ బావ దగ్గరకి వెళ్లడానికి మీ అక్క ఇష్టపడటం లేదు అంటున్నారు కదా! అలాంటప్పుడు తనని ఒత్తిడి చేయకండి. పదేళ్లక్రితమే తీసుకొచ్చి వదిలేసినవాడు ఇప్పుడెలా తీసుకెళ్తాడు? వృద్ధాశ్రమానికి చెల్లించాల్సిన డబ్బులు, మందులకు అయ్యే ఖర్చు, ఇన్నాళ్లు పడిన బాధలకు పరిహారం అంతా కలిసి గృహహింస చట్టం కింద పెద్ద మొత్తం అడగవచ్చు. బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 144 ప్రకారం క్రిమినల్ కేసు వేసి కూడా మెయింటెనెన్స్ కోరవచ్చు.

> పైవాళ్లు తమ శక్తిసామర్థ్యాలను అదే పనిగా పరీక్షిస్తూ, పరిశీలిస్తున్నారని మహిళలకు అనిపిస్తే... తమలోని కొన్ని సహజమైన మంచి లక్షణాలనూ మార్చుకునేందుకు ప్రయత్నిస్తారు. దీనివల్ల ఆయా సంస్థలు భవిష్యత్తు నాయకత్వాన్ని కోల్పోవాల్సి ఉంటుంది.
>
> - సులజ్జా ఫిరోదియా మోత్వానీ, వ్యవస్థాపకురాలు, సీయీవో, కెనటిక్ గ్రీన్



నల్లద్రాక్ష... స్త్రీల ఆరోగ్యానికి రక్ష



పుల్లగా, తీయగా ఉండే ద్రాక్షలో పోషకాలు ఎక్కువే. అందులోనూ నల్లద్రాక్షలో మహిళలకు మేలు చేసే సుగుణాలెన్నో! మరి వాటి గురించి తెలుసుకుందామా...

- నల్లద్రాక్ష ముందస్తు వృద్ధాప్య ఛాయల్ని అదుపులో ఉంచుతుందట. ముఖ్యంగా కొలాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో చర్మం తాజాగా మెరిసిపోతుంది.
- ఈ పండ్లలో ఉండే రెస్వెరాట్రాల్ సహజ ఈస్ట్రోజన్‌లా పనిచేసి హార్మోన్ల అసమతుల్యత రాకుండా చేస్తుంది. వేడిఆవిర్లు, మూడ్ స్వింగ్స్ వంటి వాటిని అదుపులో ఉంచుతుంది. ఎముక బలాన్ని కాపాడుతుంది.
- రెస్వెరాట్రాల్, పాలీఫెనాల్స్ నల్లద్రాక్షలో మెండుగా ఉంటాయి. ఇవి శరీరంలో రొమ్ముక్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుంటాయి. దీంతో ఆ ముప్పు తగ్గుతుంది.
- మెనోపాజ్ తర్వాత మహిళలు గుండెజబ్బుల బారిన పడుతుంటారు. నల్లద్రాక్షలో ఉండే ఫైటోకెమికల్స్ చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి కండరాలకు మేలుచేస్తాయి. రక్తపోటు అదుపులో ఉండటమే కాదు... గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.
- బరువు తగ్గాలనుకునేవారు ఈ పండ్లను తీసుకుంటే సరి. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలను తొలగించి, బరువు తగ్గించేందుకు కారణం అవుతాయి.

ఆమె రచనలు... నేటికీ పాఠాలే!

రాసింది ఆరు నవలలే. కానీ ప్రపంచవ్యాప్తంగా ఆమె పేరు సుపరిచితమే. 2017లో కొత్త పది పౌండ్ల పాలిమర్ నోటుని ఆమె చిత్రంతో ముద్రించింది బ్రిటిష్ ప్రభుత్వం. నేడు ఆమె 250వ జయంతి. ఆ సందర్భంగా ఏడాది పొడవునా వేడుకలు జరుగుతూనే ఉన్నాయి. చరిత్రలో ఒక రచయిత్రిని ఇంతగా స్మరించడం, వేడుకలు చేయడం ఇదే తొలిసారి. ఇంతకీ ఎవరీమె?



జేన్

జేన్ ఆస్టిన్... ఇంగ్లిష్ సాహిత్యంతో పరిచయం ఉన్నవాళ్లందరికీ ఈ పేరు తెలిసే ఉంటుంది. సాహిత్యం తెలియనివాళ్లు కనీసం 'ప్రైడ్ అండ్ ప్రిజుడీస్' నవల లేదా సినిమా పేరయినా వినుంటారు. ఆ సుందర రచన ఆమె విరచితమే. నేడు ఆమె 250వ జయంతి. ఈ సందర్భంగా లండన్‌లో ఏడాది నుంచి వేడుకలు జరుగుతున్నాయి. ఆనాటి బాల్ రూమ్‌లు ఏర్పాటుచేసి అప్పటి కాస్ట్యూమ్స్ ధరించి, ఆమె సాహిత్యం గురించి చర్చిస్తూ ఆస్టిన్ అభిమానులు ఈ వేడుకల్లో ఆనందంగా, ఆసక్తిగా పాల్గొంటున్నారు. ప్రముఖ పత్రికలన్నీ ఆమె గురించిన కథనాలెన్నో ప్రచురిస్తున్నాయి. రెండున్నర శతాబ్దాల తరవాత కూడా ఆమెనంతగా గుర్తుంచుకోవడానికి కారణమేంటి?

ప్రేమ, డబ్బు, హోదా... కాలాతీత ఇతివృత్తాలు. అందుకే ఆమె రచనలు ఆంగ్ల సాహిత్యానికే పరిమితం కాలేదు. ప్రపంచ భాషల్నీ, రచయితల్నీ ప్రభావితం చేశాయి. వాటి ఆధారంగా వచ్చిన సినిమాలు మనకీ కొత్తగా ఉండవు. అవి మన సమాజాన్నీ ప్రతిఫలింపజేస్తాయి మరి. ముఖ్యంగా ఆస్టిన్ కథానాయికలు తెలివి, వ్యక్తిత్వం ఉన్నవాళ్లు. సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటారు. వివాహం చేసుకుని తీరాలన్న ఒత్తిడి, ఆర్థిక అంతరాలు... నాడే కాదు, నేటి సమాజాన్నీ శాసిస్తున్నాయి. అందుకే ఆ పాత్రలు మహిళలకు స్వతంత్ర భావాల్నీ నైతిక స్థైర్యాన్నీ అందిస్తున్నాయి. కాబట్టే నచ్చుతున్నాయి. ఉదాహరణకు 'ప్రైడ్ అండ్ ప్రిజుడీస్' కథానాయిక ఎలిజబెత్ బెనెట్. తను ఆత్మవిశ్వాసం, తెలివి, సమయస్ఫూర్తి, స్వతంత్ర భావాలున్న అమ్మాయి. వివాహంలో డబ్బు, హోదా కన్నా ప్రేమ, గౌరవం ఉండాలనుకుంటుంది. ఇది ఆనాటి అమ్మాయిలకే కాదు, దేశంతో సంబంధం లేకుండా నేటితరానికీ ఆదర్శమే. అందుకే ఆమె రచనల్ని భారతీయ నేపథ్యానికి అనుగుణంగా మార్చుకుని వచ్చిన సినిమాలెన్నో. నేటికీ ఆంగ్ల సాహిత్య సిలబస్‌లోనూ తప్పక ఉంటాయివి. ఐరోపాలోని రీజెన్సీ యుగంలో... డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చుని రాసిన ఆమె నవలలు... ఏఐ కాలంలోని స్క్రీన్‌లమీదా కనిపిస్తూ మనసుని హత్తుకుంటున్నాయంటే ఆమె దూరదృష్టి ఎంత గొప్పదో తెలియడం లేదూ.

ఆ ప్రేమ... ఆమెకు దక్కలేదు!

గిరజాల జుట్టూ మెరిసే కళ్లతో ఉండే ఆస్టిన్ అందానికి టామ్ లెఫ్రాయ్ అనే ఐరిష్ వ్యక్తి ఆకర్షితుడయ్యాడు. కానీ డబ్బుకోసం సంపన్న యువతిని పెళ్లాడి రాజకీయ నాయకుడిగా ఎదిగాడు. తరవాత తెలిసినవాళ్ల సంబంధం వచ్చినా నో చెప్పిందట ఆస్టిన్. ఆమె కథల్లోని నాయికలకు కనిపించే అదృష్టం, ప్రేమ ఆమె జీవితంలో లేవు. అవివాహితగానే ఉండిపోయింది.

ఇంగ్లండ్... హ్యాంప్‌షైర్‌లోని స్టీవెన్‌సన్‌లో పుట్టింది జేన్. జార్జ్ ఆస్టిన్, కసాండ్రా దంపతుల ఎనిమిది మంది పిల్లల్లో ఏడో సంతానం. తండ్రి మత గురువు. అనారోగ్యం, పేదరికం కారణంగా చదువు స్కూలు దశలోనే ఆగిపోయింది. సోదరులు, తండ్రి సాయంతో ఇంట్లోనే చదివింది. పన్నెండేళ్ల వయసు నుంచే కవితలు, నాటికలు రాసి కుటుంబ సభ్యులకీ చుట్టుపక్కలవాళ్లకీ గట్టిగా చదివి వినిపించేదట. ఇరవయ్యేళ్లకి మొదటి నవల రాసింది. అదే సెన్స్ అండ్ సెన్సిబిలిటీ. రెండోది ప్రైడ్ అండ్ ప్రిజుడీస్. తరవాత రాసిన మాన్స్‌ఫీల్డ్ పార్క్, ఎమ్మా నవలలు ఆమె ఉన్నప్పుడే ప్రచురితమయ్యాయి. నార్తాంగర్ అబే, పర్సుయేషన్‌లు మరణానంతరం ప్రచురితమయ్యాయి. రాసింది కూడా ఈ ఆరు నవలలే. అయితేనేం... అవి అజరామరం. 41 సంవత్సరాల వయసులో వించెస్టర్‌లో లింఫోమాతో మరణించిందీమె.

తండ్రి మరణానంతరం సోదరుడు ఎడ్వర్డ్ ఆర్థిక సహాయంపై ఆధారపడాల్సి పరిస్థితి ఆస్టిన్‌ది. సోదరుల్లో ఒకరైన ఎడ్వర్డ్‌ను సంపన్న కుటుంబానికి దత్తత ఇవ్వడంతో అతనే తరవాత వీళ్ల కుటుంబాన్ని ఆదుకున్నాడు. దాంతో ఆమె జీవితం మేనకోడళ్లు, మేనల్లుళ్ల చుట్టూనే అల్లుకుంది. ఇంటిపనులన్నీ చేసేది. ఆ కాలంలో సొంత ఆదాయం లేక మహిళలు పడే అన్ని రకాల ఇబ్బందుల్నీ ఎదుర్కొంది. అంతెందుకు... ఆమె జీవించి ఉన్నప్పుడు ప్రచురితమైన నవలలకు రచయిత్రిగా ఆమె పేరు ఉండదు. మొదటి నవలకు 'ఎ లేడీ' అని ఉంటుంది. తరవాతి నవలకి బై ద ఆథర్ ఆఫ్ సెన్స్ అండ్ సెన్సిబిలిటీ పేరుతో ప్రచురితమయ్యాయి. చనిపోయాకే అన్నీ ఆస్టిన్ పేరుతో వచ్చాయి. బతికున్నంతకాలం రచయిత్రిగా ఎలాంటి గౌరవం పొందలేదు. కానీ రెండొందల ఏళ్లుగా ఎందరికో ఆమె ప్రేరణ. అందుకే ఇన్నేళ్లయినా ఆమె పుట్టిన దేశంలోనే కాదు, ప్రపంచమంతా ఆమెను స్మరిస్తున్నారు, ఆ రచనల్ని మళ్లీ మళ్లీ చదువుతున్నారు!

పీసీఐకి... తొలి మహిళా ప్రెసిడెంట్!



సంగీత

ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)... దేశంలో జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహించే ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటి. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడంలో, జర్నలిస్టుల స్వరాలకు సమష్టి వేదికను అందించడంలో దీనిది కీలకపాత్ర. దాదాపు 70ఏళ్ల క్రితం దిల్లీలో పీసీఐ ఏర్పాటైంది. అయితే దాన్ని ఇంతవరకూ ముందుకు నడిపించిన నాయకురాళ్లు లేరు. దాన్ని తిరగరాస్తూ సంస్థకి తొలి మహిళా ప్రెసిడెంట్ అయ్యారు సంగీతా బారువా పిషరోతి. కాబట్టే, భారతీయ జర్నలిజం చరిత్రలో ఆమె విజయాన్ని ఓ మైలురాయిగా చెబుతున్నారంతా. సంగీతది అసోం. ద వైర్, హిందూ, నేషనల్ హెరాల్డ్ వంటి జాతీయ మీడియా సంస్థల్లో సేవలందించారామె. ప్రస్తుతం ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తున్నారు. దూసుకుపోయే మనస్తత్వం, విశ్లేషణాత్మక రిపోర్టింగ్, నిబద్ధత ఆమె సొంతమని చెబుతారంతా. కాబట్టే, తోటి జర్నలిస్టుల మనసు... దాంతోపాటు పీసీఐ ఎలక్షన్స్‌లో గెలిచారామె. తన బృందం, మేనేజింగ్ కమిటీలో సభ్యులంతా ప్రత్యర్థులపై గెలవడం విశేషం. 'ఈ స్థానం మహిళకు దక్కడం తొలిసారి. అందుకే దీన్ని మరింత బాధ్యతగా నిర్వర్తించాలి. సంస్థను మరింత ఉన్నత దిశగా నడిపించాలన్నది కోరిక' అంటోన్న సంగీత... ఈశాన్య రాష్ట్రాల నుంచి ఈ హోదా దక్కించుకున్న తొలి వ్యక్తి కూడా!

నగానట్రా

వేలాడే అందాలివి..!















పసిడి ధర పైపైకి వెళ్తుంటే... మెడ నిండుగా నగ పెట్టుకోవాలనే ఆశ మహిళలకు రోజు రోజుకీ సన్నగిల్లిపోతోంది. అలాగని ఆశా వదులుకోలేం. అందుకే, మన అభిరుచి తెలుసుకున్న తయారీదారులు కొత్తడిజైన్‌లపై దృష్టి పెట్టారు. బంగారం మోతాదు తగ్గినా పచ్చలు, కెంపులు, ముత్యాలు వంటివి వీటికి ఆడంబరతను తెచ్చిపెడుతున్నాయి. లేదంటే బీడ్స్, సెమీ ప్రెషియస్ రత్నాలను జోడించి ఆధునికత అద్దుకునేలా చేస్తున్నారు. సన్నటి గొలుసు... దానికి వేలాడే డ్రాప్స్ పూ లతల్ని తలపిస్తూ పెట్టుకున్నవారికి నవ్యతను తెచ్చిపెడుతున్నాయి. సంప్రదాయ దుస్తుల మీదకే కాదు... ఫ్యూజన్ వస్త్రధారణకు సరైన ఎంపికగా మెప్పిస్తున్నాయి. ఆ డిజైన్లను ఓ సారి చూడండి. మీకూ నచ్చేస్తాయి.

అందానికి పంచదార!





పదార్థాలకు తియ్యటి రుచినివ్వడమే కాదు... పంచదారకు అందాన్ని పెంచే గుణాలూ ఉన్నాయట. అందుకే, దీన్ని బాడీ స్క్రబ్‌గా ఉపయోగిస్తే చర్మంపై మృతకణాలు తొలగిపోవడమే కాదు... తగినంత తేమ అంది మెరిసిపోతుంది. అదెలాగో చూద్దామా!

- రెండు టేబుల్ స్పూన్ల బ్రౌన్‌షుగర్‌లో సమాన పరిమాణంలో ఆలివ్ ఆయిల్ కలిపి ఒంటికి రాయండి. చక్కెర కరిగేవరకూ మృదువుగా మసాజ్ చేస్తే సరి. మృతకణాలు పోయి చర్మానికి తగిన రక్త ప్రసరణ జరిగి కాంతిమంతంగా మెరుస్తుంది. దీన్ని వారానికోసారి వాడొచ్చు.
- బ్రౌన్‌షుగర్‌ని రెండు టేబుల్ స్పూన్లు తీసుకోండి. దీనికి చెంచా పెసరపిండి, కాసిని పాలు కలిపి... ఒంటికి రాసి స్క్రబ్ చేయండి. చర్మం ఎంత నిగారింపుగా కనిపిస్తుందో!
- అరకప్పు చక్కెరకు రెండు చెంచాల కొబ్బరి నూనె, చెంచా తేనె కలిపి చర్మానికి రాయండి. ఆపై ఐదునిమిషాలాగి చేతులు తడుపుకొంటూ నెమ్మదిగా మర్దన చేయాలి. ఇలా చేస్తే టాన్ తొలగిపోతుంది. ప్రకాశవంతంగానూ కనిపిస్తారు.

బంగారం - వెండి



15న ముగింపు


	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,37,070	1,23,900	1,98,009
విజయవాడ	1,33,130	1,23,700	1,95,700
ప్రొద్దుటూరు	1,32,400	1,21,810	1,91,000
రాజమహేంద్రవరం	1,35,380	1,24,100	2,15,000
విశాఖపట్నం	1,34,240	1,23,500	2,00,000
తమిళనాడు	-----	1,25,150	2,15,000

రంగవల్లిక

22 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకూ



జి. మాధవీలత, కరీంనగర్






తూతిక ఆదిశ్రీ, రాజమహేంద్రవరం

చుక్కల్ని చిత్రంలో చూపించినట్లుగా పెట్టుకోవాలి.

18 చుక్కలు
18 వరుసలు



నూతికట్ల వాణి, చెన్నూర్



మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512. Email:vasundhara@eenadu.in

బండి స్టార్ట్ కావాలంటే హెల్మెట్ పెట్టాల్సిందే

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడేందుకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ప్రభుత్వం ఎంత మొత్తుకున్నా చాలా మంది పెడచెవిన పెడుతుంటారు. దానిని ధరించకపోతే జరిమానాలు వేస్తామన్నా మాట వినరు. అలాంటి వారి కోసం గుజరాత్‌లోని భావ్ నగర్‌కు చెందిన ఓ విద్యార్థి సరికొత్త 'స్మార్ట్ హెల్మెట్'ను తయారు చేశారు. ఆ హెల్మెట్ ధరిస్తేనే బండి స్టార్టయ్యేలా రూపొందించారు. సర్ భావ్‌సింగ్‌జీ పాలిటెక్నిక్‌లో మెకానికల్ కోర్సు చదువుతున్న పర్మార్ కుల్‌దీప్ దాని రూపకర్త. దానిని తయారు చేయడానికి ఆర్‌డీడీ నానో, షుగర్ క్యూబ్, డీసీ మోటారు, రిసీవర్, ట్రాన్స్‌మీటర్, యాంటెన్నా, ఛార్జింగ్ మాడ్యూల్‌ను వినియోగించారు. కేవలం రూ.1,200తో ఈ హెల్మెట్‌ను తయారు చేయడం విశేషం.



ఉసిరితో చ్యవన్‌ప్రాశ్

గిరిజనులకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు దేశంలోని పలు ప్రాంతాల్లో చాలా ప్రయత్నాలు జరుగుతుంటాయి. అలాంటిదే.. మహారాష్ట్రలోని మేల్‌ఘాట్, చికల్‌దారా ప్రాంతాల్లో జరుగుతోంది. అడవుల్లో లభించే ఉసిరి కాయలతో చ్యవన్‌ప్రాశ్‌ను తయారు చేస్తున్నారు. స్వాగ్రీ క్లస్టర్ ద్వారా శీతాకాలంలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. చ్యవన్‌ప్రాశ్‌తో ఆరోగ్యపరమైన లాభాలుంటాయి. అడవుల్లో లభించే తాజా ఉసిరి కాయలను రాలి పడకముందే చెట్ల నుంచి ఏరి సేకరిస్తారు. ఇందులో అధిక ఫైబర్, తక్కువ చక్కెర ఉంటుంది. ఇది చ్యవన్‌ప్రాశ్ చిక్కగా ఉండటానికి దోహదపడుతుంది. దీర్ఘకాలం పాడవకుండా ఉంటుంది. ఈ చ్యవన్‌ప్రాశ్‌ను అటవీ ఉసిరి, అశ్వగంధ, శతావరి, పుష్కర్మూల్, విదారికంద్, నాగర్మోత, పునర్నవ, జివాంతి, దాల్చినచెక్క, తేజ్‌పత్ర, రాక్ షుగర్, గిర్ ఆవు నెయ్యి కలిపి తయారుచేస్తున్నారు.





ఛార్జిషీటు పత్రాలు ఉన్న పెట్టెను కోర్టుకు తీసుకొస్తున్న ఎన్‌ఐఏ అధికారులు

పహల్గాం ఉగ్రదాడి కేసులో ఛార్జిషీటు దాఖలు

జమ్మూ: ఈ ఏడాది ఏప్రిల్‌లో 25 మంది పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) సోమవారం ఆరుగురు వ్యక్తులు, రెండు ఉగ్రవాద సంస్థలపై జమ్మూలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. పాకిస్థాన్ స్థావరంగా పనిచేస్తున్న లష్కరే తయ్యిబా, దాని అనుబంధ సంస్థ అయిన టీఆర్‌ఎఫ్‌లపై ఎన్‌ఐఏ ఈ మేరకు 1,597 పేజీల ఛార్జిషీటు దాఖలు చేసింది. బైసరన్ పచ్చిక బయలులో పర్యాటకుల్ని కడతేర్చిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదుల్ని ఛార్జిషీటులో నిందితులుగా పేర్కొంది. ఈ ముగ్గురూ జులై 29న శ్రీనగర్ శివారు ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్ మహాదేవ్‌లో ప్రాణాలు కోల్పోయారు. పాక్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరిని కూడా ఛార్జిషీటులో నిందితులుగా పేర్కొన్నారు.



ఈ విషయాల్లో తొందరపాటు వద్దు

- ఆహారం తినే సందర్భంలో..
- పెద్ద నిర్ణయాలు తీసుకోవడంలో..
- ప్రేమ వ్యవహారంలో..
- ఆస్తుల అప్పగింతలో..
- వ్యక్తిత్వాన్ని నిర్ణయించడంలో..
- ఎదుటివారి గురించి పూర్తిగా తెలియకుండా ఓ అంచనాకు రావడంలో..

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఉగ్రవాదులు తండ్రీ కుమారులే..

- బోండీ బీచ్‌లో దాడిలో పాల్గొన్నది వారే



నవీద్



సాజిద్

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని సిడ్నీ బోండీ బీచ్‌లో యూదులపై ఆదివారం ఉగ్ర దాడికి పాల్పడింది తండ్రీ కుమారులేనని తేలింది. వారిని 50 ఏళ్ల సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌గా గుర్తించారు. 1998లో సాజిద్ ఆస్ట్రేలియాకు విద్యార్థిగా వచ్చాడు. ఆ తరువాత పౌరుడిగా మారాడు. నవీద్ ఆస్ట్రేలియాలోనే జన్మించాడు. సాజిద్ పోలీసుల కాల్పుల్లో హతం కాగా.. నవీద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నవీద్ పాకిస్థానీ జాతీయుడని తొలుత చెప్పిన అధికారులు.. ఆ తరువాత ఆస్ట్రేలియాలోనే పుట్టాడని నిర్ధారించారు. సాజిద్ ఎక్కడి నుంచి వలస వచ్చిందీ చెప్పలేదు. వీరికి ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్)తో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 15 మంది మృతి చెందారు. 42 మంది గాయపడ్డారు. ఒక ఉగ్రవాది హతమయ్యాడు.

గతంలో ఆస్ట్రేలియాలో ఉగ్ర దాడికి ఐసిస్ ఉగ్రవాది ప్రణాళిక వేశాడు. దీనిని గుర్తించిన పోలీసులు అతడిని 2019లో అరెస్టు చేశారు. ఆ ఉగ్రవాదితో నవీద్ అక్రమ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలున్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. దీంతో కొంతకాలం పాటు ఆస్ట్రేలియా నిఘా సంస్థ అతడిపై నిఘా వేసింది. కానీ ఆ తరువాత పట్టించుకోలేదు. ఆ చిన్న నిర్లక్ష్యమే ఇప్పుడు మారణ హోమం సృష్టించడానికి కారణమైంది.

అడ్డుకున్నది సిరియా జాతీయుడు

దాడి సందర్భంగా.. ఒక ఉగ్రవాదిని ధైర్యంగా అడ్డుకున్న 'రియల్ హీరో' అహ్మద్ అల్ అహ్మద్. సిరియా నుంచి దశాబ్దం క్రితం ఆస్ట్రేలియాకు వలస వచ్చిన ఈయనకు ఇద్దరు చిన్న పిల్లలు. స్థానికంగా ఓ పండ్ల దుకాణం నిర్వహిస్తున్నారు. దాడి సమయంలో అహ్మద్.. బోండీ బీచ్‌లో తన బంధువు అల్కాంజ్‌తో కలిసి కాఫీ షాప్‌లో ఉన్నారు. కాల్పుల శబ్దాలు వినిపించగానే తన ప్రాణాలు పోతాయని తెలిసినా అహ్మద్ వెనకడుగు వేయలేదు. 'నేను చనిపోబోతున్నా. నా కుటుంబాన్ని చూసుకో. నాకేదైనా జరిగితే ఇతరుల ప్రాణాలను కాపాడే క్రమంలో నేలకొరిగానని నా కుటుంబానికి చెప్పు' అని అహ్మద్ తన బంధువుకు తెలిపారు. ఉగ్రవాది కాల్పుల్లో అహ్మద్ భుజానికి గాయమైంది. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అహ్మద్


తెలుగు ఐపీఎస్ ఆత్మహత్య కేసులో డీజీపీ తొలగింపు

చండీగఢ్: హరియాణాలో తెలుగు ఐపీఎస్ అధికారి వై.పూరన్‌కుమార్ ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను ప్రభుత్వం ఆ విధుల నుంచి తొలగించింది. కపూర్ గైర్హాజరీలో అదనపు బాధ్యతలు నిర్వహించిన ఒ.పి.సింగ్‌ను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తాత్కాలిక డీజీపీగా నియమించింది. డిసెంబరు 31న ఒ.పి.సింగ్ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కొత్త డీజీపీ నియామకానికి సీనియర్ ఐపీఎస్ అధికారుల ప్యానల్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)కి పంపే యోచనలో ప్రభుత్వం ఉంది. అక్టోబరు 7న ఐపీఎస్ అధికారి వై.పూరన్ కుమార్ తుపాకీతో కాల్చుకుని మృతిచెందారు. తన సూసైడ్ నోట్‌లో ఆయన కపూర్ సహా పలువురు సీనియర్ అధికారులపై కుల వివక్ష, మానసిక వేధింపులు, దౌర్జన్యాలు, బహిరంగ అవమానాల ఆరోపణలు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు పేర్కొన్నారు.

జోర్డాన్ రాజుతో ప్రధాని మోదీ భేటీ

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ

అమ్మాన్: ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం జోర్డాన్ చేరుకున్నారు. దేశ రాజు అబ్దుల్లా-2 ఇబిన్ అల్ హుసేన్‌తో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చర్చించారు. గాజా విషయంలో అబ్దుల్లా-2 చాలా క్రియాశీల పాత్ర పోషించారని మోదీ కొనియాడారు. వాణిజ్యం, ఎరువులు, డిజిటల్ సాంకేతికత సహా పలు



జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో మోదీ

రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అంతకుముందు- అమ్మాన్ విమానాశ్రయంలో మోదీకి జోర్డాన్ ప్రధానమంత్రి జాఫర్ హసన్ సాదర స్వాగతం పలికారు. భారత్-జోర్డాన్ మధ్య దౌత్య సంబంధాలు మొదలై 75 ఏళ్లవుతున్న తరుణంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. భారత ప్రధాని పూర్తిస్థాయిలో ద్వైపాక్షిక పర్యటన కోసం జోర్డాన్‌కు రావడం 37 ఏళ్లలో ఇదే తొలిసారి. జోర్డాన్‌కు మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి భారత్. ద్వైపాక్షిక వాణిజ్య బంధం విలువ 280 కోట్ల డాలర్లుగా ఉంది. భారత్‌కు జోర్డాన్ ఎరువులను ఎక్కువగా సరఫరా చేస్తుంటుంది. ఇక్కడ భారత సంతతి ప్రజలు 17,500 వరకూ ఉంటారు.

మోదీనే అంత మాటలంటారా?!

- విపక్షం తీరుపై మండిపడ్డ అధికార పక్షం
- ఉభయసభల్లో అంతరాయం
- ఓటుచోరీ ఆరోపణలతో ప్రతిపక్షాలకే నష్టం: దేవెగౌడ

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీకి సమాధి కడతామంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినదించడంపై భాజపా మండిపడింది. ఓట్ చోర్.. గద్దీ ఛోడ్ పేరుతో ఆదివారం దిల్లీలో నిర్వహించిన భారీ బహిరంగ సభ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు చేసిన నినాదాలను భాజపా, ఎన్డీయే నేతలు సోమవారం పార్లమెంటు లోపలా, వెలుపలా గట్టిగా ఖండించారు. ఎన్నికల సంస్కరణలపై రాజ్యసభలో చర్చలో మాజీ ప్రధాని, జేడీ(ఎస్) వ్యవస్థాపకుడు హెచ్.డి.దేవెగౌడ మాట్లాడుతూ- ఓటుచోరీపై ఆరోపణల్ని ఇలాగే కొనసాగిస్తే విపక్షాలకే నష్టమని హెచ్చరించారు. మోదీ నేతృత్వంలోని సర్కారును నిందిస్తూ ఓటర్ల మదిలో అనుమాన బీజాలు నాటడం వల్ల ఉపయోగం లేదన్నారు. వీధుల్లో, బహిరంగ వేదికలపై ప్రధానిని అవహేళన చేయడాన్ని తప్పుబట్టారు. "మనది చాలా పెద్ద దేశం. కాంగ్రెస్ ఓ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండిఉండొచ్చు. కానీ విపక్ష సభ్యులంతా ఒకటి గుర్తు పెట్టుకోవాలి. ఓటుచోరీ వంటి పదాలు వాడటం వల్ల ముమ్మందు నష్టపోయేది మీరే. అసలు మీ బుర్రలకేమైందో..? వాటిని సరిచేసుకోవాలి. ఓట్ల అంశాలు చూడటానికి ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు ఉన్నాయి. ప్రధానిగా నెహ్రూ ఉన్నప్పుడు కూడా కేరళలో 18,000 మంది ఓటర్లను చేర్చడంపై ఒక లేఖ రాశారు. అప్పటినుంచీ ఎన్నికల వ్యవస్థలో కొన్ని లోపాలున్నాయి. మోదీ సర్కారుపై ప్రజా విశ్వాసం వల్ల వచ్చే ఎన్నికల్లోనూ అదే ప్రభుత్వం వస్తుంది" అని దేవెగౌడ చెప్పారు. దిగజారిన కాంగ్రెస్ ఆలోచనల్ని ఆ పార్టీ కార్యకర్తల నినాదాలు చాటుతున్నాయని కేంద్ర మంత్రి జె.పి.నడ్డా విమర్శించారు. ప్రధాని చావును కాంగ్రెస్ కోరుకోవడం సరికాదన్నారు. అధికార, విపక్షాల నిరసనలు, వాగ్వాదాల మధ్య సభ పలుమార్లు వాయిదాపడింది.


ప్రత్యర్థులమే.. శత్రువులం కాదు

పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో, ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ- మోదీపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన నినాదాల విషయంలో అగ్రనేతలు మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ పార్లమెంటు వేదికగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "మనం రాజకీయ ప్రత్యర్థులమే గానీ శత్రువులం కాదు. యావత్ ప్రపంచం గౌరవించే మోదీకి సమాధి తవ్వుతామనడం అత్యంత దురదృష్టకరం" అని గుర్తుచేశారు.

సీఐసీగా రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణం

- 8 మంది నూతన కమిషనర్లు కూడా..

దిల్లీ: సమాచార ప్రధాన కమిషనర్(సీఐసీ)గా మాజీ ఐఏఎస్ అధికారి, న్యాయశాఖ మాజీ కార్యదర్శి రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తదితరులు హాజరయ్యారు. అనంతరం 8 మంది నూతన సమాచార కమిషనర్లతో రాజ్‌కుమార్ గోయల్ కమిషన్ కార్యాలయంలో ప్రమాణం చేయించారు. వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగితోపాటు జయవర్మ సిన్హా, స్వాగత్ దాస్, సంజీవ్ కుమార్ జిందాల్, సురేంద్ర సింగ్ మీనా, కుశ్వంత్ సింగ్ సేథీ, సీనియర్ జర్నలిస్టులు పీఆర్ రమేశ్, అశుతోష్ చతుర్వేదీ ఉన్నారు. ఇప్పటికే ఆనంది రామలింగం, వినోద్ కుమార్ తివారీ సమాచార కమిషనర్లుగా కొనసాగుతున్నారు. తాజా నియామకాలతో దాదాపు 9 ఏళ్ల తర్వాత కేంద్ర సమాచార కమిషన్‌లో పోస్టులన్నీ పూర్తి స్థాయిలో భర్తీ కావడం విశేషం.




రాజ్‌కుమార్‌తో ప్రమాణం చేయిస్తున్న ముర్ము

దేవుళ్లకు విశ్రాంతి లేకుండా చేస్తారా?

- విరామ సమయంలో ప్రత్యేక పూజలపై సుప్రీంకోర్టు
- బృందావన్ ఆలయంలో దర్శన వేళల మార్పుపై నోటీసులు

దిల్లీ: శ్రీమంతులైన భక్తులు సమర్పించే విలువైన కానుకల కోసం దేవుళ్లకు విశ్రాంతి లేకుండా చేస్తున్నారని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రత్యేక పూజల పేరుతో ధనవంతులైన భక్తులను విరామ సమయాల్లో ఆలయాల్లోకి అనుమతించడంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీ ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం బృందావన్‌లోని బాంకె బిహారీ జీ (రాధాకృష్ణ) ఆలయంలో దర్శన వేళల్లో, పూజా క్రతువుల్లో మార్పులు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై పాలకమండలికి సోమవారం నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి తొలి వారానికి వాయిదా వేసింది. ఆలయంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించే దెహ్రీ పూజ, ఇతర క్రతువులను నిలిపివేశారని పిటిషనర్ తెలిపారు. ఆలయంలో అత్యంత నిష్ఠగా పాటించే దర్శన వేళలనూ మార్చివేయడంతో పాటు దేవుళ్ల విశ్రాంతి, నిద్ర, మేల్కొలుపు ఆరాధనల్లోనూ కొత్త విధానాలు వచ్చి చేరాయని ఆరోపించారు.



'ఇండిగో' పిటిషన్ తిరస్కరణ

వందల సంఖ్యలో ఇండిగో విమానాలు రద్దైన వ్యవహారంలో న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఇబ్బందులేమైనా ఉంటే దిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన ధర్మాసనం పిటిషనర్ నరేంద్ర మిశ్రకు సూచించింది. ఇలాంటి పిటిషన్ ఒకటి ఇప్పటికే దిల్లీ హైకోర్టు ముందు ఉందని, పౌరవిమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నిపుణుల కమిటీని నియమించిందని ఇండిగో తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు.

■ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధాన్ని ప్రశ్నిస్తూ ఆయన భార్య గీతాంజలి జె.అంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జనవరి 7వ తేదీకి వాయిదా పడింది. జాతీయ భద్రతా చట్టం కింద సెప్టెంబరు 26న పోలీసులు వాంగ్‌చుక్‌ను అరెస్టు చేశారు.

నిష్ప్రయోజనం... దుర్వినియోగం..

- వరకట్న నిషేధ చట్టాల పరిస్థితిపై సుప్రీంకోర్టు

దిల్లీ: దేశం నుంచి వరకట్న పిశాచాన్ని తరిమివేయాల్సిన రాజ్యాంగపరమైన, సామాజికపరమైన అవసరం ఎంతైనా ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వరకట్న చట్టాలు నిష్ప్రయోజనంగా మారడంతో పాటు దుర్వినియోగానికీ గురవుతున్నాయనీ తెలిపింది. వరకట్న భూతం విజృంభిస్తూనే ఉందని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 304బి(వరకట్న మరణం), 498ఎ (వివాహితపై భర్త, అతని బంధువుల వేధింపులు) కింద నమోదైన కేసులు ఇప్పటి వరకూ ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో నివేదించాలని అన్ని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. 24ఏళ్ల క్రితం నాటి 'వరకట్న మరణం' కేసులో తీర్పు వెలువరిస్తూ కేంద్రం, రాష్ట్రాలకు కూడా పలు సూచనలు చేసింది. వివాహమంటే ఒకరిని మరొకరికి పరాధీనం చేయడం కాదని, ఇద్దరు సమానుల మధ్య జరిగే వ్యవహారమని విద్యార్థులకు బోధించాలని తెలిపింది. వరకట్న దురాచారం హిందువులకు మాత్రమే పరిమితమై లేదని, అన్యమతాల్లోనూ విస్తృతంగా ఉందని పేర్కొంది. వరకట్న మరణం కేసులో ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన అలహాబాద్ హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. వీరిలో ఒకరు 94 ఏళ్ల వృద్ధురాలు కావడంతో జైలు శిక్ష ఆదేశాలివ్వలేదు. ట్రయల్ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను అనుభవించాలని స్పష్టం చేసింది.

మహిళ హిజాబ్ లాగిన నీతీశ్

- మరో వివాదంలో బిహార్ సీఎం

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమంలో ఓ మహిళ హిజాబ్‌ను లాగినట్లుగా కనిపిస్తోన్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇది ఆయన మానసిక చర్యను తెలియజేస్తోందంటూ కాంగ్రెస్, ఆర్జేడీ విమర్శలు గుప్పిస్తున్నాయి. పట్నాలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఓ వైద్యురాలికి ఆయుష్ సర్టిఫికెట్‌ను నీతీశ్ తన చేతులమీదుగా అందజేశారు. సర్టిఫికెట్‌ను చేతికిచ్చిన ఆయన.. డాక్టర్ ముఖంపై ఉన్న హిజాబ్‌ను కొంతమేర తొలగించారు. సీఎం చర్యకు మహిళ స్పందించనప్పటికీ.. నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయారు. అదే స్టేజీపై ఉన్న కొందరు నవ్వుతూ కనిపించారు. అక్కడే ఉన్న డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరి మాత్రం సీఎంను ఆపే ప్రయత్నం చేయడం వీడియోలో కనిపించింది.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు మోదీ, అమిత్‌షా నివాళులు

దిల్లీ: భారత 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 75వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయనకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాటం అనంతరం పటేల్ చొరవతోనే 550 సంస్థానాలు భారత్‌లో విలీనమై.. దేశం ఏకమైందని మోదీ తెలిపారు. భారత్ నిర్మాణానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. దేశ తొలి హోంమంత్రిగా జాతీయ ఐక్యతకు ప్రతీకగా, 'ఐరన్ మ్యాన్'గా పటేల్ నిలిచారని అమిత్‌షా అన్నారు. అంతర్గత స్థిరత్వం, శాంతి స్థాపన ఆయన జీవిత లక్ష్యమని.. సహకార ఉద్యమం, స్వావలంబన భారతానికి పునాదివేసి మహిళలు, రైతులకు బలం చేకూర్చాలని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఉగ్రవాదులతో ఎదురు కాల్పుల్లో ఎస్‌ఓజీ జవాను మృతి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ఉధమ్‌పుర్‌జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక ప్రత్యేక దళ జవాను మరణించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కాల్పుల్లో ఒక ఉగ్రవాది గాయపడినట్టు తెలిసింది. ఎదురు కాల్పులు నిలిచిపోయినా ఆ ప్రాంతం మొత్తాన్ని చుట్టు ముట్టి ఉగ్రవాదులు పారిపోడానికి వీల్లేకుండా చేసినట్టు అధికారులు వివరించారు. మజల్తా ప్రాంతంలోని సోవన్ గ్రామంలో ఈ కాల్పులు జరిగాయి. పాకిస్థాన్‌కు చెందిన జైషే మొహమ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు గ్రామంలో ఉన్నారన్న సమాచారంతో భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక స్పెషల్ ఆపరేషన్ గ్రూపు (ఎస్‌ఓజీ) జవాను మరణించారు. ఒక ఉగ్రవాది గాయపడినట్టు భావిస్తున్నారు.

ఈ ఏటి మాటగా "స్లాప్"

వాషింగ్టన్: జుగుప్సాకరమైన, మూర్ఖత్వంతో కూడుకున్న, తప్పుడు డిజిటల్ సమాచారాన్ని ఆన్‌లైన్ జగతిలో "స్లాప్" అని పిలవడం పరిపాటి అయింది. కృత్రిమ మేధ విస్తృత ప్రచారం కల్పించిన ఈ మాటను మరియం-వెబ్‌స్టర్ నిఘంటు సంస్థ ఈ సంవత్సరపు మేటి మాటగా గుర్తింపునిచ్చింది. 'ఇదో చక్కటి వర్ణణాత్మక పదం' అని మరియం వెబ్‌స్టర్ సంస్థ అధ్యక్షుడు గ్రెగ్ బార్లో సోమవారం వెల్లడించారు. స్లాప్ అనే మాటను 1700 సంవత్సర ప్రాంతంలో మెత్తటి బురదను అభివర్ణించడానికి తొలుత వాడారు. ఇప్పుడా మాటను కృత్రిమ మేధ సాయంతో తయారు చేసిన నాణ్యత లేని డిజిటల్ సమాచారాన్ని అభివర్ణించేందుకు వాడుతున్నారు. "అర్థంలేని వీడియోలు, విచిత్రమైన వ్యాపార ప్రకటనల చిత్రాలు, ప్రచారం కోసం ఉద్దేశించిన చవకబారు సమాచారం, తప్పుడు వార్తలు ఈ కోవకు చెందుతాయి" అని గ్రెగ్ బార్లో అన్నారు.

దిల్లీని కప్పేసిన పొగమంచు

- 100కు పైగా విమాన సర్వీసుల రద్దు

దిల్లీ: దేశరాజధాని పరిసర ప్రాంతాల ప్రజలను వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సోమవారం ఉదయం 6 గంటలకు గాలి నాణ్యతా సూచీ (ఏక్యూఐ) 457గా నమోదైంది. దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 100కు పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. వీటిలో 90 ఇండిగో విమాన సర్వీసులు, 29 ఎయిర్ ఇండియా విమాన సర్వీసులు ఉన్నాయి. సుమారు 300 విమాన సర్వీసుల్లో జాప్యం చోటుచేసుకుంది. మరోవైపు వందల సంఖ్యలో రైళ్లు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. విమాన సర్వీసుల వేళలు, రద్దు సమాచారం కోసం ఇండిగో, ఎయిర్ ఇండియా వెబ్‌సైట్‌లను చూడాలని ఆయా సంస్థలు ప్రయాణికులను కోరాయి.

■ నర్సరీ నుంచి ఐదో తరగతి వరకూ హైబ్రిడ్ విధానానికి బదులు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

■ లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో 82 శాతం మంది దిల్లీ ప్రజలు వాయు కాలుష్యం కారణంగా తమ కుటుంబం, సన్నిహితులు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు.

■ వాయు కాలుష్య తీవ్రత కారణంగా జంతువులు, పక్షుల్లోనూ కళ్ల మంటలు, శ్వాస సమస్యలు పెరుగుతున్నట్లు వెటర్నరీ వైద్యులు తెలిపారు.

■ కాలుష్యాన్ని నివారించడానికి కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్(జీఆర్ఏపీ)'లో స్టేజ్-4 నిబంధనలను నగరంలో అమల్లోకి తెచ్చింది.

మండల యాత్రలో శబరిమల రికార్డు

- 25 లక్షలు దాటిన భక్తులు

పథనంథిట్ట: కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో కొనసాగుతున్న మండల యాత్ర సీజన్‌లో భక్తుల సంఖ్య 25 లక్షలు దాటిందని అధికారులు సోమవారం తెలిపారు. గతేడాదితో పోలిస్తే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగినా, సమర్థవంతమైన ప్రణాళికలు, ఏర్పాట్ల వల్ల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయని శబరిమల పోలీసు ఉన్నతాధికారి ఎస్.శ్రీజిత్ వెల్లడించారు. గతేడాది ఇదే సమయానికి సుమారు 21 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకోగా, ఈ ఏడాది సంఖ్య 25 లక్షలు దాటిందన్నారు. ప్రారంభ దశలో కొంత రద్దీ ఏర్పడినప్పటికీ.. ఆ తర్వాత సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. ఈ నెల చివరి నాటికి భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. 27న మండల పూజతో ఈ యాత్ర తొలి దశ ముగియనుంది.



తమిళనాడుకు పీయూష్ గోయల్.. అస్సాంకు బైజయంత్ పాండా

- అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ ఇన్‌ఛార్జులుగా నియమించిన భాజపా


దిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు, అస్సాం అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ ఇంఛార్జులను భాజపా సోమవారం నియమించింది. తమిళనాడు బాధ్యతలను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు అప్పగించింది. అక్కడ సహ ఇంఛార్జులుగా కేంద్ర మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, మురళీధర్ మొహోల్ వ్యవహరిస్తారు. అస్సాం ఎన్నికలకు భాజపా ఇన్‌ఛార్జిగా లోక్‌సభ సభ్యుడు బైజయంత్ పాండా నియమితులయ్యారు. ఆ రాష్ట్రంలో సహ ఇన్‌ఛార్జులుగా జమ్మూకశ్మీర్ విపక్ష నేత సునీల్‌కుమార్ శర్మ, కేంద్ర మాజీ మంత్రి దర్శనాబెన్ జర్దోష్ ఉంటారు.

బిహార్ భాజపా అధ్యక్షుడిగా సంజయ్ సరావగీ

బిహార్‌లో తమ పార్టీ నూతన అధ్యక్షుడిగా రాష్ట్ర మాజీ మంత్రి సంజయ్ సరావగీ(57)ని భాజపా నియమించింది. దిలీప్ జయస్వాల్ స్థానంలో ఆయన ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. సరావగీ ఇప్పటివరకూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం శాసనసభలో దర్భంగా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సరావగీ నిరుడు ఫిబ్రవరిలో రాష్ట్ర క్యాబినెట్‌లో చేరారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచాక ఆయనకు మంత్రి పదవి దక్కకపోవడంతో చాలామంది ఆశ్చర్యపోయారు. దిలీప్ జయస్వాల్ ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. 'ఒక వ్యక్తికి ఒకే పదవి' అన్న విధానంలో భాగంగా ఆయన స్థానంలో సరావగీకి రాష్ట్ర పార్టీ అధ్యక్ష పగ్గాలను భాజపా అప్పగించినట్లు తెలుస్తోంది.

'ఓటు చోరీ'తో ఇండియా కూటమికి సంబంధం లేదు

ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్: కాంగ్రెస్ లేవనెత్తిన ఓటు చోరీ అంశంతో ఇండియా కూటమికి ఎలాంటి సంబంధం లేదని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం స్పష్టంచేశారు. "ప్రతి పార్టీకి తన సొంత ఎజెండాను నిర్దేశించుకునే స్వేచ్ఛ ఉంది. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లను హస్తం పార్టీ తన ప్రధాన అంశాలుగా చేసుకుంది. ఏం చేయాలో వాళ్లకి మనం చెప్పలేం కదా!" అని అన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ దిల్లీలో 'ఓట్ చోర్... గద్దీ ఛోడ్' బహిరంగ సభ నిర్వహించిన మరుసటి రోజే ఆయన ఈ మేరకు స్పందించారు. ఇండియా కూటమి పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్నట్లుందని ఒమర్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

ఉక్రెయిన్‌కు ఈయూ సభ్యత్వంపై రష్యా గ్రీన్ సిగ్నల్?

బెర్లిన్, లండన్: యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో ఉక్రెయిన్ చేరేందుకు తనకు అభ్యంతరం లేదని రష్యా సూచనప్రాయంగా తెలిపిందని అమెరికా అధికారులు సోమవారం వెల్లడించారు. ఐరోపా ఖండంలో ఉన్న ఉక్రెయిన్‌కు ఈయూలో గానీ, నాటోలో గానీ సభ్యత్వం లేదు. శాంతి చర్చల్లో భాగంగా ఉక్రెయిన్‌కు అనేక భద్రతాపరమైన హామీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధికారులు తాజాగా వెల్లడించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా దూతలు నిర్వహించిన చర్చలు సోమవారం ముగిశాయి. ఈయూలో ఉక్రెయిన్ చేరేందుకు అనుమతిస్తే శాంతిస్థాపన దిశగా అదొక ముందడుగు కాగలదని పరిశీలకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్ ఈయూలో చేరడంపై తనకే అభ్యంతరం లేదని రష్యా గతంలోనూ ప్రకటించింది. అయితే ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వబోమన్న లిఖితపూర్వక హామీ ఇస్తేనే శాంతి చర్చలు ముందుకు సాగుతాయని పట్టుబట్టింది. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని అంతంచేసే ప్రయత్నాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అడ్డంకులు సృష్టిస్తున్నారని బ్రిటన్ గూఢచార సంస్థ ఎం16 పేర్కొంది. శాంతిచర్చల్ని పుతిన్ సాగదీస్తున్నారని ఆ సంస్థకు చెందిన బ్లెయిస్ మెట్రెవెలి అన్నారు. ఉక్రెయిన్‌ను తొక్కిపట్టి నాటో సభ్య దేశాలను వేధించేందుకు పుతిన్ గట్టిగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇతర దేశాల కీలక మౌలిక రంగాలపై సైబర్ దాడుల్ని రష్యా ప్రోత్సహిస్తోందని చెప్పారు.

విశాఖలో ఇన్ఫోసిస్ శాశ్వత క్యాంపస్!

ఈనాడు, అమరావతి: సాంకేతిక రంగంలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ విశాఖలో శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీని కోసం ఎండాడ వద్ద 20 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆ సంస్థ ప్రతినిధులతో అధికారులు జరిపిన సంప్రదింపులు కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. ఈ నెలలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇన్ఫోసిస్ క్యాంపస్‌కు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలపై తుది సంప్రదింపులు కూడా తుది దశకు వచ్చినట్లు సమాచారం. మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో సంస్థ చేసిన కొన్ని ప్రతిపాదనలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇన్ఫోసిస్, దాని అనుబంధ సంస్థలకు సుమారు 50 దేశాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.

■ దక్షిణ భారత దేశంలోని కర్ణాటకలో బెంగళూరు, మంగళూరు, మైసూరులో క్యాంపస్‌లు ఉన్నాయి. దీంతోపాటు హైదరాబాద్, చెన్నై, తిరువనంతపురాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి. ఇప్పుడు విశాఖలో క్యాంపస్ ఏర్పాటుకు నిర్ణయించుకోవడంతో దక్షిణాదిలో అన్ని రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసినట్లవుతుంది. రాష్ట్రంలో ఇన్ఫోసిస్ క్యాంపస్ ఏర్పాటుపై రెండు నెలల క్రితమే ఆ సంస్థతో ప్రభుత్వం సంప్రదింపులు ప్రారంభించింది. ప్రస్తుతం విశాఖ ఐటీ హిల్స్‌లో తాత్కాలిక భవనంలో ఇన్ఫోసిస్ తన కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

విశాఖా సిద్ధంగా ఉండు: మంత్రి లోకేశ్

‘విశాఖ సిద్ధంగా ఉండు. ఈ నెలలో ప్రపంచ ఛాంపియన్లు రాబోతున్నారు. వచ్చేది ఎవరో ఎవరైనా ఊహించగలరా’ అని మంత్రి లోకేశ్ చేసిన ట్వీట్ అందరిలో ఆసక్తి రేకెత్తించింది. ఆయన ఇన్ఫోసిస్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు నిర్ణయించుకోవడం పైనే ట్వీట్ చేసి ఉంటారని తెలుస్తోంది.

విశాఖ బాట పట్టిన దిగ్గజ సంస్థలు

దిగ్గజ ఐటీ సంస్థలు విశాఖ బాట పట్టాయి. ఇప్పటికే గూగుల్ రూ.1.33 లక్షల కోట్లతో 1,000 మెగావాట్ల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనికి మార్చిలో శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. రిలయన్స్ రూ.లక్ష కోట్లతో 1,000 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకోగా.. మరో సంస్థ సిఫీ 500 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు పనులు మొదలుపెట్టింది.

■ మిలీనియం టవర్స్‌లో టీసీఎస్ తాత్కాలిక క్యాంపస్ ఏర్పాటు పనులు దాదాపు పూర్తి అవుతున్నాయి. ఇక్కడ సుమారు 1,200 సీటింగ్‌తో త్వరలో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది.

■ కాగ్నిజెంట్ సంస్థ ఇటీవల 800 సీటింగ్ సామర్థ్యంతో తాత్కాలిక క్యాంపస్ ప్రారంభించడంతో పాటు.. శాశ్వత క్యాంపస్ భవనాలకు శంకుస్థాపన చేసింది.

■ మరో ప్రముఖ టెక్ సంస్థ యాక్సెంచర్ విశాఖలో క్యాంపస్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనికి భూముల కేటాయింపు పూర్తయింది. త్వరలో తాత్కాలిక క్యాంపస్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు సన్నద్ధం అవుతోంది.

ఉత్తరాంధ్రకు మరో మణిహారం

- జీఎంఆర్-మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ప్రాజెక్టు

ఈనాడు, విజయనగరం: విశాఖను ఐటీ కారిడార్‌గా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్న కూటమి సర్కారు.. మరో కీలక ప్రాజెక్టు చేపడుతోంది. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న భోగాపురం ప్రాంతాన్ని తొలి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ హబ్‌గా నిలపనుంది. దీనిలో భాగంగా విజయనగరం-విశాఖపట్నం సరిహద్దుల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు చేయనుంది. గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, జీఎంఆర్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ఈ ప్రాజెక్టులో కీలకం కానున్నారు. దీనికి జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్ట్‌గా నామకరణం చేశారు. మంగళవారం విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్టులో మంత్రి లోకేశ్ సమక్షంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒప్పందం చేసుకోనున్నారు. ఈ కార్యక్రమానికి అశోక్ గజపతిరాజు, గ్రంధి మల్లికార్జునరావు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు భరత్, కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు హాజరవుతారని అధికారిక వర్గాలు తెలిపాయి.

తరలిరానున్న విశ్వవిద్యాలయాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఏవియేషన్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ (ఏఏడీ) ఎడ్యుకేషన్ సిటీ నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీని స్థాపనతో ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల బ్రాంచి క్యాంపస్‌లు ఏర్పాటవుతాయి. అప్లయిడ్ టెక్నాలజీస్‌పై అడ్వాన్స్డ్ రీసెర్చ్, ఇన్నోవేషన్ సెంటర్లు వస్తాయి. స్టార్టప్‌లు, పరిశ్రమల సహకారానికి ఇంక్యుబేషన్ వసతులు సమకూరతాయి. నేషనల్ సివిల్ ఏవియేషన్ పాలసీలో భాగంగా ఈ ఎడ్యుకేషన్ సిటీ రూపుదిద్దుకోనుంది. మేకిన్ ఇండియా, డిఫెన్స్ కారిడార్ లక్ష్యాలకు అనుగుణంగా ఇది పనిచేస్తుంది. 160 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్యాంపస్ నిర్మించనున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.

పోలీసు గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శివ శ్రీనివాస్



దస్త్రంపై సంతకం చేస్తున్న పోలీసు గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్. చిత్రంలో హోం మంత్రి అనిత, సంస్థ ఎండీ రవిప్రకాశ్

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీ పోలీసు గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రూ.509 కోట్లతో అనేక భవనాల నిర్మాణాలు చేపట్టామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ఇవి కాకుండా గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం, పోలీసు అకాడమీ, మోడల్ పోలీసుస్టేషన్లు సహా మొత్తం రూ.1000 కోట్ల విలువైన ప్రాజెక్టులు సంస్థ చేతిలో ఉన్నాయన్నారు. పోలీసు గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా కల్యాణం శివ శ్రీనివాస్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హోం మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీనివాస్ నేతృత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసు గృహనిర్మాణ సంస్థను నిర్వీర్యం చేశారని, దానికి పూర్వ వైభవం తెచ్చేలా పనిచేస్తానని శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఏపీపీహెచ్‌సీఎల్ ఎండీ రవిప్రకాశ్, భాజపా నాయకుడు పాతూరి నాగభూషణం, సినీనటుడు సుమన్ పాల్గొన్నారు.

తెలుగు పాటకు పట్టం కట్టిన బాలు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- రవీంద్రభారతిలో విగ్రహావిష్కరణ
- హాజరైన హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్; రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అనేక రంగాల్లో ప్రతిభ కనబర్చారని, స్వర సార్వభౌమత్వానికి ఆయన నిదర్శనమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కొనియాడారు. ‘ఈటీవీ’లో ప్రసారమయ్యే ‘పాడుతా తీయగా’ కార్యక్రమం ద్వారా ఆయన వందల మంది గాయకులను సినీ రంగానికి అందించారని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో ఘంటసాల విగ్రహం పక్కన 7.6 అడుగుల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం ‘మ్యూజిక్’ సంస్థ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్పీబీతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. “తెలుగు సంగీత ప్రపంచానికి ఘంటసాల, ఎస్పీబీ స్వర్ణయుగం తెచ్చారు. తెలుగు పాటకు వారు పట్టం కట్టారు. సంగీత దర్శకులు ఏది కోరుకుంటే అది ఇచ్చే అక్షయ పాత్ర... బాలు గళం. ఈతరం గాయకులకు, సంగీత దర్శకులకు, కళాకారులకు ఆయన ఆదర్శం. సినీ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది” అని వెంకయ్యనాయుడు అన్నారు.



విగ్రహ సృష్టికర్త, శిల్పి వడయార్‌ను సన్మానిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

పాటకు ఎల్లలు లేవని నిరూపించారు

– తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో రారాజుగా.. పాటల పల్లకిలో నెలరాజుగా.. తెలుగువారి గుండెల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారని అన్నారు. అనేక భాషల్లో వేల సంఖ్యలో పాటలు పాడి.. పాటకు ఎల్లలు లేవని నిరూపించారని చెప్పారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... రవీంద్రభారతిలో ఎస్పీబీ విగ్రహం ఏర్పాటు చేయడం తెలుగు ప్రజలందరికీ గౌరవమని అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సతీమణి సావిత్రి, కుమారుడు ఎస్పీ చరణ్, సోదరి, గాయని ఎస్పీ శైలజ, నటుడు ‘శుభలేఖ’ సుధాకర్, ఇతర కుటుంబ సభ్యులు, గాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో ఎస్పీ చరణ్, బాలసుబ్రహ్మణ్యం సతీమణి సావిత్రి, సోదరి శైలజ

ఏపీలో బాలు పేరిట కళామందిరాలు: తమన్

సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన ‘బాలుకు సుస్వరాభిషేకం’ కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ... ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో కలిసి చర్చించినప్పుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరిట ఐదు అద్భుతమైన కళామందిరాలు నిర్మించేందుకు అంగీకారం తెలిపారన్నారు.

రెవెన్యూ ప్రక్షాళనా సమయం

ఈనాడు – అమరావతి: సమస్యల పుట్టగా ఉన్న రెవెన్యూ శాఖలో ప్రక్షాళనకు ప్రభుత్వం నడుంకట్టింది. భూయజమానుల సమస్యలకు చెక్ పెట్టే దిశగా పలు కీలక నిర్ణయాలకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటి వరకు వెబ్‌ల్యాండ్‌లో రైతు ఆధార్ నంబరు తప్పుగా నమోదైతే సవరణ కోసం జేసీ వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇకపై దీన్ని తహసీల్దార్లకు అప్పగించబోతోంది. భూకేటాయింపు, సేకరణ, కోర్టు ఉత్తర్వుల అమలు సహా పలు కీలక బాధ్యతలూ వారికే ఇవ్వనుంది. రీ సర్వే చేసిన గ్రామాల్లో మ్యుటేషన్ల సవరణతోపాటు ఎల్‌పీఎం నంబర్లలో సమస్యల్ని చక్కదిద్దే బాధ్యతల్ని ఆర్డీవోలకు కట్టబెట్టనుంది. అయితే ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చే అధికారాన్ని మాత్రం సంయుక్త కలెక్టర్ల వద్ద కొనసాగించనుంది. ఈ మేరకు మ్యుటేషన్, పట్టాదారు పాసుపుస్తకాల సేవలకు సంబంధించి రెవెన్యూశాఖ కీలక సంస్కరణలు చేయబోతోంది. ఒకటి రెండు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల కానున్నాయి. తహసీల్దార్లు చేసే భూలావాదేవీలన్నీ ఆర్డీవో, జేసీ, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాలకు ఎప్పటికప్పుడు సందేశం (మెసేజ్) రూపంలో వెళ్తాయి. దాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా చేస్తున్నారో లేదో పరిశీలిస్తారు. రెవెన్యూ సమస్యలు ఒక కొలిక్కి వచ్చేదాకా కార్యదర్శుల స్థాయి పర్యవేక్షణ మరింత పెంచనున్నారు. గ్రామ/వార్డు సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లోనూ వివిధ రెవెన్యూ సేవల కోసం దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షల భూ సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

జేసీ నుంచి తహసీల్దారు, ఆర్డీవోకు ఇచ్చే అధికారాలు

■ కోర్టు ఉత్తర్వుల కారణంగా మార్పులు (సివిల్ కోర్టు/ రెవెన్యూ కోర్టు) ■ భూమి కేటాయింపు ■ భూసేకరణ ■ ఎసైన్‌మెంట్ ■ భూమార్పిడి ■ తప్పుగా మ్యాప్ అయిన ఆధార్‌లో సవరణలు ■ భూమి స్వభావం, వర్గీకరణ (క్లాసిఫికేషన్)లో మార్పులు

జేసీ నుంచి ఆర్డీవోకు వచ్చే అధికారాలు

● రీసర్వే చేసిన గ్రామాల్లో సవరణ మ్యుటేషన్ ● ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సెల్ మ్యాప్) కొలతలతో (షేప్, ఫైల్ విస్తీర్ణం) ఆర్ఓఆర్‌లోని విస్తీర్ణాన్ని సరిదిద్దడం ● ఎల్‌పీఎంల్లో తప్పుగా నమోదైన ఖాతా నంబర్లను సరిచేయడం● ఇప్పటికే ఉన్న ఎల్‌పీఎంల్లో పట్టాదారుల్ని చేర్చడం ● గల్లంతైన సర్వే నంబర్ల జోడింపు ● వివాద రిజిస్టర్ నుంచి చేర్పులు, తొలగింపులు

గ్రామంలో ఒకటి కంటే ఎక్కువ ఖాతాలుంటే తొలగించాల్సిందే

ఒక గ్రామంలో ఒక ఖాతాదారుకు ఒకటి కంటే ఎక్కువ ఖాతాలుంటే అక్కడి రెవెన్యూ అధికారులు అదనంగా ఉన్నవాటిని వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలి. మరణించిన వారి ఖాతాల్ని తొలగించి చట్టబద్ధ వారసుల పేర్లను చేర్పించాలి. ▼ గ్రామ సచివాలయాలు, మీ సేవల ద్వారా వివిధ సేవలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకోనున్నారు. ఇందులో ప్రధానమైనవి.. ▼ కోర్టు ఉత్తర్వుల ఆధారంగా వెంటనే మ్యుటేషన్ చేయాలి▼ గల్లంతైన సర్వే నంబర్లను గుర్తించి వెంటనే చేర్చాలి. డూప్లికేట్ ఉంటే తొలగించాలి. ▼ వివాద రిజిస్టర్ నుంచి తొలగించేందుకు వచ్చిన 1.87 లక్షల ఎకరాలకు సంబంధించిన అభ్యర్థనలు తీసుకోవాలి. ▼ పట్టా భూమి విభాగంలోని జీరో ఖాతాలకు మ్యుటేషన్లు, లావాదేవీలకు అనుమతించాలి. 30,721 ఎకరాలకు చెందిన 31,444 మంది రైతులకు లబ్ధి కలుగుతుంది. ▼ ఎసైన్డ్ భూముల మ్యుటేషన్ చేయాలి. దీనివల్ల 40,791 ఎకరాల విస్తీర్ణం కలిగిన 33,593 మందికి ప్రయోజనం. ▼ 2000వ సంవత్సరానికి ముందు నాటి పత్రాల్ని రిజిస్ట్రార్ కార్యాలయాలు స్కానింగ్ చేయాలి. వాటిని మ్యుటేషన్ చేయాలి.

వారానికోసారి సమీక్ష

సంస్కరణలకు సంబంధించి ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా.. వాటి అమలులో జిల్లాల వారీ పనితీరుపై కలెక్టర్లతో వారానికోసారి సమీక్షించనున్నారు. ఎంపిక చేసిన మ్యుటేషన్ కేసుల్ని సీసీఎల్ఏ బృందం పరిశీలించి, చర్యలు సూచిస్తుంది. పేలవ పనితీరు కనబరిచే గ్రామ/వార్డు సచివాలయ కేంద్రాల్ని ఆర్టీజీఎస్ ద్వారా గుర్తించి క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేస్తారు.

మద్యం కేసు ఛార్జిషీట్లను పరిగణనలోకి తీసుకోవచ్చు

- నిందితుల బెయిల్ కేసు విచారణ మీకు అడ్డంకి కాదు
- ట్రయల్‌కోర్టుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో తమ బెయిళ్లను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బాలాజీ గోవిందప్ప, పి.కృష్ణమోహన్ రెడ్డి, కె.ధనుంజయరెడ్డిలు దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నప్పటికీ ఈ కేసులో దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన ఛార్జిషీట్లను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్‌కోర్టుకేమీ అడ్డంకికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. సోమవారం జస్టిస్ జోయ్‌మాల్యబాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలిలతో కలిసి బెయిల్ పిటిషన్లపై విచారించి, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేశారు. ఈ ముగ్గురికీ మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ గత నెల 26న ఇచ్చిన ఉత్తర్వులను కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అరియామా సుందరం తమ పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం గత సోమవారం దాఖలు చేసిన కౌంటర్‌కు సమాధానమిస్తూ శనివారం రెండు, సోమవారం మరొకటి రిజాయిండర్లు వేశామని చెప్పారు. అందువల్ల దీనిపై పూర్తిస్థాయిలో విచారించడానికి ఏదైనా నాన్ మిసిలేనియస్‌డేకి వాయిదా వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుంటూ ‘ఈ కేసు ఇక్కడ విచారణలో ఉందన్న కారణంతో ఛార్జిషీట్లను పరిగణనలోకి తీసుకొనే అంశం ట్రయల్ కోర్టులో ఆగిపోయింది. దానిపై స్పష్టత ఇవ్వాలి’ అని కోరారు. అందుకు జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించారు. గత నెల 26న తాము జారీ చేసిన ఉత్తర్వులు ఛార్జిషీట్లను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్‌కోర్టుకు అడ్డంకి కాబోవని తేల్చిచెప్పారు.

రూ.7 కోట్లు డిపాజిట్ చేయండి

అక్రమ ఇసుక తవ్వకాల కేసులో జేపీ వెంచర్స్‌కు సుప్రీం ఆదేశం

ఈనాడు, దిల్లీ: వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు రూ.7 కోట్ల జరిమానా డిపాజిట్ చేయాలని జైప్రకాశ్ పవర్ వెంచర్స్ (జేపీ వెంచర్స్)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపినందుకు రూ.18 కోట్ల జరిమానా చెల్లించాలంటూ జేపీను ఆదేశిస్తూ జాతీయ హరిత ట్రైబ్యునల్ చెన్నై బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆ సంస్థ దాఖలు చేసిన కేసులో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. పర్యావరణ అనుమతుల్లో 7 మాత్రమే తమ సంస్థ పేరు మీద ఉన్నాయని, తమ బాధ్యత వాటికే పరిమితమని పేర్కొన్నారు. ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఆ మేరకు రూ.7 కోట్లు డిపాజిట్ చేయాలని జేపీ సంస్థను ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 23కి వాయిదా వేసింది.

గుడివాడ పోలీసుల అదుపులో అర్జున్‌రెడ్డి

- వైకాపా అధినేత జగన్‌కు సమీప బంధువు
- అనుచిత పోస్టుల కేసులో గతంలో లుక్‌అవుట్ నోటీస్‌లు
- తాజాగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, గుడివాడ, న్యూస్‌టుడే: వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీప బంధువు అర్జున్‌రెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలో గుడివాడ పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వైకాపా సామాజిక మాధ్యమ విభాగంలో సజ్జల భార్గవ్‌రెడ్డితో కలిసి అర్జున్‌రెడ్డి క్రియాశీలకంగా పనిచేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, వారి కుటుంబ సభ్యుల చిత్రాలను అసభ్యంగా మార్ఫింగ్ చేసి, వైకాపా సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా వ్యాప్తి చేస్తున్నారంటూ గతేడాది నవంబరులో అతనిపై గుడివాడలో కేసు నమోదైంది. అప్పట్లో అతన్ని అరెస్టు చేసేందుకు పోలీసులు యత్నించగా, అంతలోనే విదేశాలకు పారిపోయాడు. తర్వాత పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. సోమవారం సాయంత్రం అర్జున్‌రెడ్డి విదేశాల నుంచి తిరిగి రావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుని గుడివాడ పోలీసులకు సమాచారమిచ్చారు. ఏపీ నుంచి వెళ్లిన బృందాలు అతన్ని అదుపులోకి తీసుకుని సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసులు అందజేశాయి. అయితే, అర్జున్‌రెడ్డి అప్పటికే తన న్యాయవాదుల్ని ఎయిర్‌పోర్టుకు రప్పించుకున్నారు. అతనిపై ఉమ్మడి కడప సహా పలు జిల్లాల్లో కేసులున్నాయి.

వివేకా హత్య కేసులోనూ అనుమానితుడు..

వైఎస్ జగన్‌కు బాబాయ్ వరుసయ్యే వైఎస్ ప్రకాశ్‌రెడ్డి మనవడే అర్జున్‌రెడ్డి. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో నిందితుడైన సునీల్‌యాదవ్ సోదరుడు కిరణ్‌యాదవ్, అర్జున్‌రెడ్డిల మధ్య వివేకా హత్య జరిగిన రోజు రాత్రి ఫోన్ సంభాషణలు జరిగినట్లు అభియోగాలున్నాయి. దీనిపై దర్యాప్తు చేసి, అనుబంధ ఛార్జిషీట్ వేయాలని హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టు ఇటీవల సీబీఐని ఆదేశించింది.

కడప ఎయిర్‌పోర్టులో మరో కార్యకర్త..

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేశ్‌పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టిన వైకాపా కార్యకర్త బత్తల శ్రీనివాసులురెడ్డిని కడప విమానాశ్రయంలో సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బద్వేలుకు చెందిన శ్రీనివాసులురెడ్డి.. వైకాపా సామాజిక మాధ్యమ కార్యకర్తగా పని చేసేవారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక గల్ఫ్‌కు పారిపోయాడు. సోమవారం తిరిగి రాగా, కడప ఎయిర్‌పోర్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



వారెక్స్ ఇమేజింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా సంస్థ భవనం

విశాఖ మెడ్‌టెక్ జోన్ మరో కీలక ఘనత

‘వారెక్స్ ఇమేజింగ్’ తయారీ యూనిట్ ప్రారంభం



వారెక్స్ ఇమేజింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా సంస్థను ప్రారంభిస్తున్న ఆర్తి సరిన్, రాజీవ్‌నాథ్ తదితరులు

విశాఖపట్నం (పరవాడ), న్యూస్‌టుడే: భారతదేశ వైద్య సాంకేతిక తయారీ ఆశయాలకు ఊతమిస్తూ విశాఖ ఏపీమెడ్‌టెక్ జోన్ కీలక ఘనత సాధించింది. ఎక్స్-రే ఇమేజింగ్ భాగాల తయారీలో ప్రపంచ అగ్రగామి సంస్థ అయిన వారెక్స్ ఇమేజింగ్ కార్పొరేషన్... విశాఖ మెడ్‌టెక్ జోన్(ఏఎంటిజెడ్)లో అధునాతన తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. దీన్ని సోమవారం సాయుధ బలగాల వైద్యసేవల డైరెక్టర్ జనరల్, వైస్ అడ్మిరల్ ఆర్తి సరిన్, హిందుస్థాన్ సిరంజిస్, మెడికల్ డివైజెస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్‌నాథ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వైద్య ఇమేజింగ్ వ్యవస్థలకు శక్తినిచ్చే ఎక్స్-రే ట్యూబ్‌లు, ఇమేజింగ్ ప్రాసెసింగ్ సాఫ్ట్‌వేర్ తదితరాలను వారెక్స్ ఇమేజింగ్ కార్పొరేషన్ అభివృద్ధి చేస్తుందన్నారు. మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ మాట్లాడుతూ వారెక్స్ కేంద్రం ప్రారంభంతో వైద్య సాంకేతికతకు విశ్వసనీయ గమ్యస్థానంగా భారత్ మారనుందన్నారు. దేశంలో మొదటిసారిగా ఇక్కడి కేంద్రంలో సీసియం అయోడైడ్ పూతతో ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్లు, అధునాతన ఇమేజింగ్ భాగాలు తయారవుతాయని అన్నారు. వారెక్స్ సంస్థ సీఈవో సన్నీ సన్యాల్ మాట్లాడుతూ కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి, ఆవిష్కరణ వ్యూహంలో భారతదేశం కేంద్రంగా ఉందన్నారు. సంస్థ భారత్ హెడ్ వివేక్ ఫాల్లే మాట్లాడుతూ మేకిన్ ఇండియా నినాదాన్ని బలపరుస్తూ భారత్‌లో ఈ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ప్రపంచ స్థాయి నాణ్యత గల ఫ్లాట్‌ప్యానెల్స్ డిటెక్టర్ తయారీని సాధ్యం చేసేందుకు ఎకోసిస్టమ్‌ను తీర్చిదిద్దిన మెడ్‌టెక్‌జోన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ అయినా మాకు 10% ఇవ్వాల్సిందే

- రైల్వే పనులపై కమీషన్ డిమాండ్
- అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తే భయపడాలా?
- ఫోన్‌లో బెదిరించిన ఎమ్మెల్యే సోదరుడు

ఈనాడు, అనంతపురం: ‘ఎంపీ అయితే ఏంటి.. పనులు చేయాలంటే మాకు 10 శాతం కమీషన్ ఇవ్వాల్సిందే. పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తే భయపడాలా? ఇక్కడ మేమే అధిష్ఠానం’ అంటూ ఓ ఎమ్మెల్యే సోదరుడు ఏకంగా ఎంపీనే బెదిరించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు రాయలసీమ పరిధిలో తెదేపాకు చెందిన ఎంపీ సమీప బంధువు ఒకరు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో రైల్వే పనులు చేస్తున్నారు. రూ.7 కోట్ల విలువైన పైపులైన్ పనుల్ని టెండరు ద్వారా దక్కించుకుని పనులు మొదలుపెట్టారు. స్థానిక ఎమ్మెల్యే.. ఆ గుత్తేదారుకు ఫోన్ చేసి పనుల్ని తమకు అప్పగించాలని, లేకపోతే 10 శాతం కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏదైనా ఉంటే ఎంపీతో మాట్లాడుకోవాలని గుత్తేదారు సమాధానమిచ్చారు. దీంతో ఎంపీతో మాట్లాడే బాధ్యతను ఎమ్మెల్యే తన తమ్ముడికి అప్పగించారు. ఎమ్మెల్యే సోదరుడు ఎంపీకి నేరుగా ఫోన్ చేసి.. స్థానికంగా పనులు ఎవరూ చేసినా 10 శాతం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశాడు. పనులు తానే చేస్తున్నానని ఎంపీ చెప్పినా వినలేదు. ఎంపీ అయినా వదలొద్దని తన అన్న చెప్పాడంటూ చెప్పుకొచ్చాడు. దీంతో ఆ ఎంపీ సదరు ఎమ్మెల్యేపై పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు.

ఇది మా సామ్రాజ్యం.. ఇక్కడ మేమే అధిష్ఠానం

ఎంపీ ఫిర్యాదుతో స్పందించిన పార్టీ పెద్దలు స్థానిక ఎమ్మెల్యేకు ఫోన్ చేసి మాట్లాడారు. సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధిని కమీషన్ల కోసం వేధించడం సరికాదంటూ హెచ్చరించారు. అయినా ఎమ్మెల్యే వెనక్కు తగ్గలేదు. మళ్లీ తన తమ్ముడితో ఎంపీకి ఫోన్ చేయించి ‘పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేస్తే వదిలేస్తామా? ఇది మా సామ్రాజ్యం. ఇక్కడ మేమే అధిష్ఠానం. మేం అడిగినట్లు 10 శాతం కమీషన్ ఇవ్వకపోతే పనులు చేయనివ్వం, డబ్బులు ఇవ్వకుండా పనులు కొనసాగిస్తే సామగ్రి ఎత్తుకెళ్లిపోతాం’ అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో ఆ ఎంపీ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై మంత్రి నారా లోకేశ్ కార్యాలయం సైతం ఆరా తీసినట్లు సమాచారం.

మావోయిస్టుల మృతిపై మెజిస్టీరియల్ విచారణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: మావోయిస్టు కీలకనేత హిడ్మా మృతిపై సోమవారం మెజిస్టీరియల్ విచారణ జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో గత నెల 18న జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ కాల్పుల్లో హిడ్మాతోపాటు భార్య మడకం రాజే మృతి చెందారు. దీనిపై రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మావోల కుటుంబ సభ్యులు, పోలీసు, రెవెన్యూ అధికారులతోపాటు వైద్యులతో విచారణ జరిగింది. విచారణకు హిడ్మాకు ఇద్దరు కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఎవరూ లేకుండా విచారణ నిర్వహించడం ఏమిటని ప్రజా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, హైదరాబాదు నుంచి వచ్చిన హైకోర్టు న్యాయవాది సురేష్‌కుమార్ ప్రశ్నించారు.

ఛాంపియన్స్

కళ్లన్నీ గ్రీన్‌పైనే..

ఐపీఎల్ మినీ వేలం నేడు

- లివింగ్‌స్టన్, పతిరనపైనా ఆసక్తి
- వెంకటేశ్ ఎంత పలుకుతాడో!



మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గ్రీన్

అబుధాబి



వెంకటేశ్ అయ్యర్

ఆటగాళ్ల పోరుకు ముందు ఆటగాళ్ల కోసం పోటీకి వేళైంది. 2026 ఐపీఎల్ కోసం మంగళవారం మినీ వేలం జరగనుంది. తమ జట్లను బలోపేతం చేసుకోవడం కోసం ఫ్రాంఛైజీలు గట్టిగా పోటీపడనున్నాయి. ఈ వేలంలో అందరికన్నా ఎక్కువగా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ లబ్ధిపొందనున్నాడు. ఎందుకంటే ఎక్కువ మంది స్టార్లు అందుబాటులో లేరు. ఉన్నవాళ్లలో ఫ్రాంఛైజీలను ఎక్కువగా ఆకర్షిస్తోన్న స్టార్ గ్రీనే. అత్యధిక డబ్బుతో ఉన్న కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్‌కింగ్స్ అతడి కోసం బలంగా తలపడే అవకాశముంది.

77 మంది.. రూ.237.55 కోట్లు: మొత్తంగా 359 మంది క్రికెటర్లు వేలంలో అమ్మకానికి ఉండగా.. ఫ్రాంఛైజీలకు 77 మందిని మాత్రమే కొనుగోలు చేసే వీలుంది. వాటి దగ్గర ఉన్న మొత్తం డబ్బు రూ.237.55 కోట్లు. కొద్ది మంది అన్‌క్యాప్డ్ ఆటగాళ్లను వాళ్ల కనీస ధరకు కొనడం మినహా.. చేతిలో కేవలం రూ.2.75 కోట్లు ఉన్న ముంబయికి ఈ వేలంలో పెద్దగా పాత్రేమీ ఉండదు. ఎక్కువ మంది ఆటగాళ్లను విడుదల చేసిన కోల్‌కతా దగ్గర అత్యధికంగా రూ.64.30 కోట్లు ఉన్నాయి. ఆ జట్టు 13 మందిని తీసుకోవాల్సివుంది. కేకేఆర్ తర్వాత ఎక్కువగా డబ్బుంది సీఎస్కే (రూ.43.40 కోట్లు) దగ్గరే. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండరైన గ్రీన్‌ను ఈ రెండు ఫ్రాంఛైజీల్లో ఒకటి చేజిక్కించుకోవచ్చు. గ్రీన్ ఐపీఎల్‌లో ఇప్పటివరకు 29 మ్యాచ్‌ల్లో 704 పరుగులు చేశాడు. 16 వికెట్లు పడగొట్టాడు. కనీస ధర రూ.2 కోట్లుగా ఉన్న మరో ఇద్దరు పేస్ ఆల్‌రౌండర్లు జేసన్ హోల్డర్, వెంకటేశ్ అయ్యర్ కూడా ఆసక్తిరేపుతున్నారు. కిందటిసారి రూ.23.75 కోట్ల భారీ మొత్తానికి కేకేఆర్‌కు అమ్ముడుపోయిన వెంకటేశ్.. తీవ్రంగా నిరాశపరిచాడు. తన ధరకు ఏమాత్రం న్యాయం చేయలేపోయాడు. దీంతో కోల్‌కతా అతణ్ని వదిలేసింది. ఈసారి అతడికి భారీ ధర పలికే అవకాశం కనిపించట్లేదు. రసెల్‌ను కూడా వదిలేసిన కేకేఆర్‌కు కనీసం ఇద్దరు టాప్ ఆర్డర్ బ్యాటర్లు, ఓ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అవసరం. బ్యాటర్లు లివింగ్‌స్టన్, డికాక్, ఫాస్ట్‌బౌలర్ పతిరన కూడా పెద్ద ధర పలికే అవకాశమున్న ఇతర ఆటగాళ్లు. కనీస ధర రూ.75 లక్షల వల్ల ఫ్రాంఛైజీలను ఆకర్షించవచ్చని పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్ ఆశిస్తున్నారు. వెంకటేశ్ కాకుండా రూ.2 కోట్ల కనీస ధరతో ఈ వేలంలో ఉన్న భారత ఆటగాడు స్పిన్నర్ రవిబిష్ణోయ్ మాత్రమే. మినీ వేలంలో 'రైట్ టు మ్యాచ్ కార్డ్' వాడడానికి వీల్లేదు.

ఫ్రాంఛైజీ	ఉన్న డబ్బు	ఖాళీలు
కోల్‌కతా	రూ.64.30 కోట్లు	13
చెన్నై	రూ.43.40 కోట్లు	9
హైదరాబాద్	రూ.25.50 కోట్లు	10
లఖ్‌నవూ	రూ.22.95 కోట్లు	6
దిల్లీ	రూ.21.80 కోట్లు	8
బెంగళూరు	రూ.16.40 కోట్లు	8
రాజస్థాన్	రూ.16.05 కోట్లు	9
గుజరాత్	రూ.12.90 కోట్లు	5
పంజాబ్	రూ.11.50 కోట్లు	4
ముంబయి	రూ.2.75 కోట్లు	5

ఎంత పలికినా..

ఈ వేలంలో అందరికన్నా ఎక్కువ డిమాండ్ ఉన్న ఆటగాడు గ్రీన్. అతడు స్టార్క్ (రూ.24.75 కోట్లు)ను అధిగమించి ఐపీఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా నిలిచినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కానీ ఇక్కడే చిన్న మెలిక ఉంది. ఒకవేళ గ్రీన్‌కు రూ.25 కోట్లు పలికినా ఈ సీజన్‌కు అతడికి దక్కేది రూ.18 కోట్లే. నిబంధనల ప్రకారం మినీ వేలంలో ఓ విదేశీ ఆటగాడి గరిష్ఠ ఫీజు.. అత్యధిక రిటెన్షన్ స్లాబ్ (రూ.18 కోట్లు), మెగా వేలం అత్యధిక ధర (పంత్ రూ.27 కోట్లు)లలో తక్కువగా ఉన్న మొత్తాన్ని మించకూడదు. గ్రీన్ ఎక్కువ పలికితే.. ఆ మొత్తాన్ని ఫ్రాంఛైజీ పర్స్ నుంచి తగ్గిస్తారు. కానీ అతడికి మాత్రం రూ.18 కోట్లే ఇస్తారు.

రో-కో సహా అందరూ ఆడాల్సిందే

దిల్లీ: దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో టీమ్‌ఇండియా ఆటగాళ్ల పాల్గొనడాన్ని బీసీసీఐ తప్పనిసరి చేసింది. స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మతో సహా ఆటగాళ్లంతా కనీసం రెండు మ్యాచ్‌లు ఆడాలని స్పష్టంచేసింది. ఈనెల 24న విజయ్ హజారే ట్రోఫీ ప్రారంభంకానుంది. దక్షిణాఫ్రికాతో చివరి టీ20 మ్యాచ్ (ఈనెల 19న).. న్యూజిలాండ్‌తో మొదటి వన్డే పోరు (2026 జనవరి 11)కు మధ్య మూడు వారాలు గడువు ఉండటంతో సీనియర్ ఆటగాళ్లంతా దేశవాళీలో పాల్గొనాలని బీసీసీఐ కోరుకుంటోంది. అజిత్ అగార్కర్ ఆధ్వర్యంలోని సీనియర్ సెలక్షన్ కమిటీ ఈమేరకు ఆటగాళ్లకు సమాచారం అందించింది. ఈ టోర్నీలో పాల్గొనడానికి కోహ్లి, రోహిత్ ఇప్పటికే సంసిద్ధతను తెలియజేశారు. శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, సూర్యకుమార్ యాదవ్‌లను కూడా వారి జట్ల తరపున కనీసం రెండు మ్యాచ్‌లు ఆడాలని సెలక్షన్ కమిటీ సూచించింది. శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ సాధించడానికి మరికొంత సమయం పట్టేలా ఉండడంతో అతడికి మినహాయింపు లభించగా.. మిగతా ఆటగాళ్లంతా రాష్ట్ర జట్ల తరపున బరిలో దిగనున్నారు. మరోవైపు ధర్మశాలలో మూడో టీ20కి ముందు వ్యక్తిగత కారణాలతో బుమ్రా ఇంటికి తిరిగి వెళ్లాడు. సన్నిహిత కుటుంబ సభ్యుడొకరు ఆసుపత్రిలో చేరడంతో అతను జట్టును వీడాడు. అంతా సవ్యంగా ఉంటే నాలుగు లేదా అయిదో మ్యాచ్‌కు బుమ్రా అందుబాటులోకి రావొచ్చు.



షెఫాలి

ఐసీసీ ఉత్తమ క్రికెటర్‌గా షెఫాలి

దుబాయ్: ఐసీసీ నవంబరు నెల మహిళల క్రికెట్ ఉత్తమ ప్లేయర్‌గా షెఫాలివర్మ అవార్డు గెలుచుకుంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయడంతో ఆమెకు ఈ పురస్కారం దక్కింది. పుత్తవాంగ్ (థాయ్‌లాండ్), ఇషా ఓజా (యూఏఈ) నుంచి పోటీ ఎదురైనా.. షెఫాలినే ఈ అవార్డు దక్కించుకుంది. ప్రపంచకప్ సెమీఫైనల్‌కు ముందు ఓపెనర్ ప్రతీక రావల్ గాయపడడంతో ఆమె స్థానంలో షెఫాలి జట్టులోకి వచ్చింది. దక్షిణాఫ్రికాతో తుది పోరులో 78 బంతుల్లో 87 పరుగులు చేసిన ఈ ఓపెనర్.. బంతితోనూ రాణించి, రెండు కీలక వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పింది. పురుషుల్లో దక్షిణాఫ్రికా స్పిన్నర్ సిమోన్ హార్మర్ నవంబరుకు 'ఐసీసీ ఉత్తమ ఆటగాడు' అవార్డును కైవసం చేసుకున్నాడు. భారత్‌తో టెస్టు సిరీస్‌లో హార్మర్ 1.91 ఎకానమీతో 17 వికెట్లు పడగొట్టాడు. తైజుల్ ఇస్లామ్ (బంగ్లాదేశ్), మహ్మద్ నవాజ్ (పాకిస్థాన్)లను అతడు వెనక్కినెట్టి ఈ అవార్డును గెలుచుకున్నాడు.



మెస్సీకి బ్యాటును బహూకరిస్తున్న ఐసీసీ ఛైర్మన్ జై షా. చిత్రంలో దిల్లీ సీఎం రేఖా గుప్తా, ఫుట్‌బాలర్లు సువారెజ్, రోడ్రిగో డి పాల్

మురిపించి.. ముగించి!



మెస్సీ

- భారత్‌లో పూర్తయిన మెస్సీ పర్యటన
- దిల్లీలో సాఫీగా చివరి ఈవెంట్

దిల్లీ

అర్జెంటీనా సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సి మూడు రోజుల భారత పర్యటన సోమవారం ముగిసింది. తొలి రోజు కోల్‌కతా, హైదరాబాద్ ఈవెంట్లలో పాల్గొని.. రెండో రోజు ముంబయిలో సందడి చేసిన మెస్సి, మూడో రోజు దేశ రాజధాని దిల్లీలో అభిమానులను అలరించాడు. సాయంత్రం అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మెస్సి ఈవెంట్లో దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఐసీసీ ఛైర్మన్ జై షా, దిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా పాల్గొన్నారు. మెస్సితో పాటు భారత పర్యటనకు వచ్చిన అతడి సహచరుడు రోడ్రిగో డి పాల్, ఉరుగ్వే స్టార్ సువారెజ్ ముందుగా కాసేపు 7×7 సెలబ్రిటీ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించారు. అనంతరం ఈ ముగ్గురూ మైదానంలోకి వచ్చి అభిమానులకు అభివాదం చేశారు. ఆపై వీరిని రేఖా గుప్తా, జై షా సత్కరించారు. జై షా ముగ్గురు ఫుట్‌బాలర్లకు వారి పేర్లతో ఉన్న భారత క్రికెట్ జట్టు జెర్సీలను బహూకరించాడు. దీంతో పాటు ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారత్ వేదికగా జరిగే టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా, అమెరికా మధ్య జరిగే మ్యాచ్ టికెట్‌ను అందజేశాడు. మరోవైపు మెస్సి బృందం.. మినెర్వా అకాడమీ ఫుట్‌బాల్ టీమ్‌ను సత్కరించింది. ఆపై ముగ్గురు ఫుట్‌బాలర్లు హైదరాబాద్, ముంబయిల్లో మాదిరే స్టేడియమంతా తిరుగుతూ ఫుట్‌బాల్స్‌ను స్టాండ్స్‌లోకి పంపుతూ వీక్షకులను ఉత్సాహపరిచారు. ఈ ఈవెంట్‌కు దాదాపు 25 వేల మంది అభిమానులు హాజరయ్యారు. వాళ్లంతా మెస్సి నినాదాలతో స్టేడియాన్ని హోరెత్తించారు. మెస్సి బృందం సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కలుస్తుందని వార్తలు వచ్చాయి. కానీ ప్రతికూల వాతావరణం కారణంగా ముంబయి నుంచి దిల్లీకి రావాల్సిన వీరి విమానం ఆలస్యమైంది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.45 గంటలకు రాజధానిలో అడుగుపెట్టాల్సిన ఫుట్‌బాలర్లు.. 2.30కి చేరుకున్నారు. మోదీ విదేశీ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో ఆయనతో ఫుట్‌బాలర్ల సమావేశం కూడా రద్దయింది. దిల్లీ చేరుకున్నాక లీలా ప్యాలెస్ హోటల్‌లో కొంతమందితో 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో పాల్గొన్న మెస్సి బృందం.. తర్వాత అరుణ్ జైట్లీ స్టేడియానికి వచ్చింది. ఈ ఈవెంట్ అయ్యాక భారత్ నుంచి బయల్దేరింది. తొలి రోజు ఉదయం కోల్‌కతాలో జరిగిన మెస్సి ఈవెంట్ అస్తవ్యస్తంగా మారగా.. ఆ తర్వాత హైదరాబాద్, ముంబయి, దిల్లీల్లో కార్యక్రమాలు సాఫీగా సాగడంతో ఆయా చోట్ల నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

మళ్లీ వస్తా: మెస్సి

భారత పర్యటనకు మళ్లీ తప్పక వస్తానని మెస్సి అన్నాడు. మూడు రోజుల భారత పర్యటనను సోమవారం ముగించుకుని స్వదేశానికి తిరిగి వెళ్లిన మెస్సి.. దిల్లీలో చివరగా జరిగిన ఈవెంట్లో ఈ వ్యాఖ్యలు చేశాడు. "భారత్‌లో ఉన్నన్ని రోజులు నా మీద చూపించిన ప్రేమ, ఆప్యాయతకు ధన్యవాదాలు. మా అందరికీ ఇది అందమైన అనుభవం. పర్యటన క్లుప్తంగా సాగినప్పటికీ.. మీ అందరి నుంచి నేరుగా ఇంత ప్రేమను పొందడం ఆనందంగా ఉంది. ఈ ప్రేమను మాతో పాటు తీసుకెళ్తాం. కచ్చితంగా మళ్లీ ఇక్కడికి తిరిగి వస్తాం. మ్యాచ్ ఆడడానికో, ఇంకో సందర్భం చూసుకునో ఇక్కడికి రావడం తథ్యం" అని మెస్సి అన్నాడు.

దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సి హైదరాబాద్‌ను సందర్శించడం తెలంగాణ రాష్ట్రానికి లభించిన గొప్ప గౌరవమని భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమల్‌రాజ్ అన్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ చరిత్రలో ఇదో చిరస్మరణీయ ఘట్టమని అభివర్ణించారు. మెస్సి రాక యువ ఆటగాళ్లకు ప్రేరణగా నిలుస్తుందని, మరింత మంది ఫుట్‌బాల్ ఆడేలా ప్రోత్సహిస్తుందంటున్న అమల్‌రాజ్.. మెస్సి పర్యటనపై 'ఈనాడు'తో మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

మెస్సీ జీవితం ఓ పాఠం

ఈనాడు – హైదరాబాద్



విక్టర్ అమల్‌రాజ్

క్రికెట్ పేరు చెప్పగానే ఊగిపోయే భారత్ కొన్ని రోజుల పాటు మెస్సి జపం చేసింది. భారత్‌లో మెస్సి పర్యటన ఒక కార్యక్రమమే కాదు.. కీలక మలుపు. దేశంలో క్రికెట్‌ను ఆరాధించే వాళ్లు చాలా మందే ఉండొచ్చు. కానీ ఫుట్‌బాల్‌ను ఇష్టపడే వాళ్ల సంఖ్య తక్కువేమీ కాదు. కేరళ, గోవా మొదలుకుని పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో ఫుట్‌బాల్‌కు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికీ క్రికెట్ కంటే ఫుట్‌బాల్‌ను ఆరాధించే వాళ్లే ఎక్కువ. అలాంటి వాళ్లందరికీ మెస్సి రాక కొత్త ఉత్సాహాన్ని అందించేదే. ఇక ఫుట్‌బాల్‌తో హైదరాబాద్ అనుబంధం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. భారత ఫుట్‌బాల్‌కు దశ, దిశ చూపించిందే హైదరాబాద్. 1940 నుంచి 1970 వరకు ఫుట్‌బాల్‌ను హైదరాబాద్ శాసించింది. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టులో ఎనిమిది మంది హైదరాబాదీలు ఉండటం భాగ్యనగరం ఫుట్‌బాల్ లోతుకు నిదర్శనం. అలాంటి గడ్డపై ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సి అడుగుపెట్టడం.. ఆటను అభిమానించే వాళ్లందరికీ పండుగలా మారింది.

మెస్సి రాక హైదరాబాద్ ఫుట్‌బాల్‌కు పూర్వ వైభవం తీసుకొస్తుందని చెప్పలేను. కానీ కొత్త జోష్ తీసుకొస్తుంది. మెస్సి పర్యటనను ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకుని ఆటకు మరింత జవసత్వం అందించాలి. ప్రపంచంలోనే మొట్టమొదటి ఫిఫా మహిళల అకాడమీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మెస్సి పర్యటన మరింత అర్థవంతంగా మారింది. చిన్నారులు ప్రపంచ దిగ్గజాన్ని ఆదర్శంగా.. మార్గదర్శిగా ఎంచుకునేందుకు ప్రేరణ లభిస్తుంది. కొత్త తరానికి ఉత్ప్రేరకంగా పని చేస్తుంది. ఫుట్‌బాల్‌లో రాణించాలన్న కోరికను పెంచుతుంది. క్రికెట్‌నే మతంగా భావించే భారత్‌లో ఈ స్థాయిలో కోట్లాది మంది ఫుట్‌బాల్ గురించి మాట్లాడుకోవడం అరుదైన విషయమే. ఫుట్‌బాల్‌లో భారత ఘన చరిత్రను మెస్సి గుర్తు చేశాడు. ప్రత్యేకంగా హైదరాబాద్ ఫుట్‌బాల్ వారసత్వానికి లభించిన గుర్తింపు ఇది. ఎంతోమంది ఒలింపియన్లు, అంతర్జాతీయ క్రీడాకారులు, జాతీయ ఆటగాళ్లను హైదరాబాద్ అందించింది. మెస్సి ఆటలోనే కాదు.. వ్యక్తిత్వ పరంగా కూడా ఆదర్శనీయుడు. అతడి జీవితం యువతకు ఓ పాఠం. తెలుగు క్రీడాకారులు అతడి నుంచి ఎంతో నేర్చుకోవచ్చు.

అక్షర్ స్థానంలో షాబాజ్ అహ్మద్

దిల్లీ: ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అనారోగ్యం కారణంగా దక్షిణాఫ్రికాతో మిగతా రెండు టీ20లకు దూరమయ్యాడు. బీసీసీఐ సెలక్షన్ కమిటీ అతడి స్థానంలో షాబాజ్ అహ్మద్‌ను ఎంపిక చేసింది. అక్షర్ ఆదివారం ధర్మశాలలో జరిగిన మూడో టీ20లో కూడా ఆడలేదు. ఆ మ్యాచ్‌లో గెలిచిన భారత జట్టు.. సిరీస్‌లో 2-1 ఆధిక్యం సంపాదించిన సంగతి తెలిసిందే. నాలుగో టీ20 బుధవారం లఖ్‌నవూలో, అయిదో టీ20 శుక్రవారం అహ్మదాబాద్‌లో జరుగుతాయి. అక్షర్ ప్రస్తుతం జట్టుతో పాటు లఖ్‌నవూలోనే ఉన్నాడని బీసీసీఐ తెలిపింది. 31 ఏళ్ల షాబాజ్ ఇంతకుముందు భారత్ తరపున రెండు టీ20లు, మూడు వన్డేలు ఆడాడు. రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మెరుగైన ప్రదర్శనతో కారణంగా అతడికి ఇప్పుడు జట్టులో చోటు దక్కింది.

శుభ్‌మన్‌పై నమ్మకముంచండి: అభిషేక్

ధర్మశాల: శుభ్‌మన్ గిల్‌పై నమ్మకం ఉంచాలని.. అతడు త్వరలో గాడిలో పడతాడని అతడి చిన్ననాటి స్నేహితుడు, భారత స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ అన్నాడు. 'సుదీర్ఘ కాలంగా శుభ్‌మన్‌తో ఆడుతున్నా. అతడు తన జట్లను ఎలా గెలిపించేవాడో నాకు తెలుసు. ప్రస్తుతం ఫామ్‌లో లేకపోవచ్చు. ముస్ముందు సత్తా చాటుతాడు. అందరూ గిల్‌పై నమ్మకముంచాలి. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌లోనూ అతడు భారత్‌కు మ్యాచ్‌లు గెలిపించడాన్ని మీరు చూస్తారు. సూర్య కూడా రాణిస్తాడనే నమ్మకం ఉంది.'' అని అభిషేక్ చెప్పాడు. భారత్‌లో మంచుతో కూడిన వాతావరణంలో బౌలర్లకు స్వింగ్ లభిస్తుందని.. అందుకే తాను ఆ పిచ్‌లకు తగ్గ షాట్లతోనే పరుగులు సాధించేందుకు ప్రయత్నిస్తానని అభిషేక్ పేర్కొన్నాడు. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గత 15 టీ20 మ్యాచ్‌ల్లో 291 పరుగులే చేశాడు. వేగంగా ఆడడంలో శుభ్‌మన్ విఫలమవుతున్నాడు. 15 మ్యాచ్‌ల్లో అతడు నాలుగు సిక్స్‌లే కొట్టాడు.

ఛెత్రి.. గాయంతో బాధ పడుతున్నా!



ఛెత్రి

దిల్లీ: భారత ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న సునీల్ ఛెత్రి.. ప్రపంచ మేటి ఫుట్‌బాలర్లలో ఒకడైన లియోనల్ మెస్సిని కలవడం దేశంలోని సాకర్ ప్రేమికులకు అపురూప జ్ఞాపకం. ఆదివారం ముంబయిలో వాంఖడే మైదానంలో జరిగిన కార్యక్రమానికి ఈ ఇద్దరూ హాజరయ్యారు. మెస్సి ముందే ఛెత్రి ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడాడు. తర్వాత అర్జెంటీనా దిగ్గజాన్ని కలిశాడు. నిజానికి ఛెత్రి ఈ కార్యక్రమానికి రావాల్సింది కాదని, అయినా వచ్చానన్నాడు ఛెత్రి. "ఆట కోసం మెస్సి చేసిన దానికి నా కృతజ్ఞత తెలియజేసే అవకాశం వచ్చింది. అది నా కల, అలాగే బాధ్యత కూడా. నిజానికి కొన్నాళ్లుగా గాయంతో ఇబ్బంది పడుతున్నా. ముంబయికి నేను వెళ్లాల్సింది కాదు. కానీ నాలోని అభిమానికి ఎలాగైనా అక్కడికి వెళ్లాలనిపించింది. అలా నన్ను ఎంతో సంతోషపెట్టే వ్యక్తిని కలిసే అవకాశం దక్కింది. నేను ఎప్పుడైనా బాధలో ఉంటే అతడి కళే నాకు మందులా పని చేసేది" అని ఛెత్రి తెలిపాడు.

ఆ నలుగురు.. ఓ చరిత్ర

భారత్‌కు ఇది ప్రపంచకప్‌ల కాలమేమో! క్రికెట్లో మహిళల వన్డే ప్రపంచకప్, అంధుల ప్రపంచకప్ భారత్ సొంతమైతే.. తాజాగా స్క్వాష్‌లో ప్రపంచకప్‌ను మన దేశం కైవసం చేసుకుంది. స్క్వాష్‌లో అడపాదడపా వ్యక్తిగత విజయాలే తప్ప ఒక జట్టుగా సత్తా చాటిన సందర్భాలు చాలా తక్కువే. ఆ లోటు తీరుస్తూ జోష్న చిన్నప్ప, అనాహత్ సింగ్, అభయ్ సింగ్, సెంథిల్ కుమార్‌లతో కూడిన మిక్స్‌డ్ జట్టు తొలిసారి విశ్వ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. ఎన్నో ఏళ్లుగా ఈ ఆట ఆడుతున్నా సాధ్యం కాని విజయం ఇప్పుడు దక్కిందంటే ఈ జట్టు ప్రత్యేకమే. మరి ఈ నలుగురి గురించి తెలుసుకుందామా?

అనుభవాన్ని రంగరించి



జోష్న

జోష్న చిన్నప్ప.. టెన్నిస్‌లో సానియామీర్జా, చెస్‌లో కోనేరు హంపి, హారిక మాదిరే సుదీర్ఘ కాలంగా ఒక ఆటలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తోంది. కెరీర్‌లో ఎన్నో ఘనతలు అందుకున్న ఈ 39 ఏళ్ల తమిళనాడు ప్లేయర్.. కెరీర్ చివర్లో ప్రపంచకప్‌నూ ముద్దాడింది. తన అనుభవాన్ని యువ క్రీడాకారులకు పంచి భారత్ ప్రపంచకప్ గెలవడంలో జోష్న కీలకపాత్ర పోషించింది. ముఖ్యంగా ఫైనల్లో టాప్‌సీడ్ హాంకాంగ్‌ను 3-0తో చిత్తు చేయడం వెనుక జోష్న ఇచ్చిన స్ఫూర్తి ఎంతో ఉంది. తొలి సింగిల్స్‌లో తనకన్నా మెరుగైన ర్యాంకర్ కయీ లీని చిత్తు చేసి భారత్‌కు శుభారంభం అందించింది. 2003లో ప్రొఫెషనల్ ప్లేయర్‌గా మారిన జోష్న.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 2 స్వర్ణాలు, 3 కాంస్యాలు, కామన్వెల్త్‌లో ఒక స్వర్ణం, ఆసియా క్రీడల్లో 2 రజతాలు, 3 కాంస్యాలు, ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రజతం గెలిచింది.


యువ సంచలనం



అనాహత్

భారత స్క్వాష్‌లోకి మెరుపులా దూసుకొచ్చింది అనాహత్ సింగ్. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ టోర్నీల్లో స్థిరంగా రాణిస్తూ తన ముద్ర వేసింది. దిల్లీకి చెందిన అనాహత్ క్రీడా కుటుంబం నుంచి వచ్చింది. ఆమె అమ్మానాన్న హాకీ ప్లేయర్లు. సింధు స్ఫూర్తితో అనాహత్ మొదట బ్యాడ్మింటన్ ఆడింది. తర్వాత అక్క సమైరా స్క్వాష్ ఆడుతుండడంతో ఆ ఆట వైపు మళ్లింది. సౌరభ్ ఘోషల్ శిక్షణలో రాటుదేలింది. 2019లో బ్రిటిష్ జూనియర్ ఓపెన్ గెలవడంతో అనాహత్ ప్రయాణం మొదలైంది. 2019లో డచ్ జూనియర్ ఓపెన్, 2021లో యుఎస్ ఓపెన్ నెగ్గింది. 2022లో 14 ఏళ్లకే కామన్వెల్త్ క్రీడల్లో పోటీపడి భారత్ తరపున బరిలో దిగిన పిన్న వయస్కురాలిగా నిలిచింది. 2022 ఆసియా క్రీడల్లో టీమ్, మిక్స్‌డ్ విభాగాల్లో కాంస్యాలు అందుకుంది. ఈ ఏడాది అనాహత్ కెరీర్‌లో మలుపు. ప్రపంచకప్‌తో పాటు ఆసియా ఛాంపియన్‌షిప్‌లోనూ పసిడి గెలిచింది. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె కాంస్యం అందుకుంది.

చెన్నై చిన్నోళ్లు



అభయ్



సెంథిల్

భారత జట్టు చరిత్రాత్మక విజయంలో చెన్నై చిన్నోళ్లు అభయ్ సింగ్, సెంథిల్ కుమార్ తమ వంతు పాత్ర పోషించారు. తమిళనాడులోని సేలంకు చెందిన 27 ఏళ్ల సెంథిల్ కుమార్‌ది క్రీడల నేపథ్యం. అమ్మ ప్రియదర్శిని జాతీయ బ్యాడ్మింటన్ ప్లేయర్. నాన్న రామస్వామి జాతీయ బాస్కెట్‌బాల్ ఆటగాడు. సెంథిల్ ఈ రెండూ కాకుండా స్క్వాష్‌ను ఎంచుకున్నాడు. అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు స్క్వాష్ ఆడేవాడు. తర్వాత అదే అతడికి కెరీర్‌గా మారింది. 2022, 2024 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో టీమ్, డబుల్స్‌లో స్వర్ణాలు అతడి ఖాతాలో ఉన్నాయి. సింగిల్స్‌లో 2023లో రజతం, 2025లో కాంస్యాలు నెగ్గాడు. భారత జట్టులోకి దూసుకొచ్చి తక్కువ సమయంలోనే స్టార్‌గా ఎదిగిన ఆటగాడు అభయ్ సింగ్. 27 ఏళ్ల అభయ్.. జేమ్స్ విల్‌స్ట్రాప్, హరీందర్ పాల్ సింగ్ శిక్షణలో స్క్వాష్‌లో మెరుగయ్యాడు. సింగిల్స్‌లో స్థిరంగా రాణిస్తున్న ఈ చెన్నై కుర్రాడు.. ప్రస్తుతం 29వ ర్యాంకులో ఉన్నాడు. 2022లో ప్రపంచకప్‌లో కాంస్యం సాధించిన మిక్స్‌డ్ టీమ్‌లో సభ్యుడిగా ఉన్న అభయ్.. ఇప్పుడు స్వర్ణాన్ని ముద్దాడాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ (2022, 2024)లో టీమ్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో అయిదు స్వర్ణాలు అభయ్ ఖాతాలో ఉన్నాయి. 2019 దక్షిణ ఆసియా క్రీడలు, 2016 ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో సింగిల్స్‌లో కాంస్యాలు నెగ్గాడు.

– ఈనాడు క్రీడావిభాగం

అడుగు జారకుండా.. అభినయం మారకుండా!



సంగీతానికి అనుగుణంగా అభినయిస్తూ లయ తప్పకుండా శాస్త్రీయ నృత్యం చేయడమే ఓ అద్భుతం. అలాగే శరీరాన్ని బ్యాలెన్స్ చేస్తూ స్కేటింగ్ చేయడమూ ఎంతో కష్టం. ఈ రెండింటినీ ఒకేసారి ప్రదర్శించి కర్ణాటకలోని మంగళూరుకు చెందిన సుశ్రావ్య ప్రస్తుతం బీఎస్సీ చదువుతున్న ఆమె.. 14 ఏళ్ల నుంచి స్కేటింగ్, శాస్త్రీయ నృత్యాలకు వేర్వేరుగా శిక్షణ పొందుతోంది. ఇటీవల జరిగిన కార్యక్రమంలో స్కేటింగ్ చేస్తూనే సంప్రదాయ నృత్యాన్నీ ప్రదర్శించింది. 4 గంటల పాటు ఆగకుండా ప్రదర్శన ఇవ్వడంతో 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటునూ దక్కించుకుంది. తొలుత 12 గంటల పాటు నృత్యం చేయాలని భావించినా, మధ్యలో అస్వస్థతకు గురికావడంతో ఆగిపోయానని.. త్వరలో ఆ రికార్డునూ సృష్టిస్తానని సుశ్రావ్య నమ్మకంగా చెప్పింది. – న్యూస్‌టుడే, మంగళూరు

రాష్ట్రంపై 'ఉపాధి' భారం
ఏటా రూ.4 వేల కోట్లు!

- శ్రామికులకు ఇప్పటివరకు 100 శాతం వేతనాలు చెల్లిస్తున్న కేంద్రం
- రాష్ట్రం ఇక 40 శాతం భరించాలి
- 'మెటీరియల్' పనుల్లోనూ రాష్ట్రవాటా 40 శాతం
- ఉపాధి హామీ చట్ట సవరణతో రాష్ట్ర ప్రభుత్వంపై భారీ వడ్డన

ఈనాడు, అమరావతి: గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర ప్రభుత్వానికి ఇక భారం కానుంది. శ్రామికులకు వేతనాల చెల్లింపులు, మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టే పనులపైనా రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 40శాతం నిధులు వెచ్చించాల్సి వస్తుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా రూ.4 వేల కోట్ల భారం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రామికుల ఉపాధికి కేంద్రం ఇక ఏటా ఒకసారే కేటాయించే నిధులకు లోబడే పని దినాలు కల్పించాలి. అంతకుమించి ఖర్చు పెరిగితే రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. ఉపాధి హామీ చట్టంలో పలు సవరణలు చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో సోమవారం ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఈ పథకం కింద అయ్యే ఖర్చులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా కింద 40 శాతం భరించాలి.

భారం ఇలా..

రాష్ట్రంలో శ్రామికులకు ఇప్పటివరకు ఉపాధి (లేబర్ బడ్జెట్) అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. కేంద్రమే ఏటా కనీస వేతనాలు ప్రకటించి ఆ మేరకు నిధులు కేటాయిస్తోంది. ఏడాదికి రెండుసార్లు లేబర్ బడ్జెట్ ఇస్తోంది. రాష్ట్రంలో ఏటా 25 కోట్ల పని దినాలు శ్రామికులకు కేంద్రం కేటాయిస్తోంది. ఆ మేరకు దాదాపు రూ.6 వేల కోట్ల వరకు నిధులను విడుదల చేస్తోంది. కేంద్ర ప్రభుత్వమే నేరుగా శ్రామికుల బ్యాంకు ఖాతాలకు వేతనాలను జమ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం శ్రామికులకు పని కల్పించడం వరకే పరిమితం. చట్ట సవరణ బిల్లు మేరకు లేబర్ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులు కేటాయిస్తుంది. 40శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద సమకూర్చాలి. అంటే రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా రూ.2,400 కోట్ల భారం పడనుంది.

◆ అదనపు పని దినాలు అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే అదనపు ఖర్చు భరించాలి.

◆ ఉపాధి పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టే పనులపైనా రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద ఇక 40శాతం నిధులు సమకూర్చాలి. ప్రస్తుతం 75శాతం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం కేటాయిస్తున్నాయి. రాష్ట్రంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద ఏటా రూ.4 వేల కోట్ల విలువగల పనులు చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర వాటా కింద ఇప్పటివరకు రూ.1,000 కోట్లు (25%) కేటాయిస్తున్నారు. రాష్ట్రం వాటా 40% అంటే ప్రభుత్వం ఇక రూ.1,600 కోట్లు వెచ్చించాలి.

ఉపాధికి 'హామీ' లేనట్లే...!

శ్రామికులకు ఉపాధి కల్పన ఇప్పటివరకు హామీగా ఉండేది. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉపాధి కల్పించేలా చట్టం చేశారు. శ్రామికులకు ఇదో హక్కుగా ఉండేది. చట్ట సవరణ ద్వారా ఉపాధి హామీ లేకుండా చేశారు. వ్యవసాయ పనుల యాంత్రీకరణతో పనులు కోల్పోయిన శ్రామికులకు ఉపాధి హామీ చట్టం ఇప్పటి వరకు వరంలా నిలిచింది. ఇక నుంచి ప్రభుత్వం కల్పించిన మేరకు ఉపాధి పొందాలి. హక్కుగా సాధించే అవకాశాన్ని శ్రామికులు కోల్పోతారు. 'కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్యక్రమంలో గుండెకాయ లాంటి హామీని తొలగించి శ్రామికులకు అన్యాయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా భారాన్ని భరించే స్థితిలో లేదు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.



పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

పెట్రో ధరలు ఏపీలో అత్యధికం

- రాజధాని అమరావతిలో లీటరు ధర రూ. 109.74
- కేరళలో రూ. 107.48, తెలంగాణలో రూ. 107.46
- కేంద్ర మంత్రి సురేష్ గోపి వెల్లడి

దిల్లీ: దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికమని కేంద్ర ప్రభుత్వం సోమవారం రాజ్యసభకు తెలియజేసింది. చిన్న రాష్ట్రాలు, అండమాన్ నికోబార్ దీవుల వంటి కేంద్ర పాలిత ప్రాంతాల కన్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎక్కువగా వ్యాట్ విధిస్తున్నందునే అక్కడ ఇంధన ధరలు అత్యధికంగా ఉన్నాయని వివరించింది. రాష్ట్ర రాజధాని అమరావతిలో ఒక లీటరు పెట్రోలు ధర రూ 109.74 కాగా అండమాన్ నికోబార్ దీవుల్లో ఆ ధర లీటరుకు రూ 82.46 అని కేంద్ర పెట్రోలియం సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల్లో పెట్రోలియం ధరల్లో అసమానతలపై అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ సమాచారం అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ప్రస్తుతం ప్రతి లీటరు పెట్రోలుపై రూ.29.06 వ్యాట్ రూపంలో విధిస్తోంది. అండమాన్ నికోబార్ దీవుల్లో అక్కడి ప్రభుత్వం విధిస్తున్న వ్యాట్ కేవలం 82 పైసలేనని మంత్రి తెలియజేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో డీజిల్ ధర రూ.21.56 వ్యాట్‌తో కలిపి లీటరుకు రూ 97.57 కాగా అండమాన్ నికోబార్ దీవుల్లో దాని ధర 77 పైసల వ్యాట్‌తో కలిపి లీటరుకు రూ.78.05, అని మంత్రి తెలిపారు. కేరళలో పెట్రోలు ధర లీటరుకు రూ 107.48 కాగా, తెలంగాణలో రూ 107.46 అని మంత్రి అన్నారు. మధ్యప్రదేశ్ వంటి భాజపా పాలిత రాష్ట్రాల్లో కూడా పెట్రోల్ ధరలు అధికంగానే ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో లీటరు పెట్రోలు ధర రూ. 106.52 అని మంత్రి స్పష్టం చేశారు. దిల్లీలో ప్రతి లీటరుపై రూ 15.40 వ్యాట్‌తో లీటరు పెట్రోలు 94.77కు విక్రయిస్తున్నారు.



వైద్యకళాశాలల నిర్మాణాన్ని ఓర్వలేకపోతున్న వైకాపా

- ఎంపీ కేశినేని శివనాథ్ ధ్వజం

ఈనాడు, దిల్లీ: వైద్య కళాశాలల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి.. అందులోని సీట్లు, వసతులను పేద ప్రజలు, విద్యార్థుల కోసం త్వరగా అందుబాటులోకి తేవడానికి ఏపీ ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ఎంచుకుంటే వైకాపా ఓర్వలేక దానికి అడ్డుపడుతోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ధ్వజమెత్తారు. వైకాపా పాలనలో రూ.500 కోట్లు పెట్టి రుషికొండపై ముఖ్యమంత్రి సొంత అవసరాల కోసం ప్యాలెస్ కట్టుకున్నవారు అదే డబ్బు పెట్టి కనీసం ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్ అనుబంధ పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.1,303 కోట్ల నిధులను అదనంగా కేటాయిస్తున్నారు. విద్యలో కీలకమైన వైద్యవిద్య విస్తరణకు కొత్త కాలేజీల నిర్మాణం చాలా అవసరం. నిధుల కొరత ఉన్నప్పుడు అభివృద్ధి ఆగకూడదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వినూత్న విధానాలను తెరపైకి తీసుకొస్తోంది. పీపీపీ విధానాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదించి నోటిఫై చేస్తే, నేషనల్ మెడికల్ కమిషన్ కూడా దాని ప్రకారం వైద్య కళాశాలల నిర్మాణానికి సిఫార్సు చేసింది. పార్లమెంటు స్థాయీ సంఘం కూడా ఆ విధానాన్ని బలపరిచింది. ఆ మేరకు ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో చేపడుతున్న వైద్యకళాశాలలను వైకాపా వ్యతిరేకిస్తోంది. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని చెప్పి అందులో చాలావాటికి కనీసం పునాదిరాయి కూడా వేయలేదు. వైకాపా హయాంలో ఈ కాలేజీల కోసం రూ.85 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా కనీసం రూ.వెయ్యి కోట్లయినా వెచ్చించలేకపోయారు. అదే వేగంతో వెళితే 17 మెడికల్ కాలేజీలు పూర్తికావడానికి పాతికేళ్లు పడుతుంది. పీపీపీ- ప్రైవేటీకరణ మధ్య తేడాను అర్థం చేసుకోలేక వైకాపా నేతలు దీన్ని అడ్డగోలుగా విమర్శిస్తున్నారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలపై ప్రభుత్వానికే పూర్తి నియంత్రణ ఉంటుంది. అందులో 50% సీట్లు ప్రభుత్వ కోటాలో ఉంటాయి. అన్ని రకాల రిజర్వేషన్లకూ రక్షణ ఉంటుంది. ఈ కళాశాలల్లో 70% పడకలు ఆయుష్మాన్ భారత్ రోగులకు రిజర్వ్ చేస్తారు. అయినా సరే వైకాపా నేతలు మేం పనిచేయం, చేసేవారిని చేయనీయం అన్నట్లు వ్యవహరిస్తున్నారు' అని విమర్శించారు.

విశాఖ, విజయవాడలకు మెట్రో రైలు ఇవ్వాలి

దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ ఒక్క రాష్ట్రానికి మెట్రో రైలు వ్యవస్థ లేదని, అందువల్ల విశాఖపట్నం, విజయవాడలకు వెంటనే మెట్రో రైలు ప్రాజెక్టులు కేటాయించాలని ఎంపీ శివనాథ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

వందే భారత్.. కోస్తా జిల్లాలకు మణిహారం

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



నరసాపురం రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి నరసాపురం వరకు పొడిగించిన వందే భారత్ రైలును సోమవారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం రైల్వేస్టేషన్‌లో కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు ఇంతవరకు చెన్నై నుంచి విజయవాడ వరకు నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ తీర ప్రాంత మత్స్య పరిశ్రమ అభివృద్ధిలో వందే భారత్ కోస్తా జిల్లాలకు మణిహారంగా నిలుస్తుందన్నారు. బెంగళూరు నుంచి విజయవాడకు వచ్చే వందే భారత్ రైలునూ నరసాపురం వరకు పొడిగించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందే భారత్ రైలు తాడేపల్లిగూడెంలో ఆగేలా కోరతానన్నారు. నరసాపురం నుంచి వారణాసికి రైలు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాక్య పాల్గొన్నారు.

భారత్-అమెరికా మధ్య సాంకేతిక సహకారం విస్తరిస్తోంది

- అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్

ఈనాడు, అమరావతి: భారత్-అమెరికా మధ్య ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో సహకారం విస్తరిస్తోందని అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ అన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ టెక్నాలజీ, సైబర్ భద్రత, డేటా వినియోగం వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారం మరింత బలపడుతోందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతిలోని మంగళగిరి వద్ద ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)ను ఆమె సోమవారం సందర్శించారు. స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలు, ఆర్టీఐహెచ్ బృందంతో సమావేశమయ్యారు. స్టార్టప్ వ్యవస్థాపకులతో ప్రత్యేక చర్చ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో ఆర్టీఐహెచ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వివిధ రంగాల్లో జరుగుతున్న పనులు, ప్రజోపయోగానికి సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో హబ్ పోషిస్తున్న పాత్రపై ఆర్టీఐహెచ్ నాయకత్వ బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లారా విలియమ్స్ మాట్లాడుతూ సాంకేతిక సమాజానికి ఉపయోగపడే విధంగా నైతిక విలువలు, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు.



రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, ఆర్టీఐహెచ్ సీఈవో ధాత్రిరెడ్డి తదితరులు

◆ స్టార్టప్‌లు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా ఆవిష్కరణల ఎకో సిస్టమ్‌ను ఆర్టీఐహెచ్ నిర్మిస్తోందని ఆ సంస్థ సీఈవో పి.ధాత్రిరెడ్డి అమెరికా కాన్సుల్ జనరల్ బృందానికి వివరించారు. ఇలాంటి అంతర్జాతీయ స్థాయి పరస్పర సమావేశాలు స్థానిక ఆవిష్కర్తలకు ప్రపంచస్థాయి దృక్పథాన్ని అందించడంలో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఆర్టీఐహెచ్ సహకారంతో పనిచేస్తున్న పలు స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలను ప్రదర్శించాయి.

అలిపిరి శిల్ప కళాశాల పరిధిలో భక్తుల వసతికి బేస్ క్యాంప్?

- ప్రణాళికలు సిద్ధంచేస్తున్న తితిదే

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుల వసతికి అలిపిరి వద్ద 40 ఎకరాల్లో బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేయాలని తితిదే భావిస్తోంది. తిరుమల విజన్-2047కు అనుగుణంగా తిరుమలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు, అదే సమయంలో భక్తులకు మెరుగైన మౌలిక, వసతి సౌకర్యాలు కల్పించేందుకు తితిదే ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజా అంశం తెరపైకి వచ్చింది. శ్రీవారి దర్శనార్థం పెద్ద ఎత్తున భక్తులు తిరుమలకు తరలివస్తున్నారు. దీంతో వారికి వసతి కల్పించడం తితిదేకు భారంగా మారుతోంది. దాదాపు 7,500 గదులు, యాత్రికుల వసతి సముదాయం-1, 2, 3, పద్మనాభ నిలయం, పీఏసీ-5 అందుబాటులో ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి దాదాపు 45వేల మందికి వసతి సౌకర్యాలు కల్పించవచ్చు. అయితే తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య మాత్రం లక్షల్లో ఉంటోంది. ఈ నేపథ్యంలోనే గత సంవత్సరం తిరుమల విజన్-2047కు అనుగుణంగా భక్తుల వసతికి అలిపిరి వద్ద 40 ఎకరాల్లో బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి వసతి భవనాలను నిర్మించి.. అక్కడి నుంచి భక్తుల కోసం ఆర్టీసీ బస్సులు, ఇతర రవాణా సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలిపిరి నుంచి చెర్లోపల్లి వరకు ఉన్న భూమిని మొదలుగా వినియోగించాలని భావించారు. అయితే అటవీశాఖ, ఇతర న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో ఎస్వీ శిల్ప కళాశాల నుంచి పాత అలిపిరి చెక్‌పోస్ట్ వరకు ఉన్న దాదాపు 35 ఎకరాల భూమిని భక్తుల బేస్‌క్యాంప్ వసతి భవనాల నిర్మాణానికి వినియోగించాలనే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో శిల్ప కళాశాలను మరో ప్రాంతానికి తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తితిదేకు సంబంధించిన భూమి కావడంతో ఎటువంటి న్యాయపరమైన చిక్కులు ఉండవు.



శిల్ప కళాశాల భవనం

మరోవైపు భక్తులు త్వరగా అలిపిరి కాలినడక మార్గానికి చేరుకోవచ్చు. రవాణా అనుకూలమైన పరిస్థితులు ఉంటాయని భావిస్తున్నారు. ఈ అంశంపై తితిదే బోర్డు సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం.

కల్యాణకట్టల్లో మెరుగైన సదుపాయాలు

తిరుమలలోని కల్యాణకట్టల్లో భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తితిదే ప్రణాళికలు సిద్ధం చేసింది. కొన్ని దశాబ్దాలుగా స్వామివారికి తలనీలాలు సమర్పించే కల్యాణకట్టల్లో ఆధునిక సౌకర్యాలు పెద్దగా ఏర్పాటుచేయలేదు. దీంతో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ మేరకు తిరుమలలోని కల్యాణకట్ట భవనాలకు మార్పులు చేసి ఆధునికంగా మార్చనున్నారు.

తితిదే ఆలయాల్లో కియోస్కులు, క్యూఆర్ కోడ్‌లు

దేశవ్యాప్తంగా తితిదే పరిధిలోని 60 ఆలయాల్లో భక్తులు సులభంగా యూపీఐ విధానంలో చెల్లింపులు చేసేందుకు వీలుగా కియోస్క్‌లు, క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేయాలని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశించారు. తిరుపతిలో సోమవారం సీనియర్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు.

సాగునీరు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి పర్యావరణ అనుమతులు తప్పనిసరి

పోలవరం-బనకచర్లపై కేంద్ర సహాయ మంత్రుల వివరణ

ఈనాడు, దిల్లీ: కేంద్ర పర్యావరణ ప్రభావ మదింపు నోటిఫికేషన్ ప్రకారం ఎక్కడ సాగునీరు, జల విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మించాలన్నా ముందుగా పర్యావరణ అనుమతులు తప్పనిసరి అని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్‌సింగ్, జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్‌చౌధరిలు తెలిపారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పర్యావరణ అనుమతులపై సోమవారం లోక్‌సభ, రాజ్యసభల్లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్‌లు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

మంత్రివర్గ ఉపసంఘం పరిశీలనలో..
ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ

- 4 వారాల సమయమివ్వండి
- హైకోర్టుకు నివేదించిన ఏజీ
- కోర్టుకు హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతుల కల్పించే విషయం మంత్రివర్గ ఉపసంఘం వద్ద తుది పరిశీలనలో ఉందని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ సోమవారం హైకోర్టుకు నివేదించారు. కార్యదర్శులతో కూడిన కమిటీ గతంలో ఇచ్చిన నివేదికలో పదోన్నతులు కల్పించేందుకు ఎన్ని సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించాలో సరైన లెక్కలు లేవని, దీన్ని తేల్చాల్సి ఉందన్నారు. ఇది రెండు గ్రూపుల మధ్య పరిష్కరించాల్సిన విషయమన్నారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేసేందుకు చివరి అవకాశంగా నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరారు. ఏజీ వాదనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందన్‌రావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం విచారణను వచ్చే ఏడాది జనవరి 20కి వాయిదా వేసింది. తదుపరి విచారణకు హాజరు నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) విజయానంద్, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌లకు మినహాయింపునిచ్చింది. పదోన్నతుల్లో రిజర్వేషన్ కారణంగా తమకు అన్యాయం జరుగుతోందని పలువురు ఉద్యోగులు ఉమ్మడి హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. 2018 డిసెంబర్ 11న విచారణ జరిపిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని 'సెక్రటేరియట్ బీసీ, ఓసీ ఎంప్లాయీస్ అసోసియేషన్, పలువురు ఉద్యోగులు' 2019, 2020, 2022లలో కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్‌లో ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడంపై వివరణ ఇచ్చేందుకు కోర్టు ధిక్కరణ కేసులో సీఎస్ విజయానంద్, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో వారిద్దరు సోమవారం కోర్టుకు హాజరయ్యారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ, 'రాష్ట్రంలోని 33 శాఖల్లోని ఉద్యోగుల పదోన్నతులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఏజీ కోరినట్లు నాలుగు వారాల సమయమివ్వడానికి అభ్యంతరం లేదు. తీర్పును అమలు చేయకుండా కమిటీలు వేయడంపైనే మా అభ్యంతరం'ని పేర్కొన్నారు. కేవలం సెక్రటేరియట్ ఉద్యోగులకు పదోన్నతుల్లోనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం నిజమే

- ఓఎంఆర్ షీట్లపై మార్కులు నమోదు చేశారు
- గ్రూప్-1పై హైకోర్టుకు నివేదించిన జస్టిస్ శంకర్ కమిటీ
- అప్పీళ్ల పునర్విచారణకు ధర్మాసనం నిర్ణయం
- విచారణ ఈ నెల 29కి వాయిదా

ఈనాడు, అమరావతి: ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాలను మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో మూల్యాంకనం చేసినట్లు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ నేతృత్వంలోని స్వతంత్ర కమిటీ తేల్చింది. ఓఎంఆర్ షీట్లపై మార్కులు నమోదు చేశారని పేర్కొంది. ఈ మేరకు నివేదికను హైకోర్టుకు సమర్పించింది. ఈ నివేదిక ప్రతులను ఇరుపక్షాల న్యాయవాదులు రిజిస్ట్రీ నుంచి పొందేందుకు వెసులుబాటు ఇచ్చింది. మరోవైపు మూల్యాంకనంలో అక్రమాలపై దాఖలైన అప్పీళ్లపై పునర్విచారణ చేపట్టాలని ధర్మాసనం నిర్ణయించింది. గతంలో వాదనలు ముగించి, తీర్పును రిజర్వు చేసిన ధర్మాసనం.. విచారణను తిరిగి ప్రారంభించాలంటూ ఉద్యోగాలు పొందిన కొందరు అభ్యర్థులు వేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. ఈ కేసుకు సంబంధించి కోర్టు వద్ద ఉన్న రికార్డుల ధ్రువపత్రాలు పొందేందుకు న్యాయవాదులకు వీలు కల్పించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.



◆ 2018 నాటి నోటిఫికేషన్ ఆధారంగా నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న కారణంగా పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందినవారు, పొందనివారు ధర్మాసనం ముందు వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం.. నివేదిక ఇచ్చేందుకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ ఛైర్మన్‌గా, బార్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ గంటా రామారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ సభ్యులుగా స్వతంత్ర కమిటీని నియమించింది.

ఎస్‌బీఐ యోనో 2.0 ఆవిష్కరణ

- మార్చి కల్లా 10,000 మంది సిబ్బంది నియామకం

దిల్లీ: ప్రభుత్వరంగ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), తమ మొబైల్ యాప్ యోనో కొత్త వెర్షన్ 'యోనో 2.0'ను సోమవారం ఆవిష్కరించింది. యోనో 2.0 ను మొబైల్, ట్యాబ్లెట్, డెస్క్‌టాప్ కంప్యూటర్లలోనూ వినియోగించుకోవచ్చని, ఇతర బ్యాంకుల ఖాతాదార్లూ వాడుకునేలా తీర్చిదిద్దినట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. తమ ఖాతాదారులు డిజిటల్ ఛానళ్లను వినియోగించుకునేలా సాయపడేందుకు 3,500 మంది ఎగ్జిక్యూటివ్‌లను బ్యాంకు శాఖల్లో నియమించామని, ఈ సంఖ్యను 2026 మార్చి చివరికల్లా 10,000కు చేరుస్తామని చెప్పారు. రోజూ 70,000 కొత్త ఖాతాలు జతవుతుండగా, ఇందులో 90% మందిని యోనో యాప్ ద్వారా జతచేర్చుకోవాలనేది తమ ప్రణాళికగా వెల్లడించారు.

మిరప 'ధర'హాసం

డబ్బి బ్యాడిగ రకం క్వింటాలు రూ.71 వేలు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే-ఉరవకొండ: గతేడాది అమాంతం పడిపోయిన మిర్చి ధరలు ప్రస్తుతం పైపైకి ఎగబాకుతున్నాయి. కర్ణాటకలోని బ్యాడిగ అంతర్జాతీయ మార్కెట్‌లో డబ్బి బ్యాడిగ రకం మిర్చి క్వింటాలు గరిష్ఠంగా రూ.71,199 అమ్ముడుపోయింది. బ్యాడిగ కడ్డీ రకం రూ.54 వేలు పలికింది. బ్యాడిగ రకాల్లో నాణ్యతను బట్టి సగటున రూ.55 వేల నుంచి రూ.65 వేలకు వరకు ధర పలుకుతుండటంతో రైతులు లాభాలు చూస్తున్నారు. విత్తన రకాలైన తేజ, 5531, 2043, 273 ధరలు గతేడాది క్వింటాలు రూ.11 వేల లోపు ఉండగా ఈసారి రూ.16 వేల నుంచి రూ.22 వేల వరకు పలుకుతున్నాయి. నాణ్యతను బట్టి ఒక్కో రకం రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు పెరిగింది. జూన్‌లో పంట సాగు చేసిన రైతులకు ఈ నెల తొలి వారంలో మొదటి కోత చేతికొచ్చింది. మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో రైతులు తీసుకొచ్చిన పంటను వ్యాపారులు వెంటనే కొనుగోలు చేస్తున్నారు. రెండేళ్లుగా మిర్చి ధరలు నేలచూపులు చూడటంతో రైతులు నష్టపోయారు. దీంతో ఈ ఏడాది చాలామంది సాగు చేయలేదు. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దిగుబడి తగ్గింది. కర్ణాటకలోనూ ఆశించిన స్థాయిలో సాగవ్వలేదు. ఫలితంగా మిరపకు ఈ ఏడాది అనూహ్యంగా డిమాండ్ ఏర్పడిందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.



కర్ణాటకలోని బ్యాడిగ మార్కెట్‌కు వచ్చిన మిరప

పరిధి పెంచి.. గడువు కుదించి

- డిస్కంల టెండర్ ప్రకటనల మార్పు వెనుక మర్మమేంటో?
- ఫీడర్ల విభజన పనులకు రూ.1039.77 కోట్లతో అంచనాలు

ఈనాడు, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థల పునర్ వ్యవస్థీకరణ పథకం (ఆర్‌డీఎస్ఎస్) మొదటి దశలో మిగిలిపోయిన ఫీడర్ల విభజన పనులు రూ.1039.77 కోట్లతో చేపట్టేందుకు ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్ హడావిడిగా టెండర్లు పిలిచి, బిడ్‌ల దాఖలుకు తక్కువ సమయం ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తవుతున్నాయి. ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.764.62 కోట్లతో పనులకు తొలుత ఏడు ప్యాకేజీలకు పిలిచిన టెండర్లను వెబ్‌సైట్‌లో ఉంచి, మరునాడు వాటిని నాలుగుకు కుదించింది. ఇక, సీపీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రూ.275.15 కోట్లతో ప్రతిపాదించిన పనులకు బిడ్‌లు వేసేందుకు కేవలం ఐదు రోజులే గడువు ఇచ్చారు. బడా సంస్థలకు టెండర్లు కట్టబెట్టేలా, చిన్న గుత్తేదారులకు అవకాశం లేకుండా చేసేందుకే డిస్కంలు ఇలా తక్కువ గడువు విధించాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

టెండర్లతో సరిపెట్టిన వైకాపా ప్రభుత్వం

వ్యవసాయానికి పగటి వేళల్లో 9 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు వీలుగా ఆర్‌డీఎస్ఎస్ కింద ఫీడర్లను విభజించాలని గతంలో డిస్కంలు ప్రతిపాదించాయి. మొదటి దశలో 4,845 మిక్స్‌డ్ ఫీడర్లతో పాటు ఓవర్ లోడ్ సమస్యలున్న 11/33 కేవీ సామర్థ్యం గల మరో 938 ఫీడర్లను విభజించాలని నిర్ణయించాయి. వైకాపా ప్రభుత్వ హయాంలోనే టెండర్లు పూర్తిచేసి, 2023లో గుత్తేదారులకు పనులు అప్పగించారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో 20శాతం పనులు కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిపై దృష్టి సారించడంతో ప్రస్తుతం 40శాతం పురోగతి ఉంది.

మిగిలిన పనులకు.. ఇప్పుడు అనుమతి

ఎస్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాల్లో 465 ఫీడర్ల విభజనకు ఆర్‌డీఎస్ఎస్ కింద రూ.764.62 కోట్లతో అంచనాలు రూపొందించారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఏడు ప్యాకేజీల కింద టెండర్లు పిలుస్తూ ఈ నెల 6న డిస్కం ప్రకటన జారీ చేసింది. ఆ మేరకు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. తర్వాత ఆ ప్రకటనను తొలగించి.. నాలుగు ప్యాకేజీలుగా కుదించిన నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో ఉంచింది. దీని వల్ల ఒక్కో ప్యాకేజీ విలువ భారీగా పెరిగింది. డిస్కం అధికారులు ఇలా వ్యవహరించడానికి కారణమేంటి? టెండరు విలువ పెంచడం ద్వారా చిన్న గుత్తేదారులకు అవకాశం లేకుండా చేసి, బడా సంస్థలు మాత్రమే పోటీలో ఉండేలా చేయడమేనా? అని గుత్తేదారులు ప్రశ్నిస్తున్నారు. బిడ్‌ల దాఖలుకు ఈ నెల 20 తుది గడువుగా నిర్దేశించింది. బ్యాంకు గ్యారంటీలు, ఇతర సాంకేతిక సమస్యలు, తప్పులు సవరించుకునేందుకు ఈ సమయం సరిపోదని వారు వాపోతున్నారు.

ఎస్పీడీసీఎల్ తొలుత పిలిచిన టెండరు ప్రకారం పనుల వివరాలు

జిల్లా	ఫీడర్ల సంఖ్య	టెండరు విలువ (రూ.కోట్లలో)
అనంతపురం	119	191.67
శ్రీసత్యసాయి	103	168.36
నంద్యాల	69	99.08
కడప	31	87.79
కర్నూలు	45	65.45
నెల్లూరు	37	58.23
చిత్తూరు	28	37.19
తిరుపతి	20	29.82
అన్నమయ్య	13	28.03

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు వేధింపులు!

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తమపై వేధింపులకు పాల్పడుతున్నారని ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థినులు కులపతి, రిజిస్ట్రార్, డైరెక్టర్లకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులు విచారణ కమిటీ నియమించాలని ఆదేశించినట్లు సమాచారం. బాధిత విద్యార్థినులు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. "కొందరు అధ్యాపకులు విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. పరీక్షల నిర్వహణ విభాగంలోని బోధనేతర సిబ్బంది సైతం ఉత్తీర్ణుల య్యేలా చేస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఉపకార వేతన విభాగంలో ఇద్దరు.. విద్యార్థినుల వేలి ముద్రలు తీసుకునే సమయంలో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వారిని మార్చడం లేదు. బోధన సిబ్బందిలో చాలామంది పాఠ్యాంశాలు చెప్పకుండా.. వాటిని యూట్యూబ్, చాట్ జీపీటీల్లో చూసుకోవాలని సూచిస్తున్నారు. శిక్షణ, ఉపాధి కల్పన విభాగం అధికారులు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు సరిగా నిర్వహించడం లేదు" అని వాపోయారు. దీనిపై ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ సండ్ర అమరేంద్రకుమార్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నెలకొన్న పరిస్థితులపై విద్యార్థినులు ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడం వాస్తవమన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు ఓ కమిటీని నియమిస్తామని చెప్పారు. తప్పు జరిగిందని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటిమంది సంతకాలు

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై కోర్టుకు వెళ్తాం
- మాజీ ముఖ్యమంత్రి జగన్



ఈనాడు, అమరావతి: ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను అమ్మేయాలన్న చంద్రబాబు ప్రయత్నాన్ని, ఆయన నిర్ణయాలను ఆపాలంటూ కోటిమంది ప్రజలు సంతకాలు చేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. 'ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా ప్రారంభించిన కోటి సంతకాల సేకరణ విజయవంతమైంది. ఇది కేవలం వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమం మాత్రమే కాదు, చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఇచ్చిన తీర్పు' అని సోమవారం 'ఎక్స్'లో చేసిన పోస్టులో జగన్ పేర్కొన్నారు. 'ప్రైవేటీకరణ నిర్ణయాన్ని చంద్రబాబు వెంటనే వెనక్కి తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. ఈ సంతకాల పత్రాలను ఈ నెల 18న గవర్నర్‌కు సమర్పిస్తామని వెల్లడించారు. తర్వాత న్యాయస్థానాల తలుపులనూ తట్టనున్నామని ప్రకటించారు.

స్పష్టమైన వ్యూహంతోనే ఆరోగ్య రంగంలో ఏఐ

- లేదంటే దాని ప్రయోజనాలు కోల్పోతాం
- దక్షిణ భారత ప్రాంతీయ కార్యశాలలో నిపుణుల వెల్లడి
- ఫిబ్రవరిలో ముసాయిదా రూపొందించనున్న కేంద్రం



సదస్సులో పాల్గొన్న డబ్ల్యూహెచ్ఓ ఆగ్నేయాసియా సలహాదారు కార్తీక్ అడపా, డాక్టర్ మోనా దుగ్గల్, అనురాగ్ అగర్వాల్, సౌరభ్ గౌర్, సెంథిల్‌కుమార్, కిరణ్‌గోపాల్, వీరపాండియన్

ఈనాడు, అమరావతి: 'భవిష్యత్తులో ఆరోగ్య రంగంపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం చూపుతుంది. ఈ సాంకేతికతను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన వ్యూహం లేకపోతే దానివల్ల లభించే ప్రయోజనాలు కోల్పోయే ప్రమాదం ఉంది' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆగ్నేయాసియా ప్రాంతీయ సలహాదారు డాక్టర్ కార్తీక్ అడపా అన్నారు. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై విజయవాడలో నిర్వహించిన దక్షిణ భారతదేశ బహుళ భాగస్వామ్య సమన్వయ ప్రాంతీయ కార్యశాలలో ఆయన ప్రసంగించారు. భారత ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ఏఐ వ్యూహాన్ని రూపొందిస్తోందని.. అందుకు సరైన ఆలోచనల కోసం రీజియన్ల వారీగా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. నేషనల్ హెల్త్ అథారిటీ అదనపు సీఈవో, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) ఎండీ కిరణ్ గోపాల్ మాట్లాడుతూ రోగ నిర్ధారణ, క్లినికల్ నిర్ణయాలు, చికిత్స ఆరోగ్య సంరక్షణ సామర్థ్యం పెంచితే ఫలితాలు అందుతాయన్నారు. భారత వైద్య పరిశోధన మండలి- డిజిటల్ హెల్త్ అండ్ డేటా సైన్స్ పరిశోధన జాతీయ సంస్థ (ఐసీఎంఆర్- ఎన్ఐఆర్‌డీహెచ్‌డీఎస్) ప్రతినిధి డాక్టర్ మోనా దుగ్గల్ మాట్లాడుతూ దేశంలో ఎదురవుతున్న సవాళ్లను సరైన వ్యూహాలు, పాలసీలు, టెక్నాలజీ వినియోగం ద్వారా అధిగమించవచ్చన్నారు. ఆరోగ్య రంగంలో డిజిటల్ కమ్యూనికేషన్ సేవలు చివరి వ్యక్తి వరకు చేరేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సి ఉందని చెప్పారు. వైద్యారోగ్య శాఖ రాష్ట్ర కార్యదర్శి సౌరభ్ గౌర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఏఐ ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేస్తుందన్నారు. ఈ డ్రాఫ్ట్ ఆధారంగా రాష్ట్రాల స్థాయిలో విడిగా ఆరోగ్య రంగంలో ఏఐ అమలు వ్యూహాన్ని ఖరారు చేస్తామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై జాతీయ స్థాయిలో పాలసీ రూపొందించడానికి దేశంలో తొలిసారిగా ఏపీలో కార్యశాల ఏర్పాటు చేశామని తెలిపారు. వైద్యారోగ్యశాఖ అదనపు చీఫ్ సెక్రటరీ సెంథిల్‌కుమార్, అశోకా యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ అనురాగ్ అగర్వాల్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరీష, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేష్‌కుమార్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదు బృందాలుగా చర్చలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, కేరళ, అండమాన్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి నుంచి వైద్యారోగ్య, ఐటీ కార్యదర్శులు, జాతీయ ఆరోగ్య మిషన్ ప్రతినిధులు వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు. గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, వంశధార బృందాలుగా విడిపోయి.. సమాచారం- డిజిటల్ మౌలిక సదుపాయాలు, పరిపాలన- నైతికత- విధానాలు, సిబ్బంది- సామర్థ్యం, ఆరోగ్య వ్యవస్థల సమగ్రత- ప్రభావం అంశాలపై చర్చించారు. ఈ సమాచారం అంతా క్రోడీకరించి, సమగ్ర నివేదిక రూపొందించారు. దీన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు.

50 బస్తాలు పండుతున్నాయని మురిసిపోవద్దు

- ఎరువుల వినియోగంతో భూమి నిష్ఫలం
- సౌభాగ్య విధానంలో పంటల సాగుతో మేలు
- చినజీయర్‌స్వామి సూచనలు



పంటలను పరిశీలిస్తున్న చినజీయర్‌స్వామి. చిత్రంలో విజయరామ్

గూడూరు, న్యూస్‌టుడే: "ప్రకృతి వైపు పయనించి అందరం ఆరోగ్యంగా ఉందామా? లేక ఇలాగే ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేద్దామా" అని త్రిదండి చిన జీయర్‌స్వామి ప్రశ్నించారు. సౌభాగ్య విధానంలో పంటల సాగుపై కృష్ణా జిల్లా గూడూరు మండలం పినగూడూరులంక గోసదన్‌లో సేవ్ సంస్థ నిర్వాహకుడు మేకపోతుల విజయరామ్ ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. భూమి ఆరోగ్యంగా ఉంటేనే అందరం ఆరోగ్యంగా ఉంటామన్న విషయాన్ని గుర్తించాలన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందులు చల్లి 50 బస్తాలు పండుతున్నాయని సంతోషించడం తగదన్నారు. ఇలాగే వ్యవసాయం చేస్తే కొన్నాళ్లకు భూమి సాగుకు పనికి రాకుండా పోతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు పాదయాత్ర

ప్రకృతి సమతుల్యత లోపించి అత్యధిక ఉష్ణోగ్రతలు, వర్షాలు, చలి నమోదవడం అందరం చూస్తున్నాం. ఈ పరిస్థితి మారాలంటే అందరూ ప్రకృతి వైపు పయనించాలని చినజీయర్‌స్వామి కోరారు. యంత్రాలతో వరిని కోయడం ద్వారా పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతోందని, టన్నుల బరువు ఉండే యంత్రం పొలంలో తిరిగితే భూమి కూడా పాడైపోతుందన్నారు. విజయరామ్ వరికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన సౌభాగ్య విధానం.. ఎకరాకు ఏడాదికి రూ.4.50 లక్షల వరకు ఆదాయం తెస్తుందని తెలిపారని, పంటలను తాను పరిశీలించగా ఆశ్చర్యం వేసిందన్నారు. ఇది అందరూ అవలంబించదగ్గ విధానమని చెప్పారు. ఈ తరహాలో సాగుచేస్తున్న రైతులను సమీకరించి ప్రజలను చైతన్యం చేసేందుకు విజయరామ్ నేతృత్వంలో రాష్ట్రంలో పాదయాత్ర చేస్తామని ప్రకటించారు. తాను సాగు చేసిన విధానం గురించి ఈ సందర్భంగా రైతులకు విజయరామ్ వివరించారు.

చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో.. రాజ్యసభలో వైకాపా సభ్యుడు, తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అప్పటి పీఏ చిన్న అప్పన్నకు హైకోర్టు షాకిచ్చింది. బెయిలు కోసం అప్పన్న వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, ప్రస్తుతం బెయిలివ్వలేమని స్పష్టంచేశారు. ఇటీవల జరిగిన విచారణలో సిట్ తరఫున సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్‌పీ సురేశ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ 'కల్తీ నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా తదితర డెయిరీల నుంచి చిన్న అప్పన్న కిలోకు రూ.25 చొప్పున కమీషన్ డిమాండ్ చేశారు. ఆ మేరకు కమీషన్ ఇచ్చినట్లు నెయ్యి సరఫరా చేసిన కంపెనీ యజమానులు కూడా వాంగ్మూలాలిచ్చారు. ఎవరి ప్రోద్బలంతో ఆ సొమ్ము వసూలు చేశారో దర్యాప్తులో తేలాల్సి ఉంది. హవాలా మార్గంలో చిన్న అప్పన్నకు సొమ్ము చేరింది. రూ.కోట్ల కొద్దీ బ్యాంక్ లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. విశాఖపట్నంలో అప్పన్నకు 14 ప్లాట్లు ఉన్నట్లు గుర్తించాం. దర్యాప్తునకు అప్పన్న సహకరించడం లేదు. ఈ దశలో అతనికి బెయిలివ్వొద్దు. పిటిషన్‌ను కొట్టేయండి' అని కోరారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. బెయిలు పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు.

సంతృప్తస్థాయి తగ్గిందా.. సీసీఎల్ఏకు రావాల్సిందే

సర్వేశాఖలో గ్రామ, మండల సర్వేయర్లకు కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: సర్వేశాఖలో సంతృప్తస్థాయి తగ్గిందా? సంబంధిత సర్వేయర్ సీసీఎల్ఏ కార్యాలయానికి రావాల్సిందే. అధికారులకు వివరణ ఇచ్చుకోవాల్సిందే. సర్వే సిబ్బందిలో జవాబుదారీతనం పెంచేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యల్లో భాగమిది. ప్రభుత్వం ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ సహా వివిధ మార్గాల్లో ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. ఎఫ్ లైన్ సర్వేలో భాగంగా పొలం కొలతలకు ముందే నోటీసులు ఇవ్వడం, ఫీల్డ్ సర్వే, అదనపు మొత్తం అడగడం, సర్వే సర్టిఫికెట్ జారీ తదితర వివరాలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా అదనపు మొత్తం అడుగుతున్నారని, కొలతలకు ముందు నోటీసులు ఇవ్వడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. జూన్, జులై నెలల్లో సంతృప్తస్థాయి తగ్గిపోయింది. దీంతో సంబంధిత సచివాలయాలు, మండలాలపరిధిలోని సిబ్బందిని మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయానికి పిలిపించి మాట్లాడుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 437మంది గ్రామ సర్వేయర్లు, 32 మంది మండల సర్వేయర్లను పిలిపించి.. కౌన్సెలింగ్ ఇచ్చినట్లు అధికారులు వివరించారు.

ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ పరిసమాప్తం

విజయవాడ (ఇంద్రకీలాద్రి), న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ పూర్ణాహుతి కార్యక్రమంతో సోమవారం పరిసమాప్తమైంది. అయిదు రోజుల పాటు యాగశాలలో కలశ ప్రతిష్ఠ చేసి చండీహోమం నిర్వహించారు. చివరి రోజున పూర్ణాహుతి అనంతరం కలశ ఉద్వాసన చేశారు. పూజా ద్రవ్యాలు ఉంచిన పట్టు చీరను హోమ గుండంలో అగ్ని దేవునికి సమర్పించడంతో పూర్ణాహుతి క్రతువు ముగిసింది. ఈ సందర్భంగా దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ మాట్లాడుతూ.. "ఈ నెల 11 నుంచి 15 వరకు రాష్ట్రం నలుమూలల నుంచి వేల మంది భవానీ దీక్షాధారులు జగన్మాత స్మరణతో గిరిప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకుని ఇరుముడి సమర్పించారు. 5.15 లక్షల మంది భవానీ దీక్షాధారులు, వారి కుటుంబ సభ్యులు దుర్గమ్మను దర్శించుకున్నారు. 21.20 లక్షల లడ్డూ ప్రసాదాలను భక్తులకు దేవస్థానం విక్రయించింది" అని చెప్పారు.

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా రఘునాథరెడ్డి



రఘునాథరెడ్డి, సాయి శ్రీనివాస్

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. కడప జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ హాలులో 79వ రాష్ట్ర కౌన్సిల్ ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించగా, ఇందులో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ ఎన్నికల అధికారిగా డాక్టర్ ప్రతాప్‌రాజు, పరిశీలకులుగా ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి వ్యవహరించారు. నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లు రఘునాథరెడ్డి (కడప), ప్రధాన కార్యదర్శిగా ఎల్.సాయి శ్రీనివాస్ (పశ్చిమ గోదావరి), ఆర్థిక కార్యదర్శిగా కె.కోటేశ్వరరావు (పల్నాడు), ఉపాధ్యాయవాణి ప్రధాన సంపాదకులుగా కె.వి.శేఖర్ (అంబేడ్కర్ కోనసీమ)ను ఎన్నుకున్నారు. సంయుక్త అధ్యక్షులు, అదనపు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, ఆర్థిక కమిటీ సభ్యులుగా ఆయా జిల్లాలకు చెందిన పలువురు ఎన్నికయ్యారు.

మూత్రపిండాలు బలహీనపడితే..



రోజూ తెల్లవారుజాము మూడు నుంచి ఐదు గంటల మధ్యలో మన మూత్రపిండాలు శుభ్రపడుతుంటాయి. ఈ ప్రక్రియకు అంతరాయం కలిగినా, కిడ్నీలు బలహీనపడినా కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడతాయి. వీటినుంచి బయటపడేందుకు పుచ్చకాయ జ్యూస్‌ను రోజూ తాగాలి. అలాగే ద్రాక్ష, బెర్రీలను తింటుంటే మూడు వారాల్లోనే ఫలితం కనిపిస్తుంది.

– బాబీ ప్రైలర్, ప్రకృతి వైద్యుడు

EENADU Vol: 52, Issue: 126 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao



రోజురోజుకీ పెరుగుతున్న వాహనాల పొగానో, పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యమో.. కారణమేదైనా నానాటికీ గాలి కలుషితమవుతోంది. ఇదుగలదందు లేదని సర్వత్రా విజృంభించేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రజారోగ్యానికే సవాల్ విసురుతోంది. మొత్తం 256 పట్టణాల్లో 150 పట్టణాల్లోని గాలిలో నుసి పదార్థం (పీఎం 2.5) జాతీయ పరిమితికి మించిపోవటం ఆందోళనకరం. చాలా పట్టణాల్లో హానికారక గాలిని పీల్చటం తప్ప గత్యంతరం లేని పరిస్థితి నెలకొంది. ఇది చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ ఇబ్బంది పెడుతోంది. పసి పిల్లలు, చిన్నారులనైతే మరింత గట్టిగానూ 'కాటు' వేస్తోంది.

పసి ఊపిరికి గాలి కాటు!

అశుభం శుభం తెలియని పసికందులు. ఏ పాపమూ తెలియని అమాయకులు. అయినా వాయు కాలుష్య కోరలకు బలవుతున్నారు. పుట్టిన తర్వాత కాదు, తల్లికడుపులో ఉన్నప్పటి నుంచే! అవును.. వాయు కాలుష్య దుష్ప్రభావం పుట్టకముందు.. తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే పడుతుండటం గమనార్హం. కలుషిత గాలిలోని నుసి పదార్థం, నైట్రిక్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, ఓజోన్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి విషతుల్యాలు, హాని కారకాలెన్నో తల్లి మాయ ద్వారా గర్భస్థ శిశువుకూ చేరతాయి. ఆక్సిజన్, పోషకాల కోసం పూర్తిగా తల్లి రక్తం మీదే ఆధారపడిన కడుపులోని బిడ్డకివి తీవ్ర అనర్థాలు తెచ్చిపెడతాయి. నెలలు నిండక ముందే కాన్పు అవటంలో సుమారు 30% వరకూ వాయు కాలుష్యం దోహదం చేస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. బిడ్డ చనిపోయి పుట్టే ప్రమాదమూ ఉంటోంది.



డా॥ గూడూరు విజయ్‌కుమార్
మెడికల్ సూపరింటెండెంట్
నిలోఫర్ హాస్పిటల్, హైదరాబాద్

● గాలి కాలుష్య కారకాలు తల్లి, బిడ్డ ఇద్దరిలో వాపుప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)ను ప్రేరేపిస్తాయి. తల్లి దీనికి ప్రతిస్పందించే క్రమంలో మాయకూ విఘాతం కలుగుతుంది. విశృంఖల కణాలు (ఫ్రీ రాడికల్స్), వీటిని అరికట్టే యాంటీఆక్సిడెంట్ల మధ్య సమతుల్యతా లోపిస్తుంది. బిడ్డకు ఆక్సిజన్‌తో కూడిన రక్తం అందటం తగ్గటం వల్ల ఊపిరితిత్తులు, మెదడు వంటి కీలక అవయవాల ఎదుగుదల కుంటుపడుతుంది. దీంతో పుట్టుకతోనే శ్వాస సమస్యలు తలెత్తే ముప్పూ పెరుగుతుంది. పిల్లలు తక్కువ బరువుతోనూ పుట్టొచ్చు. ఇలాంటివారు ఎక్కువరోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుంది. తక్కువ బరువుతో పుట్టేవారికి ముస్ముందు అలర్జీలు, ఆస్థమా వంటి వాటితో పాటు వయసుకు తగిన ఎదుగుదల ప్రక్రియ కూడా కుంటుపడుతుంది. కొందరికి ప్రవర్తనా పరమైన సమస్యలూ తలెత్తొచ్చు. విషయ గ్రహణ సామర్థ్యమూ దెబ్బతినొచ్చు.

పిల్లలకే ఎక్కువ ప్రమాదం

పిల్లల ఊపిరితిత్తులు చిన్నగా, ఇంకా వృద్ధి చెందుతూ ఉంటాయి. పైగా పెద్దవారి కన్నా దాదాపు రెట్టింపు వేగంతో శ్వాస తీసుకుంటుంటారు. నవజాత శిశువులైతే నిమిషానికి 55 నుంచి 60 సార్లు శ్వాస తీసుకుంటారు. అందువల్ల కలుషిత గాలి పిల్లల ఊపిరితిత్తుల మీద మరింత ఎక్కువ దుష్ప్రభావం చూపుతుంది. పిల్లల శ్వాసనాళాల లోపలి మార్గం సన్నగానూ ఉంటుంది. దీంతో కాలుష్య కారకాలు వీటిని ఇంకా ఎక్కువగా చికాకు పరుస్తాయి కూడా.

శ్వాసకోశ సమస్యల ఉద్ధృతి

ఐదేళ్ల లోపు పిల్లల మరణాలకు ఒకప్పుడు వాంతులు, విరేచనాలు ప్రధాన కారణాలు. స్వచ్ఛమైన తాగునీరు, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులోకి రావటంతో ఇవి తగ్గాయి. కానీ వాయు కాలుష్యం పుణ్యమాని ఇప్పుడు శ్వాసకోశ సమస్యలు పిల్లల మరణాలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. శ్వాసనాళాలు సన్నగా ఉండటం, ఊపిరితిత్తుల సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల శిశువులు, పిల్లల్లో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల లక్షణాలు తీవ్రంగా ఉంటాయి కూడా. ఐదేళ్ల లోపు పిల్లల్లో సాధారణ జలుబు, న్యుమోనియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల అనంతరం తలెత్తే పిల్లికూతలు, ఆస్థమా వంటివి తరచూ కనిపిస్తుంటాయి. గాలిలో కాలుష్య కారకాలు పెరిగినప్పుడు ఇవి ఇంకాస్త తీవ్రమవుతుండటమూ గమనిస్తున్నాం. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల మూలంగా పిల్లలు నిద్రపోకపోవటం, బడికి సరిగా వెళ్లకపోవటం, తరచూ ఆసుపత్రికి వెళ్లాల్సి రావటం వంటి ఇబ్బందులకూ గురవుతుంటారు. వాయు కాలుష్యం పెరిగినప్పుడల్లా అత్యవసరంగా చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే పిల్లల సంఖ్యా పెరుగుతుండటం గమనార్హం. చిన్నప్పుడు తరచూ శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల బారినపడుతుంటే ముస్ముందు ఆస్థమా వంటి జబ్బుల ముప్పూ పెరిగే ప్రమాదముంది.

న్యుమోనియా తీవ్రంగా

పిల్లల్లో శ్వాసకోశ సమస్యల్లో ఎక్కువగా చూసేది న్యుమోనియానే. ఎందుకంటే అప్పుడప్పుడే రోగనిరోధక వ్యవస్థ పరిపక్వం చెందుతున్న వీరికి బ్యాక్టీరియా, వైరస్‌లు దాడి చేసే అవకాశం ఎక్కువ. తల్లిపాలు తాగనివారు, టీకాలు తీసుకోనివారు, తక్కువ బరువుతో పుట్టినవారిలో ఇది మరింత తీవ్రంగానూ ఉంటుంది. ఇప్పుడు వాయు కాలుష్యమూ దీనికి ఆజ్యం పోస్తోంది. న్యుమోనియాలో తీవ్రమైన జ్వరం, డొక్కలు ఎగరేయటం, మూల్గటం, శ్వాస వేగంగా తీసుకోవటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. సమస్య తీవ్రతను బట్టి చికిత్స అవసరం. రక్తంలో ఆక్సిజన్ శాతం 92 కన్నా తగ్గితే తీవ్ర సమస్యగా పరిగణించాల్సిందే. నిర్లక్ష్యం అసలే వద్దు. చికిత్స ఆలస్యమైతే బిడ్డ ప్రాణాలకే ప్రమాదం ముంచుకురావొచ్చు.

బ్రాంకియోలైటిస్ న్యుమోనియా కాదు

కొన్నిసార్లు బ్రాంకియోలైటిస్‌ను న్యుమోనియాగానూ పొరపడుతుంటారు. ఇవి రెండూ వేర్వేరు సమస్యలు. బ్రాంకియోలైటిస్ అనేది ఊపిరితిత్తుల్లో ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్‌ను మార్పిడి చేసే గాలిగదులకు, సూక్ష్మ శ్వాసనాళాలకు మధ్య భాగంలో (బ్రాంకియోల్) తలెత్తుతుంది. దీనికి ప్రధాన కారణం రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ). ముందు జలుబుగా మొదలై కొద్దిరోజుల తర్వాత శ్వాస తీసుకోవటం కష్టమవుతుంది. ఇది రెండేళ్ల లోపు పిల్లల్లోనే కనిపిస్తుంది. చాలావరకూ తేలికగానే తగ్గుతుంది. తీవ్రమైతే ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయాల్సి వస్తుంది.

బాల ఆస్థమాను పట్టుకోవటం కష్టమే

పిల్లలకు ఆస్థమా ఏంటని అనుకోవద్దు. నిజానికి చిన్నారుల్లో దీన్ని పోల్చుకోవటం కష్టమే. ఇది వయసును బట్టి రకరకాలుగా కనిపిస్తుంటుంది. దీని ప్రధాన లక్షణాలు ఛాతీ బిగపట్టినట్టు అనిపించటం, దగ్గు, ఆయాసం, పిల్లికూతలు. ఉదయం లేదా రాత్రివేళల్లో పిల్లికూతలు ఎక్కువ. అయితే జలుబు, అలర్జీ కారకాలు (దుమ్ము, పుప్పొడి), వైరల్ ఇన్‌ఫెక్షన్ల మధ్యలోనూ పిల్లికూతలు రావొచ్చు. దీన్నే మల్టీ ట్రిగ్గర్ వీజ్ అంటారు. వీరికి ముస్ముందు ఆస్థమా వచ్చే అవకాశముంది. కొందరికి అప్పుడప్పుడూ పిల్లికూతలు రావొచ్చు (ఎపిసోడిక్ వీజ్). దీనికి చాలావరకూ వైరల్ ఇన్‌ఫెక్షనే కారణం. ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడే పిల్లికూతలు వస్తాయి. కొందరికి ఆటలాడటం, శారీరక శ్రమ ఎక్కువగా చేసిన తర్వాత కూడా ఆస్థమా లక్షణాలు కనిపించొచ్చు. అందువల్ల పిల్లల్లో ఆస్థమాను నిర్ధారించటం అంత తేలిక కాదు. పిల్లికూతల వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

● ఆస్థమా నిర్ధారణ అయ్యి, దీర్ఘకాలం చికిత్స అవసరమైన పిల్లలకు ఇన్‌హేలర్ ద్వారా పీల్చుకునే కార్టికోస్టిరాయిడ్ (ఐసీఎస్).. శ్వాసనాళాలను విప్పార్చే (బ్రాంకోడైలేటర్) మందులు విధిగా వాడుకోవాలి. ఇన్‌హేలర్ రూపంలోనైతే చాలా చాలా తక్కువ మోతాదు మందే సరిపోతుంది. ఇది నేరుగా ఊపిరితిత్తుల మీదే పనిచేసి, తక్షణం ఉపశమనం కలగజేస్తుంది. దుష్ప్రభావాలు పెద్దగా ఉండవు. కాబట్టి ఇన్‌హేలర్ల మీద అపోహలు వద్దు. స్టిరాయిడ్ మందులు చేటు చేస్తాయని, అలవాటు అవుతాయని భయపడొద్దు. ఆస్థమా దాడి చేసినప్పుడు తక్షణం ఉపశమనం కలిగించే రిలీవర్లే కాదు, సమస్య అదుపులో ఉండటానికి తోడ్పడే కంట్రోలర్ మందులనూ విధిగా వాడుకోవాలి.

అన్నింటికీ యాంటీబయాటిక్స్ వద్దు

బ్యాక్టీరియాతో వచ్చే న్యుమోనియాకు యాంటీబయాటిక్ మందులు అద్భుతంగా పనిచేస్తాయి. అయితే శ్వాసకోశ సమస్యలకు చాలావరకూ వైరస్‌లే మూలం. వీటికి యాంటీబయాటిక్స్ పనిచేయవు. కాబట్టి అనవసరంగా వాడొద్దు. జలుబు, జ్వరం అనగానే మనదగ్గర చాలామంది మందుల దుకాణానికి వెళ్లి, యాంటీబయాటిక్ మందులు కొనుక్కొచ్చి పిల్లలకు వేస్తుంటారు. ఇది సరికాదు. ఆచితూచి వాడకపోతే బ్యాక్టీరియా ఆ మందులను తట్టుకొనే శక్తిని సంతరించుకొని, మొండిగా తయారవుతుంది.

● అలాగే దగ్గు మందులు సొంతంగా కొనుక్కొని వాడొద్దు. డాక్టర్ సూచించిన మందులను అవసరమైనన్ని రోజులే వాడాలి. వారాల కొద్దీ వాటిని పిల్లలకు తాగించొద్దు.

నెబ్యులైజర్ ఇంటి పరికరం కాదు

ఇటీవల నెబ్యులైజర్ వాడకం పెరిగిపోయింది. కొద్దిగా జలుబు చేయగానే దీన్ని ఇంట్లోనే వాడేస్తున్నారు. నిజానికిది ఇంటి పరికరం కాదు. గొంతు దగ్గర పెద్ద శ్వాసనాళాల్లో తలెత్తే క్రూప్, మల్టీ ట్రిగ్గర్ వీజ్ వంటి సమస్యల్లో నెబ్యులైజర్ ద్వారా మందులిస్తే సత్వరం ఉపశమనం కలుగుతుంది. అయితే దీన్ని ఆసుపత్రిలోనే వాడాలి. సొంతంగా కొనుక్కొని ఇంట్లో వాడితే ఇబ్బందులకు దారితీస్తుంది. నెబ్యులైజర్ కన్నా అందులో వాడే మందులే ముఖ్యమని తెలుసుకోవాలి. ఏ మందు ఇవ్వాలో, ఎంత మోతాదులో ఇవ్వాలో తల్లిదండ్రులకు తెలియదు. నెబ్యులైజర్‌ను శుభ్రం చేయటమూ ముఖ్యమే. ఒకట్రెండు రోజులు వాడిన తర్వాత నెలల తరబడి పక్కన పెట్టేస్తే లోపల దుమ్ము, ధూళి చేరొచ్చు. శుభ్రం చేయకుండా వాడితే అవన్నీ ఊపిరితిత్తుల్లోకి వెళ్లి, చేటు చేస్తాయి.

ఇలా కాపాడుకోవాలి

వాయు కాలుష్యం రోజురోజుకీ విజృంభిస్తున్న తరుణంలో పిల్లల ఊపిరితిత్తులను జాగ్రత్తగా కాపాడుకోవటం తక్షణ కర్తవ్యంగా మారింది.

● ఆరునెలల వరకూ తల్లిపాలు విధిగా పట్టాలి. పోతపాలు తాగే పిల్లలకు శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం 12 రెట్లు ఎక్కువ. ఆరునెలల తర్వాత ఉగ్గుతో పాటు తల్లిపాలు కూడా కొనసాగించాలి. ఇవి రోగనిరోధక శక్తి పెంపొందించటం ద్వారా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల బారినపడకుండా కాపాడతాయి.

● పిల్లలకు అవసరమైన టీకాలన్నీ ఇప్పించాలి.

● బడికి వెళ్లే పిల్లలకు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ముక్కుకు, నోటికి చేతి రుమాలు అడ్డం పెట్టుకోవటం నేర్పించాలి. జలుబు, దగ్గు వంటివి ఉన్నట్టయితే మాస్కు ధరించేలా చూడాలి.

● ఇంట్లో ఎవరినీ సిగరెట్లు కాల్చనీయొద్దు. ఇతరులు వదిలిన పొగను పిల్లలు పీల్చుకుంటే ఊపిరితిత్తులు త్వరగా దెబ్బతినే ప్రమాదముంది.

● కాలుష్యం ఎక్కువగా ఉండే సమయాల్లో పిల్లలను ఇంట్లోనే ఉండేలా చూసుకోవాలి. వీలైతే ఇంట్లో ఎయిర్ ప్యూరిఫయర్స్ అమర్చుకోవాలి.

● పిల్లలు ఆయాస పడుతున్నప్పుడు, శ్వాసవేగంగా తీసుకుంటున్నప్పుడు, డొక్కలు ఎగరేస్తున్నప్పుడు, మూల్గుతున్నప్పుడు, పాలు తాగలేకపోతున్నప్పుడు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

ఎందుకీ పాంక్రియాస్ వాపు?

సమస్య సలహా

సమస్య: నాకు రెండేళ్ల క్రితం అక్యూట్ పాంక్రియాటైటిస్ బయటపడింది. చిన్నప్పటి నుంచీ మద్యం, పొగ అలవాట్లేవీ లేవు. అయినా ఈ సమస్య ఎందుకొచ్చింది? జీవనశైలి, ఆహార మార్పులు పాటిస్తున్నా జబ్బు అప్పుడప్పుడూ తిరగబెడుతోంది. ఇటీవల తీవ్ర కడుపునొప్పి, వాంతులతో ఆసుపత్రిలో చేరి, చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. దీన్ని తగ్గించుకోవటమెలా? అక్యూట్ సమస్యను క్రానిక్‌గా మారకుండా చూసుకునేదెలా? – వీరేశ్ బాబు

సలహా: హఠాత్తుగా క్లోమగ్రంథి వాపు (అక్యూట్ పాంక్రియాటైటిస్) తలెత్తటానికి అతిగా మద్యం తాగటమే కాదు, పిత్తాశయ రాళ్లూ కారణం కావొచ్చు. క్లోమగ్రంథి విడుదల చేసే ఇన్సులిన్, ఎంజైమ్‌ల వంటివన్నీ ఉమ్మడి పైత్యనాళం ద్వారానే పేగుల్లో కలుస్తాయి. ఒకవేళ పిత్తాశయంలో ఏర్పడిన రాయి నాళానికి అడ్డుపడితే క్లోమంలో ఎంజైమ్‌లు పోగుపడి, వాపు కలగజేయొచ్చు. వైరల్ ఇన్‌ఫెక్షన్లు, రక్తంలో ట్రైగ్లిజరైడ్లు, క్యాల్షియం ఎక్కువగా ఉండటం, వంశపారంపర్యంగా పాంక్రియాటైటిస్‌కు దారితీసే జన్యువులు (ఉదా: టీఆర్ఎస్ఎస్1, స్పింక్1), క్లోమానికి దెబ్బలు తగలటం, రక్తసరఫరా తగ్గటం, కొన్నిరకాల మందుల వంటివీ పాంక్రియాటైటిస్‌కు దారితీయొచ్చు. కొందరిలో ఎలాంటి కారణమూ ఉండకపోవచ్చు. మీరు మద్యం అలవాటు లేదంటున్నారు కాబట్టి ఇతరత్రా అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. రక్తంలో కొలెస్ట్రాల్, జన్యు ప్రొఫైల్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ పరీక్షల సాయంతో కారణాలను గుర్తించొచ్చు. ఏవైనా కారణాలు ఉన్నట్టయితే వాటికి చికిత్స తీసుకుంటే జబ్బును అదుపులో ఉంచుకోవచ్చు. ఇతరత్రా కారణాలేవీ లేనప్పుడు, వంశపారంపర్యంగా వచ్చినప్పుడు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా ఆహారంలో కొవ్వు పదార్థాలు తగ్గించాలి. కొలెస్ట్రాల్ తగ్గించే మందులూ అవసరమవ్వచ్చు. వీటితో జబ్బు తిరగబెట్టకుండా, దీర్ఘకాల సమస్యగా మారకుండా చూసుకోవచ్చు. నిజానికి అక్యూట్ పాంక్రియాటైటిస్ చాలావరకూ తాత్కాలికమే. కొందరిలో దీర్ఘకాల సమస్యగా మారొచ్చు. ఇందులో క్లోమగ్రంథి క్రమంగా కుంచించుకుపోవటం, లోపల రాళ్లు ఏర్పడటం వంటి మార్పులూ కనిపిస్తుంటాయి. దీంతో ఇన్సులిన్ ఉత్పత్తి ఆగిపోయి, మధుమేహంలోకి జారిపోవచ్చు. కాబట్టి ముందే జాగ్రత్త పడటం మంచిది.




- డా॥ రాకేశ్ కలపాల,
సీనియర్ గ్యాస్ట్రోఎంటెరాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

బాల్య వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో మూత్రాశయ క్యాన్సర్ ముప్పు

మూత్రాశయ క్యాన్సర్‌ను నివారించుకోవటానికి పొగ తాగటం మానెయ్యమని డాక్టర్లు సూచిస్తుంటారు. ఇదొక్కటే కాదు.. బీకే వైరస్‌ను ముందుగానే గుర్తించి, కట్టడి చేయటమూ ముఖ్యమేనని సైన్స్ అడ్వాన్సెస్ పత్రికలో ప్రచురితమైన తాజా అధ్యయనం పేర్కొంటోంది. బీకే వైరల్ ఇన్‌ఫెక్షన్ బాల్యంలో తరచూ కనిపిస్తుంటుంది. ఇది పెద్దయ్యాక మూత్రాశయ క్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తున్నట్టు బ్రిటన్ పరిశోధకులు గుర్తించారు. అందుకే దీన్ని ముందుగానే కట్టడి చేయగలిగితే మూత్రాశయ క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చనీ సూచిస్తున్నారు. బాల్యంలో దాడిచేసిన తర్వాత బీకే వైరస్ నిద్రాణంగా ఉండిపోతుంది. స్పష్టమైన లక్షణాలేవీ ఉండవు. కానీ రోగనిరోధకశక్తి తగ్గినప్పుడు ఉద్ధృతమవుతుంటుంది. ఇది కిడ్నీ మార్పిడి చేయించుకున్నవారిలో స్పష్టంగా కనిపిస్తుంటుంది కూడా. కిడ్నీ మార్పిడి చేయించుకున్నవారు కొత్త కిడ్నీని శరీరం తిరస్కరించకుండా రోగనిరోధక వ్యవస్థను అణచిపెట్టే మందులు వేసుకుంటుంటారు. దీంతో బీకే వైరస్ తిరిగి ఉద్ధృతమవుతుంది. దీన్ని ఎదుర్కోవటానికి రోగనిరోధక వ్యవస్థ పోరాడిన తర్వాత మూత్రకోశ గోడల కణాల్లో డీఎన్ఏ దెబ్బతిన్న ధోరణులు తలెత్తినట్టు పరిశోధకులు గుర్తించారు. అంటే రోగనిరోధక వ్యవస్థ వైరస్‌ను నిర్మూలించే క్రమంలో కణాలనూ దెబ్బతీస్తోందన్నమాట. ఈ బీకే వైరస్ ఎప్పుడో బాల్యంలో దాడిచేసిందే కావటం గమనార్హం. వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో ముడిపడిన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి ఇతర క్యాన్సర్లలో వైరస్ డీఎన్ఏ మనుషుల జన్యు పదార్థంతో కలిసి, కణితికి దారితీస్తుంది. అదే బీకే వైరస్ ఇన్‌ఫెక్షన్‌లోనైతే మన రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందనతో కణాల్లో డీఎన్ఏ మారుతోంది.



ఈ మార్పులు ఇన్‌ఫెక్షన్‌కు గురైన కణాలకే పరిమితం కావటం లేదు, చుట్టుపక్కల కణాల్లోనూ కనిపిస్తున్నాయి.

నిద్ర శక్తి!



రోగనిరోధకశక్తిని పెంచుకోవటం అనగానే ఆరోగ్యకర ఆహారం, వ్యాయామం, పోషక మాత్రలు, విటమిన్లు, సూపర్ ఫుడ్స్ వంటివే గుర్తుకొస్తుంటాయి. కానీ కంటి నిండా నిద్ర పోవటమూ ముఖ్యమే. నిద్ర, రోగనిరోధక వ్యవస్థ రెండూ ఒకదాంతో మరోటి ముడిపడి ఉంటాయి. నిద్ర పోతున్నప్పుడు రోగనిరోధక శక్తికి దన్నుగా నిలిచే రకరకాల కీలక ప్రక్రియలు కొనసాగుతాయి.

సైటోకైన్ల ఉత్పత్తి: సైటోకైన్లనే ప్రొటీన్లు వార్తాహరులుగా పనిచేస్తూ.. రోగనిరోధక ప్రతిస్పందనను నియంత్రిస్తుంటాయి. ఇంటర్ల్యూకిన్ 1 (ఐఎల్-1), ట్యూమర్ నెక్రోసిస్ ఫ్యాక్టర్ (టీఎన్ఎఫ్) వంటి కొన్ని సైటోకైన్ల సంఖ్య నిద్రపోతున్నప్పుడు పెరుగుతుంది. ఇవి వాపుప్రక్రియ, ఇన్‌ఫెక్షన్లతో పోరాడటంలో సాయం చేస్తాయి. నిద్రలేమితో వీటి ఉత్పత్తి పడిపోతుంది. రోగనిరోధక రక్షణ వ్యవస్థ బలహీనపడుతుంది.

టి కణాల చురుకుదనం: తెల్ల రక్తకణాల్లో ఒకటైన టి కణాలు ఇన్‌ఫెక్షన్లతో పోరాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి చురుకుగా పనిచేయటానికి.. ఇన్‌ఫెక్షన్‌కు గురైన కణాలను గుర్తించి, వాటిని నిర్మూలించే సామర్థ్యం ఇనుమడించటానికి నిద్ర తోడ్పడుతోందని పరిశోధనలు చెబుతున్నాయి.

యాంటీబాడీల ఉత్పత్తి: రోగకారక క్రిములను గుర్తించి, వాటిని నిర్వీర్యం చేసేవి యాంటీబాడీలే. ఇవి బాగా ఉత్పత్తి కావటానికి నిద్ర సాయం చేస్తుంది. రకరకాల జబ్బులను ఎదుర్కొనేలా శరీరం సన్నద్ధం కావటానికి దోహదం చేస్తుంది.

- అదన్నమాట సంగతి. కాబట్టి రోగనిరోధక శక్తిని పెంపొందించుకొని, జబ్బుల బారినపడకుండా ఉండాలంటే కంటి నిండా నిద్రపోవటానికి ప్రయత్నించండి. అర్ధరాత్రి వరకూ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు చూడటం మానేసి, త్వరగా నిద్రకు ఉపక్రమించండి. పెద్దవారిలో చాలామందికి రాత్రిపూట 7-9 గంటల నిద్ర అవసరం. అలాగని అతిగానూ పడుకోవద్దు. 9-10 గంటల కన్నా ఎక్కువసేపు నిద్రిస్తున్నారంటే గాఢ నిద్ర కరవైందని, నిద్రపట్టక సతమతమవుతున్నారనే అర్థం. పిల్లలకైతే వయసుల వారీగా నిద్ర అవసరమవుతుంది.

- **4–12 నెలలు:** 12 నుంచి 16 గంటలు
- **1–2 ఏళ్లు:** 11 నుంచి 14 గంటలు
- **3–5 ఏళ్లు:** 10 నుంచి 13 గంటలు
- **6–12 ఏళ్లు:** 9 నుంచి 12 గంటలు
- **13–18 ఏళ్లు:** 8 నుంచి 10 గంటలు

గోటి సౌందర్యం గొప్పదే

గోళ్లను పెద్దగా పట్టించుకోం గానీ సున్నితమైన వేళ్ల చివర్లను కాపాడే రక్షణ కవచాలివే. చిన్న చిన్న వస్తువులను ఏరటం, పట్టుకోవటం, గోకటం వంటి పనులకే కాదు.. అందంగా కనిపించటానికీ తోడ్పడతాయి. నఖ శిఖ పర్యంతమూ అని ఊరికే అనలేదు మరి. అలాంటి గోళ్లు ఎగుడుదిగుడుగా పెరిగితే? చూడటానికి వికారంగా కనిపిస్తే? తేలికగా విరుగుతుంటే? వీటికి ఫంగల్ ఇన్‌ఫెక్షన్, తరచూ దెబ్బలు తగలటం, సోరియాసిస్, ఏనుగు గజ్జి వంటి సమస్యలు కారణం కావొచ్చు. ఐరన్, జింక్, బయోటిన్ లాంటి పోషకాల లోపమూ గోళ్లను దెబ్బతీస్తుంది. థైరాయిడ్ సమస్యలోనూ గోళ్లు సరిగా పెరగకపోవచ్చు. కొందరు మాటిమాటికీ గోళ్లు కొరుకుతుంటారు. ఇదీ నఖ సౌందర్యాన్ని చెడగొడుతుంది. ఇలాంటి కారణాలను గుర్తిస్తే సత్వరం సరి చేసుకోవటం మంచిది. అవసరమైతే డాక్టర్‌నూ సంప్రదించాలి. గోరే కదాని నిర్లక్ష్యం చేయొద్దు.



ప్రొటీన్ ఆహారం నుంచే

ప్రొటీన్ విషయంలో శాకాహారులు దిగులు పడుతుంటారు. తగినంత అందటం లేదేమో, ప్రొటీన్ పొడుల వంటివి తీసుకోవాలేమో అని అనుకుంటుంటారు. నిజానికి ఆహారం ద్వారా లభించేలా చూసుకోవటమే ఉత్తమం. మనకు ఒక కిలో శరీర బరువుకు రోజుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. అదే 50 ఏళ్లు దాటితే 1.2 గ్రాములు కావాలి. మాంసం, గుడ్డు వంటి జంతు ప్రొటీన్లలో మొత్తం 9 అమైనో ఆమ్లాలుంటాయి. వీటిని శరీరం బాగా గ్రహిస్తుంది కూడా. సోయాబీన్స్ మినహా చాలా శాకాహార పదార్థాల్లో ఒకటి, అంతకన్నా ఎక్కువ అమైనో ఆమ్లాలు తక్కువగా ఉంటాయి. అలాగని నిరాశ పడాల్సిన పనిలేదు. రకరకాల పదార్థాలను కలిపి తీసుకుంటే ఒకదాంతో మరోటి భర్తీ అవుతాయి. ఉదాహరణకు- బియ్యం, గోధుమల వంటి తృణ ధాన్యాల్లో లైసిన్ ఉండదు. పప్పుదినుసుల్లో మిథియోనిన్ ఉండదు. కాబట్టి మూడొంతులు బియ్యం, గోధుమల వంటి తృణధాన్యాలు.. ఒక వంతు పప్పులు కలిపి తీసుకోవటం మంచిది. దీంతో బియ్యంలో లేని లైసిన్ పప్పులతో లభిస్తుంది. పప్పుల్లో లేని మిథియోనిన్ బియ్యం, గోధుమల నుంచి అందుతుంది. అప్పుడు అన్ని అత్యవసర అమైనో ఆమ్లాలు లభించినట్టవుతుంది. వీటిని శరీరం పూర్తిగా వాడుకుంటుంది. తగినంత ప్రొటీన్ అందుతుంది.



* మితిమీరి ప్రొటీన్ పొడులు వాడితే దీర్ఘకాలంలో దుష్ప్రభావాలకు దారితీయొచ్చు. మోతాదు మరీ ఎక్కువైతే కిడ్నీల మీద ఎక్కువ భారం పడుతుంది. ప్రొటీన్ జీర్ణమయ్యాక మిగిలిపోయే నత్రజనిని శరీరంలోంచి బయటకు పంపటానికి కిడ్నీలు ఎక్కువ పనిచేయాల్సి ఉంటుంది. కిడ్నీలు సరిగా పనిచేయని వారికిది చిక్కులు కలిగిస్తుంది.

ఉప్పు కాస్త తగ్గించి..

ఉప్పు అద్భుతమైంది. చేదును తగ్గిస్తుంది, తీపిదనాన్ని పెంచుతుంది. మొత్తంగా వంటల రుచినే ద్విగుణీకృతం చేస్తుంది. అందుకేనేమో 'అన్నేసి చూడు, నన్నేసి చూడు' అని తెలగరేస్తుంది. నిజమే, ఉప్పులేని చప్పిడి కూడును ఎవరు తింటారు చెప్పండి. కానీ అతిగా తినటమే చేటు కలిగిస్తోంది. రోజుకు ఉప్పు మోతాదు 5 గ్రాముల కన్నా మించనీయొద్దని (ఒక చెంచాడు) ప్రపంచ ఆరోగ్యసంస్థ సూచిస్తుంటే మనదగ్గర సగటున దానికి రెట్టింపుకన్నా ఎక్కువగా.. 12 గ్రాములు తీసుకుంటున్నారు. ఫలితంగా గుండెజబ్బు, పక్షవాతం, కిడ్నీ సమస్యల ముప్పులూ పెరుగుతున్నాయి. నిజానికి ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవటం అసాధ్యమేమీ కాదు. మనసుంటే మార్గమదే దొరుకుతుంది. అయితే ఎలా మొదలెట్టాలనేది తెలియకే సతమతమవుతుంటారు.

సాధారణంగా మనకు రెండు మార్గాల్లో రుచి జ్ఞానం తెలుస్తుంది. ఒకటి- పులుపు, ఉప్పు మార్గం. రెండు- తీపి, చేదు, కమ్మదనం మార్గం. ఇవి నాలుక ద్వారా మెదడుకు సమాచారాన్ని చేరవేసి, ఆయా రుచులు తెలిసేలా చేస్తాయి.

● పులుపు, ఉప్పు ఒకే మార్గంలో ప్రయాణిస్తాయి కాబట్టి నిమ్మరసం, వెనిగర్ వంటి పుల్లటి దినుసులను ఆహారానికి కలిపి చూడండి. ఉప్పదనమూ పెరుగుతుంది.

● మరో చిట్కా- కాస్త దోరగా వేయించటం. పదార్థాలు దోరగా వేగినప్పుడు రకరకాల కొత్త రుచికారకాలు పుట్టుకొస్తాయి. అప్పటికే వాటిల్లో ఉన్న ఉప్పు బయటకు వెలువడుతుంది. అదనంగా ఉప్పు కలపకుండానే సోడియం మోతాదును పెంచుకోవచ్చు.

● వండేటప్పుడు కాకుండా వడ్డించుకునేటప్పుడు కూరలు, పదార్థాల మీద ఉప్పు చల్లుకోవటం మరో పద్ధతి. నోట్లో వేసుకున్నప్పుడు ముందుగా ఉప్పు రుచే నాలుకకు తగులుతుంది. తక్కువ ఉప్పుతోనే లాగించేయొచ్చు.



సైంధవ లవణం

పొటాషియంతో కూడిన సైంధవ లవణం మరో ప్రత్యామ్నాయం. రక్తనాళాలు విప్పారటానికి, అదనపు సోడియాన్ని కిడ్నీలు బయటకు వెళ్లగొట్టటానికిది తోడ్పడుతుంది. అయితే చేదుగా ఉండటం వల్ల దీనిలో మామూలు ఉప్పును కలిపి అమ్ముతుంటారు. పొటాషియం ఉప్పులో పావు వంతు మామూలు ఉప్పు కలిపితే పెద్ద తేడా ఏమీ తెలియదు. ఇలాంటి మిశ్రమ ఉప్పు వాడేవారిలో పక్షవాతం ముప్పు 14%, అకాల మరణం ముప్పు 12% తగ్గుతున్నట్టు ఒక అధ్యయనంలో వెల్లడైంది. అందుకే అధిక రక్తపోటును తగ్గించటానికి ప్రపంచ ఆరోగ్యసంస్థ తక్కువ సోడియం గల పొటాషియం ఉప్పును సిఫారసు చేసింది. కానీ డాక్టర్ సలహా తీసుకున్నాకే దీన్ని వాడుకోవాలి. ఎందుకంటే కిడ్నీ జబ్బులు గలవారిలో, కొన్నిరకాల బీపీ మందులు వేసుకునేవారిలో దీంతో పొటాషియం మోతాదులు చాలా ఎక్కువయ్యే ప్రమాదముంది.

కొత్తిమీర, మసాలా దినుసులు


కూరల మీద కొత్తిమీర, పుదీనా వంటివి చల్లుకోవటం మనకు తెలిసిందే. ఇవి మంచి సువాసన కలిగిస్తూ రుచిని పెంచుతాయి. ఉప్పు తగ్గినా హాయిగా తినొచ్చు. జీలకర పొడి, ధనియాల పొడి వంటివీ రుచిని పెంచుతాయి. ఇప్పుడు పుట్టగొడుగుల, ఉల్లిపాయ పొడుల వంటివీ అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి మొక్కల ఆకులు, మసాలాలతో ఉప్పు వాడకాన్ని 50% వరకూ తగ్గించుకోవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి.

అవి ఉప్పు బాంబులే

ఇంట్లో వండుకునేటప్పుడు ఉప్పు తగ్గించుకుంటాం సరే. మరి బయటి ఆహారం సంగతో. ప్యాకెట్లలో అమ్మే ఆహార పదార్థాలు, చిరుతిళ్లు, హోటళ్లలో తయారుచేసే వంటకాల్లో ఉప్పు దండిగా ఉంటుందనే సంగతి మరవరాదు. వీటిని ఒకరకంగా ఉప్పు బాంబులని అనుకోవచ్చు. మనం తినే సోడియంలో సుమారు 70% ఇలాంటి బయటి తిండి నుంచే వస్తున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి మరి. అందువల్ల బయటి నుంచి తెచ్చుకునే ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్త అవసరం. మరీ తప్పనప్పుడు తక్కువ ఉప్పు ఉన్నవి చూసి, ఎంచుకోవాలి.

ఫ్లాసింగ్‌తో పక్షవాతం దూరం

బ్రష్‌తో తోముకోవటమే కాదు, సన్నటి దారంతో పళ్ల మధ్య కూడా శుభ్రం చేసుకోవాలని (ఫ్లాసింగ్) డాక్టర్లు సూచిస్తుంటారు. ఇది దంతాలు శుభ్రంగా, చిగుళ్లు ఆరోగ్యంగా ఉండటానికే కాదు.. కొన్నిరకాల పక్షవాతాలు రాకుండా చూసుకోవటానికీ తోడ్పడుతున్నట్టు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంటే నోటి ఆరోగ్యానికీ గుండె, మెదడు పనితీరుకూ సంబంధం ఉంటోందన్నమాట. ఒక దీర్ఘకాల అధ్యయనంలో 6వేలకు పైగా మందిని 25 ఏళ్ల పాటు పరిశీలించారు. క్రమం తప్పకుండా ఫ్లాసింగ్ చేసుకునేవారికి మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టటం వల్ల వచ్చే పక్షవాతం (ఇస్కిమిక్) ముప్పు 22%, గుండెలోంచి రక్తం గడ్డలు మెదడుకు చేరుకోవటం వల్ల తలెత్తే పక్షవాతం (కార్డియోఎంబోలిక్) ముప్పు 44% తక్కువని గుర్తించారు. అంతేనా? పక్షవాతం వచ్చే అవకాశాన్ని పెంచే గుండెలయ తప్పటం (ఏట్రియల్ ఫిబ్రిలేషన్) సైతం 12% తక్కువని తేలింది. తరచూ బ్రష్ చేసుకోవటం, దంత వైద్యుడిని సంప్రదించటాన్ని పక్కనపెట్టి చూసినా ఈ ప్రయోజనాలు కనిపిస్తుండటం ఆశ్చర్యకరం. ఫ్లాసింగ్‌తో చిగుళ్ల వాపు, నోట్లో హానికారక బ్యాక్టీరియా తగ్గటం ఇందుకు దోహదం చేస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. చిగుళ్ల జబ్బు దీర్ఘకాల సమస్యగా మారినప్పుడు వాపుకారక పదార్థాలు, బ్యాక్టీరియా రక్తంలోకి చేరుకుంటాయి. ఇవి రక్తనాళాలను దెబ్బతీయటం, రక్తం గడ్డలు ఏర్పడటం వంటి వాటికి దారితీస్తాయి. వీటితో పక్షవాతం ముప్పూ పెరుగుతుంది. సంపూర్ణ ఆరోగ్యానికి నోటి శుభ్రత కీలకమని చాలాకాలంగా నిపుణులు చెబుతున్నదే. గుండెజబ్బు, మధుమేహం, విషయగ్రహణ తగ్గటం వంటి సమస్యలకూ చిగుళ్ల జబ్బుకూ లంకె ఉంటున్నట్టు ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే ఫ్లాసింగ్‌కూ ప్రాధాన్యం పెరుగుతోంది. ఇది బ్రష్ పోచలు చేరుకోని చోట్ల ఏర్పడే గారను తొలగిస్తుంది. ఫలితంగా వాపుప్రక్రియ కూడా తగ్గుతుంది. చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవటమనేది చాలా తేలికైన, చవకైన మార్గం. ఇది బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుండటం మరింత విశేషం.



ఈనాడు బిజినెస్

రఘు వంశీ నుంచి 6 యూఏవీలు



యూఏవీ ఆర్‌వీ మాయాతో వంశీ వికాస్, సీఈఓ రవిచంద్ర అచంట

ఈనాడు - హైదరాబాద్

భారత రక్షణ దళాల కోసం 6 అత్యాధునిక మానవ రహిత వైమానిక వాహనాల (యూఏవీ)ను, హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న రఘు వంశీ ఏరోస్పేస్ అనుబంధ డీప్‌టెక్ బ్రాండ్ ఆగ్రోబోట్ ఆవిష్కరించింది. వీటిలో ఆర్‌వీ అస్త్ర, ఆర్‌వీ మాయ, ఆర్‌వీ లక్ష్య, ఆర్‌వీ రుద్ర, ఆర్‌వీ ఇంద్ర, ఆర్‌వీ యోధ, ఆర్‌వీ దృష్టి ఉన్నాయి. నిఘా, దాడి, యుద్ధభూమి లాజిస్టిక్స్, బలగాలకు మద్దతు వంటి అవసరాలకు ఇవి ఉపయోగపడతాయి. పౌర అవసరాల కోసమూ వీటిని వినియోగించుకోవచ్చు. కొన్ని 300 కిలోమీటర్లు, మరికొన్ని అంతకు మించి ప్రయాణించగలవు. ఆర్డర్లను బట్టి, నెలకు 500 యూనిట్లకు పైగా ఉత్పత్తి చేయగలమని సంస్థ వెల్లడించింది. డిజైనింగ్ నుంచి ఉత్పత్తి వరకు పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో వీటిని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. హైదరాబాద్ సమీపంలోని హార్డ్‌వేర్ పార్క్‌లో ఈ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందులో యూఏవీలు, ఇంజిన్లు, అధునాతన రక్షణ వ్యవస్థల డిజైనింగ్, అసెంబ్లింగ్ చేస్తామని సంస్థ పేర్కొంది. 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ కేంద్రంపై రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినట్లు, 100 మందికి పైగా నిపుణులు పనిచేస్తారంది.

కొత్త ప్లాంట్‌లో 2,000 ఉద్యోగాలు

రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూపు వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ వంశీ వికాస్ మాట్లాడుతూ.. తమకు హైదరాబాద్‌లో 6, యూకేలో 3, అమెరికాలో ఒక ఉత్పత్తి కేంద్రం ఉన్నట్లు తెలిపారు. అమెరికా, యూకే, సింగపూర్, కెనడా, పోలాండ్ సహా 10 దేశాలకు తమ ఉత్పత్తులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. విమానాశ్రయం సమీపంలో, దాదాపు 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న కొత్త కేంద్రం 2026 సెప్టెంబరు చివరికి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.300 కోట్లకు పైగా పెట్టుబడులు పెడుతున్నట్లు వివరించారు. ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమైతే, దశల వారీగా 2,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు.

రూ.1,500 కోట్ల ఆర్డర్లు

రాబోయే 3 ఏళ్ల కోసం కంపెనీ వద్ద రూ.1,500 కోట్లకు పైగా ఆర్డర్లున్నాయని వంశీ వెల్లడించారు. ఈ సంవత్సరంలో గ్రూపు ఆదాయం రూ.500 కోట్లు మించుతుందని పేర్కొన్నారు. రక్షణ ఉత్పత్తుల సహ-అభివృద్ధి, పరిశోధన కోసం భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఐఐటీ హైదరాబాద్, ఏఆర్‌సీఐ, భారత సైన్యంతో ఆగ్రోబోట్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. కార్యక్రమంలో భారత నౌకాదళం వైస్ చీఫ్ ఆఫ్ ది నేవల్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సీఎండీ ఎ.మాధవరావు, రక్షణమంత్రిత్వ మాజీ శాస్త్రీయ సలహాదారుడు జి.సతీష్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

60% తగ్గిన

పసిడి దిగుమతులు

- నవంబరులో 4 బి. డాలర్లకు పరిమితం
- 5 నెలల కనిష్ఠానికి వాణిజ్య లోటు



పండగల గిరాకీ నేపథ్యంలో, ఈ ఏడాది అక్టోబరులో రికార్డు స్థాయిలో నమోదైన పసిడి దిగుమతులు, నవంబరులో నెమ్మదించాయి. 2024 నవంబరులో 9.8 బిలియన్ డాలర్ల (సుమారు రూ.88,200 కోట్ల) బంగారం దిగుమతి కాగా, గతనెలలో 60% తక్కువగా 4 బి.డాలర్ల (దాదాపు రూ.36,000 కోట్ల)కు పరిమితమైనట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

8 నెలల్లో రూ.4 లక్షల కోట్ల బంగారం దిగుమతి: గతేడాది ఏప్రిల్-నవంబరులో 43.8 బి.డాలర్ల (సుమారు రూ.3.94 లక్షల కోట్ల) విలువైన బంగారం దిగుమతి కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయంలో 3.3% వృద్ధితో 45.26 బి.డాలర్ల (సుమారు రూ.4 లక్షల కోట్ల) విలువైన పసిడి దిగుమతి అయ్యింది. 2024 అక్టోబరుతో పోలిస్తే, ఈ ఏడాది అక్టోబరులో 3 రెట్లు అధికంగా 14.72 బి. డాలర్ల (సుమారు రూ.1.32 లక్షల కోట్ల) పసిడి దిగుమతి అయింది.

స్విట్జర్లాండ్ నుంచి అధికం: మనదేశంలోకి అధికారికంగా దిగుమతయ్యే పసిడిలో స్విట్జర్లాండ్ వాటాయే 40%. ఆ తర్వాతి స్థానాల్లో యూఏఈ (16%), దక్షిణాఫ్రికా (10%) ఉన్నాయి.

పుంజుకున్న ఎగుమతులు: ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు పెరగడంతో దేశ వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య అంతరం) నవంబరులో 5 నెలల కనిష్ఠ స్థాయి అయిన 24.53 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.2 లక్షల కోట్ల)కు పరిమితమైంది. ఎగుమతులు నవంబరులో 19.37% పుంజుకుని 38.13 బి. డాలర్ల (దాదాపు రూ.3.43 లక్షల కోట్ల)కు చేరాయి. పసిడి, చమురు, బొగ్గు, కోక్ వంటి దిగుమతులు తగ్గడంతో, ఈ బిల్లు భారం 1.88% తగ్గి 62.66 బి.డాలర్ల (సుమారు రూ.5.64 లక్షల కోట్ల)కు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరులో ఎగుమతులు 2.62% వృద్ధితో 292.07 బి. డాలర్లకు, దిగుమతులు 5.59% పెరిగి 515.21 బి.డాలర్లకు చేరడంతో వాణిజ్య లోటు 223.14 బి.డాలర్ల(సుమారు రూ.20.08 లక్షల కోట్ల)గా ఉంది.

టారిఫ్‌లున్నా అమెరికాకే అధిక ఎగుమతులు: మన ఉత్పత్తులపై అమెరికా 50% టారిఫ్ అమలు చేస్తున్నా, మన అగ్రగామి ఎగుమతి గమ్యస్థానంగా అమెరికా కొనసాగుతోందని ఫియో ప్రెసిడెంట్ ఎస్.సి. రల్హన్ పేర్కొన్నారు.

కార్లు.. మొబైల్ ఫోన్లు.. ఇళ్లు కొంటాం



- భవిష్యత్తుపై భారతీయుల్లో అధిక విశ్వాసం
- చైనా తర్వాత స్థానంలో మనమే
- బీసీజీ నివేదిక విశ్లేషణ

ఈనాడు - హైదరాబాద్

ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఆర్థిక అనిశ్చితి, అధిక ధరల వల్ల వినియోగదారులు ఖర్చులు వెనకాడుతున్నారు. కానీ మనదేశంలో మాత్రం భిన్నమైన పరిస్థితి ఉంది. ఎక్కువ మంది వినియోగదారులు కొనుగోళ్లకు వెనకాడటం లేదని, ఆదాయాలు వినియోగం బాగా పెరిగే అవకాశం ఉందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) అభిప్రాయపడింది. 'గ్లోబల్ కన్జ్యూమర్ రాడార్' అనే తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. వినియోగదారుల్లో విశ్వాసం చైనాలో అధికంగా ఉండగా, ఆ తర్వాత స్థానంలో మనదేశం ఉన్నట్లు పేర్కొంది. మనదేశంలో దాదాపు 60% కుటుంబాలు భవిష్యత్తుపై ఆశావాహంగా ఉన్నట్లు, ఖర్చుకు వెనకాడటం లేదని, తమకు అవసరమైన వస్తువులు కొనుగోళ్లపై ఆసక్తిగా ఉన్నారని విశ్లేషించింది. వచ్చే 6 నెలల్లో కార్లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇళ్లు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ నివేదిక వివరించింది. దీనివల్ల అన్ని వినియోగ వస్తువుల అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని, దానికి తగ్గట్లుగా వ్యాపార సంస్థలు తమ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అభిప్రాయపడింది.

జెన్ ఏఐలో చూసి తుది నిర్ణయం

కొనుగోళ్లపై తుది నిర్ణయం తీసుకోవడానికి జెన్ ఏఐ (కృత్రిమ మేధ) ను మన వినియోగదార్లు అధికంగా వినియోగిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు నాటికి దాదాపు 62% మంది భారతీయులు జెన్ ఏఐ టూల్స్ ఉపయోగిం దారు. ఈ ఏడాది ఫిబ్రవరితో పోల్చితే ఇది 48% అధికం. బ్రాండ్ ఎంపిక, వస్తువుల డిజైన్, రూపు రేఖలు, పనితీరు వంటి అంశాలను ఏఐ టూల్స్ ద్వారా అధ్యయనం చేస్తున్నారు. భారతీయులు పూర్తిస్థాయి డిజిటల్ వినియోగదారుల్లా మారిపోతున్నారని బీసీజీ ఇండియా లీడర్ (మార్కెటింగ్, సేల్స్) పారుల్ బజాజ్ వివరించారు.

ఆర్థిక వ్యవస్థ వృద్ధి బాటే

✦ అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో మనదేశంలో ఆర్థిక వృద్ధి మందగిస్తుందని 17% మందే విశ్వసిస్తున్నారు. యూకే, జర్మనీ, ఫ్రాన్స్..తదితర దేశాల్లో 60% మంది ప్రజలు ఆర్థిక మందగమనం తప్పదని నమ్ముతున్నారు.

✦ మనదేశంలో 61% మంది ప్రజలు మంచి రోజులు రాబోతున్నాయని నమ్ముతూ ఉన్నారు. దాదాపు 34% మంది మాత్రం నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం ఇబ్బంది పెడతాయని ఆందోళనగా ఉన్నారు.

✦ వచ్చే 6 నెలల్లో తమ కుటుంబాల ఖర్చు పెరుగుతుందని 61% మంది భావిస్తున్నారు.

✦ కొత్త బ్రాండ్లను కొనుగోలు చేసేందుకు 57% మంది సుముఖంగా ఉన్నారు. 84% మంది తమకు తెలిసిన, గతంలో వినియోగించిన బ్రాండ్లకే మొగ్గుచూపుతున్నారు.

✦ మనదేశంలో జెన్-జడ్ జనరేషన్‌తో పోల్చితే 'మిలేనియల్స్', జెన్-ఎక్స్ తమ ఆర్థిక స్థితిగతులపై ఎంతో ధీమాగా ఉన్నారని నివేదిక పేర్కొంది. ఎంతో అనుభవం గడించి ఉండటంతో పాటు ఆస్తులు, బ్యాంకు బ్యాలెన్స్ కలిగి ఉండటం దీనికి కారణం.

సింగపూర్ నుంచి భారత్‌కు ఫ్లిప్‌కార్ట్ ప్రధాన కార్యాలయం

● అనుమతులిచ్చిన ఎన్‌సీఎల్‌టీ ● ఐపీఓకు మార్గం సుగమం

వాల్‌మార్ట్ నేతృత్వంలోని ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్, తన హోల్డింగ్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సింగపూర్ నుంచి భారత్‌కు తరలించడానికి నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అనుమతినిచ్చింది. దేశీయంగా పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు, ఫ్లిప్‌కార్ట్‌కు ఇది కీలక అడుగుగా భావించొచ్చు. ఐపీఓకు ఎప్పుడు వచ్చేదీ చెప్పనప్పటికీ, అందుకోసమే ప్రధాన కార్యాలయాన్ని మార్చనున్నట్లు ఈ ఏడాది మొదట్లో ఫ్లిప్‌కార్ట్ వెల్లడించింది.

2011లో ఇక్కడ నుంచి తరలింపు: బెంగళూరులో 2007లో స్థాపితమైన ఫ్లిప్‌కార్ట్, తన ప్రధాన కార్యాలయాన్ని సింగపూర్‌కు 2011లో తరలించింది. అప్పట్లో భారతీయ అంకురాలన్నీ అంతర్జాతీయ సంస్థల నుంచి మూలధనం పొందేందుకు ఇలానే చేసేవి. భారత క్యాపిటల్ మార్కెట్లు బలోపేతం అవ్వడంతో, దేశీయ లిస్టింగ్‌ల కోసం అంకుర సంస్థలు మళ్లీ మనదేశానికి తిరిగి వస్తున్నాయి. అయితే ఫ్లిప్‌కార్ట్ వంటి పెద్ద కంపెనీ కూడా ప్రధాన కార్యాలయాన్ని తిరిగి మనదేశానికి తరలించనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

సరికొత్తగా ఎంజీ హెక్టర్

ధర రూ.11.99 లక్షల నుంచి



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా, సరికొత్తగా తీర్చిదిద్దిన స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) ఎంజీ హెక్టర్‌ను సోమవారం ఆవిష్కరించింది. ముందు, వెనుక బంపర్లను, ఇంటీరియర్‌ను అధునాతనంగా తీర్చిదిద్దినట్లు ప్రకటించింది. ఈ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.11.99 లక్షలు (ఎక్స్‌ షోరూం). 1.5 లీటర్ టర్బోఛార్జ్‌డ్ పెట్రోల్ ఇంజిన్ 143 పీఎస్ శక్తిని, 250 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుందని, 5-6-7 సీట్ల సదుపాయంతో.. సెలడాన్ బ్లూ, పెరల్ వైట్ వంటి రెండు సరికొత్త రంగుల్లోనూ ఈ కారు లభ్యమవుతుంది. 14 అంగుళాల టచ్‌స్క్రీన్‌పై ఐ-స్వైప్ సాంకేతికత సాయంతో ఎయిర్ కండీషనింగ్, సంగీతం, నావిగేషన్ వంటి ఫీచర్లను ఒకేసారి మార్చుకునే వీలుంటుంది. 360 డిగ్రీ హెచ్‌డీ కెమేరా, ఏబీఎస్ వంటి సదుపాయాలున్న ఈ కారు మాన్యువల్, సీవీటీ గేర్‌బాక్స్‌లతో లభించనుంది.

కోడి గుడ్లు

16న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	671
వరంగల్	673
విజయవాడ	700
తూ/ప గోదావరి	675
విశాఖపట్నం	675
చిత్తూరు	688

కిమ్స్ బెంగళూరు ఆసుపత్రి ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కిమ్స్ హాస్పిటల్స్, బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో కొత్త ఆసుపత్రిని ప్రారంభించింది. తమ సబ్సిడరీ కంపెనీ, కిమ్స్ హాస్పిటల్స్ బెంగళూరు ప్రైవేట్ లిమిటెడ్ నెలకొల్పిన ఈ ఆసుపత్రిలో సోమవారం నుంచి వైద్య సేవలు ప్రారంభించినట్లు కిమ్స్ హాస్పిటల్స్ వెల్లడించింది. ఇది 350 పడకల మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్. కార్డియాక్, న్యూరో, ఆంకాలజీ, అవయవ మార్పిడి సేవలు అందిస్తారు.

భారత్-అమెరికా ఒప్పంద షరతులపై అతి త్వరలో తుది నిర్ణయం



దిల్లీ: భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద షరతులపై తుది నిర్ణయానికి రావడానికి 'అతి సమీపం'లో ఉన్నట్లు వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రతినిధులు చర్చల్లో చురుగ్గా పాల్గొంటున్నట్లు తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై, ఒప్పంద షరతులపై.. రెండు సమాంతర చర్చలను అమెరికాతో చేపట్టినట్లు విలేకర్లతో రాజేశ్ అన్నారు. చర్చలు తుది దశలో ఉన్నందున.. మరో దఫా సంప్రదింపులకు అవకాశం ఉందని వివరించారు. ఒప్పందం పూర్తికి ముందు భౌతికంగా ఒకటి, వర్చువల్‌గా మరొక సమావేశం జరగొచ్చని వివరించారు.

మెక్సికోతో ప్రిఫరెన్షియల్ ట్రేడ్ అగ్రిమెంట్: మెక్సికోతో ప్రిఫరెన్షియల్ వాణిజ్య ఒప్పందాన్ని (పీటీఏ) మనదేశం ప్రతిపాదించింది. తమతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) లేని భారత్, చైనా, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేసియా వంటి దేశాల ఉత్పత్తులపై 5-50% వరకు సుంకాలు విధించాలని మెక్సికో నిర్ణయించడం ఇందుకు నేపథ్యం. 'సాంకేతిక స్థాయిలో చర్చలు మొదలయ్యాయి. ఎఫ్‌టీఏకు సమయం పడుతుంది కాబట్టి పీటీఏకు మొగ్గుచూపుతున్నామ'ని ఆయన అన్నారు.

ప్రభుత్వానికి భెల్ డివిడెండు రూ.110 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను, భారత ప్రభుత్వానికి తుది డివిడెండు కింద రూ.109.98 కోట్లు చెల్లించినట్లు ప్రభుత్వ రంగ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) తెలిపింది. భెల్‌లో ప్రభుత్వానికి 63.17% వాటా ఉంది. తుది డివిడెండు చెక్కును కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి భెల్ ఛైర్మన్, ఎండీ కె సదాశివ్ మూర్తి అందజేశారు. 2024-25కు మొత్తం డివిడెండు కింద వాటాదార్లకు రూ.174.10 కోట్లను భెల్ చెల్లించింది.

హైదరాబాద్‌లో డెలివరీ సేవలు

ఈనాడు, హైదరాబాద్: సరకు రవాణా సేవల సంస్థ డెలివరీ.. హైదరాబాద్, ముంబయి నగరాల్లో ఆన్ డిమాండ్ ఇంట్రా-సిటీ సేవలు ప్రారంభించింది. డెలివరీ డైరెక్ట్ యాప్ ద్వారా బుక్ చేసిన 15 నిమిషాల్లోనే, సరకు డెలివరీ తీసుకుని, రవాణాకు సిద్ధం చేసే ఈ సర్వీసును ఇప్పటికే దిల్లీ, బెంగళూరు నగరాల్లో ఈ సంస్థ అందిస్తోంది. బుక్ చేసిన సరుకు డెలివరీ క్రమాన్ని రియల్ టైమ్‌లో గమనించే అవకాశం వినియోగదార్లకు ఉంటుందని డెలివరీ ఇంట్రా సిటీ బిజినెస్ హెడ్ నిఖిల్ విజ్ తెలిపారు.

బెంగళూరులో కాగ్నిజెంట్ సీడీసీ

బెంగళూరులో సైబర్ డిఫెన్స్ సెంటర్ (సీడీసీ) ప్రారంభించినట్లు కాగ్నిజెంట్ తెలిపింది. అంతర్జాతీయంగా తనకున్న సీడీసీ నెట్‌వర్క్‌లో ఈ కేంద్రం కీలక హబ్‌గా వ్యవహరిస్తుందని కంపెనీ వివరించింది. ప్రపంచ వ్యాప్త క్లయింట్లకు కృత్రిమ మేధ ఆధారిత సైబర్ భద్రతా నిర్వహణ సేవలను, ఇంజినీరింగ్, ట్రాన్స్‌ఫర్మేషన్ సేవలను అందించడాన్ని ఈ కేంద్రం వేగవంతం చేస్తుందని వెల్లడించింది. ఇక్కడి నిపుణులు సైబర్ దాడులపై సత్వరమే స్పందిస్తారని తెలిపింది.

ఎస్‌బీఐ ఎండీగా రవి రంజన్

ఎస్‌బీఐ నూతన మేనేజింగ్ డైరెక్టరుగా రవి రంజన్‌ను ప్రభుత్వం సోమవారం నియమించింది. ఆయన ఇప్పటివరకు డిప్యూటీ ఎండీగా ఉన్నారు. నవంబరు 30న పదవీ విరమణ చేసిన వినయ్ స్థానంలో రవి బాధ్యతలు స్వీకరించారు. 2028 సెప్టెంబరు 30 వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు.

సీఈఓ వేతనాల్లో భలే వృద్ధి



రూ.9 కోట్ల వార్షిక వేతనం అందుకుంటున్న వారిలో 71% వృద్ధి

అంతర్జాతీయంగా వ్యాపార అనిశ్చితులు పెరుగుతున్నాయి. దీంతో వృద్ధి పథంలో సాగేందుకు, అధిక సామర్థ్యాలున్న ముఖ్య కార్యనిర్వహణాధికారు (సీఈఓ)లకు గిరాకీ పెరిగింది. సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొని, సంస్థను ముందుకు నడిపేవారికి మిలియన్ డాలర్ల (రూ.9 కోట్లకు పైగా) వార్షిక వేతనాన్ని ఆఫర్ చేస్తున్న కంపెనీల సంఖ్య పెరుగుతోంది.

✦ బీఎస్ఈ-200 కంపెనీల్లో 1 మిలియన్ డాలర్ల (రూ.9 కోట్ల)కు పైగా వేతనాన్ని ఆర్జిస్తున్న సీఈఓల సంఖ్య 2024-25లో 71% వృద్ధితో 145కు పెరిగింది. అయిదేళ్ల క్రితం వీరి సంఖ్య 85 మాత్రమే. ఈ స్థాయి వేతనం అందుకుంటున్న ప్రమోటర్ నేతృత్వంలోని కంపెనీల సీఈఓల సంఖ్య మాత్రం 60 నుంచి 65కే పెరిగిందని గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ సెర్చ్ సంస్థ స్టాంటన్ ఛేజ్ వెల్లడించింది.

✦ 'అయిదేళ్ల క్రితం ప్రమోటర్ నేతృత్వంలోని కంపెనీలు పలు రంగాల్లో ఆధిపత్యం చెలాయించాయి. కానీ ప్రస్తుతం పెద్ద కంపెనీల్లో సీఈఓల హవా నడుస్తోంది. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు, పలు కంపెనీల బోర్డులు సీఈఓలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాయి. భవిష్యత్తుపై దృష్టితో పాటు, మరింత సంస్థాగతంగా భారత కంపెనీలు మారుతున్న ధోరణి కనిపిస్తోంది' స్టాంటన్ ఛేజ్ ఎండీ (ఇండియా, సింగపూర్) అమిత్ అగర్వాల్ తెలిపారు.

ఐటీ రంగంలోనే అధికం

సీఈఓలకు భారీ వేతనాలు అందిస్తున్న రంగాల్లో ఐటీ/ఐటీఈఎస్ ముందు స్థానంలో ఉంది. 34శాతంతో తయారీ రంగం రెండో స్థానం దక్కించుకుంది. 2024-25లో రూ.168 కోట్ల వార్షిక పారితోషికంతో విప్రో మాజీ సీఈఓ థియరీ డెలాపోర్టే అగ్రస్థానంలో నిలిచారు. తర్వాతి స్థానాల్లో పెర్సిస్టెంట్ సిస్టమ్స్ సీఈఓ సందీప్ కల్రా (రూ.148 కోట్లు), హీరో మోటోకార్ప్ సీఎండీ పవన్ ముంజాల్ (రూ.109 కోట్లు) ఉన్నారు.

✦ సీఈఓలకు భారీ వేతనాలు అంత సులభంగా ఏమీ లభించడం లేదు. వీరికి ఫిక్స్‌డ్ వేతనాలను పెంచడానికి బదులుగా, పనితీరు ఆధారిత వేతనాలను బోర్డులు ఆఫర్ చేస్తున్నాయి. దీని వల్ల సీఈఓలకు జవాబుదారీతనం పెరిగింది. 2020-21లో 35 శాతంగా ఉన్న ఫిక్స్‌డ్ వేతనాల చెల్లింపు 2024-25లో దాదాపు 31 శాతానికి తగ్గింది.

✦ సీఈఓల సగటు వార్షిక వేతనం 2020-21లో రూ.9.3 కోట్లు కాగా, 2024-25లో రూ.10 కోట్లకు వృద్ధి చెందింది. ఇదే సమయంలో కంపెనీల మొత్తం వేతనాలు రూ.2700 కోట్ల నుంచి రూ.4700 కోట్లకు చేరాయి.

టోకు ద్రవ్యోల్బణం మైనస్‌లోనే



పప్పులు, కూరగాయల వంటి ఆహార వస్తువుల ధరలు పెరిగినా, వరుసగా రెండో నెలా టోకు ధరల ద్రవ్యోల్బణం 'ప్రతికూలం'లోనే కొనసాగింది. ఈ ఏడాది నవంబరులో టోకు ద్రవ్యోల్బణం -0.32 శాతంగా నమోదైంది. 2024 నవంబరులో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2.16%.. ఈ ఏడాది అక్టోబరులో ఇది -1.21 శాతంగా నమోదైంది. ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం..

✦ 2025 ఏప్రిల్ నుంచి 8 నెలలుగా ఆహార పదార్థాల్లో ప్రతి ద్రవ్యోల్బణ స్థితి సాగుతోంది. అక్టోబరులో ఇది -8.31% కాగా, నవంబరు -4.16 శాతానికి పెరిగింది.

✦ కూరగాయల ద్రవ్యోల్బణం -34.97% నుంచి -20.23 శాతానికి చేరింది. పప్పులు, బంగాళదుంపలు, ఉల్లిపాయల ప్రతి ద్రవ్యోల్బణం వరుసగా -15.21%, -36.14%, -64.70 శాతంగా నమోదయ్యాయి.

✦ తయారీ వస్తువుల ద్రవ్యోల్బణం 1.54% నుంచి 1.33 శాతానికి తగ్గింది. ఇంధనం- విద్యుత్ ద్రవ్యోల్బణం -2.55% నుంచి -2.27 శాతానికి చేరింది.

కిలో చక్కెర కనీస విక్రయ ధర రూ.41

ప్రభుత్వానికి ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్ ప్రతిపాదన

దిల్లీ: 2025-26 సీజన్ (అక్టోబరు-సెప్టెంబరు)లో ఇప్పటి వరకు చక్కెర ఉత్పత్తి 28.33% పెరిగి 77.90 లక్షల టన్నులకు చేరినట్లు సహకార మిల్లుల సమాఖ్య (ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్) తెలిపింది. సాగు వ్యయాలతో పాటు ఇతర ఖర్చులు పెరిగిన నేపథ్యంలో, చక్కెర కనీస విక్రయ ధరను కిలోకు రూ.41 చేయాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ (ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ సీజన్ ప్రారంభం నుంచి చూస్తే, చక్కెర ధర టన్నుకు దాదాపు రూ.2,300 తగ్గి, రూ.37,700కు చేరిందని ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్ వెల్లడించింది. డిసెంబరు 15 వరకు చూస్తే, 79 మిల్లుల నుంచి 77.90 లక్షల టన్నుల పంచదార ఉత్పత్తి జరిగినట్లు పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో 473 మిల్లుల నుంచి ఉత్పత్తి అయిన 60.70 లక్షల టన్నులకంటే ఇది 28% అధికం.

✦ ఇథనాల్ ఉత్పత్తికి మరో 5 లక్షల టన్నుల చక్కెర కేటాయించాలని, దీని ద్వారా దాదాపు రూ.2000 కోట్ల ఆదాయ సృష్టి జరుగుతుందని తెలిపింది.

టాటా పవర్ రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి 2029-30 దాకా ఏటా రూ.25,000 కోట్ల చొప్పున మొత్తం రూ.1.25 లక్షల కోట్ల మూలధన వ్యయాలను చేయాలని టాటా పవర్ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో 65 శాతాన్ని స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టుల పైనే పెట్టనుంది. తద్వారా 2029-30 కల్లా 30 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవాలన్నది లక్ష్యం. అందులో 20 గిగావాట్ల మేర హరిత ఇంధనమే ఉండనుంది. ఈ విస్తరణల ద్వారా 2029-30 కల్లా రూ.లక్ష కోట్ల ఆదాయం, రూ.10,000 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం 15.7 గిగావాట్లు కాగా.. ఇందులో 7 గిగావాట్ల మేర స్వచ్ఛ ఇంధనమే ఉంది.

దేశంలోనే అతిపెద్ద సోలార్ వేఫర్ ప్లాంటు

దేశంలోనే అతిపెద్ద సోలార్ వేఫర్స్, ఇన్‌గాట్స్ తయారీ నిమిత్తం రూ.6,500 కోట్ల పెట్టుబడులతో 18-24 నెలల్లో ప్లాంటు పూర్తి చేయనున్నట్లు కంపెనీ సీఈఓ ప్రవీర్ సిన్హా పేర్కొన్నారు.

✦ 2047 కల్లా కనీసం 100 గిగావాట్ల అణు విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం కనుక, ఈ రంగంలోనూ అడుగుపెట్టాలని కంపెనీ భావిస్తోంది.

సూచీలకు స్వల్ప నష్టాలు

సెన్సెక్స్ ▼ 54 **85213** | నిఫ్టీ ▼ 20 **26027**



డాలరు @ రూ.90.78

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.1468.32 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.1792.25 కోట్లు

విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలు కొనసాగడంతో సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. విదేశీ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, బలహీన రూపాయి ప్రభావం చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 29 పైసలు తగ్గి 90.78 వద్ద ముగిసింది. ఇది తాజా జీవనకాల కనిష్ఠ స్థాయి. బ్రెంట్ ముడి చమురు ధర 0.13% తగ్గి 61.03 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.74,000 కోట్లు పెరిగి రూ.471.03 లక్షల కోట్ల (5.19 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

ఆద్యంతం ప్రతికూల ధోరణిలోనే..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 85,267.66) ఉదయం 376 పాయింట్ల నష్టంతో 84,891.75 వద్ద ఆరంభమైంది. నష్టాలను క్రమంగా తగ్గించుకుంటూ, ఒక దశలో 85,278.63 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 54.30 పాయింట్ల నష్టంతో 85,213.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 19.65 పాయింట్లు కోల్పోయి 26,027.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,047.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని; 25,904.75 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది.

సగం.. సగం..: సెన్సెక్స్ 30 షేర్లలో సగం లాభాల్లో, మిగతా సగం నష్టాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 1.94%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.79%, మారుతీ సుజుకీ 0.71%, అదానీ పోర్ట్స్ 0.66%, భారతీ ఎయిర్‌టెల్ 0.55%, పవర్‌గ్రిడ్ 0.49% చొప్పున డీలాపడ్డాయి. హిందుస్థాన్ యునిలీవర్ 1.42%, ట్రెంట్ 0.79%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.7%, ఏషియన్ పెయింట్స్ 0.53%, టాటా స్టీల్ 0.52% లాభపడ్డాయి.

✦ పబ్లిక్ ఇష్యూకు వెళ్లే నిమిత్తం సెబీకి ముసాయిదా పత్రాలను **రెన్నీ స్ట్రిప్స్ లిమిటెడ్** సమర్పించింది. రూ.300 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా మరో 1.2 కోట్ల షేర్లను ఈ కంపెనీ విక్రయించనుంది.

✦ **ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ** తొలి పబ్లిక్ ఆఫర్ రెండో రోజుకే 2.11 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 83% షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి.

✦ **హ్యుందాయ్ మోటార్ ఇండియా** మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా తరుణ్ గార్గ్ నియామకానికి వాటాదార్లు ఆమోదం తెలిపారు. ఆయన నియామకం 2026 జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఆయన కంపెనీలో ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా వ్యవహరిస్తున్నారు.

✦ **హెచ్‌ఆర్ఎస్ అలుగ్లేజ్** ఐపీఓ ముగిసేసరికి 44.90 రెట్ల అధిక స్పందన లభించింది.

కరోనా రెమిడీస్ కళకళ.. వేక్‌ఫిట్ వెలవెల

సోమవారం స్టాక్ మార్కెట్లో నమోదైన కరోనా రెమిడీస్, వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ షేర్లకు మదుపర్ల నుంచి భిన్న స్పందన లభించింది.

✦ **కరోనా రెమిడీస్ లిమిటెడ్** షేరు, ఇష్యూ ధర రూ.1,062తో పోలిస్తే 36.72% అధికంగా రూ.1,452 వద్ద నమోదైంది. అదే జోరు కొనసాగిస్తూ 41.14% లాభంతో రూ.1,499 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. ఆఖరుకు 35.32% లాభంతో రూ.1,437.20 వద్ద స్థిరపడింది.

✦ **వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్** షేరు, ఇష్యూ ధర రూ.195తో పోలిస్తే 0.46% తక్కువగా రూ.194.10 వద్ద నమోదైంది. ఒక దశలో 9.10% నష్టంతో రూ.177.25కు దిగివచ్చింది. చివరకు 1.38% నష్టంతో రూ.192.30 వద్ద ముగిసింది.

ఈనాడు సినిమా




పవన్ కల్యాణ్

ఆ కోరిక నెరవేర్చేందుకే ఈ పాట

"రం పం పం రం పం పం.. స్టెప్పేస్తే భూకంపం" అంటూ 'ఉస్తాద్ భగత్ సింగ్' తొలి పాట 'దేఖ్ లేంగే సాలా'తో ప్రేక్షకుల్ని పలకరించారు పవన్ కల్యాణ్. ఇటీవల విడుదలైన ఆ గీతం 24 గంటల్లోనే 29.6 మిలియన్ వీక్షణలతో రికార్డులు బద్దలు కొట్టి సరికొత్త చరిత్ర సృష్టించినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని సోమవారం సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటూ సంతోషం వ్యక్తం చేసింది. "పవన్ కల్యాణ్‌ని మళ్లీ 'గబ్బర్‌సింగ్' తరహా పాటల్లో, ఆ తరహా నృత్యాలతో చూడాలనేది ఎంతోమంది అభిమానుల కోరిక. దాన్ని నెరవేర్చేందుకే 'దేఖ్‌లేంగే సాలా' పాటకు శ్రీకారం చుట్టారు హరీశ్ శంకర్. ఆ కృషికి ఫలితంగానే ఈ పాట అభిమానులకు విందు భోజనంలా మారి.. ఇంతటి ఆదరణను దక్కించుకుంటోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం.. పవన్ కల్యాణ్ వేసిన హుషారైన స్టెప్పులు.. దినేశ్ మాస్టర్ కొరియోగ్రఫీ.. భాస్కరభట్ల సాహిత్యం ఈ పాట విజయంలో కీలక పాత్ర పోషించాయ"ని చిత్ర నిర్మాతలు తెలిపారు. పవన్ కల్యాణ్ - హరీశ్ శంకర్ కలయికలో రూపొందిన ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటించారు. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

టీజర్ సిద్ధం



విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవికిరణ్ కోల దర్శకత్వంలో 'రౌడీ జనార్దన్' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కీర్తి సురేశ్ కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈనెల 18న దిల్‌రాజు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించి విజయ్ డబ్బింగ్ పూర్తి చేసినట్లు తెలిసింది. ఇది కోనసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. దీంట్లో ఓ అందమైన ప్రేమకథ మిళితమై ఉంటుంది. విజయ్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో అలరించనున్నారు.

ఓ టీ టీ లో ఈ వారం

చూస్తుండగానే మరో వారం వచ్చేసింది. కొత్త కబుర్ల కోసం ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినీ ప్రియులందరినీ వినోదాలతో అలరించడానికి ఓటీటీలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ఎప్పటిలాగే ఈ వారం కూడా నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేయడానికి వైవిధ్యమైన సిరీస్‌లు, సినిమాలను అందుబాటులో ఉంచుతున్నాయి ఓటీటీలు.

ఫాలౌట్ సీజన్ 2(సిరీస్)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
ఎమిలీ ఇన్ పారిస్ సీజన్ 5(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
రాత్ అకేలీ హై: ది బన్సల్ మర్డర్స్(సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
ఫోర్ మోర్ షాట్స్ ప్లీజ్ సీజన్4(సిరీస్)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
మిసెస్ దేశ్‌పాండే(సిరీస్)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
ఉన్ పార్వైయిల్(సినిమా)	శుక్రవారం	సన్‌నెక్స్ట్
ది గ్రేట్ ఫ్లడ్(సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
ఫార్మా(సిరీస్)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
దివ్య దృష్టి (సినిమా)	శుక్రవారం	సన్‌నెక్స్ట్

రాజు... రాంబాయిల ప్రేమ ముచ్చట్లు



'రాంబాయి నీ మీద నాకు మనసాయెనే..' అంటూ కుర్రకారు గుండెల్లో మారుమోగింది 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ నుంచి వచ్చిన ఈ చిత్రాన్ని సాయిలు కంపాటి తెరకెక్కించారు. అఖిల్ రాజ్, తేజస్విరావ్ జంటగా నటించారు. చైతు జొన్నలగడ్డ, అనిత చౌదరి కీలక పాత్రలు పోషించారు. గత నెల థియేటర్లలోకి వచ్చి యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమా ఇప్పుడు మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. గురువారం నుంచి ఈటీవీ విన్‌లో అందుబాటులో ఉండనుంది. దీంతో పాటు ఈ సినిమా ఎక్స్‌టెండెడ్ కట్‌ను కూడా ఓటీటీలో అందుబాటులో ఉంచనున్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం రాజు, రాంబాయిల ప్రేమ ముచ్చట్ల గురించి మీరూ తెలుసుకోండి.

థ్రిల్ ప్రాప్తిరస్తు



"సారం లేని సంసారం వద్దు.. విడాకులే ముద్దు' అంటూ ఇటీవలే 'ప్రేమంటే' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించారు హీరో ప్రియదర్శి. ఆయన హీరోగా నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన సినిమా ఇది. ఆనంది కథానాయిక. సుమ కనకాల, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. పెళ్లి జరిగిన ఒక నెల తర్వాత ఓ జంట జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. థ్రిల్ ప్రాప్తిరస్తు అంటూ థియేటర్లలో నవ్వులు పంచిన ఈ సినిమా శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా వినోదాలు పంచడానికి సిద్ధమైంది.

ప్రేమ - స్నేహంతో ముడిపడిన పతంగ్



ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్

"పతంగ్' ఓ కొత్త రకమైన సినిమా. యువతరానికి కావాల్సిన అన్ని రకాల అంశాలతో ఆకట్టుకునేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు దేవ కట్టా. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రాన్ని ప్రణీత్ ప్రత్తిపాటి తెరకెక్కించారు. డి.సురేశ్ బాబు సమర్పణలో సురేశ్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మించారు. గౌతమ్ మేనన్, ఎస్పీ చరణ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. దర్శకుడు దేవ కట్టా అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ట్రైలర్ చూసి సూపర్ థ్రిల్‌గా ఫీలయ్యా. ప్రేమ, ఫ్రెండ్‌షిప్, మంచి సంగీతం.. ఇలా ఓ సూపర్ హిట్ సినిమాకి కావాల్సిన అన్ని అంశాలు నిండి ఉన్నాయి" అన్నారు. "ఈ సినిమా చివరి 30నిమిషాల పాటు సాగే పతంగుల పోటీ ఎపిసోడ్ సూపర్‌గా ఉంటుంది. దాన్ని వీఎఫ్ఎక్స్‌లో అద్భుతంగా చేశారు. తెలుగు సినిమా గర్వంగా ఫీలయ్యే చిత్రమిది" అన్నారు నటుడు వంశీ పూజిత్. 'కంటెంట్ పరంగా పెద్ద చిత్రమిది. ఇలాంటి సినిమా తీయాలంటే చాలా ధైర్యం కావాలి" అన్నారు నటుడు ప్రణవ్ కౌశిక్. ఈ కార్యక్రమంలో వడ్లమాని శ్రీనివాస్, రమ్య వేములపాటి తదితరులు పాల్గొన్నారు.



విష్వక్ సేన్

ప్రేమికుల రోజు బరిలో ఫంకీ

'ఫంకీ' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పూయించేందుకు సిద్ధమవుతున్నారు విష్వక్ సేన్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ సినిమాని కేవీ అనుదీప్ తెరకెక్కిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. ఈ సినిమాని వచ్చే ఏడాది వేసవి సందర్భంగా ఏప్రిల్ 3న తెరపైకి తీసుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడీ చిత్రాన్ని నెలన్నర ముందుగానే ప్రేమికుల రోజు కానుకగా 2026 ఫిబ్రవరి 13న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ప్రేక్షకుల్ని వందశాతం కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. విష్వక్ ఇందులో దర్శకుడిగా కనిపించనుండగా.. కయాదు నిర్మాత పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

హాలీవుడ్ దర్శకుడు రాబ్ రైనర్ దంపతులు మృతి



మిచెల్, రాబ్ రైనర్

ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు, నటుడు రాబ్ రైనర్ (78), ఆయన సతీమణి మిచెల్ అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. లాస్‌ఏంజెలీస్‌లోని తమ నివాసంలో ఆదివారం వారిద్దరూ విగతజీవులుగా కనిపించారని, వారి శరీరాలపై కత్తిపోట్లు ఉన్నట్లు అక్కడి పోలీసులు భావిస్తున్నారని హాలీవుడ్ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ.. లాస్ ఏంజెలీస్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కెప్టెన్ మైక్ బ్లాండ్ అనే అధికారి.. ప్రస్తుతం ఈ హత్యలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. 80, 90ల కాలంలో ఎన్నో గుర్తుండిపోయే సినిమాలు చేశారు రాబ్. ఐదు దశాబ్దాల తన సినీప్రయాణంలో 'దిస్ ఈజ్ స్పైనల్ ట్యాప్', 'స్టాండ్ బై మీ', 'ఏ ఫ్యూ గుడ్ మెన్' లాంటి పలు చిత్రాలతో దర్శకుడిగా నిరూపించుకున్నారు. 'బై బై లవ్', 'హాల్స్ ఆఫ్ యాంగర్' లాంటి సినిమాలతో నటుడిగా తనదైన ముద్రవేశారు రాబ్. ఆయన మృతి పట్ల పలువురు హాలీవుడ్ సినీప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సవాల్ చేసే స్క్రిప్ట్‌తో...



హెబ్బా పటేల్, బాబీ సింహా

బాబీ సింహా, హెబ్బా పటేల్ జంటగా ఓ కొత్త చిత్రం శ్రీకారం చుట్టుకుంది. మెహర్ యరమతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని యువ కృష్ణ నిర్మిస్తున్నారు. ఇది సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాతలు ఎస్‌కేఎన్ క్లాప్ కొట్టగా.. వంశీ నందిపాటి కెమెరా స్విచ్చాన్ చేశారు. తనికెళ్ల భరణి దర్శక నిర్మాతలకు స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా హీరో బాబీ సింహా మాట్లాడుతూ 'తెలుగులో హీరోగా ఓ సినిమా చేయాలని చాలా కథలు విన్నా. అప్పుడే నిర్మాత యువ ఈ స్క్రిప్ట్ వినిపించారు. ఓ నటుడిగా నన్ను సవాల్ చేసే స్క్రిప్ట్ ఇది. నా కెరీర్‌లోనే ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఈ నెల 22నుంచి వైజాగ్‌లో చిత్రీకరణ ప్రారంభిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సిద్ధార్థ సదాశివుని.

క్లాప్.. క్లాప్

ఆ అబ్బాయి కావాలమ్మా!



వి.విజయేంద్రప్రసాద్, పవన్ మహావీర్

శివాల ప్రభాకర్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'అమ్మా..నాకు ఆ అబ్బాయి కావాలి'. పవన్ మహావీర్ హీరోగా తెరపైకి అడుగుపెట్టబోతున్న ఈ సినిమాతోనే జి.శైలజా రెడ్డి నిర్మాతగా పరిచయమవుతున్నారు. సుహాస, మేఘశ్రీ కథానాయికలుగా నటిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ రచయిత వి.విజయేంద్రప్రసాద్ క్లాప్ కొట్టగా.. నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఘట్టమనేని శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. కార్యక్రమంలో రేలంగి నరసింహారావు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, శోభారాణి, జేకే భారవి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలో సుమన్, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

వినోదాల 'విష్ణు విన్యాసం'



శ్రీవిష్ణు

శ్రీవిష్ణు హీరోగా యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. జి సుమంత్ నాయుడు నిర్మిస్తున్నారు. నయన సారిక కథానాయిక. ఈ సినిమాకి 'విష్ణు విన్యాసం' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు సోమవారం ఓ యానిమేషన్ వీడియోతో టైటిల్‌ను ప్రకటించారు. "చరిత్ర.. సంఖ్యా శాస్త్రం.. జ్యోతిష్యం.. అన్నీ అతని కోసమే కనుగొనబడ్డాయి" అంటూ ఆ ప్రచార చిత్రంలో వినిపించిన డైలాగ్ ఆసక్తిరేకెత్తించేలా ఉంది. 'అందర్నీ కడుపుబ్బా నవ్వించే సరికొత్త కథతో ఈ సినిమా రూపొందింది. రెండు పాటలు మినహా టాకీ పార్ట్ చిత్రీకరణ మొత్తం పూర్తయింది. దీన్ని ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: రధన్, ఛాయాగ్రహణం: సాయి శ్రీరామ్.

భయపెట్టే 'జిన్'



రాజ్ కందుకూరి, వీరభద్రం చౌదరి, సోహైల్, అమిత్ రావ్, నిఖిల్ ఎం.గౌడ

"ప్రేక్షకులు పెట్టిన డబ్బులకు సరిపడా వినోదాన్ని అందించే చిత్రం 'జిన్'" అన్నారు దర్శకుడు చిన్మయ్ రామ్. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో అమిత్ రావ్, పర్వేజ్ సింబా, ప్రకాశ్ తుమినాడ్ ప్రధాన పాత్రలు పోషించారు. నిఖిల్ ఎం.గౌడ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేశారు. నిర్మాత రాజ్ కందుకూరి, దర్శకుడు వీరభద్రం చౌదరి అతిథులుగా హాజరయ్యారు. "ఇదొక హారర్ సినిమా. దెయ్యాలు, ప్రేతాత్మల్ని ఇస్లాంలో జిన్ అంటారు. భూతాల్ని భయపెట్టే, వదిలించే వ్యక్తిని మౌల్వి అంటారు. నేనిందులో ఆ మౌల్వి పాత్రను పోషించాను. ఈ చిత్రం చాలా కొత్తగా ఉంటుంది" అన్నారు నటుడు అమిత్‌రావ్. ఈ కార్యక్రమంలో పర్వేజ్, సోహైల్, మణికంఠ, భార్గవ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పాత్రా అనుమానాస్పదమే




జయ్ వల్లందాస్

రోహిత్, రియా కపూర్, మేఘనా రాజ్ నాయకానాయికలుగా మహి కోమటిరెడ్డి తెరకెక్కించిన చిత్రం 'మిస్టీరియస్'. జయ్ వల్లందాస్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత జయ్ వల్లందాస్ మాట్లాడుతూ.. "నా మిత్రుడు మహిని దర్శకుణ్ని చేయాలన్న సంకల్పంతో ఈ చిత్రం నిర్మించా. ఇది బలమైన కథతో కూడిన మంచి సస్పెన్స్ థ్రిల్లర్. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. చివరి 20నిమిషాలు ఏం జరుగుతుందా అని ప్రేక్షకులు ఉత్కంఠకు గురవుతారు. దీంట్లో ప్రతి పాత్ర అనుమానాస్పదంగానే ఉంటుంది. కచ్చితంగా ఈ సినిమా అందర్నీ అలరిస్తుంది" అన్నారు.

జి.డి.నాయుడు ముగించారు

శక్తిమంతమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు నటుడు ఆర్.మాధవన్. ఈ ఏడాది 'టెస్ట్', 'కేసరి ఛాప్టర్2' లాంటి వరుస సినిమాలతో తెరపై మెరిసిన ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'జి.డి.నాయుడు'. కృష్ణకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ విజయవంతంగా పూర్తయినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది చిత్రబృందం. 'ది ఎడిసన్ ఆఫ్ ఇండియా'గా పేరు గాంచిన జీడీ నాయుడు జీవితాధారంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. వృత్తిపరంగా ఆయన ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలతో పాటు వ్యక్తిగత జీవితాన్ని ఇందులో చూపించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ బయోపిక్‌లో జీడీ నాయుడుగా కనిపించనున్నారు మాధవన్. ప్రియమణి, జయరామ్, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం మాధవన్ ఖాతాలో 'అదృష్టశాలి', 'ధురంధర్ 2' లాంటి చిత్రాలున్నాయి.



ఆర్.మాధవన్

ఆ సమస్యకు పరిష్కారం తెరపై!



మురళీకాంత్

"చూసిన ప్రతి ఒక్కర్నీ ఆశ్చర్యపరిచే సినిమా 'దండోరా'. ఈ కథ ఎవరి ఊహలకి అందని రీతిలో సాగుతుంది" అన్నారు దర్శకుడు మురళీకాంత్. ఇది ఆయనకు దర్శకుడిగా తొలి సినిమా. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. ఈ సినిమా ఈనెల 25న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు మురళీకాంత్.

- "మలయాళంలో ఎక్కువ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలొస్తుంటాయి అంటుంటారు. అలా మన దగ్గర ఎందుకు రావనే ఆలోచనల్లో నుంచి ఈ కథ రాసుకున్నా. అందరూ టీజర్, పాటలు చూసి దీన్ని 'బలగం'తో పోలుస్తున్నారు. నిజానికి దానికి దీనికి ఏ పోలిక లేదు. ఆ సినిమా ఓ వ్యక్తి చనిపోయిన తర్వాత జరిగే పిండ ప్రదానం చుట్టూ తిరుగుతుంది. మా చిత్రం వ్యక్తి చనిపోయిన తర్వాత నుంచి ఆ శవాన్ని ఖననం చేసే వరకు జరుగుతుంది. ఆ శవాన్ని పూడ్చనీకుండా ఓ ఊరి వాళ్లు ఎందుకు అడ్డుకున్నారు? అసలు ఆ ఊరి సమస్య ఏంటి? దానికి పరిష్కారం దొరికిందా? లేదా? అన్నదే ఈ చిత్ర ఇతివృత్తం".
- "చనిపోయిన వ్యక్తుల్ని పూడ్చేందుకు కులాలు, మతాల వారీగా కొంత భూమి కేటాయిస్తారని నాకంత తెలియదు. అయితే కొన్నేళ్ల క్రితం నుంచి కులాలకు అతీతంగా ఒకే దగ్గర అందరి అంత్యక్రియలు నిర్వహించేలా ప్రభుత్వాలు వైకుంఠ ధామాల్ని ఏర్పాటు చేశాయి. కానీ, అక్కడ కూడా వర్ణ వివక్షత ఎదురవుతోంది. అలాంటి ఘటనల్ని నేను ప్రత్యక్షంగా ఎన్నో చూశాను. అందుకే ఈ సమస్యను తెరపై తప్పక చర్చించాలన్న ఉద్దేశంతో ఈ కథ రాసుకున్నా. ఈ సమస్యకు నేను ఎలాంటి పరిష్కారాన్ని చూపించాను అన్నది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. నిజానికి ఈ చిత్రానికి మేము తొలుత అనుకున్న పేరు 'అంతిమ యాత్ర'. కానీ, ఆ పేరు అంత ప్రభావవంతంగా లేదన్న ఉద్దేశంతో 'దండోరా' అనే టైటిల్ పెట్టాం".
- "ఈ కథ ప్రధానంగా శివాజీ పాత్ర చుట్టూ తిరిగినా.. దీంట్లోని ప్రతి పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. బిందు మాధవి పాత్ర ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. ఈ చిత్ర స్క్రీన్‌ప్లే అద్భుతంగా ఉంటుంది. సినిమా చూశాక ప్రేక్షకులు ఓ అందమైన అనుభూతితో థియేటర్ల నుంచి బయటకొస్తారు. ఈ చిత్ర నేపథ్య సంగీతం అందర్నీ కదిలిస్తుంది".

రణ్‌వీర్ సింగ్ ప్రలే?



రణ్‌వీర్ సింగ్

'ధురంధర్' సినిమా విజయంతో ఈ ఏడాదికి ఉత్సాహంగా సెండాఫ్ చెప్పేశారు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్. ఇప్పుడాయన మరిన్ని వైవిధ్యమైన ప్రాజెక్టులతో 2026కి స్వాగతం పలకడానికి సిద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో 'ప్రలే' అనే చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. దీనికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారట. "పోస్ట్ అపోకలిప్టిక్ జాంబీ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. రణ్‌వీర్ 'డాన్ 3' షూటింగ్‌ను పూర్తి చేసిన తర్వాత వచ్చే ఏడాది ప్రథమార్ధంలో సెట్స్‌పైకి వెళ్తుందీ చిత్రం. సామాజిక పతనం, భావోద్వేగ విచ్ఛిన్నం, సందిగ్ధత లాంటి లోతైన ఇతివృత్తాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఇందులో మనుగడ కోసం పోరాడే వ్యక్తిగా రణ్‌వీర్ పాత్ర ఉండనుంది. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంద"ని రణ్‌వీర్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

కరెంట్ అఫైర్స్



✦ బొలీవియా నూతన అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికయ్యారు?
జ: రోడ్రిగో పాజ్ (ఈయన 54.5 శాతం ఓట్లతో మాజీ అధ్యక్షుడు జార్జ్ క్విరోగో పై విజయం సాధించారు.)

✦ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ఇటీవల విడుదల చేసిన గ్లోబల్ ఫారెస్ట్ రిసోర్సెస్ అసెస్‌మెంట్ (జీఎఫ్ఆర్ఏ) 2025 నివేదిక ప్రకారం మొత్తం అటవీ విస్తీర్ణంలో ప్రపంచంలో భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది?
జ: 9వ స్థానం

మాదిరి ప్రశ్నలు

✦ జాతీయ పౌర విమానయాన విధానం కింద దేశంలో చౌకైన ప్రాంతీయ విమాన ప్రయాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉడాన్ (యూడీఏఎన్– ఉడే దేశ్‌గా ఆమ్ నాగరిక్) పథకం 2025, అక్టోబరు 21న ఎన్నేళ్లు పూర్తి చేసుకుంది?
జ: 9 సంవత్సరాలు (ఈ తొమ్మిదేళ్లలో 649 మార్గాల ద్వారా 3.23 లక్షల విమానాల ద్వారా 1.56 కోట్లకు పైగా ప్రయాణికులకు సేవలు అందించినట్లు కేంద్రం ప్రకటించింది.)

✦ పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని ఏటా ఏ రోజు నిర్వహిస్తారు? (1959లో ఇదే రోజున లద్దాఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్‌లో మోహరించబడిన భారత పోలీసు సిబ్బందిపై చైనా దళాలు చేసిన దాడిలో 10 మంది పోలీసు అధికారులు మరణించడంతో 1960 నుంచి ఈ తేదీన అధికారికంగా పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.)
జ: అక్టోబరు 21

మరింత సమాచారం

మొక్కల్లో జీవ సమన్వయకర్తలు!

జనరల్ స్టడీస్ బయాలజీ



ప్రతి జీవి పెరుగుదలకు, అభివృద్ధికి, పర్యావరణానికి ప్రతిస్పందించడానికి ఒక సంక్లిష్టమైన సమన్వయ వ్యవస్థ ఉంటుంది. మొక్కల్లో ఈ జీవక్రియలన్నింటినీ వృక్షహార్మోన్లు లేదా ఫైటోహార్మోన్లు అనే ప్రత్యేక రసాయనాలు నియంత్రిస్తాయి. ఇవి మొక్కల పెరుగుదల, అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అత్యంత శక్తిమంతమైన, తక్కువ సాంద్రతతో ఉత్పత్తి అయ్యే అణువులు. ఇవి విత్తనాలు మొలకెత్తడం నుంచి పూలు పూయడం, పండ్లు పక్వానికి రావడం, ఆకులు రాలిపోవడం వరకు మొక్కల జీవన చక్రంలో ప్రతి అంశాన్నీ అదుపు చేస్తాయి. ఈ విధంగా మొక్కల్లో జరిగే అనేక రకాల విధులకు కారణమైన ఆ హార్మోన్ల గురించి అభ్యర్థులు పోటీ పరీక్షల కోణంలో తెలుసుకోవాలి. ఫలాల పక్వ దశలో జరిగే మార్పులపై అవగాహన పెంచుకోవాలి.

వృక్ష హార్మోన్లు

మొక్కల్లో ఏర్పడే వృక్షహార్మోనులను (ఫైటో హార్మోనులు) వృద్ధి నియంత్రకాలని, వృద్ధి కారకాలని, పెరుగుదల హార్మోనులని, పెరుగుదల పదార్థాలని వివిధ రకాలుగా పిలుస్తారు. మొక్కల్లో ఉన్న ఈ హార్మోనులు అయిదు రకాలు అవి 1) ఆక్సిన్‌లు 2) జిబ్బరెల్లిన్‌లు 3) సైటోకైనిన్‌లు 4) అబ్‌సైసిక్ ఆమ్లం 5) ఇథిలీన్

1) ఆక్సిన్‌లు : ఆక్సిన్ అనే పదానికి గ్రీకు అర్థం పెరుగుదల. వీటిని ఉద్యానవన, వ్యవసాయంలో విరివిగా వాడతారు. ఇవి నిర్వహించే విధులు-

ఖండించిన కాండం నుంచి వేర్ల ఉత్పత్తి: మల్లె, గులాబీ, మందార లాంటి మొక్కలను శాఖీయ ప్రత్యుత్పత్తి ద్వారా కాండాలను ఉపయోగించి వ్యాప్తి చెందించడానికి ఆక్సిన్‌లను వాడతారు. ఈ కాండాలను భూమిలోకి నాటడానికి ముందు కాండం చివరి భాగాలను ఆక్సిన్‌లో ముంచడం వల్ల వేర్లు తొందరగా, ఎక్కువగా ఏర్పడి భూమిలో నాటుకుంటాయి. ఈ ఉపయోగం వల్లనే ఆక్సిన్‌లను ఉద్యానవన రంగంలో వాడుతున్నారు.



అనిషేకఫలనాన్ని ప్రేరేపించడం: ఫలదీకరణం జరగకుండానే పుష్పంలోని అండాశయం ఫలంగా మారడాన్ని అనిషేక ఫలనం అంటారు. దీనివల్ల విత్తనాలు లేని ఫలాలు ఏర్పడి ఫలాల్లో గుజ్జు పరిమాణం పెరుగుతుంది. టమాటా, ద్రాక్ష లాంటి వాటిపై ఆక్సిన్‌లను చల్లడం వల్ల అవి అనిషేకఫలాలుగా అంటే విత్తనాలు లేని ఫలాలుగా మారతాయి.



కలుపు మొక్కల నివారణకు ఆక్సిన్‌లు: పంట మొక్కల్లో పెరిగే పెద్ద ఆకులు ఉన్న ద్విదళబీజ మొక్కలను చంపడానికి వీటిని వాడతారు. 2, 4 - డైక్లోరో ఫినాక్సీ ఎసిటిక్ ఆమ్లం (2, 4-D), 2, 4-5 ట్రైక్లోరో ఫినాక్సీ ఎసిటిక్ ఆమ్లం (2, 4-5, -T) లను కలుపు మొక్కల నివారిణిగా ఉపయోగిస్తున్నారు. ఈ ఆక్సిన్‌లను కలుపునాశకాలుగా వినియోగించడం వల్ల పర్యావరణం, మనుషులపై ఎటువంటి చెడు ప్రభావం ఉండదు. దీని వల్ల కాలుష్యం జరగదు.

అగ్రాధిక్యాన్ని ప్రేరేపించడం: కాండపు కొన భాగం వేగంగా పెరుగుతూ పక్క పార్శ్వ శాఖల పెరుగుదలను తగ్గించడాన్ని అగ్రాధిక్యం అంటారు. దీనికి కారణం కాండపు కొన మొగ్గలో ఉన్న ఆక్సిన్‌లు. కాండపు మొగ్గను తుంచివేయడం వల్ల పార్శ్వ శాఖలు పెరిగి కాండం గుబురుగా మారుతుంది.

ఇతర విధులు: ఆక్సినులు అనాస లాంటి మొక్కల్లో పుష్పాలు ఏర్పడటాన్ని ప్రేరేపిస్తాయి. ప్రాథమిక దశలో ఉన్న ఫలాలు, పుష్పాలు, పత్రాలు రాలిపోకుండా నియంత్రిస్తాయి. కాని ముదిరిన దశలో ఉన్న ఫలాలను, పత్రాలను రాలడాన్ని ప్రేరేపిస్తాయి.

ఆక్సిన్‌లకు ఉదాహరణ: ఇండోల్ ఎసిటిక్ ఆమ్లం, ఇండోల్ బ్యుటరిక్ ఆమ్లం అనేవి సహజంగా ఉంటాయి. నాఫ్తలీన్ ఎసిటిక్ ఆమ్లం 2, 4 - డైక్లోరో ఫినాక్సీ ఎసిటిక్ ఆమ్లం(2, 4-D), 2, 4-5 ట్రైక్లోరో ఫినాక్సీ ఎసిటిక్ ఆమ్లం(2, 4-5, -T).

2) జిబ్బరెల్లిన్‌లు : వీటిని మొదటిసారి ఒక శిలీంద్రంలో కనుక్కున్నారు. ఇవి పత్రాలు, కాండాగ్రాల్లో ఉంటాయి. జిబ్బరెల్లిన్‌లు నిర్వహించే విధులు - 1) కణుపు మధ్యమాలను పెంచడం ద్వారా కాండం పొడవుగా పెరిగేట్లు చేస్తాయి. 2) పొట్టి మొక్కలను (మరుగుజ్జు మొక్కలను) పొడవుగా పెంచుతాయి. 3) ఫలాలను రాలకుండా నిరోధిస్తాయి. కొన్ని మొక్కల్లో పుష్పాల ఉత్పత్తిని పెంచుతాయి ఆక్సిన్‌ల అనిషేక ఫలాలను ప్రేరేపిస్తుంది. విత్తనాల సుప్తావస్థను తగ్గించి తొందరగా మొలకెత్తే విధంగా చేస్తాయి. జిబ్బరెల్లిన్ ఆమ్లం-1 (GA1, GA2, GA3) లాంటి వాటిని వీటికి ఉదాహరణగా పేర్కొనవచ్చు.






3) సైటోకైనిన్‌లు : ఇవి మొక్కల్లో కణవిభజన అధికంగా ఉండే ప్రాంతాలైన వేరు అగ్రం, కాండం మొగ్గలు, ప్రాథమిక దశలో ఉన్న ఫలాలు లాంటి వాటిలో ఎక్కువగా ఉంటాయి. ఇవి పలు రకాల విధులు నిర్వహిస్తాయి.

కణ విభజనను ప్రేరేపించడం: ❖ ఇవి నిజమైన కణ విభజన కారకాలుగా పనిచేస్తాయి. ❖ దీని ద్వారా పక్క శాఖలు ఎక్కువగా పెరుగుతాయి. కొత్త పత్రాలు ఏర్పడటం, పుష్పాలు, వేర్ల వంటి అవయవాల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. విత్తనాల సుప్తావస్థను తగ్గించి తొందరగా మొలకెత్తే విధంగా చేస్తాయి. అగ్రాధిక్యం, వార్ధక్యాన్ని తగ్గిస్తాయి.

ఆక్సిన్‌లకు ఉదాహరణ: ★ ఐసో పెంటినైల్ అడినైన్ జియాటిన్, కైనటిన్, బెంజైల్ అడినైన్. ★ ఆక్సిన్, జిబ్బరెల్లిన్‌లు, సైటోకైనిన్‌లు పెరుగుదల ఎక్కువ అవడానికి ఉపయోగపడతాయి. కాబట్టి వీటిని పెరుగుదల ప్రోత్సాహకాలు అంటారు.



4) అబ్‌సిసిక్ ఆమ్లం : ఇది మొక్కల్లో కొన్ని విధాలుగా పెరుగుదలను ప్రేరేపిస్తే కొన్ని విధాలుగా పెరుగుదలను నిరోధిస్తుంది. ఇది మొక్కను నీటి ఎద్దడి, అధిక ఉష్ణోగ్రత నుంచి రక్షిస్తుంది. కాబట్టి దీనిని ఒత్తిడి నిరోధించే హార్మోన్ అంటారు. ఇది పత్ర రంధ్రాలను మూసివేసి బాష్పోత్సేకాన్ని నిరోధిస్తుంది. విత్తన సుప్తావస్థను ప్రేరేపించడం ద్వారా విత్తనాలను ప్రతికూల పరిస్థితుల నుంచి కాపాడుతుంది. అనేకసార్లు ఇది జిబ్బరెల్లిన్ ఆమ్లం చర్యలకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. పత్రాల్లో వార్ధక్య దశను ప్రేరేపిస్తుంది.

5) ఇథిలీన్ : దీనిని పండ్లను పరిపక్వం చెందించే హార్మోన్ అంటారు. ఇది పత్రాలు రాలిపోయే విధంగా చేసి అగ్రాధిక్యతను పెంచుతుంది. ఈ హార్మోన్ వాయు రూపంలో ఉంటుంది. పండ్లను కృత్రిమంగా పండించేందుకు ఇథిఫాన్ అనే ద్రావణాన్ని వాడుతున్నారు. ఇది ఇథిలీన్ వాయువును విడుదల చేస్తుంది. అబ్‌సిసిక్ ఆమ్లం, ఇథలీన్‌లు మొక్కల్లో కొన్ని విధులకు వ్యతిరేకంగా ఉండటం వల్ల వీటిని పెరుగుదల నిరోధకాలుగా పిలుస్తారు. ముఖ్యంగా అబ్‌సిసిక్ ఆమ్లం నిరోధకంగా ఉంటుంది. దీన్ని ఇథిలిన్‌తో పోలిస్తే ఎక్కువ వృద్ధి నిరోధకంగా పనిచేస్తుంది.

ఫలాల పక్వదశలో మార్పులు



ఫలాల పక్వదశలో అనేక మార్పులు జరుగుతాయి. ఫలం పైభాగంలో ఉండే పొరలో క్లోరోఫిల్ ఉండటం వల్ల ఆకుపచ్చగా ఉంటుంది. పక్వదశలో దీని స్థానంలో ఇతర వర్ణద్రవ్యాలైన కెరోటినాయిడ్‌లు జమ కావడం వల్ల పసుపు, ఎరుపు నారింజ రంగులోకి మారతాయి. ఫలం పైన ఉండే త్వచం దళసరి నుంచి పలుచగా మారుతుంది. పిండిపదార్థాలు ఎక్కువ పక్వానికి వచ్చిన తర్వాత ఇవి చక్కెరలుగా మారతాయి. మంచి వాసన, బాష్పశీల పదార్థాలు పెరుగుతాయి.



రచయిత: డాక్టర్.బి.నరేష్

జూనియర్ ఇంటర్ భౌతికశాస్త్రం — సరళరేఖాత్మక గమనం



ఫైనల్ పరీక్షలు 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

4 మార్కులు

1. ఒక వస్తువు వేగ దిశ ఆ వస్తువు త్వరణ దిశ కాకుండా వేరే దిశలో ఉండగలదా? ఉదాహరణ ఇవ్వండి.

జ: అవును. వస్తువు యొక్క వేగం దిశ, త్వరణం యొక్క దిశ వేర్వేరుగా ఉండవచ్చు.
ఉదా: 1) పైకి విసిరిన బంతి వేగం దిశపైకి, త్వరణం కిందికి ఉంటాయి.
2) కారు బ్రేకు వేసినప్పుడు వేగ దిశ ముందుకు, త్వరణం వెనుకకు ఉంటుంది.

2. సగటు వేగం, తక్షణ వేగం అనే పదాలను వివరించండి. అవి ఎప్పుడు సమానంగా ఉంటాయి?

జ: సగటు వేగం: $V_{AVe} = \frac{\Delta x}{\Delta t} = \frac{X_2 - X_1}{t_2 - t_1}$

వస్తువు ప్రయాణించిన స్థానభ్రంశాన్ని, ప్రయాణించిన మొత్తం కాల వ్యవధికి గల నిష్పత్తిని సగటు వేగం అంటారు.
తక్షణ వేగం: ఏదైనా నిర్దిష్ట సమయంలో వస్తువు యొక్క వేగం.
వస్తువు సమరీతిచలనంలో ఉన్నప్పుడు సగటు వేగం, తక్షణ వేగం సమానమవుతాయి.

3. ఒక వ్యక్తి తిన్నని రోడ్డు వెంట తన ఇంటి నుంచి 2.5 కి.మీ. దూరాన ఉన్న మార్కెట్‌కు 5 కి.మీ./గం. వడితో నడిచాడు. మార్కెట్ మూసి ఉండటం గమనించి, వెంటనే వెనుదిరిగి ఇంటికి 7.5 కి.మీ./గం. వేగంతో చేరాడు. 0 నుంచి 50 నిమిషాల కాలవ్యవధిలో అతడి
a) సగటు వేగ పరిమాణం b) సగటు వడి కనుక్కోండి.

జ: స్థానభ్రంశం = 0

కాలం = 50 నిమిషాలు $= \frac{50}{60}$ గం. $= \frac{5}{6}$ గం.

సగటు వేగం $= \frac{\text{స్థాన భ్రంశం}}{\text{కాలం}} = \frac{0}{\frac{50}{60}} = 0$

సగటు వడి $= \frac{\text{దూరం}}{\text{కాలం}} = \frac{5 \text{ కి.మీ.}}{\left(\frac{5}{6}\right)}$ గం. = 6 కి.మీ./గం.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు

సమతలంలో చలనం

2 మార్కులు

1. 3 ప్రమాణాలు, 5 ప్రమాణాలు పరిమాణం ఉన్న రెండు బలాలు ఒకదానితో ఒకటి 60° కోణంతో పనిచేస్తున్నాయి. ఫలిత పరిమాణం ఎంత?

జ: P = 3 యూనిట్లు Q = 5 యూనిట్లు θ = 60°

$R = \sqrt{P^2 + Q^2 + 2PQ \cos\theta}$

$= \sqrt{(3)^2 + (5)^2 + 2 \times 3 \times 5 \cos 60^\circ}$

$R = \sqrt{9 + 25 + 30 \times \frac{1}{2}}$


$= \sqrt{9 + 25 + 15} = \sqrt{49} = 7$ యూనిట్లు.



రచయిత: అల్లు రాంబాబు

నిరంకుశత్వాన్ని అంతం చేసిన విప్లవం!

జనరల్ స్టడీస్ - ప్రపంచ చరిత్ర



స్వేచ్ఛ, సమానత్వం కోసం జరిగిన ఫ్రాన్స్ విప్లవం పందొమ్మిదో శతాబ్దంలో ఐరోపా రాజకీయ పటాన్నే మార్చేసింది. జాతీయవాదం ఒక శక్తిమంతమైన సైద్ధాంతిక ప్రేరణగా మారి, ఆస్ట్రియా-హంగరీ, ఒట్టోమన్ లాంటి బహుళ జాతి రాజ్యాలను విచ్ఛిన్నం చేసింది. నిరంకుశ పాలకులను కూలదోసింది. ప్రజాస్వామ్య భావాల వ్యాప్తికి బీజం వేసింది. జాతి, సంస్కృతి, భాష ఆధారంగా ఆధునిక, జాతీయవాద దేశాలు ఏర్పాటయ్యాయి. మొత్తం ఐరోపా రాజకీయాలను, సమాజాలను పునర్నిర్మించిన ఈ పరిణామాలపై పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. చరిత్రలో ఫ్రెంచ్ విప్లవ ప్రాధాన్యం, ఉదారవాదం విస్తృతికి దోహదపడిన పరిస్థితులు, ఈ క్రమంలో జరిగిన ఘర్షణలు, కుదిరిన సంధులు, పారిశ్రామికీకరణ దిశగా పడిన అడుగులు, మొత్తంగా ఆనాటి ఐరోపా కాలమాన పరిస్థితులకు అద్దం పట్టిన చిత్రాలు, ఆధారాల గురించి తెలుసుకోవాలి.

ఐరోపాలో జాతీయవాదం - పురోగతి

1. 1848 ఫ్రెడ్రిక్ సోరియా అనే ఫ్రెంచ్ చిత్రకారుడు ఊహించి గీసిన చిత్రంలో ఉన్న ప్రపంచం?
   1) ప్రజాస్వామం 2) సామ్యవాదం
   3) గణతంత్రం 4) పైవన్నీ

2. ఫ్రెంచ్ విప్లవ కాలంలో చిత్రకారులు స్వేచ్ఛను ఏ రూపంలో చిత్రించారు?
   1) దేవుడు 2) దేవత
   3) మగవారు 4) ఆడవారు (స్త్రీ)

3. చిత్రంలో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ మీదుగా సాగే ఊరేగింపునకు నాయకత్వం వహిస్తున్నది?



   1) అమెరికా సంయుక్త రాష్ట్రాలు
   2) స్విట్జర్లాండ్ 3) 1, 2
   4) ఇంగ్లాండ్

4. నలుపు, తెలుపు, బంగారు రంగుల జెండా ఉన్న దేశం?
   1) అమెరికా 2) స్విట్జర్లాండ్
   3) జర్మనీ 4) ఫ్రాన్స్

5. 1882లో సోర్‌బోన్ యూనివర్సిటీలో ఫ్రెంచ్ తత్వవేత్త దేని గురించి ఉపన్యాసం ఇచ్చారు?
   1) దేశం ఎలా ఏర్పడింది
   2) ప్రపంచం ఎలా ఏర్పడింది
   3) విశ్వం ఎలా ఏర్పడింది
   4) జాతి ఎలా ఏర్పడింది

6. 'జాతి అంటేనేమి' అనే ఉపన్యాసం ఏ శీర్షికతో ప్రచురితమైంది?
   1) నేషన్ 2) సేక్యున్ - నేషన్
   3) క్వెస్ట్-సె-క్యున్-నేషన్ 4) క్వెస్ట్


7. కిందివాటిని పరిగణించండి.
   ఎ) 1789 ఫ్రెంచ్ విప్లవం ద్వారా జాతీయ భావన వ్యక్తమైంది.
   బి) 1789 ఫ్రెంచ్ విప్లవం ద్వారా రాజకీయ, రాజ్యాంగపరమైన మార్పులు సంభవించాయి.
   సి) చక్రవర్తి నుంచి ఫ్రెంచ్ సమూహానికి సార్వభౌమాధికారం బదిలీ అయింది.
   డి) జాతి అంటే ప్రజలు అని నిరూపితమైంది.
   1) ఎ, బి, సి సరైనవి 2) బి, సి, డి సరైనవి
   3) ఎ, బి, సి, డి సరైనవి 4) ఎ, సి, డి సరైనవి

8. కిందివాటిని జతపరచండి.

1) ప్రజాభిప్రాయ సేకరణ	ఎ) ఒక ప్రాంతంలోని ప్రజలు ఏదైనా ఒక ప్రతిపాదనను ఆమోదించడం లేదా తిరస్కరించడం
2) లాపట్రీ	బి) పితృభూమి
3) లేసిటియెన్	సి) పౌరులు
4) సాంప్రదాయవాదం	డి) సాంప్రదాయ వ్యవస్థీకృత సంస్థలు, ఆచారాలు

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   3) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
   4) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి

9. ఫ్రాన్స్‌లోని ఎస్టేట్ జనరల్‌కు ఏమని పేరు మార్చారు?




   1) జాతీయ సభ 2) జాతీయ మండలి
   3) జాతీయ అసెంబ్లీ 4) జాతీయ కాంగ్రెస్

10. ఫ్రెంచ్ రాజ్య లక్ష్యం, దాని ముందున్న కార్యం?
   ఎ) నిరంకుశత్వం నుంచి ఐరోపా ప్రజల్ని స్వేచ్ఛాయుతుల్ని చేయడం.
   బి) ఐరోపా ప్రజలు రాజ్యాలుగా ఏర్పడటానికి సహాయం చేయడం.
   1) ఎ సరైంది, బి సరికాదు
   2) ఎ, బి సరికావు 3) ఎ, బి సరైనవి
   4) ఎ సరికాదు, బి సరైంది

11. జాకోబిన్ క్లబ్‌లో సభ్యులుగా ఎవరు ఉండేవారు?
   1) కులీనులు - భూస్వాములు
   2) మతాధికారులు
   3) విద్యార్థులు, విద్యావంతులైన మధ్యతరగతివారు
   4) పై అందరూ

12. కార్ల్ కాస్పర్‌ఫ్రిట్జ్ ఏ దేశంలోని వైబూకన్‌లో స్వేచ్ఛా వృక్షం నాటుతున్న దృశ్యం గీశారు?
   1) ఫ్రాన్స్ 2) జర్మనీ 3) అమెరికా 4) ఇటలీ

13. కిందివాటిని పరిగణించండి.



   ఎ) 1798లో ఆండ్రియస్ రెబ్‌మాన్ అనే పాత్రికేయుడు జర్మనీ క్యాలెండర్ కవర్ పేజీ రూపొందించారు.
   బి) ఫ్రెంచ్ విప్లవకారులు గుంపుగా కోటపై దాడి చేస్తున్నట్లు చిత్రించారు.
   సి) ఈ చిత్రంలో జర్మనీ ప్రావిన్స్ అయిన కాజల్‌లోని కోట ఉంది.
   డి) ప్రజలు తమ స్వేచ్ఛను తామే సాధించుకోవాలని ఈ క్యాలెండర్ కవర్ పేజీ పై ఉంది.
   ఇ) రెబ్‌మాన్ మైంజ్‌ నగరంలో నివసించేవాడు, జర్మన్ జాకోబిన్ సమూహ సభ్యుడు.
   1) ఎ, బి, సి సరైనవి; డి, ఇ సరికావు
   2) ఎ, సి, ఇ సరైనవి; బి, డి సరికావు
   3) అన్నీ సరైనవి
   4) ఎ, సి సరైనవి; బి, డి, ఇ సరికావు

14. వియన్నా మహాసభ ఎప్పుడు జరిగింది?
   1) 1815 2) 1816
   3) 1817 4) 1818

15. కిందివాటిలో సరైనవి.
   1) 1804లో సివిల్ కోడ్‌గా పిలిచే నెపోలియన్ కోడ్ అమల్లోకి వచ్చింది.
   2) ఈ కోడ్ ప్రకారం చట్టం ముందు అందరూ సమానమే.
   3) ఈ చట్టం ప్రకారం ఆస్తి హక్కుకి హామీ ఇచ్చారు.
   4) పైవన్నీ సరైనవి.

16. లీప్‌జిగ్ యుద్ధం ఎప్పుడు జరిగింది?
   1) 1812 2) 1813
   3) 1815 4) 1817

17. కిందివాటిని జతపరచండి.

1) 1797	ఎ) నెపోలియన్ యుద్ధాలు ప్రారంభం
2) 1815	బి) నెపోలియన్ పతనం
3) 1821	సి) గ్రీకు స్వతంత్ర సమరం ప్రారంభం
4) 1905	డి) హాబ్స్‌బర్గ్, ఒట్టోమన్ సామ్రాజ్యంలో బానిసల జాతీయవాదం బలం పుంజుకుంది.

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
   3) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
   4) 1-ఎ, 2-డి, 3-సి, 4-ఎ

18. 18వ శతాబ్దం మధ్యకాలంలో ఆస్ట్రియా – హంగరీలను పాలించిన రాజవంశం?
   1) స్టూవర్ట్ 2) ట్యూడర్
   3) హబ్స్‌బర్గ్ 4) లూయి

19. హంగరీ జనాభాలో సగం మంది ఏ భాష మాట్లాడేవారు?
   1) మాగ్యర్ 2) ఫ్రెంచ్
   3) లాటిన్ 4) ఇంగ్లిష్

20. ఇంగ్లాండ్‌లో పారిశ్రామికీకరణ 18వ శతాబ్దం ద్వితీయార్థంలో ప్రారంభమైంది. ఫ్రాన్స్, జర్మనీలో ఏ శతాబ్దంలో ప్రారంభమైంది?
   1) 17వ శతాబ్దం 2) 19వ శతాబ్దం
   3) 20వ శతాబ్దం 4) 21వ శతాబ్దం

21. స్వేచ్ఛ అనే పదాన్ని లిబర్ అనే పదం నుంచి తీసుకున్నారు. లిబర్ ఏ భాషా పదం?
   1) లాటిన్ 2) ఆంగ్లం
   3) గ్రీకు 4) ఫ్రెంచ్

22. ఏ విప్లవం తర్వాత నుంచి ఉదారవాదం.. నిరంకుశత్వం, మతపరమైన హక్కులు అంతం చేయడానికి మద్దతు ఇచ్చింది?
   1) అమెరికా విప్లవం 2) రష్యా విప్లవం
   3) ఇంగ్లాండ్ విప్లవం 4) ఫ్రాన్స్ విప్లవం

23. కింది వాక్యాలు పరిగణించండి.
   ఎ) ఫ్రాన్స్ విప్లవానికి ముందు కాలంలో ఆస్తి లేని పురుషులు, మహిళలకు రాజకీయ హక్కులు నిరాకరించారు.
   బి) జాకోబిన్ పరిపాలనా కాలంలో వయోజనులైన పురుషులు ఓటు హక్కు అనుభవించారు.
   సి) నెపోలియన్ కోడ్ మహిళలందరినీ మైనర్లుగా ప్రకటించింది.
   1) ఎ, బి సరైనవి; సి సరికాదు
   2) ఎ, సి సరైనవి; బి సరికాదు
   3) ఎ, బి, సి సరైనవి 4) ఎ, బి, సి సరికావు

24. 1833లో హంబర్గ్ నుంచి న్యూరెంబర్గ్‌కు సరకులు విక్రయించేందుకు ప్రయాణించే వర్తకుడు ఎన్ని కస్టమ్స్ అడ్డంకులు అధిగమించాలి?
   1) 10 2) 11 3) 12 4) 13

25. 1834లో ఏ దేశం చొరవతో ఒక కస్టమ్స్ యూనియన్ 'జోల్వెరిన్' ఏర్పడింది?
   1) రష్యా 2) ఫ్రాన్స్ 3) ప్రష్యా 4) ఇంగ్లాండ్

26. "జర్మన్లను ఆర్థికంగా ఒక దేశంగా సంఘటితం చేయడమే జోల్వెరిన్ లక్ష్యం" అన్నది ఎవరు?



   1) ఫ్రెడరిక్ లిస్ట్
   2) ఫ్రెడరిక్ ఏంజెల్
   3) నెపోలియన్
   4) బిస్మార్క్

27. 1815 వియన్నా సమావేశం తర్వాత జరిగిన మార్పులు?
   ఎ) ఫ్రాన్స్‌కి ఉత్తర దిక్కున బెల్జియంతో కూడిన నెదర్లాండ్స్ ఏర్పడింది.
   బి) దక్షిణాన పీడ్మాంట్‌కు జెనీవా కలిసింది.
   సి) ఉత్తర ఇటలీపై నియంత్రణను ఆస్ట్రియాకు ఇచ్చారు.
   డి) పోలండ్‌లో కొంత భాగం రష్యాకు, సాక్సనీలో కొంత భాగం ప్రష్యాకు ఇచ్చారు.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి 4) ఎ, సి, డి

28. జాకోమామాంటిగాజ్జు 1833లో ఎవరి చిత్రం వేశారు?
   1) గారిబాల్డీ 2) మాజిని 3) కవూర్ 4) ఇమాన్యుయేల్

29. 19వ శతాబ్దం మధ్యకాలానికి ఇటలీ ఎన్ని రాజ్యాలుగా విడిపోయింది?
   1) 10 2) 11 3) 7 4) 9

30. ఏ సంవత్సరంలో ఏకీకృత ఇటాలియన్ గణతంత్రాన్ని ఏర్పరచడానికి గిస్సెప్పి మాజిని ఒక కార్యక్రమాన్ని రూపొందించారు?
   1) 1850 2) 1830 3) 1820 4) 1840

31. ఆస్ట్రియన్ సైన్యాన్ని సార్డీనియా–పీడ్మాంట్ ఓడించిన సంవత్సరం?
   1) 1852 2) 1850 3) 1856 4) 1859

32. 1860లో దక్షిణ ఇటలీ నుంచి సిసిలీస్ రాజ్యంలోకి చొచ్చుకుపోయి ఎవరిని తరిమి కొట్టడానికి స్థానిక రైతాంగం మద్దతునిచ్చింది?
   1) స్పానిష్ పాలకులు
   2) డచ్‌వారు
   3) ఇంగ్లిష్‌వారు
   4) ఇతర ఇటాలియన్ పాలకులు



రచయిత: గద్దె నరసింహారావు


సమాధానాలు

1-4; 2-4; 3-3; 4-3; 5-4; 6-3; 7-3; 8-1; 9-3; 10-3; 11-3; 12-2; 13-3; 14-1; 15-4; 16-2; 17-1; 18-3; 19-1; 20-2; 21-1; 22-4; 23-3; 24-2; 25-3; 26-1; 27-1; 28-2; 29-2; 30-2; 31-4; 32-1.


ఉష్ణం అనేది ఒక శక్తి స్వరూపం. ఒక వ్యవస్థ పనిచేయడానికి ఉష్ణం సహాయపడుతుంది. ఉష్ణశక్తి ఎల్లప్పుడూ వేడి వస్తువుల నుంచి చల్లని వస్తువులకు ప్రవహిస్తుంది. ఒక వస్తువు వెచ్చదనం లేదా చల్లదనం స్థాయిని ఉష్ణోగ్రత అంటారు. కెల్విన్ మానంలో తెలియజేసే ఉష్ణోగ్రతే పరమ ఉష్ణోగ్రత. ఉష్ణశక్తి ప్రసార దిశను ఉష్ణోగ్రత నిర్ణయిస్తుంది.

రెండు వస్తువుల మధ్య ఉష్ణ ప్రసారం మూడు పద్ధతుల్లో ఏదో ఒక రకంగా జరుగుతుంది. అవి: ఉష్ణ వహనం, ఉష్ణ సంవహనం, ఉష్ణ వికిరణం.

ఉష్ణం - ఉష్ణోగ్రత



ఉష్ణ వికిరణం



వేడి వస్తువు నుంచి చల్లని వస్తువుకు ఉష్ణ ప్రసారం తరంగాల రూపంలో జరుగుతుంది. ఈ రెండింటి మధ్య యానకం ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు. కానీ ఉష్ణం వికిరణాల రూపంలో ప్రసారమవుతుంది.

▼ ఉష్ణ వికిరణాలు కూడా కాంతి కిరణాల మాదిరిగానే విద్యుదయస్కాంత కిరణాలు. వీటి పౌనఃపున్యం కాంతి కంటే తక్కువగా ఉంటుంది. విద్యుదయస్కాంత వర్ణపటంలో వీటిని పరారుణ కిరణాలు అంటారు.

▼ 0 (సున్నా) కెల్విన్ ఉష్ణోగ్రత తప్ప మిగతా ఏ ఉష్ణోగ్రతలో ఉన్న వస్తువైనా పరారుణ వికిరణాలను విడుదల చేస్తుంది. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ విడుదలయ్యే వికిరణాల పౌనఃపున్యం పెరుగుతుంది.

▼ కొన్ని వస్తువులు ఉష్ణ వికిరణాలను శోషించుకుని వేడెక్కుతాయి, మరికొన్ని వేడెక్కవు.

ఉదా: భూమిని ఆనుకుని ఉన్న గాలి కంటే ఎక్కువ ఎత్తులో ఉండే గాలి చల్లగా ఉంటుంది. ఎక్కువ ఎత్తులో ఉన్న గాలి ఉష్ణాన్ని సౌర వర్ణపటం నుంచి శోషించుకోకపోవడమే ఇందుకు కారణం.

ధర్మాలు:

ఇవి కూడా ఇతర విద్యుదయస్కాంత వికిరణాల మాదిరిగానే 3×10^8 మీ./సె. వేగంతో ప్రయాణిస్తాయి.

☛ యానకం లేకపోయినా శూన్యం నుంచి ప్రయాణిస్తాయి. భూమిపై పడే సూర్యుడి వికిరణాలు మనం ఈ విధంగానే పొందుతున్నాం.

☛ ఉష్ణ వికిరణాలు సరళరేఖ వెంట ప్రయాణిస్తాయి. అందువల్లే ఎండలో గొడుగు పట్టుకుని నిల్చుంటే ఉష్ణ వికిరణాలు వంగి గొడుగులోకి రాలేవు.

☛ కాంతి మాదిరిగానే ఉష్ణ వికిరణాలు కూడా పరావర్తనం, వక్రీభవనం లాంటి ప్రక్రియలకు గురవుతాయి.

☛ ఉష్ణ వికిరణాలు అవి ప్రయాణించే యానకాన్ని వేడి చేయవు.

అనువర్తనాలు:

శీతాకాలంలో ముదురు రంగు బట్టలు, వేసవిలో తెల్లని వస్త్రాలు ధరించడం వల్ల ఉష్ణ వికిరణాన్ని శోషించుకోవడంలో మార్పులు చేయవచ్చు.

☛ మెరిసే ఉపరితలాలు ఉష్ణాన్ని పరావర్తనం చెందిస్తాయి. అందుకే ఉష్ణాన్ని నియంత్రించేందుకు కర్మాగారాల ఉపరితలాలకు తెలుపు పెయింట్ వేస్తారు.

☛ వంట పాత్రల అడుగు భాగానికి నలుపు రంగు (మసి) పూసి ఎక్కువ ఉష్ణాన్ని శోషించుకునేలా చేస్తారు. పాత్ర గోడలు మెరిసేలా ఉంచి, లోపలి ఉష్ణం వికిరణాల రూపంలో బయటకు పోకుండా నియంత్రించవచ్చు.

సరళరేఖ వెంటే...

ఉష్ణ వికిరణాల ప్రయాణం!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

ఉష్ణ వహనం

ఘనపదార్థాల్లో అణువులు ఒకచోటు నుంచి మరోచోటుకి కదలకుండానే వాటి మధ్య ఉష్ణ ప్రసారం జరిగితే ఆ దృగ్విషయాన్ని 'ఉష్ణ వహనం' అంటారు.

ఉదా: ఒక ఇనుప కడ్డీని కొలిమిలో ఉంచితే మంటలో ఉన్న కొనతో పాటు అవతలి కొన కూడా వేడెక్కుతుంది. అంటే ఉష్ణ వహనం ద్వారా ఉష్ణ ప్రసారం జరిగిందని అర్థం.

✦ గతిశక్తి ఆధారంగా వివరిస్తే, ఘనపదార్థంలోని అణువులు ఉష్ణశక్తిని గ్రహించి అధిక వేగం, కంపన పరిమితితో కంపించడం ప్రారంభిస్తాయి. ఈ విధంగా గ్రహించిన శక్తిని పక్కనున్న అణువులకు బదిలీ చేస్తాయి. ఇది నిరంతరాయంగా జరిగి అవతలి కొనని కూడా వేడెక్కేలా చేస్తుంది.

ఉత్తమ, అధమ వాహకాలు

ఉష్ణ వహనం ఆధారంగా పదార్థాలను రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:

ఉత్తమ వాహకాలు: ఉష్ణ వహనం సులభంగా జరిగే పదార్థాలను ఉత్తమ వాహకాలు అంటారు. లోహాలన్నీ ఉత్తమ ఉష్ణ వాహకాలే. వెండి అత్యుత్తమ ఉష్ణ వాహకం కాగా రాగి, అల్యూమినియం ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అలోహాల్లో గ్రాఫైట్ ఉత్తమ ఉష్ణ వాహకం. పాదరసం ద్రవస్థితిలో ఉన్నప్పటికీ లోహం కాబట్టి ఉత్తమ ఉష్ణ వాహకం.

అనువర్తనాలు: ఉత్తమ వాహకం కావడం వల్లే ఉష్ణమాపకాల్లో పాదరసాన్ని వినియోగిస్తారు. లోహాలతోనే వంట పాత్రలు తయారు చేస్తారు. వాహనాల రేడియేటర్లలో రాగి గొట్టాల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. ఎందుకంటే రాగి ఉత్తమ వాహకం కాబట్టి. అది ఉష్ణాన్ని గ్రహించి పరిసరాల్లోకి విడిచిపెడుతుంది. ఫ్రిజ్‌లు, ఏసీలలో కూడా రాగి గొట్టాలనే వాడతారు. సోల్డరింగ్ చేసేటప్పుడు లోహాల వాహకత్వాన్ని ఉపయోగిస్తారు.


అధమ వాహకాలు: తమ ద్వారా ఉష్ణ వహనం జరగనివ్వని పదార్థాలను అధమ వాహకాలు అంటారు. గాజు, ఉన్ని, చెక్క, రబ్బరు, ప్లాస్టిక్ లాంటి ఘనపదార్థాలు, పాదరసం తప్ప మిగిలిన అన్ని ద్రవాలు, వాయువులు అధమ ఉష్ణ వాహకాలు. ఈ వాహకాల్లో స్వేచ్ఛా ఎలక్ట్రాన్లు తక్కువ సంఖ్యలో ఉండటమే ఇందుకు కారణం.

ఉష్ణ వాహకత్వం: ఒక ఉష్ణ వాహకం తన ద్వారా పంపగలిగే ఉష్ణం దాని ఉష్ణ వాహకత్వంపై ఆధారపడి ఉంటుంది. వివిధ లోహాలకు ఇది వేర్వేరుగా ఉంటుంది. ఉష్ణం పరంగా నీరు, గాలి అధమ వాహకాలు.

అనువర్తనాలు:

శీతల ప్రాంతాల్లో జీవించే జంతువుల శరీరంపై ఎక్కువ మొత్తంలో వెంట్రుకలు ఉంటాయి. వీటి మధ్య గాలి బంధితమై ఉండటం వల్ల శరీరం వెచ్చగా ఉంటుంది.

▌చలి వాతావరణం నుంచి రక్షించుకోవటానికి ఉన్ని వస్త్రాలు, దుప్పట్లను ఉపయోగిస్తుంటాం. వీటిలో ఎక్కువ మొత్తంలో గాలి బంధితమై ఉండటంతో శరీరం లోపలి ఉష్ణాన్ని బయటకు ప్రవహించనీయదు. ఫలితంగా శరీరం వెచ్చగా ఉంటుంది. ఇక్కడ గాలి అధమ ఉష్ణవాహకం కావడమే ఇందుకు కారణం.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

ఉష్ణ సంవహనం



ప్రవాహిల్లో (ద్రవాలు, వాయువులు) ఉష్ణ ప్రసారం సంవహనం ద్వారా జరుగుతుంది. ప్రవాహిలో అణువులు కదిలే స్వేచ్ఛను కలిగి ఉంటాయి. ఉష్ణాన్ని సరఫరా చేసినప్పుడు అణువులు ఆ శక్తిని శోషించుకుని దూరంగా కదులుతాయి. మిగిలిన అణువులు ఆ వైపుగా కదిలి శక్తిని గ్రహిస్తాయి. ఈ విధంగా ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి అణువుల కదలిక ద్వారా ఉష్ణ ప్రసారం జరగడాన్ని ఉష్ణ సంవహనం అంటారు.

❖ ఇది కేవలం ద్రవాలు, వాయువుల్లో మాత్రమే సాధ్యపడుతుంది. ఘనపదార్థాల్లో సాధ్యం కాదు. ఎందుకంటే ఘనపదార్థాల్లోని అణువులు స్థిరంగా ఉండటమే ఇందుకు కారణం.

ద్రవాల్లో అనువర్తనాలు: కార్లు, ఇతర వాహనాల్లోని రేడియేటర్లు ఉష్ణ సంవహనం ఆధారంగా పనిచేస్తాయి. రేడియేటర్‌లోని ద్రవం ఇంజిన్‌లోని ఉష్ణాన్ని గ్రహించి, దూరంగా ప్రవహించి చల్లగా మారిన తర్వాత తిరిగి ఇంజిన్ వైపు ప్రవహిస్తుంది.

◆ ఉష్ణ మండల ప్రాంతాల్లోని సముద్రపు నీరు వేడెక్కి ధ్రువ ప్రాంతాల వైపు ప్రయాణిస్తుంది. అదేవిధంగా ధ్రువ ప్రాంతాల్లోని సముద్రపు నీరు ఉష్ణ మండలం వైపు ప్రయాణిస్తుంది. ఇలా ఉష్ణ సంవహనం ద్వారా సముద్రపు నీరు వాతావరణ సమతౌల్యతను కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.

వాయువుల్లో అనువర్తనాలు: భూగోళంపై వేర్వేరు ప్రాంతాలు వేర్వేరుగా వేడిని గ్రహిస్తాయి. భూమధ్య రేఖ వద్ద ఎక్కువ ఉష్ణం శోషణం కావడంతో గాలి తేలికై పైకి వెళ్తుంది. ధ్రువ ప్రాంతాల్లో గాలి చల్లగా ఉండటం వల్ల పీడనం ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా గాలి నిరంతరం అధిక పీడనం నుంచి అల్ప పీడనానికి ప్రవహిస్తూ ఉంటుంది. దీనికి భూభ్రమణం తోడై అనేక గాలి ప్రవాహాలు ఏర్పడతాయి.

◆ భూమి, సముద్రంపై పవనాలు ఏర్పడటంలోనూ ఉష్ణ సంవహనం ప్రముఖపాత్ర పోషిస్తుంది.

Word of the Day 862

Winnow

Telugu meaning: పడపోత, విడదీయడం

English meaning: The word winnow (విన్) is a verb that means to separate useful or important things from the less useful ones, originally referring to separating grain from chaff.

Synonyms: Filter, Sift; ***Antonyms:*** Combine, Merge

Usage: 1. The committee had to winnow dozens of applications to select the most deserving candidates.

2. She carefully winnowed the important emails from the junk to focus on urgent tasks.

Current Affairs



President Droupadi Murmu presented the National Energy Conservation Awards 2025 and prizes of the National Painting Competition on Energy Conservation in New Delhi on the occasion of National Energy Conservation Day on 14 December 2025.

✦ For the Best Performing state award in energy efficiency, Karnataka was awarded the first prize in Group 1. Andhra Pradesh bagged the first prize in group 2, whereas Kerala was chosen the winner in group 3. For group 4, Assam secured the first position, and Chandigarh won the first position in group 5.



Joshna Chinappa, Abhay Singh, and Anahat Singh led India to a historic win in the final of the Squash World Cup against Hong Kong on 14 December 2025 in Chennai. India won their first-ever squash World Cup title with a 3-0 triumph.



Former law secretary Raj Kumar Goyal was appointed as the head of the Central Information Commission (CIC) on 13 December 2025. Goyal is a retired IAS officer of the Arunachal Pradesh-Goa-Mizoram-Union Territories (AGMUT) cadre of the 1990 batch.

✦ Goyal succeeded Heeralal Samariya, the first Dalit chief of the CIC. With the exit of Samariya - who was appointed chief information commissioner on November 6, 2023 - on September 13 as he completed 65 years of age, the CIC became headless for the seventh time in 11 years.

For more Current Affairs: Scan QR code

విజయ్ దివస్



1947లో బ్రిటిష్ వారు భారత్‌కు స్వాతంత్ర్యాన్ని ప్రకటించడంతోపాటు మన దేశం నుంచి పాకిస్థాన్‌ను విడగొట్టి స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచే రెండు దేశాల మధ్య వివిధ భౌగోళిక, రాజకీయ కారణాల వల్ల పరస్పరం ఘర్షణలు, యుద్ధాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. 1947లో జరిగిన మొదటి కశ్మీర్ యుద్ధం నుంచి 2025లో ఆపరేషన్ సిందూర్ వరకు అనేక ఘటనలు అందులో ఉన్నాయి. ఈ క్రమంలో మన దేశం ఎప్పటికప్పుడు తన వ్యూహాలకు పదును పెడుతూ, సరికొత్త యుద్ధ రీతితో పాకిస్థాన్‌పై పైచేయి సాధిస్తూనే ఉంది. అయితే 1971లో జరిగిన యుద్ధం మన దేశ గెలుపును చాటడంతోపాటు బంగ్లాదేశ్ ఆవిర్భావాన్ని సూచిస్తుంది. ఈ పోరులో భారత్ విజయానికి గుర్తుగా ఏటా డిసెంబరు 16న 'విజయ్ దివస్'గా నిర్వహిస్తారు. దేశ రక్షణలో ప్రాణాలు వదిలిన సైనికులను స్మరించుకోవడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

డిసెంబరు 16

చరిత్రలో ఈనాడు

యుద్ధానికి కారణాలు

1905లో లార్డ్ కర్జన్ మతం ఆధారంగా బెంగాల్‌ను రెండు భాగాలుగా విభజించాలని నిర్ణయించాడు. తూర్పు బెంగాల్ ముస్లిం ఆధిపత్య ప్రాంతం కాగా, పశ్చిమ బెంగాల్‌లో హిందువులు ఎక్కువగా ఉండేవారు. 1911లో బెంగాల్ విభజన తీర్మానం రద్దయ్యింది.

▌1947లో భారతదేశ విభజన తర్వాత మళ్లీ బెంగాల్ విభజన అంశం తెరపైకి వచ్చింది. తూర్పు బెంగాల్ పాకిస్థాన్‌కు ప్రావిన్స్ (అనుబంధ రాజ్యం)గా మారింది. దీన్ని తూర్పు పాకిస్థాన్‌గా పిలిచారు.


▌పాకిస్థాన్, తూర్పు పాకిస్థాన్‌ల మధ్య ఉన్న ఏకైక సారూప్యత మతం మాత్రమే. ఈ రెండూ భౌగోళికంగా దూరంగా ఉండటమే కాక.. ప్రజల భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాల్లో తేడా ఉండేది. పాలనలోనూ అనేక సమస్యలు ఎదురయ్యాయి.

▌నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ తూర్పు పాకిస్థాన్ కోరుకునే స్వాతంత్ర్యానికి మద్దతు ప్రకటించడంతోపాటు పాకిస్థాన్ సైన్యానికి వ్యతిరేకంగా భారత సేనలను ఉపయోగించారు. దీంతో భారత్ - పాకిస్థాన్ మధ్య యుద్ధం అనివార్యమైంది.

చారిత్రక నేపథ్యంతో సహా పూర్తి సమాచారం, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ భారతదేశ చరిత్ర

భారత జాతీయ సైన్యం (ఆజాద్ హింద్ ఫౌజ్)



బ్రిటిష్ వారి దాస్యశృంఖలాల నుంచి భరతమాతకు విముక్తి కల్పించడం అహింస, శాంతియుత పోరాటాలతో సాధ్యం కాదని, సాయుధ పోరాటమే దానికి మార్గమని నమ్మిన వ్యక్తి ఆయన. గాంధీజీతో విభేదించి కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చారు. స్వతంత్ర భారతావనిని సాధించడానికి ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేశారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రత్యేక ప్రభుత్వాన్ని స్థాపించారు. ఆయన గురించి వింటే చాలు రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఆయన పేరు తలుచుకుంటే ఏదో తెలియని గర్వం భారతీయుల సొంతం. ఆయనే ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్.

■ భారత జాతీయోద్యమంలో పాల్గొన్న విప్లవ నాయకులతో పాటు ప్రజల విశేష ఆదరాభిమానాలు చూరగొన్న వ్యక్తి సుభాష్ చంద్రబోస్.

■ బోస్ 1897 జనవరి 23న కటక్‌లో జన్మించారు. ఈయన తండ్రి జానకీనాథ్ బోస్ న్యాయవాదిగా పనిచేశారు.

■ 1920లో సివిల్ పరీక్షల్లో ఉత్తీర్ణుడైనప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వంలో పనిచేయడం ఇష్టంలేక బోస్ ఉద్యోగాన్ని వదులుకున్నారు. 1921లో కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోస్ - ఫార్వర్డ్ బ్లాక్ స్థాపన

1938లో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశం గుజరాత్‌లోని హరిపురలో జరిగింది. దీనికి అధ్యక్షుడిగా బోస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

☛ ఇందులో సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఒక గడువును విధించి, బేషరతుగా స్వాతంత్ర్యం ఇవ్వాలని, బ్రిటిష్ ప్రభుత్వానికి తుది హెచ్చరిక చేయాలని ఆయన ఉద్ఘాటించారు.

☛ 1939లో త్రిపుర కాంగ్రెస్ మహాసభ అధ్యక్షుడిగా పోటీ చేశారు. గాంధీజీ తరపు అభ్యర్థి పట్టాభి సీతారామయ్యపై విజయం సాధించారు.

జపాన్‌లో బోస్, ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపన మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్ 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Posts In AP Erstwhile East Godavari

The Andhra Pradesh State Government, under the National Health Mission (NHM), has released a notification through the District Selection Committee for filling the posts on a contract basis in the erstwhile East Godavari district. The total number of posts is 35. The application fee is Rs.300. The last date for online applications is 20 December 2025.

Senior Resident Jobs

The Employees' State Insurance Corporation (ESIC) in Sanathnagar, Hyderabad, is conducting interviews to fill Faculty (Professor, Associate Professor, Assistant Professor), Senior Resident, and Medical Officer posts on a contract basis. The total number of posts is 102. The application fee is Rs.500. Eligible candidates can appear for the interview from 2025 December 29 to 2026 January 7.

Did You Apply..?

Today (December 16) is the last date for the following Jobs

☛ Jobs in the Regional Passport Office, Vijayawada. ***Eligibility:*** Degree.

☛ JRF posts at IIT BHU. ***Eligibility:*** BE/ BTech/ MTech.

☛ Young Professional Posts in IFSCA. ***Eligibility:*** Master's Degree, PG Diploma, Law Degree.

☛ Jobs in the National Institute of Technology, Warangal. ***Eligibility:*** BTech/BE, MTech.

For more information and other notifications - scan QR code

Relative Speed - I

1. The distance between two stations Hyderabad and Kochi is 1135 km. A car starts at 5.00 AM from Hyderabad and moves towards Kochi at an average speed of 90 kmph. Another car starts from Kochi at 5 : 30 AM and moves towards Hyderabad at an average speed of 110 kmph. Then the time at which both the cars meet is:

A) 9 : 57 AM B) 10 : 50 AM
C) 10 : 00 AM D) 10 : 57 AM
E) None of the above

2. Two animals are standing 750 meters apart. First animal can run at a speed of 6 m/sec and the second can run at a speed of 9 m/sec. If two animals run towards each other, after how much time (in seconds) will they meet each other:

A) 55 B) 40 C) 50 D) 45 E) 13

3. Two Cyclists Ravi and Arun start cycling at 23 km/hr and 27 km/hr towards each other. They met after 1 hr 18 min. How far (in km) were they from each other, when they started?

A) 65 km B) 60 km C) 70 km
D) 50 km E) 44 km

4. Two motor cyclists starts at the same time from stations P and Q, 1920 km apart and proceed towards each other at an average speed of 83 km/h and 77 km/h respectively. where will they meet?

A) 924 km from station P
B) 996 km from station P
C) 996 km from station Q
D) 950 km from station Q
E) None of the above

5. The distance between two stations Hyderabad and Chennai is 640 km. Charminar express train leaves from Hyderabad for Chennai and Chennai express train leaves from Chennai for Hyderabad at the same time on the same day on parallel tracks. Both trains meet after $6\frac{2}{3}$ hours. The speed of Charminar express train is 12 kmph more than that of Chennai express train. What is the speed of Charminar express train?

A) 54 kmph B) 45 kmph
C) 60 kmph D) 42 kmph
E) 46 kmph

6. A train 126 m long overtook a person who was walking at the rate 5 kmph and passed him in $8\frac{2}{5}$ seconds. subsequently it overtook a second person and passed him in $9\frac{3}{5}$ seconds. At what rate the second person is travelling?

Bank Exams

Quantitative Aptitude

A) $11\frac{3}{5}$ kmph B) $11\frac{3}{4}$ kmph
C) $11\frac{2}{5}$ kmph C) $11\frac{1}{4}$ kmph
E) None of the above

7. The distance from Warangal to Adilabad is 270 km. A car takes $4\frac{2}{5}$ hrs to cover the distance. Karunakar riding a motor bike starts $1\frac{1}{5}$ hour before the car from Warangal and reaches Adilabad $1\frac{1}{5}$ hour later than the car. Find the speed of Karunakar.

A) $39\frac{16}{17}$ kmph B) $39\frac{10}{17}$ kmph
C) $37\frac{12}{17}$ kmph D) $39\frac{12}{17}$ kmph
E) $42\frac{11}{17}$ kmph

8. Two trains running at the rate of 60 kmph and 48 kmph respectively, on parallel tracks in the opposite direction, are observed to pass each other in 10 seconds. When they are running in the same direction at the same rate as before a person sitting in the faster train observes that he passes the other train 27 sec. Find the length of the slower train.

A) 100 m B) 110 m C) 90 m
D) 120 m E) 67 m

9. Two trucks start at the same time from two villages and proceed towards each other at the rate of 47 kmph and 58 kmph respectively. When they meet, it is found that one truck has travelled 132 km more than the other. Find the distance between two villages.

A) 1300 km B) 1260 km
C) 1280 km D) 1200 km
E) 1360 km

10. Two trains running in opposite directions cross a pole on the platform in 24 sec and 18 sec respectively and they cross each other in 20 seconds. The ratio of their speed is:

A) 3 : 2 B) 2 : 1
C) 2 : 3 D) 1 : 2
E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్
సంస్థ: ఆర్టిజెన్స్ నైపుణ్యాలు: జాంగో, జాంగో రెస్ట్ ఫ్రేమ్‌వర్క్, మెషీన్ లెర్నింగ్, ఓపెన్‌సీవీ, పైతాన్
స్టైపెండ్: రూ.3,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 4
https://shorturl.at/Jscww

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: స్ట్రక్చర్డ్ స్పిరిట్
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, కేన్వా
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: జనవరి 9
https://tinyurl.com/3ta94n9v

క్రియేటివ్ డిజైన్
సంస్థ: అనురాధా శ్రీనివాసన్ - ది లలిత
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, కంటెంట్ రైటింగ్, ఫ్రేమర్, గ్రాఫిక్ డిజైన్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)
స్టైపెండ్: రూ.12,000-30,000
దరఖాస్తు గడువు: జనవరి 9
https://tinyurl.com/2rje27cc

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్
సంస్థ: సిట్రిన్ అండ్ సాజె లిమిటెడ్ (లండన్, యునైటెడ్ కింగ్‌డమ్)
నైపుణ్యాలు: ఫ్లాస్క్, జెమిని, జావాస్క్రిప్ట్, మైఎస్‌క్యూఎల్, ఓపెన్‌ఏఐ ఏపీఐ, పైతాన్, రియాక్ట్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 9
https://tinyurl.com/mr2ktsna

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: టెక్ఏఐవీవీ టెక్నాలజీస్
నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, పర్ఫార్మెన్స్, సోషల్ మీడియా మార్కెటింగ్, కాపీ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం గూగుల్ యాడ్‌వర్డ్స్, గూగుల్ అనలిటిక్స్, లీడ్ జనరేషన్, మార్కెట్ అనాలిసిస్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 9
https://tinyurl.com/ybn29s4f

కోర్స్ డెవలపర్
సంస్థ: సెల్ఫ్‌కోడ్ అకాడమీ
నైపుణ్యాలు: క్రియేటివిటీ, కరిక్యులం డెవలప్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, టీచింగ్
స్టైపెండ్: రూ.6,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 9
https://tinyurl.com/37f77sn5

బామర్ లారీలో మేనేజర్లు

బామర్ లారీ అండ్‌కో లిమిటెడ్, కోల్‌కతా.. మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ✦ డిప్యూటీ మేనేజర్(ట్రావెల్)- 03 ✦ అసిస్టెంట్ మేనేజర్: 10 ✦ జూనియర్ ఆఫీసర్/ఆఫీసర్: 04 ✦ సీనియర్ మేనేజర్: 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఎంటీఎం/ ఎంబీఏ/ ఇంజినీరింగ్ డిగ్రీ/బ్యాచిలర్ డిగ్రీ, ఎంసీఏ/ బీఈ/ బీటెక్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: సీనియర్ మేనేజర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 32 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు; జూనియర్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 04-01-2026.

వెబ్‌సైట్: https://www.balmerlawrie.com/

టెక్నీషియన్లు

నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ, పుణె.. ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ టెక్నీషియన్: 15 ✦ టెక్నికల్ అసిస్టెంట్: 19

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎంటెక్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు టెక్నీషియన్‌కు రూ.19,900 - రూ.63,200; టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.35,400- రూ.1,12,400.

వయసు: 28 ఏళ్లు మించకూడదు. (ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది).

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.01.2026.

వెబ్‌సైట్: https://www.ncl-india.org/

ఉద్యోగ ఇంటర్వ్యూలో సాంకేతిక నేస్తాలు

ఉద్యోగ నియామకాల్లో కీలక అంకం.. ముఖాముఖి. నియామకపత్రం చేతికందాలంటే ఇందులో మెరుగైన ప్రదర్శన తప్పనిసరి. వ్యక్తిత్వం, క్రమశిక్షణ, జ్ఞానం, ఆత్మవిశ్వాసం, మాటతీరు.. ఇవన్నీ ఇంటర్వ్యూలో గమనిస్తారు. సాంకేతికతను ఉపయోగించుకుని, సరైన వ్యూహంతో సన్నద్ధమైతే ముఖాముఖిలో విజయం అందుకోవచ్చు.



ఉద్యోగాలకు పోటీ పడేవారిలో ఎక్కువ మంది రాత పరీక్షల్లో బాగా రాణిస్తారు. కానీ ఇంటర్వ్యూలో మాత్రం తడబడతారు. దీనికి ముఖ్య కారణం.. మాట్లాడే నైపుణ్యాల (స్పోకెన్ స్కిల్స్)పై అభ్యాసాలున్నా, పరీక్షలు లేకపోవటం వల్ల వీటిని పెద్దగా పట్టించుకోం. అయితే అందుబాటులో ఉన్న వనరులతో ఇంటర్వ్యూలకు సన్నద్ధమైతే విజయం సాధించవచ్చు.

ఇంటర్వ్యూ అంటే?

నియామక సంస్థ అడిగే ప్రశ్నలు, వాటికి అభ్యర్థి ఇచ్చే సమాధానాలు ఇదొక్కటే కాదు. ఆలోచనా విధానం, ప్రవర్తన, భాష, ఆత్మస్థైర్యం, జ్ఞానం, శరీర భాష లాంటి అనేక అంశాలు ముఖాముఖితో ముడిపడి ఉంటాయి. దీన్ని రెండు రకాలుగా విభజించుకోవచ్చు.

టెక్నికల్ ఇంటర్వ్యూ: మీ సబ్జెక్ట్ లేదా ఫీల్డ్‌కి సంబంధించిన జ్ఞానం, సమస్యా పరిష్కార సామర్థ్యం, లాజికల్ థింకింగ్ మొదలైనవి చూసే దశ.

బిహేవియర్ ఇంటర్వ్యూ: మీరు బృందంలో ఎలా పని చేస్తారు, ఒత్తిడి పరిస్థితుల్లో ఎలా స్పందిస్తారు, నాయకత్వం, నైతిక విలువలు వంటి అంశాలను పరిశీలించే దశ.

మెరుగైన సన్నద్ధతకు

ఇంటర్వ్యూ విజయానికి ఇంటెన్సివ్ ప్రిపరేషన్ అత్యంత ముఖ్యం. ఇందుకోసం లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్‌ఎల్‌ఎం)లు ఉపయోగపడతాయి.
- ChatGPT, Gemini, Claude, Perplexity లాంటి టూల్స్ ఒక మార్గదర్శిలా (మెంటర్) సహాయం చేస్తాయి.

తర్కానికి ప్రాధాన్యం

ఇంటర్వ్యూలో జ్ఞానం కంటే ఆలోచనా విధానాన్ని ఎక్కువగా పరీక్షిస్తారు. ఉదాహరణకు:

ఐటీ అభ్యర్థులకు: "Explain your favourite project", "How do you handle code debugging?", "Explain an algorithm you optimized."

నాన్-ఐటీ వారికి: "How do you handle customer complaints?", "Tell me about a time you worked under pressure."

సివిల్స్ ఉద్యోగాలకు: "Why do you want to join civil service?", "What are the challenges in rural education?"

ఇలాంటి ప్రశ్నలకు మీ సమాధానం స్పష్టంగా, సంక్షిప్తంగా, ఉదాహరణలతో ఉండాలి.

ఎలా ఉపయోగించాలి?

ప్రాక్టీస్ సిమ్యులేషన్: ChatGPT లో "Simulate an IAS interview panel" లేదా "Mock HR interview for software engineer" లాంటి ప్రాంప్ట్‌లు ఇవ్వండి. మీరు ఇచ్చే సమాధానాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకోండి.

సబ్జెక్ట్ రివిజన్: Gemini లేదా Perplexityలో "Explain Python decorators for interview" లేదా "Top 20 HR questions for freshers" లాంటి ప్రశ్నలు అడిగి జవాబులను చదవండి.

బిహేవియర్ ప్రశ్నలకు ట్రెయినింగ్: "Tell me about a time you faced a challenge" లాంటి ప్రశ్నలకు సమాధానాలు రాసి, LLMలతో సవరణలు చేయించండి.



ఈ పద్ధతి వల్ల మీరు నిజమైన ఇంటర్వ్యూ పరిస్థితిని అనుభూతి చెందుతారు. తప్పులను ముందుగానే గుర్తించి సరిదిద్దుకోవచ్చు.



- రహ్మాన్

వేషధారణ

వేసుకున్న దుస్తులు, ఆహార్యం మీ గురించి కొంత తెలిసేలా చేయగలవు.

పురుషులు: లైట్ కలర్ షర్ట్, ఫార్మల్ ప్యాంట్, పాలిష్ చేసిన షూస్ (అవసరం అయితే టై).

మహిళలు: లేత రంగు చుడీదార్ లేదా చీర ధరించాలి. అవసరానికి మించిన అలంకరణ లేదా మేకప్ ఉండకూడదు.

ప్రవర్తన

- ✦ ఇంటర్వ్యూకు ముందు ఫోన్ సైలెంట్ మోడ్‌లో పెట్టాలి.
- ✦ తలుపు తట్టిన తర్వాత "May I come in, Sir/Ma'am?" అని అడగండి.
- ✦ కుర్చీలో కూర్చోవడానికి అనుమతి తీసుకోండి.
- ✦ సమాధానం ఇచ్చేటప్పుడు ప్యానల్ వైపు నేరుగా చూడండి, హుందాతనంతో కూడిన చిరునవ్వును చివరి వరకూ పాటించండి.

మాట తీరు



ఆలోచనలను సమర్థంగా మాటల్లో కూర్చడం, మాట్లాడేటప్పుడు భావాన్ని తెలిపేలా హెచ్చుతగ్గులతో మాట్లాడటం (ఆర్టిక్యులేషన్, మాడ్యులేషన్) మాట్లాడేటప్పుడు మరీ గట్టిగా, అరుస్తున్నట్లుగా కానీ లేదా మరీ నెమ్మదిగా గొణుగుతున్నట్టుగా గానీ వద్దు. వేగంగా మాట్లాడకండి. ప్రతి మాటా ప్రభావవంతంగా చెప్పండి. టెక్నికల్ కాన్సెప్ట్ వివరించేటప్పుడు సహజమైన భాషలో చెప్పగలగడం ఒక కళ. మీరు చెప్పేది ప్యానల్‌కు అర్థమయ్యేలా ఉండాలి.

ఒక మంచి సాధన పద్ధతి - ChatGPT లో "Correct my spoken English for interviews" అని ఇవ్వండి. మీరు చెప్పిన వాక్యాలను సరిదిద్దుతుంది, ఫ్లూయెన్సీ పెంచుతుంది.

సంస్థ, హోదాకు తగ్గట్టుగా

- ✦ మీరు దరఖాస్తు చేసిన సంస్థ గురించి పూర్తి అవగాహన ఉండాలి - చరిత్ర, ప్రాజెక్టులు, విలువలు.
- ✦ ఆ ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు మీ దగ్గర ఏమున్నాయో ఉదాహరణలతో చెప్పండి.
- ✦ "Tell me about yourself", "Why should we hire you?", "Where do you see yourself in 5 years?" లాంటి ప్రశ్నలకు ముందుగానే మెరుగైన సమాధానాలు సిద్ధం చేసుకోండి.
- ✦ మీ స్నేహితులు లేదా ఉపాధ్యాయులతో చిన్న సెషన్ జరపండి, రికార్డ్ చేసి మీ బాడీ లాంగ్వేజ్‌ను పరిశీలించండి.

ముందు రోజు

- ✦ ఇంటర్వ్యూకు ముందు రాత్రి బాగా నిద్రపోవాలి.
- ✦ తగిన సమయానికి అంటే కనీసం 30 నిమిషాల ముందే ఇంటర్వ్యూ జరిగే ప్రదేశానికి చేరుకోవాలి. ఆన్‌లైన్ లేదా ఫోన్ ఇంటర్వ్యూ అయితే కనీసం పది నిమిషాల ముందే సిద్ధంగా ఉండండి. ముఖ్యంగా ఆఫ్‌లైన్/ఫోన్ ఇంటర్వ్యూ జరిగే సమయంలో ఇతరత్రా అంతరాయాలు లేకుండా చూసుకోవాలి.
- ✦ మానసికంగా ప్రశాంతంగా ఉండాలి. ప్యానల్ కూడా మనిషే.. శత్రువు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- ✦ ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత "Thank you" చెప్పడం మర్చిపోకండి.

ఇంటర్వ్యూ విజయానికి రహస్యం ఒకే ఒక్కటి. తయారీ + ప్రాక్టీస్ + ఆత్మవిశ్వాసం. ChatGPT, Claude, Gemini లాంటి సాంకేతిక నేస్తాలను సరైన రీతిలో ఉపయోగించండి. మీరు చదివిన విద్యా సంస్థ కంటే మీరు ఎలా ఆలోచిస్తారు అనే దాని మీదే తుది ఫలితం ఆధారపడి ఉంటుంది. ఆలోచన స్పష్టంగా, మాట సూటిగా, మనసు ప్రశాంతంగా ఉంటే ఏ ఇంటర్వ్యూలోనైనా విజయం సాధించగలుగుతారు.

మేటి భవితకు మంచి అలవాట్లు



విద్యార్థుల జీవితంలో చిన్న చిన్న అలవాట్లే పెద్ద మార్పులను తీసుకువస్తాయి. చదువు, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం.. అన్నింటినీ ఇవెంతో మెరుగుపరుస్తాయి. దినచర్యలో వీటిని భాగం చేసుకుంటే మిమ్మల్ని ఎంతో గొప్పగా మార్చేస్తాయి. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లకు బీజం పడితే మేటి భవిష్యత్తు సొంతం చేసుకోవచ్చు.

త్వరగా లేవడం

రాత్రి తొందరగా పడుకుని, తెల్లవారునే లేవడాన్ని జీవన గమనంలో భాగం చేసుకోవాలి. ఉదయం 6 గంటల కల్లా నిద్ర నుంచి లేవాలి. అప్పుడు మెదడు తాజాగా ఉండటం వల్ల చదివింది బాగా అర్థం చేసుకోవచ్చు. సమయానికి నిద్ర లేస్తే రోజంతా ఉత్సాహంగానూ ఉండొచ్చు. చేయాలనుకున్న ముఖ్యమైన పనులన్నీ ఎలాంటి అవాంతరాలూ లేకుండా పూర్తి చేసుకోవడానికీ వీలవుతుంది.

స్టడీ టైమ్

పరీక్షలతో సంబంధం లేకుండా ప్రతి రోజూ చదవడాన్ని అలవాటు చేసుకోవాలి. ఫోన్‌లో నోటిఫికేషన్లు అన్నీ ఆఫ్ చేసి 25 నిమిషాలు ఏకాగ్రతతో చదవాలి. ఆ తర్వాత 5 నిమిషాల విరామం తీసుకోవాలి. ఇలా ప్రతి రోజూ 4 సెషన్లు పూర్తి చేస్తే దాదాపు 2 గంటలు చదువుకు కేటాయించినట్లు అవుతుంది. దీంతో పరీక్షలప్పుడు ఎలాంటి ఒత్తిడీ లేకుండా చక్కగా రాయడానికి వీలవుతుంది. అన్నిటికీ మించి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇదే అలవాటు కొనసాగిస్తే విజ్ఞానవంతులుగానూ మారతారు.



టు డూ లిస్ట్

ఏ రోజు ఏం చదవాలి, ఎంత చదవాలి అనేది ముందే నిర్ణయించుకోవాలి. చదవాల్సిన విషయాలను పాయింట్ల రూపంలో రాసుకుంటే సులభంగా ఉంటుంది. ప్రతి పనికీ సమయ పాలన పాటించాలి, అప్పుడే అనుకున్న పని గురించి సమగ్రంగా ఆలోచించగలరు.

- ◆ తరగతిలో చెప్పిన ముఖ్యమైన పాయింట్లను అదే రోజు నోట్సులో రాసుకోవాలి. పరీక్షకు ముందు ఈ నోట్సు మరో సారి చదువుకుంటే సిలబస్ తక్కువ వ్యవధిలోనే సులువుగా పూర్తి చేయడానికీ వీలవుతుంది.
- ◆ ఎక్కువ మంది విద్యార్థులు సోషల్ మీడియాతో సమయాన్ని బాగా వృథా చేసుకుంటున్నారు. కాబట్టి మొబైల్ వాడకాన్ని తగ్గించాలి. కొంత వ్యవధి నిర్ణయించుకుని అప్పుడే చూడాలి. మిగతా సమయమంతా నోటిఫికేషన్లు ఆఫ్‌లో ఉంచాలి. మొబైల్‌ను దూరం పెట్టడం కష్టమే కానీ పరిమితులు విధించుకుని వాటికి కట్టుబడితే నెమ్మదిగా సోషల్ మీడియా ప్రతికూల ప్రభావం నుంచి బయటపడవచ్చు.
- ◆ విషయాన్ని ఎంత అర్థం చేసుకున్నారో పరీక్షించుకోవడానికి సెల్ఫ్ టెస్టింగ్ అవసరం. ఆ రోజు చదివింది ఎంత వచ్చిందో నోట్సు రాసి చెక్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల నేర్చుకున్నది మర్చిపోరు. అలాగే తప్పులు సరిచేసుకునే అవకాశమూ దక్కుతుంది.
- ◆ మొహమాటం పక్కన పెట్టి, ప్రశ్నలు అడగటాన్నీ అలవాటు చేసుకోవాలి. అర్థం కాని విషయాన్ని అలా వదిలేయకుండా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలి. దీంతో పరీక్షల్లో ఇబ్బందులు తప్పుతాయి.
- ◆ చదివింది మర్చిపోకుండా ఉండటానికి వారంలో ఒకసారైనా పునశ్చరణ చేయాలి.
- ◆ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం బాగుంటేనే మెదడు కూడా బాగా పనిచేస్తుంది. జంక్ ఫుడ్ తగ్గించి నీళ్లు ఎక్కువగా తాగాలి. అలాగే సరైన ఆహారం, 7 నుంచి 8 గంటల నిద్ర ఎంతో మేలు చేస్తాయి. రోజూ కనీసం 30 నిమిషాల నడక లేదా వ్యాయామం ద్వారా ఆరోగ్యంతో పాటూ ఉల్లాసంగానూ ఉండొచ్చు. ఏకాగ్రత పెరిగి, ఒత్తిడీ తగ్గుతుందని కొన్ని అధ్యయనాలు తెలుపుతున్నాయి.
- ◆ పాఠ్యపుస్తకాలే కాకుండా ప్రేరణనిచ్చే ఇతర పుస్తకాలూ చదివితే ఆలోచనా శక్తి పెరుగుతుంది. స్ఫూర్తినిచ్చే పుస్తకాలతో సానుకూల దృక్పథం అలవడుతుంది. దేన్నైనా సాధించాలనే తపన పెరుగుతుంది, వ్యక్తిత్వమూ వికసిస్తుంది. కాబట్టి కుదిరితే వారానికి లేదంటే నెలకి ఒక పుస్తకం అయినా చదవాలి. మంచి పుస్తకాలను మించిన మిత్రులు ఎవరూ ఉండరు. వీటితో జ్ఞానం, ఆలోచనా సామర్థ్యం.. ఇవన్నీ మెరుగవుతాయి.
- ◆ చిన్న చిన్న అలవాట్లే భవిష్యత్తులో పెద్ద విజయాన్ని అందిస్తాయి. మీ వ్యక్తిత్వాన్నీ, ఆరోగ్యాన్నీ నిర్దేశిస్తాయి. అందువల్ల ఇష్టంతో నెమ్మదిగా మంచి వ్యాపకాలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. అవి కొద్ది రోజుల్లోనే అలవాటుగా మారి, జీవితాన్ని తీర్చిదిద్దుతాయి.

- మిడియం శ్రీవాణి, ఈజేఎస్

ఏ కోర్సుతో ప్రయోజనం?

బీకామ్ చివరి ఏడాదిలో ఉన్నాను. మేటి అవకాశాల కోసం బీకామ్ తర్వాత సీఎంఏ, సీఏల్లో చేరడం మంచిదా లేదంటే ఎంకామ్ కోర్సుతో ప్రయోజనమా? - శ్రీదేవి

■ మీలాగే చాలామంది విద్యార్థులు డిగ్రీ చివరి ఏడాదిలోనే భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నారు. అదే మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడే కెరియర్ గురించి ఆలోచించి ఉంటే ఈ పాటికి ఒక నిర్ణయానికి రావడానికి వీలుండేది. ఈ దశలో తీసుకునే నిర్ణయం మీ భవిష్యత్తుపై చాలా ప్రభావం చూపుతుంది. బీకామ్ చివరి సంవత్సరం విద్యార్థుల ముందున్న అవకాశాల్లో సీఏ, సీఎంఏ, ఎంకామ్ ముఖ్యమైనవి. అయితే వీటిలో ఏది బాగు అనే ప్రశ్నకు ఒకే రకమైన సమాధానం ఉండదు. ప్రతీ కోర్సు స్వభావం, ఉద్యోగావకాశాలు వేర్వేరుగా ఉంటాయి. అందువల్ల విద్యార్థి ఆసక్తి, సామర్థ్యం, దీర్ఘకాల లక్ష్యాల ప్రకారం నిర్ణయం తీసుకోవాలి.

సీఏ గురించి పరిశీలిస్తే.. ఇది భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రొఫెషనల్ కోర్సుల్లో ఒకటి. అకౌంటింగ్, ఆడిటింగ్, టాక్సేషన్, కంపెనీ లా, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ లాంటి రంగాల్లో లోతైన నైపుణ్యాలను అందిస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసినవారికి కార్పొరేట్ సంస్థలు, మల్టీ నేషనల్ కంపెనీలు, బ్యాంకులు, ఆడిట్ సంస్థలు, సొంత ప్రాక్టీస్ లాంటి అవకాశాలు ఉంటాయి. అయితే సీఏ చాలా కోర్సుల కంటే కఠినంగా ఉండటం వల్ల పూర్తి చేయడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఉత్తీర్ణత శాతం కూడా తక్కువగా ఉంటుంది. కష్టపడేతత్వం, ఓపిక, నిరంతర అధ్యయనం ఉన్నవారికి సీఏ అత్యుత్తమ కెరియర్ మార్గం.

● సీఎంఏ కోర్సు ప్రధానంగా ఖర్చుల నియంత్రణ, బడ్జెటింగ్, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, వ్యూహాత్మక నిర్ణయాలు లాంటి అంశాలపై దృష్టి సారిస్తుంది. తయారీ రంగం, ఇండస్ట్రీలు, కార్పొరేట్ మేనేజ్‌మెంట్‌లో సీఎంఏలకు మంచి డిమాండ్ ఉంటుంది. సీఏతో పోలిస్తే సీఎంఏ కొంచెం స్పెషలైజ్డ్ కోర్సు అయినప్పటికీ, ఇండస్ట్రీకి సంబంధించిన కెరియర్ కోరుకునే వారికి ఇది చాలా అనుకూలం. ఫ్యాక్టరీలు, కార్పొరేట్ సంస్థల్లో మేనేజ్‌మెంట్‌కు దగ్గరగా పనిచేయాలనుకునే వారికి సీఎంఏ మంచి ఎంపికగా చెప్పవచ్చు.

● ఎంకామ్ పూర్తిగా అకడమిక్ కోర్సు. అకౌంటింగ్, ఫైనాన్స్, ఎకనామిక్స్, రిసెర్చ్ మెథడాలజీ లాంటి అంశాల్లో లోతైన సైద్ధాంతిక అవగాహన కలుగుతుంది. ఎంకామ్ పూర్తి చేసినవారికి జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా ఉద్యోగాలుంటాయి. యూజీసీ నెట్ లేదా సెట్‌లో అర్హత సాధిస్తే డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కామర్స్‌లో పీహెచ్‌డీ చేసి యూనివర్సిటీల్లో అధ్యాపక ఉద్యోగాలకోసం ప్రయత్నించవచ్చు. ఎంకామ్ విద్యార్హతతో ప్రభుత్వ సంస్థల్లో అకౌంటింగ్, ఆడిట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేయవచ్చు. కేవలం ఎంకామ్ మాత్రమే చదివితే సీఏ లేదా సీఎంఏతో పోల్చినప్పుడు ప్రైవేట్ రంగంలో అవకాశాలు పరిమితంగా ఉండొచ్చు.



● సీఏ, సీఎంఏ, ఎంకామ్.. ఈ మూడిటి భవిష్యత్తునూ చూసినప్పుడు.. అధిక ఆదాయం, ప్రొఫెషనల్ గుర్తింపు, కార్పొరేట్ ఎదుగుదల కోరుకునే వారికి సీఏ లేదా సీఎంఏ అనుకూలంగా ఉంటాయి. అకడమిక్ జీవితం, బోధన, పరిశోధన వైపు వెళ్లాలనుకునే వారికి ఎంకామ్ సరైన ఎంపిక. కొందరు విద్యార్థులు బీకామ్/ఎంకామ్ చదువుతూ సీఏ లేదా సీఎంఏకు సన్నద్ధం అవుతున్నారు. పైన చెప్పిన విషయాలు, మీ దీర్ఘకాల ఆశయాలను, ఆసక్తిని దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డులో

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు.. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
✦ మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 714 పోస్టులు

విభాగాలు: ఎక్సైజ్, ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ లగ్జరీ ట్యాక్సెస్ డిపార్ట్‌మెంట్, లేబర్, డ్రగ్స్ కంట్రోల్, అర్బన్ డెవలప్‌మెంట్, ఎన్‌సీసీ, రిజిస్ట్రార్ కో ఆపరేటివ్ సొసైటీస్, జనరల్ అడ్మినిస్ట్రేటివ్, లోకాయుక్త, డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, సాహిత్య కళా పరిషత్.. మొదలైనవి.

అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత.

వయసు: 18- 27 ఏళ్ల మధ్య ఉండాలి (ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; పీడబ్ల్యూబీడీలకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది)

వేతన శ్రేణి: నెలకు రూ.18,000- రూ.56,900.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత (టైర్-1) పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్‌తో.

పరీక్షలో: జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, హిందీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌ల నుంచి 200 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. వీటికి 200 మార్కులు.

దరఖాస్తు ఫీజు: రూ.100, ఎస్సీ/ఎస్టీ/మహిళలు, దివ్యాంగులు/ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.01.2026.

వెబ్‌సైట్: https://dsssb.delhi.gov.in/

పవన్ హాన్స్‌లో

పవన్‌హాన్స్ లిమిటెడ్.. పలు విభాగాల్లో పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది.
✦ అసిస్టెంట్ మేనేజర్: 02 ✦ నెట్‌వర్క్/సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్: 01 ✦ సేఫ్టీ మేనేజర్: 02 ✦ డిప్యూటీ మేనేజర్: 03 ✦ డిప్యూటీ క్వాలిటీ మేనేజర్: 01 ✦ డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్లైట్ సేఫ్టీ: 01 ✦ ఆఫీసర్: 01 ✦ స్టేషన్ మేనేజర్: 07

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ, ఎంసీఏ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, పీజీతో పాటు సంబంధిత ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: పోస్టు ప్రకారం 30 - 55 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** రూ.295+జీఎస్టీ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02.01.2026.

వెబ్‌సైట్: https://www.pawanhans.co.in/english/career.aspx

భారత్‌లో వీసా సర్వీసు ఫీజును పెంచిన న్యూజిలాండ్



ఇంటర్నెట్ డెస్క్: భారత్, పాకిస్థాన్ సహా 25 దేశాల్లో తమ వీసా సర్వీసు ఫీజును పెంచుతున్నట్లు న్యూజిలాండ్ ప్రకటించింది. జనవరి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానుంది. నిర్వహణపరమైన వ్యయాలు, ద్రవ్యోల్బణం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినట్లు న్యూజిలాండ్ ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. వీసా అప్లికేషన్ వీసా దరఖాస్తు కేంద్రాలు వసూలు చేసే ఫీజు అదనమని న్యూజిలాండ్ ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ స్పష్టం చేసింది.

కెనడాలో కాల్పులు

- ఇద్దరు భారతీయుల మృతి

ఒంటారియో: కెనడా ఎడ్మంటన్‌లో కారులో కూర్చున్న ఇద్దరు భారతీయులను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఈ నెల 12న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతులను పంజాబ్‌కు చెందిన గుర్దీప్ సింగ్(27), రణవీర్ సింగ్(19)లుగా గుర్తించారు. రెండేళ్ల కిందట కెనడాకు వెళ్లిన గుర్దీప్ సింగ్ అక్కడ వర్క్ పర్మిట్ కోసం ఎదురుచూస్తున్నాడు. విద్యార్థిగా రణవీర్ సింగ్ భారత్ నుంచి ఏడాదిన్నర కిందట కెనడా వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు హాజరై తిరిగివస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు మరో కారులో వచ్చి వారిపై కాల్పులకు పాల్పడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రిమినల్ కేసుల విచారణలో ట్రయల్ కోర్టులకు సుప్రీం నిర్దేశం

దిల్లీ: క్రిమినల్ కేసుల విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు సోమవారం ట్రయల్ కోర్టులకు పలు మార్గదర్శకాలు నిర్దేశించింది. ఈ నిర్దేశాలు ట్రయల్ కోర్టు తీర్పుల చట్టబద్ధతను పెంపొందిస్తాయని కోర్టు పేర్కొంది. ట్రయల్ కోర్టులు తమ తీర్పు చివరలో విచారించిన సాక్షుల వివరాలను, పరిశీలించిన పత్రాలను, నేర నిరూపణకు దోహదపడిన వస్తువుల వివరాలను టేబుల్ రూపంలో ఇవ్వాలని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడుకున్న ధర్మాసనం ఆదేశించింది. ఈ పట్టికను తీర్పు చివరలో స్పష్టమైన, క్రమబద్ధమైన రీతిలో తేలికగా అర్థమయ్యేలా ఇవ్వాలని కోర్టు సూచించింది. "క్రిమినల్ కేసుల్లో తీర్పుల చట్టబద్ధతను మరింత బలోపేతం చేయడానికి క్రమబద్ధమైన ఏకరూప విధానాన్ని అమలుపరచాలని మేం భావిస్తున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. అందుకు అనుగుణంగానే సాక్ష్యాలను క్రమపద్ధతిలో పొందుపరచి, తీర్పును తేలికగా అర్థమయ్యేలా చూడాలని వివరించింది. "సాక్షులు పత్రాల సంఖ్య అసాధారణమైన రీతిలో ఎక్కువగా ఉంటే ట్రయల్ కోర్టులు తీర్పునకు దారితీసిన కీలక సమాచారం, సాక్షులు, పత్రాలను మాత్రమే ప్రస్తావించాలి. ఏయే పత్రాలు, సాక్ష్యాలు తీర్పునకు దోహదపడ్డాయో కూడా ట్రయల్ కోర్టులు స్పష్టంగా పేర్కొనాలి" అని సుప్రీంకోర్టు సూచించింది.

హ్యూస్టన్‌లో దీపావళి వేడుకలు

- యునెస్కో సాంస్కృతిక వారసత్వ హోదాకు గుర్తుగా సంబరాలు

హ్యూస్టన్: దీపావళిని యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చిన సందర్భంగా అమెరికా హ్యూస్టన్‌లోని భారతీయులు ఇక్కడ ఓ వేడుక నిర్వహించారు. బాప్స్ శ్రీ స్వామినారాయణ మందిర్, ఇతర ప్రవాస భారతీయ సంస్థలతో కలిసి హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ డి.సి.మంజునాథ్ గతవారం ఈ వేడుకలను నిర్వహించారు. ఇందులో దీపాలు వెలిగించడం, సాంస్కృతిక ప్రదర్శనలు, లైట్ షో వంటివి ఏర్పాటుచేశారు. దీపావళికి ప్రపంచ గుర్తింపు రావడం ప్రవాస భారతీయులకు, భారతదేశ మిత్రులకు గర్వించదగ్గ క్షణమని డి.సి.మంజునాథ్ అన్నారు. అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ కూడా ఈ సందర్భంగా దీపాలను వెలిగించారు.

రాహుల్‌తో వైరుధ్యాన్ని అంగీకరించిన థరూర్


దిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి తనకు వైరుధ్యాలున్నాయని తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సోమవారం పరోక్షంగా అంగీకరించారు. రాహుల్‌గాంధీకి, శశిథరూర్‌కు మధ్య ఉన్న వైరుధ్యాలను వివరిస్తూ ఒక సోషల్ మీడియా యూజర్ చేసిన విశ్లేషణను థరూర్ మెచ్చుకుంటూ పోస్టు పెట్టారు. కాంగ్రెస్‌లోని భిన్న ఆలోచనా విధానాలకు థరూర్, రాహుల్‌లు ప్రతీకలని సివిటాస్ సమీర్ అనే సోషల్ మీడియా యూజర్ పేర్కొన్నారు. దీనికి స్పందిస్తూ "ఈ లోతైన విశ్లేషణకు ధన్యవాదాలు. పార్టీలో ఎప్పుడూ ఒకటికి మించిన పోకడలు సాగుతూనే ఉన్నాయి. మీ విశ్లేషణ న్యాయమైనది. ప్రస్తుత పరిస్థితికి అతికినట్టుగా ఉంది" అని థరూర్ పేర్కొన్నారు.

హాంకాంగ్ అసమ్మతివాది జిమ్మీ లాయ్ నేర నిర్ధారణ

హాంకాంగ్: చైనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గట్టిగా విమర్శిస్తూ హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమం నడిపిన మాజీ పత్రికాధిపతి జిమ్మీ లాయ్ (78)ని నగర కోర్టు దోషిగా నిర్ధారించింది. ఆయన విదేశీ శక్తులతో కలసి జాతీయ భద్రతకు హాని తలపెట్టేందుకు కుట్రపన్నారనీ, విద్రోహకర వ్యాసాలు, వార్తలు ప్రచురించారని న్యాయమూర్తులు నిర్ధారించారు. ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఆపిల్ అనే పత్రికను లాయ్ నడిపారు. 2019లో హాంకాంగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడచిన ఉద్యమంలో లాయ్ ముమ్మరంగా పాల్గొన్నారు. చైనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోయాలని అమెరికాకు లాయ్ పదేపదే విజ్ఞప్తి చేశారని కోర్టు తప్పుపట్టింది. చైనా ప్రభుత్వ ప్రోత్సాహంతో హాంకాంగ్ చేపట్టిన జాతీయ భద్రతా చట్టం కింద లాయ్‌ని 2020 ఆగస్టులో అరెస్టు చేశారు. అప్పటి నుంచి అయిదేళ్లుగా ఆయన జైలులోనే ఉన్నారు. బ్రిటిష్ పౌరుడైన లాయ్ విడుదల కోసం గట్టిగా ప్రయత్నిస్తామని బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ ప్రకటించారు. లాయ్ కేసును చైనా ప్రభుత్వం వద్ద ప్రస్తావించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు.

భారీగా హెచ్-1బీ, హెచ్-4 వీసాల రద్దు

- వెట్టింగ్ ప్రారంభించిన అమెరికా



ఇంటర్నెట్ డెస్క్: హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులపై 'వెట్టింగ్' ప్రక్రియను ప్రారంభించిన అమెరికా ప్రభుత్వం మరో బాంబు పేల్చింది. ముందుజాగ్రత్త చర్యలో భాగంగా భారీ ఎత్తున హెచ్-1బీ, హెచ్-4 వీసాలను 'ప్రుడెన్షియల్ రద్దు' చేసింది. ఈ మేరకు వర్కింగ్ వీసాలు రద్దయినట్లు ప్రభావిత వీసాదారులకు కాన్సులేట్ నుంచి ఈమెయిల్స్ వచ్చినట్లు సమాచారం. హెచ్-1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించే ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. అయితే, ప్రుడెన్షియల్ రద్దు తాత్కాలికమేనని తెలుస్తోంది. ఇది శాశ్వత వీసా తిరస్కరణ కిందకు రాదని ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఎమిలీ న్యూమన్ వివరించారు. 'ప్రుడెన్షియల్ రద్దు వీసాదారుల చట్టబద్ధ నివాస హక్కును ప్రభావితం చేయదు. కానీ, వీసా అపాయింట్‌మెంట్ సమయంలో దీన్ని పరిగణనలోకి తీసుకుని వారి దరఖాస్తును మరింత క్షుణ్నంగా పరిశీలించే అవకాశం ఉంది' అని ఎమిలీ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

మొదలైన వెట్టింగ్

మరోవైపు అమెరికాలో హెచ్-1బీ, హెచ్-4 వీసా దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ఉనికిని సమీక్షించే వెట్టింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. హెచ్-1బీ, హెచ్-4, ఎఫ్, ఎం, జే వీసాల దరఖాస్తు చేసిన వారంతా వెట్టింగ్‌లకు వీలుగా తమ సామాజిక మాధ్యమాల సెట్టింగ్‌లను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనల కారణంగా ఇప్పటికే భారతీయులు సహా అనేక మంది హెచ్-1బీ వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. 'అమెరికాలోకి ప్రవేశించేవారు అమెరికన్లకు హాని చేయబోరని మేం నమ్మాలి. వారు తమ విశ్వసనీయతను నిరూపించుకోవాలి' అని అమెరికా విదేశాంగశాఖ ఇప్పటికే స్పష్టం చేసింది.


ఏంటీ ప్రుడెన్షియల్ వీసా రద్దు

వీసాదారు చట్టబద్ధ నివాస అర్హతలో ఏదైనా సమస్య ఉందని ప్రభుత్వం అనుమానించిన సమయంలో విదేశాంగ శాఖ వివేకవంతంగా వీసా రద్దుపై నిర్ణయం తీసుకుంటుంది. దీన్నే ప్రుడెన్షియల్ వీసా రివోకేషన్‌గా పిలుస్తారు. అయితే, ఇలా తాత్కాలికంగా రద్దు చేసినప్పటికీ, వీసాదారులు తమ గడువు పూర్తయ్యే వరకు అమెరికాలో నివసించవచ్చు. కానీ, ఒకసారి అమెరికా నుంచి బయటకు వెళ్తే, వీసా గడువు ఉన్నప్పటికీ మళ్లీ అగ్రరాజ్యంలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. తాత్కాలిక రద్దు సమయంలో వీసా స్టాంప్ చెల్లుబాటు కాదు.

జనవరి నుంచి 85 వేల వీసాలు రద్దు

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్, వలసేతర వీసాలపైనా కఠినంగా వ్యవహరిస్తున్నారు. హింస, దోపిడీ కేసులతో పాటు మద్యం తాగి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినవారి వీసాల రద్దుకు చర్యలు తీసుకున్నారు. అలాగే, హెచ్-1బీ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారి లింక్డిన్ పేజీలు, రెజ్యూమెలను సమీక్షించాలని ఇటీవల తన దౌత్యవేత్తలను అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆదేశించింది. జనవరి నుంచి 85 వేల వీసాలు రద్దయ్యాయని చెప్పిన స్టేట్ డిపార్ట్‌మెంట్, అమెరికా పౌరుల భద్రతను దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

రహదారులపై ప్రమాదాల నివారణకు జాతీయ స్థాయి మార్గదర్శకాలు



- సుప్రీంకోర్టు వెల్లడి

దిల్లీ: జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేస్ పై ప్రమాదాలను నివారించేందుకు జాతీయ స్థాయిలో మార్గదర్శకాలు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రహదారుల వెంబడి అక్రమంగా వెలుస్తున్న దాబాలు, రెస్టారెంట్ల కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ అంశంపై విచారణ జరుపుతున్న జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ల ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి అక్రమ నిర్మాణాలను తొలగించే అధికారం ఎవరికి ఉంటుందని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రశ్నించింది. వీటిని నియంత్రణకున్న చట్టబద్ధమైన నిబంధనలను తెలియజేయాలని, దీంతో పాటు వాటి అమలుకు ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలను వివరించాలనీ ఆదేశించింది.

రహదారుల చెంత అక్రమ నిర్మాణాలను తొలగించే అధికారం ఎన్‌హెచ్‌ఏఐకు ఉంటుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. అయితే, సాధారణంగా స్థానిక జిల్లా కలెక్టర్‌కు అధికారం ఉంటుందని, క్షేత్రస్థాయి సిబ్బంది, పోలీసుల ద్వారా వాటిని కలెక్టర్ నియంత్రించ వచ్చని వెల్లడించారు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేస్ వెంబడి సర్వీసు రోడ్లు ఉంటున్నాయని, వాహనాలను అక్కడ నిలపవచ్చని కోర్టుకు నివేదించారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేస్తూ. . ఆ ఏర్పాట్లు దేశమంతటా లేవని పేర్కొంది. ప్రమాదాలకు బాధ్యతను స్థానిక గుత్తేదార్ల మీద, యంత్రాంగం మీద వేయడానికి చూస్తున్నారని తెలిపింది. జాతీయ రహదారుల వెంబడి ఉన్న అక్రమ కట్టడాలకు సంబంధించి తీసిన గూగుల్ చిత్రాలను ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎ.ఎన్.ఎస్ నాడ్‌కర్ణి ధర్మాసనానికి సమర్పించారు. గత నెలలో రాజస్థాన్‌లోని జాతీయరహదారిపై ఆగి ఉన్న ట్రక్కును టెంపో ట్రావెలర్ ఢీకొట్టిన దుర్ఘటనలో 10 మంది మహిళలు, నలుగురు చిన్నారులు సహా 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసును సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు.. విచారణ జరుపుతోంది.

చిలీలో వామపక్ష సర్కారుపై అతిమితవాది ఆంటోనియో గెలుపు

శాంటియాగో: చిలీ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష మధ్యేవాద సంకీర్ణ ప్రభుత్వం చిత్తయింది. అతిమితవాద నాయకుడు హోసే ఆంటోనియో కాస్ట్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఆదివారం ప్రకటించారు. కమ్యూనిస్టు అభ్యర్థి, మాజీ మంత్రి జీనెట్ జారాను కాస్ట్ ఓడించారు. చిలీలో 35 ఏళ్లపాటు వర్ధిల్లుతున్న ప్రజాస్వామ్యాన్ని వెనక్కునెట్టి అతిమితవాద ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనున్నారు. కాస్ట్‌కు 58.2 శాతం ఓట్లు రాగా, జారాకు 41.8 శాతం ఓట్లు వచ్చాయి. చిలీ సైనిక నియంత అగస్టో పినోషేపై పోరాడిన కమ్యూనిస్టు పార్టీలో జారా శాశ్వత సభ్యురాలు. జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ నాజీ పార్టీలో సభ్యునిగా కాస్ట్ తండ్రి ఉండేవారు. చిన్నాన్న నాజీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 35 ఏళ్లుగా వామపక్ష మధ్యేవాద, వామపక్ష మితవాద పార్టీలే చిలీని పాలిస్తూ వచ్చాయి. గత వామపక్ష సంకీర్ణ ప్రభుత్వ పాలనలో చిలీలో సంఘటిత నేరగాళ్ల దౌర్జన్యాలు, కార్ల దొంగతనాలు పెరిగిపోయాయి. మధ్యతరగతి పౌరులు రాత్రిపూట ఇంటి గడప దాటాలంటే భయపడేవారు. అక్రమ వలసలు విపరీతంగా పెరిగిపోయాయి.

నాటి నిఘా పరికరంపై నేడు ఆందోళన

మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీలు భారత్‌లోని నందాదేవి పర్వతంపై నిఘా పరికరం అమర్చేందుకు అమెరికాకు అనుమతి ఇచ్చారని భాజపా నేత నిషికాంత్ దుబె తాజాగా చేసిన వ్యాఖ్యలు దేశంలో తీవ్ర చర్చకు తెరతీశాయి. చైనా అణు కార్యకలాపాలపై కన్నేసి ఉంచేందుకు ఏర్పాటు చేసిన అణు ఆధారిత నిఘా పరికరాన్ని పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయ ప్రాంతంలో అమెరికా వదిలేసి వెళ్లిపోయిందని ఆరోపించారు. ఆ అణు పరికరానికి, ఉత్తర భారతంలో ఇటీవల ప్రకృతి వైపరీత్యాలకు ముడిపెడుతూ విమర్శలు చేశారు.



1964 అక్టోబరు 16న చైనా తన తొలి అణు పరీక్షను నిర్వహించింది. ఇది భారత్, అమెరికాలను కలవరపరచింది. నాడు ఉపగ్రహ పరిజ్ఞానం అంత సమర్థంగా లేదు. ఈ నేపథ్యంలో చైనా అణు పరీక్ష ప్రదేశాలను చాలా దగ్గర నుంచి పరిశీలించాలని అమెరికా గట్టిగా భావించింది. ఈ మేరకు భారత సాయం అర్థించింది. హిమాలయాల్లోని నందాదేవి శిఖరాగ్రాన.. నేలకు 25వేల అడుగుల ఎత్తులో నిఘా పరికరాన్ని అమర్చాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. నాటి బృందంలో సభ్యుడైన కెప్టెన్ మోహన్‌సింగ్ కోహ్లి తన పుస్తకంలో రాసిన కథనం ప్రకారం..

1965 మే నెలలో భారత నౌకాదళానికి చెందిన కెప్టెన్ మోహన్ సింగ్ కోహ్లి నేతృత్వంలోని బృందం తొలిసారిగా ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించింది. తిరిగొచ్చాక జూన్‌లో ఆయన బృందాన్ని సైనిక, నిఘా అధికారులు దిల్లీకి ఆహ్వానించారు. హిమాలయ శ్రేణిలోని నందాదేవి పర్వతం వద్దకు ఒక రహస్య యాత్రను చేపట్టాలని కోహ్లిని కోరారు. అందులో భారత్, అమెరికాలకు చెందిన పర్వతారోహకులు, నిఘా అధికారులు, అణు శాస్త్రవేత్తలు, సాహసోపేత పైలట్లు ఉంటారని చెప్పారు.

అనుకూలించని వాతావరణం..

అక్టోబరు 16 నాటికి ఈ మిషన్.. అణు పరికరంతో క్యాంప్-4ను చేరుకుంది. సరిగ్గా అప్పుడే తీవ్ర మంచు తుపాను మొదలైంది. దీనికితోడు మంచు పెళ్లలు విరిగిపడే ప్రమాదం కూడా పొంచి ఉంది. దీంతో యాత్రను నిలిపివేయాలని కోహ్లి నిర్ణయించారు. హిమపాతం వల్ల ఎదురుగా ఏమీ కనిపించని పరిస్థితి ఉండటంతో పరికరాన్ని అక్కడే ఉన్న ఒక శిల పగుళ్లలో భద్రపరిచి వెనుదిరగాలని, వాతావరణం మెరుగుపడ్డాక వచ్చి దాన్ని అమర్చాలని నిర్ణయించారు. అయితే ఆ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు మెరుగుపడకపోవడంతో యాత్రికులు పర్వతం నుంచి కిందకి వచ్చేశారు.

ఎందుకు?

చైనా అణు కార్యకలాపాలకు సంబంధించిన సంకేతాలను పట్టుకునే పరికరాన్ని నందాదేవి శిఖరాగ్రాన 25వేల అడుగుల ఎత్తులో అమర్చే బాధ్యతను కోహ్లి బృందానికి అప్పగించారు. దీనికి 'గురు రింపోచీ' అనే సంకేతనామం ఇచ్చారు. ఇది చైనా నుంచి వచ్చే ఉష్ణ, భూప్రకంపన తరంగాలు, రేడియోధార్మిక స్థాయిని నమోదు చేస్తుంది. అయితే అంత ఎత్తులో విద్యుత్ సరఫరాలేనందువల్ల ఆ పరికరానికి రేడియోఐసోటోప్ థర్మోఎలక్ట్రిక్ జనరేటర్ (ఆర్‌టీజీ)ను అమర్చాలని నిర్ణయించారు. సంప్రదాయ బ్యాటరీలకు భిన్నంగా.. ఎలాంటి మరమ్మతులు అవసరం లేకుండానే ఆర్‌టీజీ ఏళ్ల తరబడి పనిచేస్తుంది. ఇందులో ప్లుటోనియం-238 ఉంటుంది. దీని రేడియోధార్మికత చాలా ఎక్కువ.

ఆర్‌టీజీ, నిఘా పరికరం బరువు 50 కిలోలపైనే ఉంది. మంచుతో నిండిపోయిన హిమాలయ పర్వతంపైకి వాటిని మోసుకెళ్లడానికి చాలా మంది అవసరం. ఈ నేపథ్యంలో ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసు (ఐటీబీపీ) దళానికి చెందిన పర్వతారోహకులు, అమెరికన్లు, షెర్పాలతో ఒక బృందం ఏర్పాటైంది. భారత బృందం అమెరికా వెళ్లి, అక్కడ శిక్షణ పొందింది. 1965 సెప్టెంబరు నాటికి కోహ్లి, సీఐఏ, ఐటీబీపీ బృందం నందాదేవి శిఖరాగ్రానికి వెళ్లేందుకు సన్నద్ధమైంది. బేస్ క్యాంప్‌నుకు చేరుకుంది. వాతావరణం సరిగా లేకున్నా ముందడుగు వేసింది. భారీ నిఘా పరికరాన్ని క్యాంప్-4 నుంచి శిఖరాగ్రానికి చేరువలోని ఒక అనుకూల ప్రదేశానికి షెర్పాలు చేర్చాలన్నది లక్ష్యం. ఆ తర్వాత భారత, అమెరికన్ బృందం చేరుకొని అణు సాధనాన్ని అసెంబుల్ చేసి, దాన్ని ఆన్ చేస్తుంది.

గల్లంతు..

1966లో కోహ్లి బృందం తిరిగి క్యాంప్-4 వద్దకు చేరుకుంది. అయితే అక్కడ ఆర్‌టీజీ కనిపించలేదు. శీతాకాలంలో నందాదేవి పర్వతంపై టన్నులకొద్దీ మంచు కురుస్తుంది. ఫలితంగా ఆ పరికరం శిల నుంచి జారిపోయి ఉంటుందని తేల్చారు. దాన్ని పసిగట్టేందుకు పర్వత సానువులను పర్వతారోహకులు, షెర్పాలు జల్లెడపట్టారు. అయినా దాని ఆచూకీలేదు. ప్రజాగ్రహం వ్యక్తమయ్యే ప్రమాదం ఉన్నందువల్ల భారత ప్రభుత్వం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది.

1978లో ఆ ప్రాంతంలో భారత అణు ఇంధన కమిషన్ సర్వే నిర్వహించింది. అక్కడ ప్లుటోనియం జాడేమీ లేదని తేల్చింది. పరికరం మాత్రం దొరకలేదు. 1967లో.. సమీపంలోని నందా కోట్ ప్రాంతంలో అలాంటి పరికరాన్ని విజయవంతంగా ఏర్పాటు చేశారు. అది కొన్ని నెలల పాటు నిఘా సమాచారాన్ని సేకరించింది. ఆ తర్వాత దాని ఎలక్ట్రానిక్ వ్యవస్థలు విఫలమయ్యాయి. అనంతరం అమెరికా.. సౌర పరికరాలకు మళ్లింది. ఆ తర్వాత మరింత ఆధునికమైన ఉపగ్రహ వ్యవస్థలపై ఆధారపడటం మొదలుపెట్టింది.

అయితే నాటి నుంచి దీనిపై ఆందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. గల్లంతైన ఆర్‌టీజీ నుంచి విడుదలవుతున్న వేడి వల్ల మంచు కరుగుతోందని, దీనివల్ల మంచు పెళ్లలు విరిగిపడి పెను విపత్తులు సంభవిస్తున్నాయన్న వాదనలు ఉన్నాయి. అయితే వాటిలో నిజంలేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నిపుణుల అంచనా ప్రకారం ప్రకారం, అమెరికా అమర్చిన ఆర్‌టీజీ పరికరం కనుక మంచులో కూరుకుపోయి ఉంటే, దాని వల్ల తక్షణం ఎలాంటి ముప్పు ఉండదు. ఒక వేళ ఆ పరికరం దెబ్బతిని, అందులోని రేడియోధార్మిక పదార్థాలు వాతావరణంలో కలిస్తే, అది తీవ్ర ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. ముఖ్యంగా గంగానదీ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉంటుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

సింగపూర్‌లో వలస కార్మికులకు పథకాలు

సింగపూర్: తమ దేశ ఆర్థికాభివృద్ధికి పాటుపడిన వలస కార్మికుల సంక్షేమానికి సింగపూర్ పలు పథకాలు ప్రకటించింది. 'అంతర్జాతీయ వలసదారుల దినం' సందర్భంగా సోమవారం ప్రకటించిన ఈ పథకాలలో వలస కార్మికులకు బస, వైద్యచికిత్స ఏర్పాటు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి ఉన్నాయి. ఇంట్లో పనిమనుషులుగా చేరినవారు మొదలుకొని భవన నిర్మాణం, షిప్‌యార్డ్ పనులు, ఆహారశుద్ధి వంటి పలు రంగాల్లో పనిచేస్తున్న వలస కార్మికులు దేశ ప్రగతికి ఎంతగానో సహాయపడ్డారని సింగపూర్ మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్ పేర్కొన్నారు. వారికి ఇతోధికంగా తోడ్పడటం తమ విధి అని ప్రకటించారు. భారత్ సహా దక్షిణాసియా దేశాల నుంచి, చైనా, ఆగ్నేయాసియా దేశాల నుంచి సింగపూర్‌కు వలసవచ్చిన కార్మికుల సంఖ్య 10 లక్షలకుపైగానే ఉంటుంది.

2,400 పడకల వసతి త్వరలో ప్రారంభం

వలస కార్మికుల కోసం జురాంగ్ పారిశ్రామిక ఎస్టేట్‌లో నిర్మించిన 2,400 పడకల వసతి 2026 జనవరి నుంచి అధికారికంగా ప్రారంభమవుతుంది. ఇప్పటి నుంచే అందులో వలస కార్మికులను చేర్చుకోవడం ప్రారంభించారు. రానున్న ఏళ్లలో 45,000 పడకలతో అదనంగా ఆరు వసతి గృహాలను నిర్మించాలని సింగపూర్ తలపెట్టింది. వీటిలో ధారాళంగా వెలుతురు, పారిశుద్ధ్య ఏర్పాట్లు ఉంటాయి. వలస కూలీలు వైద్య చికిత్స కోసం దూరాభారాలు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రాథమిక చికిత్స పథకం (పీసీపీ) కింద మరిన్ని క్లినిక్కులు ఏర్పాటుచేస్తామని మంత్రి టాన్ వెల్లడించారు. పీసీపీ కింద వార్షిక వైద్య పరీక్షలు, తరుణ, దీర్ఘవ్యాధుల చికిత్స, మందుల పంపిణీ, టెలి మెడిసిన్‌ను అందిస్తున్నారు. ఈ పథకం కింద వలస కార్మికులను యజమానులు సులువుగా చేర్చడానికి ఏర్పాట్లు చేస్తారు. వలస కార్మికులకు వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలను కూడా నిర్వహిస్తామని మంత్రి చెప్పారు.

ఆపరేషన్ సిందూర్‌లో కూల్చేసిన డ్రోన్‌ను ప్రదర్శించిన సైన్యం



దిల్లీ: ఈ ఏడాది మే నెలలో పాకిస్థాన్ ప్రయోగించిన అనేక డ్రోన్లను ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మన దేశం కూల్చివేసింది. వాటిలో ఒకటైన 'ఈహా'ను సైన్యం పునర్నిర్మించి.. విజయ్ దివస్ (డిసెంబరు 16)ను పురస్కరించుకొని దిల్లీలో సోమవారం సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో ప్రదర్శించింది. 'ఈహా' కమికాజి తరగతికి చెందిన తుర్కియే డ్రోన్. లాహోర్ విమానాశ్రయం నుంచి జలంధర్‌పైకి దాన్ని పాక్ ప్రయోగించింది. అందులో 10 కిలోల పేలుడు పదార్థాలను ఉంచింది. మే 10న భూమి నుంచి రెండు వేల మీటర్ల ఎత్తులో ఎగురుతుండగా ఆర్మీ గగనతల రక్షణ విభాగం (ఏఏడీ) దాన్ని కూల్చివేసింది.

పిల్లలకు డైపర్ బాధలు తప్పేలా 'ఈ-మ్యాట్' ఆవిష్కరణ



ఇంటర్నెట్ డెస్క్: ఇటీవలి కాలంలో చిన్నారుల్లో డైపర్ల వినియోగం పెరిగింది. ఈ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల్లో దద్దుర్లు, ఇతర ఇన్‌ఫెక్షన్ల సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతుంటారు. ఈ క్రమంలోనే అస్సాంకు చెందిన ఓ విద్యార్థిని తన ఆవిష్కరణతో ప్రత్యామ్నాయ మార్గం చూపారు. ఇటీవల ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. అస్సాం తరపున సోనిత్‌పూర్ జిల్లాకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని హర్షిక ఆలమ్మియాన్ పాల్గొన్నారు. చిన్నారులకు డైపర్ వేయాల్సిన బాధ తప్పించేలా రూపొందించిన 'ఈ-మ్యాట్' పరికరాన్ని ప్రదర్శించారు. ఇది సెన్సార్ల సాయంతో పని చేస్తుంది. దీన్ని పిల్లల పరుపు కింద పర్చాలి. వారు మల, మూత్ర విసర్జన చేసినప్పుడు.. తేమను గ్రహించి వెంటనే శబ్దం లేదా వైబ్రేషన్స్‌తో అక్కడున్న వారిని అప్రమత్తం చేస్తుంది. దీంతో వెంటనే శుభ్రం చేయొచ్చు. ఈ మ్యాట్ సురక్షితమని, పునర్వినియోగించొచ్చని హర్షిక చెప్పారు.

ఆటో డ్రైవరు కుమార్తెకు కొలంబియా వర్సిటీ ఎంఎస్ పట్టా



ఈటీవీ భారత్: పట్టుదల ఉంటే ఎంత పెద్ద కలనైనా నిజం చేసుకోవచ్చని నిరూపించారు మహారాష్ట్రలోని అమరావతికి చెందిన ప్రణాలీ రూప్ రావ్ బన్సోడ్. ఒక ఆటో డ్రైవరు కుమార్తె అయిన ఆమె అమెరికాలోని ప్రఖ్యాత కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి సుస్థిరాభివృద్ధిలో ఎంఎస్ పట్టా అందుకున్నారు. పట్టా అందుకుని అమరావతికి వచ్చిన ప్రణాలీకి బంధువులు, స్నేహితులు ఘన స్వాగతం పలికారు. ఆమె తండ్రి రూప్ రావ్ బన్సోడ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా ఆయన తన ముగ్గురు పిల్లలను బాగా చదివించారు. ఆయన లక్ష్యాలకు అనుగుణంగానే కుమార్తె ప్రణాలీ ఎంఎస్ పట్టా సాధించారు. తాను పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధి, సామాజిక పరివర్తనకు కృషి చేస్తానని ఆమె ఈటీవీ భారత్‌కు తెలిపారు.

అభిమానుల్లా సెల్ఫీ అడిగి.. మొహాలీలో కబడ్డీ ఆటగాడి కాల్చివేత

చండీగఢ్: కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఓ ఆటగాణ్ని దుండగులు కాల్చిచంపిన ఘటన పంజాబ్‌లోని మొహాలీ నగరంలో తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం- కన్వర్ దిగ్విజయ్ సింగ్ అలియాస్ రాణా బాలచౌరియా (30) కబడ్డీ ఆటగాడే కాకుండా ప్రమోటర్ కూడా. మొహాలీలోని సోహానాలో కొద్దిరోజులుగా జరుగుతున్న ఓ ప్రైవేటు టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు సోమవారం అతడు తన జట్టుతో కలిసి వచ్చాడు. రాగానే ఇద్దరు/ముగ్గురు దుండగులు అభిమానుల్లా నటిస్తూ.. సెల్ఫీ కావాలంటూ కన్వర్ దగ్గరకు వెళ్లారు. వెంటనే అతడిపై కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడ్డ కన్వర్.. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతిచెందాడు. కాల్పులు జరిపిన తర్వాత దుండగులు ద్విచక్రవాహనంపై పరారయ్యారు.

పులుల గణన ప్రారంభం


ఈటీవీ భారత్: దేశంలో పులుల గణన ప్రక్రియ.. ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్కుతో పాటు వివిధ జంతు అభయారణ్యాల్లో ఆదివారం ప్రారంభమైంది. నాలుగేళ్లకోసారి చేపట్టే ఈ ప్రక్రియ ద్వారా.. దేశవ్యాప్త అడవుల్లో పులుల విస్తరణ, సంచార మార్గాలను అధికారులు అంచనా వేస్తారు. మొత్తం మూడు విడతల్లో జరిగే ఈ పులుల గణనను అధికారులు శాస్త్రీయంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అధునాతన సాంకేతికతను వినియోగించనున్నారు. 2022 చివరిసారిగా చేపట్టిన పులుల గణన ప్రకారం దేశంలో 3,167 పులులు ఉన్నాయి.

భారత్‌తో ఒప్పందానికి రష్యా చట్ట రూపం

మాస్కో: భారత్‌తో కుదుర్చుకున్న ఒక సైనిక ఒప్పందానికి రష్యా చట్ట రూపం కల్పించింది. ఈ మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తమ దేశ చట్టసభలు అంగీకారం తెలిపిన ప్రతిపాదనకు తన సమ్మతి తెలిపారు. రెసిప్రోకల్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ లాజిస్టిక్స్ సపోర్ట్(రెలోస్) పేరుతో కుదుర్చుకున్న ఈ ఒప్పందానికి రష్యా దిగువ సభ ఈనెల 2న, ఎగువ సభ ఈనెల 8న ఆమోదం తెలిపాయి. ఉభయసభల సమ్మతి పొందిన ఈ ఒప్పందానికి పుతిన్ ఆమోద ముద్ర వేయడంతో అది చట్ట రూపుదాల్చింది. ఈ చట్టం భారత్, రష్యాల మధ్య సైనిక పటాలాలు, యుద్ధ నౌకలు, సైనిక విమానాల ఇచ్చిపుచ్చుకోలుకు ఒక విధానాన్ని సూచిస్తోంది. ఉమ్మడి కసరత్తులు, శిక్షణ కార్యక్రమాలు, మానవీయ సాయం, ఉత్పాతాల సందర్భంగా సహాయ పునరావాసాలు వగైరాలకు సంబంధించి ఇరు దేశాలు అనుసరించాల్సిన క్రమ పద్ధతిని ఈ చట్టం నిర్దేశిస్తోంది.

రామజన్మభూమి ఉద్యమ నేత రామ్‌విలాస్ వేదాంతి కన్నుమూత

రీవా: రామజన్మభూమి ఉద్యమ నేత, భాజపా మాజీ ఎంపీ రామ్‌విలాస్ వేదాంతి(67) సోమవారం కన్నుమూశారు. మధ్యప్రదేశ్‌లోని రీవాలో ఉంటున్న ఆయన అనారోగ్య కారణాలతో ఇక్కడి శ్యామ్ షా వైద్య కళాశాలకు చెందిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం చేరారు. "రామ్‌విలాస్ వేదాంతికి క్రమంగా బీపీ పడిపోతూ వచ్చింది. కిడ్నీలూ పనిచేయకుండా ఆగిపోయాయి. అనంతరం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు" అని ఆసుపత్రి సూపరింటెండెంట్ అక్షయ్ శ్రీవాస్తవ తెలిపారు. అంతకు ముందు ఎయిర్ అంబులెన్స్ ద్వారా రామ్ విలాస్ వేదాంతిని భోపాల్‌లోని ఎయిమ్స్‌కు తరలించాలని ప్రయత్నించినప్పటికీ వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదని శ్రీవాస్తవ చెప్పారు. రామ్‌విలాస్ వేదాంతి శ్రీ రామజన్మభూమి ట్రస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్, మఛాలి శాహర్ లోక్‌సభ నియోజకవర్గాల ఎంపీగానూ పనిచేశారు. అంత్యక్రియలు అయోధ్యలో నిర్వహించనున్నట్లు ఆయన శిష్యుడు ఒకరు వెల్లడించారు.



డేటా పంచుకోవడంపై వినియోగదారుల అనుమతి తప్పనిసరి

వాట్సప్‌కు ఎన్‌సీఎల్‌ఏటీ స్పష్టీకరణ

దిల్లీ: మాతృసంస్థ మెటాకు డేటా పంచుకోవడంపై వినియోగదారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సామాజిక మాధ్యమ సంస్థ వాట్సప్‌నకు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) సోమవారం స్పష్టం చేసింది. ప్రకటనలు, ప్రకటనలేతర అవసరాల కోసం మెటా ప్లాట్‌ఫామ్స్ ఫేస్‌బుక్, ఇన్‌స్టా లేదా ఇతర మెటా కంపెనీలతో వాట్సప్ డేటా పంచుకోవాలంటే, వినియోగదారుల అనుమతి తప్పనిసరి. వినియోగదారుల డేటాపై ఏకపక్షంగా లేదా ఓపెన్ ఎండ్ హక్కులను వాట్సప్‌నకు ఇవ్వలేమని ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. వినియోగదారుల హక్కులను కాపాడాల్సిందేనని తెలిపింది.

జాతీయ ఐక్యతను వల్లభ్‌బాయ్ పటేల్ సాకారం చేశారు: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: జాతీయ ఐక్యతను సాకారం చేసిన మహానుభావుడు సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ అని సీఎం చంద్రబాబు కొనియాడారు. వల్లభ్‌బాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఆయనకు చంద్రబాబు సోమవారం నివాళి అర్పించారు. దేశ ప్రజల సుస్థిర, శాంతియుత జీవనానికి ఆయన పునాదులు వేశారని గుర్తు చేశారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

గవర్నర్ అబ్దుల్‌నజీర్



ఈనాడు, అమరావతి: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో పొట్టి శ్రీరాములు పోషించిన పాత్ర, ఆయన చేసిన త్యాగాన్ని ప్రజలు ఎప్పటికీ స్మరించుకుంటూనే ఉంటారని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం లోక్ భవన్‌లో నిర్వహించిన 'ఆత్మార్పణ దినం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

డీజీపీ నివాళి



అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఘన నివాళులర్పించారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో ..



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అనిత, అనురాధ

పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు భాష, సంస్కృతి, ఆత్మగౌరవాల్ని కాపాడటానికి పొట్టి శ్రీరాములు మహోన్నత త్యాగం చేశారని హోం మంత్రి వంగలపూడి అనిత, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ కొనియాడారు. ఆయన జీవితం తెలుగువారికి మార్గదర్శకమని పేర్కొన్నారు.

రేపు తెదేపా జిల్లా కమిటీలు ప్రకటించే అవకాశం

ఈనాడు, అమరావతి: తెదేపా జిల్లా కమిటీల కూర్పుపై పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు సమీక్షించనున్నారు. ఈ మేరకు జిల్లాలవారీ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీల సభ్యులతో మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం కానున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో కమిటీల కూర్పు ప్రతిపాదనలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని జాబితా సామాజికవర్గ దామాషాకు అనుగుణంగా లేదని స్పష్టం చేశారు. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల ప్రాతినిధ్యం పెంచాలని, జిల్లా కార్యవర్గాన్ని 32 నుంచి 40కి పెంచాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయా కమిటీలు జిల్లా కమిటీల్లో మార్పులు, చేర్పులు చేశాయి. ఆ జాబితాలను చంద్రబాబుకు సమర్పించనున్నాయి. అధినేత పరిశీలన అనంతరం జిల్లా కమిటీల్ని బుధవారం ప్రకటించే అవకాశం ఉంది.

ఏపీ ఆర్‌సెట్‌లో 55% ఉత్తీర్ణత

ఈనాడు, అమరావతి: పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఆర్‌సెట్ ఫలితాల్లో 55.36% మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 65 సబ్జెక్టులకు నిర్వహించిన పరీక్షలకు 5,164 మంది హాజరు కాగా.. 2,859 మంది అర్హత సాధించారు. ఫలితాలను ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నవంబరులో ఈ పరీక్షలు జరిగాయి. ఫార్మసీ సబ్జెక్టులో ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించారు. తుదపరి స్థానాల్లో మేనేజ్‌మెంట్, కంప్యూటర్ సైన్సు విభాగాలు ఉన్నాయి. ప్రవేశాలకు సంబంధించిన మౌఖిక పరీక్షల వివరాలను త్వరలో ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని ఛైర్మన్ తెలిపారు.

ఏపీపీ పోస్టులకు 19 నుంచి ఇంటర్వ్యూలు

ఈనాడు, అమరావతి: అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19 నుంచి 22 వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్‌కుమార్ మీనా తెలిపారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూలు ఉంటాయని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు నిర్దేశిత తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

స్వీయ తప్పిదాలు.. ఏళ్ల తరబడి వైఫల్యాలు!

- పాత పద్ధతులను కొనసాగించడం వల్లే భారీగా నష్టం
- మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సర్క్యులర్‌లో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఏళ్ల తరబడి వైఫల్యాల వల్లే ఎదురుదెబ్బలు తగులుతున్నాయని మావోయిస్టు పార్టీ అభిప్రాయపడింది. స్వీయ తప్పిదాలతో.. పరిస్థితులకు తగ్గట్టుగా ఉద్యమాన్ని మలచడంలో విఫలమయ్యామని. రక్షణాత్మక విధానాలను అనుసరించాల్సిన సమయంలోనూ పాతపద్ధతులే కొనసాగించడం వల్ల భారీస్థాయిలో క్యాడర్‌ను కోల్పోవాల్సి వచ్చిందని పేర్కొంది. ఈ మేరకు 2024లో మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో రూపొందించి.. క్యాడర్‌కు పంపిణీ చేసినట్లు చెబుతున్న సర్క్యులర్ తాజాగా వెలుగులోకి వచ్చింది. గతనెలలో రాయ్‌పుర్ (ఛత్తీస్‌గఢ్)లో నిర్వహించిన డీజీపీల సమావేశంలోనూ దీనిపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సర్క్యులర్‌లో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి..

◆ ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మావోయిస్టు ఉద్యమాన్ని రూపుమాపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టాయి. వేల బలగాలను మోహరించాయి. మూడున్నరేళ్లలో (2024కి ముందు) 683 మంది మావోయిస్టులు మరణించారు. వారిలో 190 మంది మహిళలున్నారు. 2024 జనవరి-ఆగస్టు మధ్యలోనే 199 మందిని కోల్పోయాం. వీరిలో 170 మంది దండకారణ్యానికి చెందినవారే. పీఎల్‌జీఏ చేపట్టిన 669 చర్యల వల్ల 261 మంది పోలీసులు చనిపోగా 516 మంది గాయపడ్డారు. 25 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం.

◆ కీలక నేతలు చనిపోవడం, లొంగిపోవడం వంటి వాటివల్ల ఉత్తర-దక్షిణ, తూర్పు-మధ్య ప్రాంతాల నడుమ సమన్వయం లేకుండాపోయింది. దళిత, గిరిజన ప్రజలు తమ హక్కుల కోసం పోరాటం మొదలుపెట్టినా.. దీన్ని అందిపుచ్చుకోలేకపోయాం. ఎన్‌ఆర్‌సీ, సీఏఏ, రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో పాల్గొన్నప్పటికీ కొత్తవారిని పార్టీలోకి తేలేకపోయాం.

◆ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ పార్టీపాత్ర పరిమితమైంది. 40 ఏళ్లుగా దండకారణ్యంలో జరుగుతున్న వర్గపోరాటం కారణంగా స్థానిక వర్గాల ప్రజలు లబ్ధి పొందారు. మావోయిస్టేతర కొత్త నాయకత్వం తయారయింది. ఆంధ్ర, తెలంగాణలలోని ప్రజాసంఘాల తరపున పోరాటం చేస్తున్న నాయకులు కూడా ఉద్యమాలు, ప్రచారాలు వంటివాటికే పరిమితమయ్యారు.

◆ మావోయిస్టు ఉద్యమంలోనూ వ్యక్తిగత భావజాలం, స్వీయఉన్నతి, అనైక్యత, గ్రూపిజం వంటివి పెరిగిపోయాయి. కొందరైతే ఆర్థిక అవకతవకలకూ పాల్పడ్డారు. విద్యార్థులు, మేధావులు ఉద్యమంలో చేరకపోవడంతో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, వనరులు అందలేదు.

◆ పెత్తందారీ వర్గాలను చిన్నాభిన్నం చేసి, అధికారాన్ని చేజిక్కించుకునే ప్రక్రియ రహస్యంగా ఉండాలన్న ప్రాథమిక సిద్ధాంతం అమల్లోనూ విఫలమయ్యాం. చాలా సమావేశాలు ఎలాంటి సన్నాహాలు లేకుండానే జరిగేవి. అతిగోప్యత పాటిస్తుండటం వల్ల అట్టడుగు వర్గాలను పోరాటంవైపు సన్నద్ధం చేయలేకపోతున్నామని మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, కేరళతోపాటు ఈశాన్య ప్రాంతాల పార్టీ సభ్యులు భావించేవారు. అందుకే రహస్య జీవితానికి వారు సిద్ధపడలేదు.

◆ ప్రత్యర్థి బలంగా ఉన్నప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లాలి.. ఆగిపోయినప్పుడు కవ్వించాలి.. అలసిపోయినప్పుడు దాడిచేయాలి.. అనే మూలసిద్ధాంతాన్ని ఆచరించడంలో విఫలమయ్యాం. సామర్థ్యానికి మించిన బాధ్యతలను క్యాడర్‌పై మోపాల్సి వచ్చింది. దుబారా ఖర్చులు పెరిగిపోయాయి. వృద్ధులు, రోగులకు ఆహారం సమకూర్చడమూ భారంగా మారింది.

◆ గెరిల్లా విధానాలకు సిద్ధమయ్యేవారి సంఖ్య తగ్గింది. పార్టీ నాయకత్వం సరైన రాజకీయ పంథాను అనుసరించలేకపోయింది. లొంగుబాట్లు, అనైతికత, నమ్మకద్రోహం పెరిగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బలగాల పోరాటాన్ని ఎదుర్కొనేందుకు సరైన వ్యూహం అనుసరించలేకపోయాం. ఇన్ఫార్మర్లను అడ్డుకోలేకపోయాం.

ఏం చేయాలంటే..!

ఎదురుదెబ్బల నుంచి బయటపడాలంటే అన్ని ప్రాంతాల్లో చట్టబద్ధమైన ప్రజాస్వామిక పద్ధతుల్లో ఉద్యమాలను నిర్మించాలి. పరిస్థితులకు తగ్గట్టుగా కేంద్ర, రాష్ట్ర కమిటీల్లో పోరాట వ్యూహాలు మార్చాలి. మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేయాలి. అన్నిరకాలుగా ఉద్యమంలో మార్పులు రావాలి. దుబారా తగ్గించుకోవాలి. సిద్ధాంత రాహిత్యాన్ని నివారించాలి.

50% రిజర్వేషన్ల పరిమితిని రద్దు చేయాల్సిందే

- దిల్లీలో బీసీ నేతల ధర్నా

ఈనాడు, దిల్లీ: దేశంలో రిజర్వేషన్లపై విధించిన 50% పరిమితిని ఎత్తివేసి, జనాభా ప్రకారం వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల నేతలు సోమవారం దిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఇచ్చిన 'చలో దిల్లీ' పిలుపు మేరకు ఆ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీసీలు మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మల్లు రవి, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, రాపోలు ఆనందభాస్కర్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కుంతియా, బీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మహారాష్ట్ర అధ్యక్షుడు సచిన్ రాజోల్కర్‌లు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీలు సుదీర్ఘ పోరాటం చేస్తున్నా కేంద్రం తమ డిమాండ్లను విస్మరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ బీసీ అయి ఉండి బీసీలకు న్యాయం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షంతో వచ్చి ఈ అంశంపై ప్రధానిని కలవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు భాజపా రిజర్వేషన్లు అమలు కాకుండా అడుగడుగునా అడ్డు పడుతోందని. మరోవైపు రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే వంటి నేతలు పార్లమెంటులో దీని గురించి కనీసం మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.



దిల్లీ జంతర్‌మంతర్ ధర్నాలో పాల్గొన్న రాపోలు ఆనందభాస్కర్, మహేశ్‌కుమార్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కె.నారాయణ, జాజుల శ్రీనివాస్‌గౌడ్, వీహెచ్ తదితరులు

దేశవ్యాప్త ఉద్యమం చేస్తాం: ఆర్.కృష్ణయ్య

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలన్న డిమాండ్‌తో దేశవ్యాప్త ఉద్యమం చేయనున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ఈ అంశంపై ఇక్కడి తెలంగాణభవన్‌లో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. దేశంలోని చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో బీసీలకూ తప్పనిసరిగా జనాభా ప్రకారం ఆ ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, ఏపీల్లో స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

25 కోట్ల మంది వినియోగిస్తున్నారు.. మరి మీరు!



'డిజిలాకర్' యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వినియోగదారుల సంఖ్య ఈ ఏడాది డిసెంబరు నాటికి 60.35 కోట్లకు చేరింది. ఇందులో 25 కోట్ల మంది వినియోగదారులు ఈ వేదిక ద్వారానే తమ సర్టిఫికెట్లు, ఇతర సేవలు పొందుతున్నారు. మిగతావారు ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నా వినియోగించుకోవడం లేదు. విద్యా పత్రాలు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు.. ఇలా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లను వినియోగదారులు ఈ వేదికలో భద్రపరచుకునే సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్లకుండా పేపర్‌లెస్ సదుపాయాన్ని ఈ యాప్ కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2015లో ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలో డిజిలాకర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఆధార్‌తో పాటు ఇతర విలువైన పత్రాలను భద్రపరచుకోవచ్చు. ప్రభుత్వ అధికారులు ఏదైనా సందర్భంలో మన గుర్తింపు కార్డులు, పత్రాలు అడిగితే 'డిజిలాకర్'లోకి వెళ్లి చూపించవచ్చు. వాహనదారులు కూడా తమ డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, బీమా వంటి పత్రాలను 'డిజిలాకర్'లో పెట్టుకుంటే. ఆయా పత్రాలను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. – ఈనాడు, హైదరాబాద్

ఇలా ఉపయోగించుకోవచ్చు..

మొదట ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో డిజిలాకర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. పేరు, పుట్టిన తేదీ, ఫోన్ నంబరు తదితర వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత మీ ఆధార్ నంబర్ లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ నంబర్‌ను నమోదు చేస్తే ఖాతా తెరుచుకుంటుంది. యాప్‌లో ఉన్న సెర్చ్ సింబల్‌లోకి వెళ్లి ఆధార్, ఎల్ఐసీ బాండ్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ఏదైనా అవసరమైన వివరాలు నమోదు చేస్తే అప్పటికే అందులో పత్రాలు ఉంటే ప్రత్యక్షమవుతాయి. వీటిని డౌన్‌లోడ్ చేసుకొని కూడా ఉపయోగించుకోవచ్చు. ఇందులో మీ నామినీ పేరును కూడా జత చేసుకోవచ్చు. మొత్తం 30 ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన శాఖలు డిజిలాకర్‌లో సేవలు అందిస్తున్నాయి.

పది, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: బీసీ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని, దీనికోసం ఇప్పటి నుంచే వారిని సన్నద్ధం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణను కూడా ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో వసతిగృహాల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం నుంచి ఆమె సోమవారం వసతిగృహాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బీసీ వసతిగృహాలు, ఎంజేపీ గురుకులాల్లో విద్యార్థుల పరీక్షల సన్నద్ధత గురించి ఆరా తీశారు.

చెవిరెడ్డి పిటిషన్‌పై కౌంటర్ వేయండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ వేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. విజయవాడ ఏసీబీ కోర్టు బెయిలిచ్చేందుకు నిరాకరించడంతో చెవిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

నాపై కేసులను సీబీఐకి అప్పగించండి

హైకోర్టులో వైకాపా నేత కాకాణి వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: తనపై నమోదు చేసిన తొమ్మిది కేసులలో నిష్పాక్షిక, సమగ్ర దర్యాప్తు నిర్వహించేందుకు వాటిని సీబీఐకి అప్పగించాలంటూ వైకాపా నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. సీబీఐ డైరెక్టర్‌తో పాటు రాష్ట్ర డీజీపీ, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు వేయాలంటూ విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉన్నత విద్యలోకి ఏపీఆర్‌డీసీ

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను ఉన్నత విద్యా శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పాఠశాల విద్యా శాఖ పరిధిలోని ఏపీ ఆర్‌ఈఐ సొసైటీ ఆధ్వర్యంలో ఉన్న పోస్టులను డిగ్రీ కళాశాలకు మార్పు చేయాలని కళాశాల విద్యాశాఖను ఆదేశించింది. ఉన్నత విద్యా శాఖకు మార్పు చేసేందుకు ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సులు చేసింది. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

ప్రభుత్వ చర్యలతో పండ్లు, ఆక్వా ఉత్పత్తుల్లో ఏపీ మొదటి స్థానం

మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలతో పండ్లు, ఆక్వా ఉత్పత్తుల్లో ఏపీ నంబర్-1గా నిలిచిందని తెదేపా నేత, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల ఆర్థిక ప్రమాణాలు మెరుగయ్యాయని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసిందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి వైకాపా నేత బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

గజిబిజి రాతకు చెల్లు'చీటీ'

ఈనాడు, హైదరాబాద్: వైద్యులు మందుల చీటీపై రాసే రాత అంత సులువుగా అర్థం కాదు. మందుల దుకాణదారులు తప్ప రోగులు ఆ అక్షరాలను చదవలేక ఇబ్బంది పడే సందర్భాలు అనేకం. ఇకపై మందుల చీటీపై డాక్టర్లు స్పష్టంగా రాయాల్సిందే అని 'జాతీయ వైద్య కమిషన్'(ఎన్ఎంసీ) సోమవారం ఆదేశించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వైద్యవిద్య సంచాలకులతోపాటు అన్ని వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లకు, డైరెక్టర్లకు దీనిపై మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతి బోధనాసుపత్రిలో తప్పనిసరిగా 'డ్రగ్స్, థెరప్యూటిక్స్ కమిటీ' (డీటీసీ) ఏర్పాటు చేసి... తాము జారీ చేసిన ఆదేశాలు అమలయ్యేలా చూడాలని సూచించింది. వైద్యులు స్పష్టమైన చేతి రాతతో చీటీపై మందులు రాయాలని ఈ ఏడాది ఆగస్టులో పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు తీర్పు ఇచ్చిందని ఉత్తర్వుల్లో ఎన్ఎంసీ పేర్కొంది. మందుల చీటీపై స్పష్టమైన రాత అన్నది... రాజ్యాంగంలో ఆర్టికల్ 21కి లోబడి ఆరోగ్య హక్కు (రైట్ టు హెల్త్) కిందకు వస్తుందని కోర్టు పేర్కొందని, అంతేకాకుండా ఎన్ఎంసీ, ఎంసీఐలు కూడా గతంలోనే వైద్యుల చేతిరాత అర్థమయ్యేలా స్పష్టంగా ఉండాలని మార్గదర్శకాలు జారీ చేశాయని కోర్టు ప్రస్తావించింది. ఇకపై ఇది అమలయ్యేలా చూడాలని కోర్టు ఆదేశాలను అమల్లోకి తెస్తున్నట్టు ఎన్ఎంసీ తాజాగా స్పష్టం చేసింది.

త్వరలో మన మిత్రతో 'ఆయుష్మాన్' అనుసంధానం

ఈనాడు, అమరావతి: మన మిత్రతో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల ఖాతాలను ఈ నెలాఖరులోగా అనుసంధానిస్తామని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. విజయవాడలో సోమవారం ఆయన మాట్లాడారు. 'సంజీవని' పేరుతో సాంకేతికత ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు సేవలందించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కుప్పం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా అమలవుతోందన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో హెల్త్ టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్-25 ద్వారా అందుబాటులోకి వచ్చిన 297 అప్లికేషన్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో వ్యాధుల భారం, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అత్యున్నత స్థాయి కమిటీతో ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మంగళవారం వర్చువల్‌గా చర్చిస్తారని వెల్లడించారు.

వ్యాధులపై నిరంతర పర్యవేక్షణ

గుంటూరు జిల్లా తురకపాలెంలో మెలియాయిడోసిస్ వ్యాప్తి, మరణాలపై జిల్లాస్థాయి సమాచారం రాష్ట్రస్థాయికి చేరవేయడంలో చోటుచేసుకున్న జాప్యం పునరావృతం కాకుండా చర్యలు చేపట్టామని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. డెత్ ఎలర్ట్ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో ప్రతి జిల్లాలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. స్క్రబ్ టైఫస్ కేసులను గుర్తించడానికి ఆర్టీజీఎస్ అవేర్‌తో అనుసంధానం చేస్తూ.. వ్యాధుల పర్యవేక్షణ, సత్వర స్పందన బృందాలు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. స్క్రబ్ టైఫస్‌పై జీనోమ్ సీక్వెన్సింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

ఏపీ రైతుల అప్పులు రూ.3.76 లక్షల కోట్లు

దేశంలో రెండో స్థానం

ఈనాడు, దిల్లీ: ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి వివిధ బ్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ రైతుల అప్పులు రూ.3,76,823 కోట్ల మేర ఉన్నాయి. తమిళనాడు (రూ.4.94లక్షల కోట్లు) తర్వాత దేశంలో అత్యధికంగా వ్యవసాయ రుణాలున్నది ఏపీ రైతులపైనే. కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పకంజ్‌చౌధరి సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో ఈ విషయం వెల్లడైంది. ఇందులో వాణిజ్య బ్యాంకుల ద్వారా తీసుకున్న అప్పులు రూ.2,89,481 కోట్లు, సహకార బ్యాంకుల ద్వారా తీసుకున్నవి రూ.33,739 కోట్లు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ద్వారా తీసుకున్నవి రూ.53,60 కోట్లు ఉన్నాయి. తమిళనాడుకంటే ఏపీలోనే సహకార, గ్రామీణ బ్యాంకులు రైతులకు ఎక్కువ రుణాలు ఇచ్చాయి. రైతు రుణాలను మాఫీ చేసే ప్రతిపాదనేదీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర మంత్రి చెప్పారు.

ఏపీ డిస్కంల బకాయిలు రూ.77,600 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని డిస్కంల అప్పులు రూ.77,600 కోట్ల మేర ఉన్నట్లు కేంద్ర విద్యుత్తు శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. కొనుగోలు చేసిన విద్యుత్తుకు సంబంధించి ఉత్పత్తి సంస్థలకు డిస్కంలు 105 రోజులు ఆలస్యంగా చెల్లింపులు చేస్తున్నట్లు చెప్పారు. అత్యధిక ఆలస్యంగా చెల్లింపులు చేసే రాష్ట్రాల్లో దిల్లీ (389 రోజులు), ఝార్ఖండ్ (384 రోజులు), తెలంగాణ (295 రోజులు) తొలి మూడు స్థానాల్లో ఉన్నట్లు చెప్పారు. గుజరాత్‌లోని డిస్కంలు కేవలం నాలుగు రోజుల్లోనే చెల్లింపులు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర అప్పులు ఆందోళనకరం

లోక్‌సభలో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర అప్పులు ఆందోళనకర స్థితికి చేరాయని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి ఆరోపించారు. ఆదాయం, అప్పుల మధ్య తీవ్ర అగాధం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆయన సోమవారం లోక్‌సభలో బడ్జెట్ అనుబంధ పద్దులపై జరిగిన చర్చలో మాట్లాడారు. "గత 18 నెలల్లో ఏపీ ప్రభుత్వం రూ.2.66 లక్షల కోట్ల అప్పు చేసింది. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో రూ.3.22 లక్షల కోట్లు మాత్రమే అప్పుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం దొరికిన అన్ని మార్గాల్లో అప్పులు చేస్తోంది. దీనివల్ల అప్పుల వార్షిక వృద్ధి 22శాతానికి చేరింది. వైకాపా ప్రభుత్వంలో ఇది 13శాతం ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రభుత్వరంగ సంస్థల తరఫున అప్పుచేసినా అది ఆర్టికల్ 293 కింద రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలోకే వస్తుందని 2019-24 మధ్య కాలంలో కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి రాష్ట్రాలకు లేఖరాశారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎండీసీ, బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా అప్పులుచేస్తోంది. ఇప్పుడు ఈ అప్పులు రాష్ట్ర ప్రభుత్వ పరిమితుల్లోకి రావా? ప్రభుత్వ బ్యాంకులు 6శాతానికి అప్పులు ఇస్తున్నప్పుడు ప్రైవేటు సంస్థల నుంచి 9శాతానికి అప్పు ఎందుకు చేస్తున్నారు? దీన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలి. తెదేపా ప్రభుత్వం 2014-19 మధ్య పరిమితికి మించి అప్పులు చేయడం వల్ల ఆ మొత్తాన్ని వైకాపా ప్రభుత్వ హయాంలో తగ్గించారు. ఇప్పుడు మరోసారి అలాగే చేస్తున్నారు. అందువల్ల కేంద్రం జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలువరించాలి. ఉపాధిహామీ పథకానికి సంబంధించి గత ఏడు నెలల్లో కూలీలకు వేతనాలు పెండింగ్ పెట్టారు. తెదేపా ఎంపీ కేంద్రంలో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్నా వేతనాలు పెండింగ్‌లో ఉండటం విచారకరం. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలి. దానికి గనులు కేటాయించాలి. రాష్ట్రంలో వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరించడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నాం. ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం నిలువరించాలి. కడప-బెంగుళూరు రైల్వేలైన్‌ను పూర్తిచేయాలి" అని మిథున్‌రెడ్డి డిమాండ్‌చేశారు.

రూ.988 కోట్ల 'ఉపాధి' వేతనాలు విడుదల

కేంద్ర మంత్రి పెమ్మసాని

ఈనాడు–అమరావతి: ఉపాధి హామీ కార్యక్రమంలో శ్రామికులకు వేతనాల చెల్లింపుల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.988 కోట్లు విడుదల చేసిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 2025-26 సంవత్సరంలో ఉపాధి కార్యక్రమానికి ఇప్పటివరకు రూ.7,669 కోట్లు కేంద్రం అందించినట్లు సోమవారం ఒక ప్రకటనలో ఆయన వివరించారు. ఇందులో శ్రామికుల వేతనాలకు రూ.5,660 కోట్లు, మెటీరియల్ పనులు, పరిపాలన ఖర్చులకు మరో రూ.2,009 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

వేదాద్రి-కంచల ఎత్తిపోతల మరమ్మతులకు రూ.15 కోట్లు

ఈనాడు, అమరావతి: కృష్ణా నదిపై నిర్మించిన వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం మరమ్మతులతో పాటు పునరుద్ధరణ కోసం రూ.15 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం పాలనామోద ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం కృష్ణా నదిపై ఈ ఎత్తిపోతల ఉంది. ఆకృతులకు, డ్రాయింగ్‌లకు సంబంధిత అధికారి నుంచి ఆమోదం పొందాలని, జలవనరులశాఖ అనుసరిస్తున్న విధివిధానాలు అన్నీ పాటిస్తూ, చేసిన పని మళ్లీ చేయకుండా రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

'75 వేల వైద్యవిద్య సీట్లు కావాలంటే పీపీపీ విధానం తప్ప మరో మార్గం లేదు'

ఈనాడు, అమరావతి: దేశంలో రాబోయే ఐదేళ్లలో 75 వేల వైద్య విద్య సీట్లు అందుబాటులోకి రావాలంటే పీపీపీ విధానం తప్ప మరో మార్గం లేదని పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను త్వరితగతిన పూర్తి చేసేందుకే కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ముందుకు వెళుతోందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

'విద్యుత్ బస్సులు ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలి'

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలో ప్రవేశపెట్టే విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు, ప్రధాన కార్యదర్శి నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో 26 జిల్లాలు, నాలుగు జోన్ల అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈయూ 28వ రాష్ట్ర మహాసభలు 2026 మార్చి/ఏప్రిల్‌లో ఒంగోలులో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సిబ్బందికి సంబంధించి 30 డిమాండ్లపై ఆర్టీసీ వీసీఎండీకి వినతిపత్రం అందించాలని ప్రతిపాదించారు.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేధించారు

తెదేపా కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనకు రావాల్సిన గ్రానైట్ క్వారీ లీజుల్ని అడ్డుకున్నారని, తప్పుడు కేసులు పెట్టి వేధించారని చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలానికి చెందిన కె.రమణ వాపోయారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి హోం మంత్రి అనిత, శాసనమండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తమ గ్రామంలో వైకాపా వాళ్లు భారీ భూ కబ్జాలకు పాల్పడ్డారని, దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని నంద్యాల జిల్లా గడివేముల మండలానికి చెందిన మాలిక్‌బాషా ఫిర్యాదు చేశారు.

సెకండరీ హెల్త్ ఆసుపత్రుల అభివృద్ధికి రూ.10.67 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సెకండరీ హెల్త్ ఆసుపత్రుల అభివృద్ధికి, అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం రూ.10.67 కోట్లు మంజూరు చేసింది. ఆర్ఐడీఎఫ్ పథకం కింద ఈ నిధులు ఖర్చు చేసేందుకు పరిపాలన ఆమోదం తెలుపుతూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

సచివాలయ సిబ్బందికి బీఎల్ఓ విధులు తప్పించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల బూత్ స్థాయి అధికారుల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. ఈమేరకు సీఎం చంద్రబాబుకు ఆయన లేఖ రాశారు.